

సత్యమేవ జయతే

సాక్షి

'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 16 | సంచిక: 287

SUNDAY Special | ఆదివారం 30-6-2024

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | BANGALORE | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సైనిక విన్యాసాల్లో తీవ్ర విషాదం

సైనిక విన్యాసాల్లో భాగంగా యుద్ధ ట్యాంకుతో నదిని దాటుతుండగా వరద పోటెత్తడంతో ఐదుగురు జవాన్లు మృత్యువాత పడ్డారు. లద్దాఖ్‌లోని ఎల్‌ఏసీ సమీపంలోని షియోక్ నదిలో ఈ ఘటన జరిగింది.

- వివరాలు 6లో



బిహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలి

ఎన్డీఏలో కీలకంగా ఉన్న జేడీయూ ఎగ్జిక్యూటివ్ సమావేశం ఢిల్లీలో శనివారం జరిగింది. ఈ భేటీలో బిహార్ సీఎం నితీశ్ కుమార్ తమ రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేదా స్పెషల్ ప్యాకేజీ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్నారు.

- వివరాలు 6లో

గంగపుత్రులకు ఏదీ భరోసా?



- గత ఐదేళ్లూ గడువులోగానే మత్స్యకార భరోసా
- రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచిన జగన్ ప్రభుత్వం
- అధికారంలోకి రాగానే రూ.20 వేలు భృతి ఇస్తామని కూటమి మేనిఫెస్టోలో హామీ
- ఆ మేరకు రూ.260.26 కోట్ల బడ్జెట్ కోసం మత్స్యశాఖ ప్రతిపాదనలు.. గడువు ముగిసినా పట్టించుకోని ప్రభుత్వం

14లో

కాంగ్రెస్ సీనియర్ నేత డీఎస్ కన్నుమూత



- ఉమ్మడి ఏపీలో పీసీసీ చీఫ్‌గా, మంత్రిగా పనిచేసిన డీఎస్
- ఘనంగా నివాళులు అర్పించిన రాజకీయ ప్రముఖులు
- స్వస్థలం నిజామాబాద్‌కు భౌతికకాయం తరలింపు
- నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- హాజరుకానున్న సీఎం రేవంత్, మంత్రులు, ఇతర నేతలు

3లో





విశ్వవిజేత భారత్

టీ20 ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై విజయం

ఎన్నో మలుపులు, మరెన్నో ఉత్కంఠభరిత క్షణాలు... టైటిల్ వేటలో దక్షిణాఫ్రికా వేగంగా దూసుకుపోతోంది... 30 బంతుల్లో 30 పరుగులు, చేతిలో 6 వికెట్లతో సునాయాసంగా గెలిచే స్థితిలో నిలిచింది. తర్వాత ఓవర్లో బుమ్రా 4 పరుగులే ఇవ్వగా సమీకరణం 24 బంతుల్లో 26 పరుగులుగా మారింది. క్లాసెన్, మిల్లర్‌లాంటి హిట్టర్లు ఉండటంతో భారత్ ఆశలు కోల్పోయింది. కానీ పాండ్యా వేసిన తర్వాతి ఓవర్లో మ్యాజిక్ మొదలైంది. తొలి బంతికే క్లాసెన్ వెనుదిరగ్గా... 18 బంతుల్లో 10 పరుగులే వచ్చాయి. కథ క్లైమాక్స్‌కు చేరింది. 6 బంతుల్లో 16 పరుగులు కావాలి. మిల్లర్ ఉండటంతో ఆందోళన పూర్తిగా తొలగిపోలేదు. కానీ పాండ్యా వేసిన తొలి బంతికే బౌండరీ వద్ద సూర్యకుమార్ ఎప్పటికీ మరచిపోలేని అత్యద్భుత క్యాచ్‌తో మిల్లర్ వెనుదిరిగాడు. అంతే... తర్వాతి ఐదు బంతులు లాంఛనమే అయ్యాయి... భారత్ ప్రపంచ విజేతగా హోరెత్తే సంబరాల్లో మునిగిపోయింది.

భారత్ 176/7

దక్షిణాఫ్రికా 169/8

- వివరాలు 12లో

ప్లేయర్ ఆఫ్ ది ఫైనల్ : విరాట్ కోహ్లి
ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్: జస్‌ప్రీత్ బుమ్రా
టీ 20లకు విరాట్ గుడ్ బై

12లో

కృషి, పట్టుదలతో మరో గొప్ప గెలుపు


భారత క్రికెట్ జట్టుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ అభినందనలు

3లో

మూడు వారాల్లో రూ.7 వేల కోట్ల అప్పు

ఆర్బీఐకి వెల్లడించిన చంద్రబాబు ప్రభుత్వం

- ఎల్లో మీడియాకు ప్రతి మంగళవారం బాబు అప్పులు కనిపించడం లేదా?
- లేక ఈ అప్పులే సంపద సృష్టిలా కనిపిస్తోందా?
- గతంలో వైఎస్ జగన్ సర్కార్‌పై ప్రతి మంగళవారం అప్పు అంటూ విషం కక్కిన ఎల్లో మీడియా
- ఇప్పుడు బాబు అంటే ఇష్టం కాబట్టి అప్పు ఊసెత్తని వైనం
- ఈ నెల 25న రూ.2 వేల కోట్లు, వచ్చే నెల 2న రూ.5 వేల కోట్ల అప్పు



సాక్షి, అమరావతి: ప్రతి మంగళవారం అప్పు చేయందే గడవదంటూ ఇన్నాళ్లూ వైఎస్ జగన్ సర్కారుపై రాసిందే పదే పదే రాస్తూ ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఎల్లో మీడియా విషం కక్కాయి. ఇప్పుడు చంద్రబాబు సర్కారు ప్రతీ మంగళవారం అప్పు చేస్తున్నా ఈనాడు, ఆంధ్రజ్యోతి తదితర ఎల్లో మీడియాకు కనిపించడం లేదా? అని అధికార వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. బాబు సర్కారు ప్రతి మంగళవారం చేస్తున్న అప్పులు ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఎల్లో మీడియాకు సంపద సృష్టిస్తున్నట్లు కనిపిస్తోందా.. అంటూ ఎద్దేవా చేస్తున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు సెక్యూరిటీల విక్రయం ద్వారా అప్పులు చేయడానికి వెసులు బాటు కల్పిస్తూ ప్రతి మూడు నెలలకు ఆర్‌బీఐ వేలం వేసే తేదీలను ముందుగానే ప్రకటిస్తుంది. ఆయా తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత మేర అప్పు చేస్తాయో.. ఎన్ని సంవత్సరాల కాల వ్యవధిలో ఆ అప్పు తీరుస్తాయో ఆర్‌బీఐకి తెలియజేస్తాయి. అదే తరహాలో గత వైఎస్ జగన్ సర్కారు పరిమితికి లోబడి అప్పులు చేస్తే.. ప్రతి మంగళవారం అప్పు అంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఎల్లో మీడియా నిత్యం దుష్ప్రచారం చేస్తూ కథనాలు వండి వారుస్తూ నానా యాగీ చేశాయి. ఇప్పుడు చంద్రబాబు సర్కారు 20 రోజుల వ్యవధిలోనే రూ.7000 కోట్లు అప్పు చేసినా.. అదీ ప్రతి మంగళవారం అప్పు చేస్తున్నా ఈనాడు, ఆంధ్రజ్యోతి తదితర ఎల్లో మీడియాకు కనిపించడం లేదు. దాని గురించి ఒక్క ముక్క రాయడం లేదు. అంటే తమకు ఇష్టమైన చంద్రబాబు అధికారంలో ఉన్నందున, ఎన్ని అప్పులు చేసినా.. ఆ పత్రికలకు సంపద సృష్టిలా కనిపిస్తుందేమోనని ఉన్నతాధికారి ఒకరు ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్ అంటే ఇష్టం లేనందున పరిమితికి లోబడి అప్పులు తెచ్చినా సరే ప్రతి మంగళవారం అప్పు చేయనిదే గడవదంటూ పెద్ద నేరం చేసినట్లు నిత్యం ఆ పత్రికలు కథనాలు రాసినట్లు ఇప్పుడు స్పష్టం అవుతోందని ఆ అధికారి విశ్లేషించారు.

సంపద సృష్టి ఏమైందో!

వైఎస్ జగన్ సర్కారు అప్పులు చేసి రాష్ట్రాన్ని శ్రీలంకలా మార్చేశారంటూ

మిగతా 3వ పేజీలో ▶

పోలవరానికి 'చంద్ర'శాపం

తన తప్పిదాలను జగన్‌పై నెట్టేందుకు శ్వేతపత్రంలో బాబు అబద్ధాలు

- పనుల్లో జాప్యంతో రూ.వేల కోట్ల నష్టానికి బాధ్యత చంద్రబాబుదేనం టోన్న నిపుణులు, అధికారులు
- కమీషన్లకు ఆశపడి నిర్మాణ బాధ్యతలను దక్కించుకోవడం చారిత్రక తప్పిదం
- ఇష్టారాజ్యంగా పనులు.. స్పిల్ వేను పునాది స్థాయిలో వదిలేసిన టీడీపీ సర్కార్
- అయినా నదికి అడ్డంగా ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–2లో పునాది దయాఫ్రమ్ వాల్ నిర్మాణం

2లో

గజరాజులతో గస్తీ

మైసూర్ నుంచి నల్లమలకు రానున్న ఏనుగులు

ఆంధ్రాకు 9 ఏనుగులను పంపేందుకు అనుమతి

శిక్షణ కోసం కర్ణాటక వెళ్లనున్న అటవీ సిబ్బంది



అడవుల్లో గస్తీ తిరుగుతున్న ఏనుగులు

పెద్దదోర్నాల: నల్లమల అడవుల పరిరక్షణకు రాష్ట్ర అటవీ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. అమూల్యమైన వృక్షసంపద అక్రమ రవాణాను అరికట్టేందుకు.. అరుదైన వన్యప్రాణులను సంరక్షించి వేసవిలో అగ్నికీలల నుంచి అటవీ ప్రాంతాన్ని కాపాడేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఇందుకోసం ఇప్పటికే బేస్ క్యాంప్‌లు, స్ట్రైకింగ్ ఫోర్స్, యాంటీ పోచింగ్ బృందాలను ఏర్పాటు చేసింది. దీంతోపాటు అభయారణ్యాల్లో ఇకపై గజరాజులతో గస్తీ చేపట్టాలని అటవీ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

రెండు అభయారణ్యాల పరిధిలో..

మన రాష్ట్రంలోని ప్రకాశం, నంద్యాల, పల్నాడు జిల్లాల్లో 3,727.82 చదరపు కిలోమీటర్ల పరిధిలో వ్యాపించి ఉన్న అడవిని కేంద్ర ప్రభుత్వం 1983లో అభయారణ్యంగా ప్రకటించింది. పెద్దదోర్నాల నుంచి శ్రీశైలం శిఖరం వరకు రాజీవ్‌గాంధీ అభయారణ్యం.. మార్కాపురం, గిద్దలూరు, ఆత్మకూరు, నంద్యాల డివిజన్ల పరిధిలో గుండ్లబ్రహ్మేశ్వర అభయారణ్యం విస్తరించి ఉన్నాయి. వీటిలో పులులతోపాటు చిరుత, ఎలుగుబంటి, జింకలు, దుప్పులు, హైనా, నెమళ్లతోపాటు 70 రకాల క్షీరదాలు, సరీసృపాలు, ఎన్నోరకాల వృక్షాలు, ఔషధ మొక్కలు నల్లమల అభయారణ్యంలో ఉన్నాయి. ఇవన్నీ మారుమూల లోతట్టు ప్రాంతాల్లో జీవిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాలను సందర్శించి వాటిని సంరక్షించే బాధ్యత కత్తిమీద సాములా మారింది.

మూలమూలల్నీ జల్లెడ పట్టేలా..

మారుమూల ప్రాంతాల్లో సైతం వన్యప్రాణులు, వృక్షాలను సంరక్షించేందుకు వీలుగా అటవీ శాఖ ఉన్నతాధికారులు సుశిక్షితులైన సిబ్బంది నేతృత్వంలో ఏనుగులతో గస్తీ ఏర్పాటు చేయాలన్న నిర్ణయం తీసుకున్నారు. మారుమూల ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించేందుకు తమకు శిక్షణ పొందిన 9 ఏనుగులు అవసరమవుతాయని గుర్తించారు. తమకు అవసరమైన 9 ఏనుగులను ఇవ్వాల్సిందిగా ఏపీ అటవీ శాఖ అధికారులు కర్ణాటక అటవీ శాఖకు లేఖ రాశారు. దీనిపై స్పందించిన కర్ణాటక అటవీ శాఖ అధికారులు శిక్షణ పొందిన ఏనుగులను ఆంధ్రప్రదేశ్‌కు పంపేందుకు ఆమోదం తెలిపారు. దీంతోపాటు ఏనుగులను కట్టడి చేసేందుకు మావటిలను తయారు చేసేందుకు అటవీశాఖ తమ సిబ్బందిని కర్ణాటక రాష్ట్రానికి పంపనుంది. రాష్ట్రానికి చెందిన సిబ్బంది అక్కడికి వెళ్లి గజరాజుల ఆహారపు అలవాట్లు, వాటి కదలికలు, వాటి ఇతర అలవాట్లను క్షుణ్ణంగా పరిశీలించి శిక్షణ పొందనున్నారు. 6 ఏనుగులను రాజీవ్‌గాంధీ వన్యప్రాణుల అభయారణ్యానికి, మరో మూడు ఏనుగులను గుండ్లబ్రహ్మేశ్వరం అడవులకు పంపేలా చర్యలు చేపట్టనున్నారు. ఏనుగుల్ని తీసుకొస్తే పెద్ద పులులు ఎక్కువగా సంచరించే లోతట్టు ప్రాంతాలైన నెక్కంటి, రేగుమానుపెంట, తూము గుండాలు, ఆలాటం తదితర ప్రాంతాల్లో సైతం ధైర్యంగా పెట్రోలింగ్ చేపట్టవచ్చని అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఏనుగులతో గస్తీ నిర్వహించేలా చర్యలు




అభయారణ్యంలోని కొన్ని మారుమూల ప్రాంతాల్లో గస్తీ నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. నడక మార్గంలో సిబ్బంది కొంతమేర వరకు మాత్రమే వెళ్లగలరు. అదే ఏనుగులతో అయితే సుదూర ప్రాంతాల్లో గస్తీ నిర్వహించవచ్చు. పులులు సంచరించే ప్రదేశాల్లో సైతం భయం లేకుండా పెట్రోలింగ్ నిర్వహించవచ్చు. మనం చేసిన విజ్ఞప్తికి కర్ణాటక అటవీ శాఖ సానుకూలంగా స్పందించింది. త్వరలో ఏనుగుల్ని నల్లమలకు రప్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– విశ్వేశ్వరరావు, ఫారెస్ట్ రేంజి అధికారి, పెద్దదోర్నాల

ఆయిల్‌పామ్ ధర తిరోగమనం

- 2023లో టన్ను ధర రూ.23 వేలు
- ప్రస్తుత ధర రూ.13,180
- క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకం ఎత్తేయడమే కారణం



ఆయిల్‌పామ్ గెలల ధరలు ఇలా

సంవత్సరం	ధర (టన్నుకు రూ.ల్లో)
2017	8,500
2018	8,600
2019	7,700
2020	10,000
2021	17,951
2022	26,000
2023	23,000
2024	13,180

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఆయిల్‌పామ్ గెలల ధరలు పతనమయ్యాయి. ఐదేళ్లుగా ఏటా పెరుగుతూ వచ్చిన ధర.. ఈ ఏడాది ఉన్నట్టుండి టన్నుకు రూ.10 వేల వరకు తగ్గింది. 2017లో టన్ను గెలల ధర రూ.8,500 ఉండగా.. 2022 నాటికి రికార్డు స్థాయిలో రూ.26 వేలకు చేరింది. 2023లో కాస్త నెమ్మదించి.. రూ.23 వేలకు చేరింది. ప్రస్తుత సీజన్ నాటికి ఆ ధర కాస్తా అమాంతం రూ.13,180కి పడిపోయింది.

దిగుమతి సుంకాలే ప్రధాన కారణం

2017 తరువాత కేంద్ర ప్రభుత్వం విదేశాల నుంచి క్రూడ్ పామాయిల్ దిగుమతులపై ఇంపోర్ట్ డ్యూటీ (దిగుమతి సుంకం) విధించింది. ఐదేళ్ల క్రితం వరకు దిగుమతి సుంకం 30 శాతం ఉండేది. ఆ తరువాత 20 శాతానికి తగ్గించింది. గతేడాది పూర్తిగా దిగుమతి సుంకాన్ని తొలగించడంతో దేశంలోని ప్రధాన కంపెనీలు క్రూడ్ పామాయిల్ దిగుమతులను పెంచుతున్నాయి. ఫలితంగా గతేడాది టన్ను ఆయిల్‌పామ్ రూ.23 వేలు ఉండగా.. ప్రస్తుతం రూ.13,180కే పరిమితమైంది. దేశంలో 10 లక్షల టన్నుల పామాయిల్ వినియోగిస్తుంటే.. దేశంలో 2 లక్షల టన్నులు కూడా ఉత్పత్తి లేదు. ఈ క్రమంలో డిమాండ్ అధికంగా ఉండాలి. కానీ.. క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాలను పూర్తిగా రద్దు చేయడంతో మార్కెట్ వర్గాలు అంతర్జాతీయంగా తక్కువ ధరకే లభిస్తుండటంతో దిగుమతులపై ఆధారపడుతున్నాయి. ఫలితంగా స్థానిక మార్కెట్‌లో పామాయిల్ ధరలు పతనమయ్యాయి.

సాగులో దేశంలోనే ఏపీ టాప్

ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం, ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 1.62 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ తోటలు ఉండగా.. ఒక్క ఏలూరు జిల్లాలోనే 48,968.80 హెక్టార్లు, పశ్చిమ గోదావరి జిల్లాలో 3 వేల హెక్టార్లలో సాగులో ఉంది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని తిరిగి విధించే అవకాశం ఉండటంతో.. తిరిగి ధరలు కొంతైనా పెరిగే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోంది



గవర్నర్‌కు వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ, జనసేన శ్రేణులు పేట్రేగిపోతున్నాయి
- వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నాయి
- శాంతిభద్రతలు క్షీణించాయి.. ప్రభుత్వం పట్టించుకోవడంలేదు
- గవర్నర్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు.. తక్షణమే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి

- వివరాలు 10లో

మెగా కాదు.. దగా డీఎస్సీ!

- జిల్లాకు కనీసం 200 ఎస్‌జీటీ పోస్టులు కూడా లేకుండా ఎలా మెగా డీఎస్సీ?
- అనంతపురం కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయ అభ్యర్థుల ధర్నా

- వివరాలు 2లో

తెలుగు అధికారికి ఎస్‌బీఐ పగ్గాలు

- కొత్త చైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు శెట్టి
- తాజాగా ప్రతిపాదించిన ఎఫ్ఎస్ఐబీ

- వివరాలు 6లో

పింఛన్ల పంపిణీకి ప్రత్యేక రశీదు

చెల్లించిన వారి సంతకంతో కూడిన రశీదు లబ్ధిదారుకు

- లబ్ధిదారుని సంతకం తీసుకున్న రశీదు సచివాలయంలో భద్రం
- 64.75 లక్షల రశీదుల ముద్రణకు రూ.32.41 లక్షలు అదనంగా విడుదల
- ఉదయం 6 గంటలకు పంపిణీ ప్రారంభం
- ఆదివారం సచివాలయాలకు రావాలని సిబ్బందికి కొన్ని జిల్లాల్లో ఆదేశాలు
- రాత్రి సచివాలయం పరిధిలోనే బస చేయాలని సూచన
- సమయానికి పంపిణీ ప్రారంభించని వారిపై చర్యలుంటాయని హెచ్చరిక

13లో

మెగా కాదు.. దగా డీఎస్సీ!


అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

- జిల్లాకు 200 ఎస్‌జీటీ పోస్టులు కూడా లేకుండా ఎలా మెగా డీఎస్సీ?
- అనంతపురం కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయ అభ్యర్థుల ధర్నా
- ఎస్‌జీటీ పోస్టుల భర్తీలో నాలుగు జిల్లాలకు తీవ్ర అన్యాయం
- నెల్లూరులో 104, ప్రకాశంలో 124, శ్రీకాకుళంలో 144, అనంతపురంలో 183 పోస్టులు మాత్రమే..


అనంతపురం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

అనంతపురం అర్బన్/ సాక్షి, అమరావతి: మెగా డీఎస్సీ అంటూ అనంతపురం జిల్లాకు సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) పోస్టుల కేటాయింపులో ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని పలువురు ఉపాధ్యాయ అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్‌జీటీ పోస్టుల సంఖ్య అతి తక్కువగా చూపుతూ మెగా డీఎస్సీ అని చెప్పడం సరికాదని మండిపడ్డారు. పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేస్తూ శనివారం అనంతపురం పట్టణంలో వందలాది మంది అభ్యర్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ అభ్యర్థులు విష్ణు, గంగాధర్, జ్యోతి, హర్షబాను తదితరులు మాట్లాడుతూ ఎస్‌జీటీ పోస్టుల కేటాయింపులో ప్రభుత్వం అనంతపురం జిల్లాను చిన్నచూపు చూస్తోందన్నారు. జిల్లాలో డీఎడ్ చేసి ఎస్‌జీటీ పోస్టులకు సిద్ధమవుతున్న వారు వేల సంఖ్యలో ఉన్నారన్నారు. కానీ, జిల్లాకు కేవలం 183 ఎస్‌జీటీ పోస్టులు కేటాయించడం సరికాదన్నారు. డీఎస్సీ కోసం ఎదురు చూస్తూ తల్లిదండ్రులు పంపిన డబ్బులతో హాస్టళ్లు, రూముల్లో ఉంటూ శిక్షణ తీసుకుంటూ చదువుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తగినన్ని పోస్టులు లేకపోతే తాము తీవ్రంగా నష్టపోతామన్నారు. అనంతపురం జిల్లాలో కనీసం అంటే వెయ్యి ఎస్‌జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటన్నింటినీ భర్తీ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వో జి.రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఎస్‌జీటీ పోస్టుల సంఖ్య పెంచాలి: డీవైఎఫ్‌ఐ

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీలో ఎస్‌జీటీ పోస్టుల భర్తీలో నాలుగు జిల్లాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) రాష్ట్ర కమిటీ పేర్కొంది. మెగా డీఎస్సీకి సంబంధించిన తొమ్మిది అంశాలపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు రాసిన లేఖను డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రాము, జి.రామన్న శనివారం మీడియాకు విడుదల చేశారు. 'మెగా డీఎస్సీలో ప్రకటించిన ఎస్‌జీటీ పోస్టుల విషయంలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 104, ప్రకాశం జిల్లాలో 124, శ్రీకాకుళం జిల్లాలో 144, అనంతపురం జిల్లాలో 183పోస్టులు మాత్రమే చూపించారు. ఆ నాలుగు జిల్లాలకు పోస్టుల సంఖ్య పెంచి అభ్యర్థులకు న్యాయం చేయాలి. అప్రెంటీస్ విధానాన్ని, జీవో 117ను రద్దు చేయాలి. వయోపరిమితిని 47 ఏళ్లకు పెంచాలి. ప్రస్తుతం ప్రకటించిన 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయగా, ఇంకా ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయనేది వెల్లడించాలి. గతంలో రద్దు చేసిన పాఠశాలలను, పీఈటీ పోస్టులను పునరుద్ధరించాలి. ఈ సంవత్సరం చివరి నాటికి రిటైర్డ్ అవుతున్న ఉపాధ్యాయుల లెక్కలు, రాష్ట్రంలో ఉన్న సింగిల్ టీచర్ పాఠశాలలను దృష్టిలో పెట్టుకుని పోస్టులు భర్తీ చేయాలి. ఉపాధ్యాయుల పదవీవిరమణ వయసును 62ఏళ్ల నుంచి 58 ఏళ్లకు తగ్గించాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వాలి' అని ఆ లేఖలో పేర్కొన్నారు.

రెడ్‌బుక్ ఉన్మాదమిది

ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి టీడీపీ శ్రేణుల ఆగడాలకు హద్దే లేకుండా పోయింది. ప్రధానంగా గ్రామాల్లో, ఎస్సీ, ఎస్టీ వాడల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతి పరులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడుతున్నారు. ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు. జేసీబీలతో ఇళ్లను కూలదోస్తున్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులని కూడా చూడకుండా చితకబాదుతుండటం ఊరూరా కనిపిస్తోంది. శిలాఫలకాలు, వైఎస్సార్ విగ్రహాలను తొలగిస్తున్నారు.. పగలగొడుతున్నారు. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి దళితవాడలో శనివారం ఉదయం 6 గంటలకు అందరూ చూస్తుండగానే టీడీపీ వర్గీయులు దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహంపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. ఇదేం కక్ష సాధింపు? గతంలో ఎన్నో ప్రభుత్వాలు మారాయి. ఎవరైనా ఇలా చేశారా? అధికారం చేజిక్కించుకుంటే ఇలా దాడులు చేయడానికి, ఆస్తులు ధ్వంసం చేయడానికి లైసెన్స్ వచ్చినట్లా? లేక అధికారంతోపాటు హిస్టీరియా ఏమైనా వచ్చిందా? రెడ్ బుక్.. రెడ్ బుక్.. అంటూ లోకేశ్‌కు వచ్చిన పూనకం తాలూకు ఉన్మాదమే ఇప్పుడు ఆ పార్టీ శ్రేణులకూ నరనరాన ఎక్కినట్లుంది. రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చడమే మీ ఉన్మాద లక్ష్యం అయితే.. ప్రజాగ్రహ జ్వాల ఉవ్వెత్తున ఎగిసి పడటం ఖాయం. ఆ సెగలో మాడి మసి అవుతారో.. లేక పద్ధతి మార్చుకుని బుద్ధిగా పాలన సాగిస్తారో చూడాలి.


అద్దేపల్లిలో టీడీపీ నాయకులు పెట్రోల్ పోసి తగలపెట్టిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం

- బాపట్ల జిల్లా అద్దేపల్లిలో పేట్రేగిన టీడీపీ నాయకులు
- పెట్రోల్ పోసి వైఎస్సార్ విగ్రహానికి నిప్పు
- తమ జెండా స్థూపం పగులగొట్టారంటూ టీడీపీ రివర్స్ ఫిర్యాదు
- ఇరువర్గాలపై కేసులు నమోదు చేసిన పోలీసులు
- దళితవాడలో ఉద్రిక్తత.. పోలీస్ పికెట్ ఏర్పాటు


అద్దేపల్లిలో దహనం చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున


అద్దేపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మౌన దీక్ష చేస్తున్న వరికూటి అశోక్‌బాబు

అద్దేపల్లి (భట్టిప్రోలు)/సాక్షి ప్రతినిధి బాపట్ల: టీడీపీ మాజీమంత్రి నక్కా ఆనందబాబు ఎమ్మెల్యేగా ఉన్న వేమూరు నియోజకవర్గంలో టీడీపీ నేతలు బరితెగించారు. భట్టిప్రోలు పంచాయతీ పరిధి అద్దేపల్లి దళితవాడలో శనివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో అందరూ చూస్తుండగానే దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహంపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. విగ్రహం ముప్పావు భాగానికి పైగా దగ్ధమైంది. దీంతో దళితవాడలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అయితే, వైఎస్సార్ విగ్రహానికి సమీపంలో ఉన్న టీడీపీ జెండా దిమ్మెను వైఎస్సార్‌సీపీ వారు పగులగొట్టారని, అందుకు ప్రతీకారంగా వైఎస్ విగ్రహాన్ని తగులబెట్టినట్లు టీడీపీ వర్గీయులు ప్రచారం చేస్తున్నారు. కానీ, టీడీపీ నేతలు ఉద్దేశపూర్వకంగానే తమను రెచ్చగొట్టేందుకు జెండా దిమ్మెను కొద్దిగా పగులగొట్టుకుని ఆ సాకుతో వైఎస్ విగ్రహాన్ని కాల్చివేశారని వైఎస్సార్‌సీపీ నేతలు వాదిస్తున్నారు.

ఇరువర్గాలూ పరస్పర ఫిర్యాదులు

బాపట్ల జిల్లాలోని రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపు అనంతరం టీడీపీ అరాచక పర్వం కొనసాగుతోంది. వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్‌గా టీడీపీ నేతలు దాడులు చేస్తూ వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. దీంతో చాలామంది వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు గ్రామాలు వదలి వెళ్లిపోయారు. ఈ పరిస్థితిలో టీడీపీ జెండా దిమ్మెలను పగులగొట్టే పరిస్థితి వైఎస్సార్‌సీపీ నేతలకు లేదన్నది టీడీపీ నేతలకూ తెలుసు. కాకపోతే ఏదో ఒక సాకుచూపి విధ్వంసాన్ని కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. టీడీపీ కార్యకర్తలే వైఎస్ విగ్రహాన్ని ధ్వంసం చేశారని ఏడు మందిపై వైఎస్సార్‌సీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. టీడీపీ జెండా దిమ్మె ధ్వంసం చేశారంటూ టీడీపీ నేతలు ప్రతిగా 14 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఫిర్యాదు చేశారు.

ఇరువర్గాలపై కేసులు : ఎస్‌ఐ

ఈ ఘటన గురించి తెలుసుకున్న వేమూరు సీఐ పి.రామకృష్ణ, ఎస్‌ఐ కాసుల శ్రీనివాసరావు, సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విషయం తెలుసుకున్న బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ కూడా భట్టిప్రోలు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వివరాలు తెలుసుకున్నారు. కాగా, వైఎస్సార్ విగ్రహం దగ్ధం చేసిన ఏడుగురిపై వైఎస్సార్‌సీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై 435, 427, 507 ఆర్/34 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. మరోవైపు టీడీపీ జెండా దిమ్మను ధ్వంసం చేసినట్లు ఆ పార్టీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూడా కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. దళితవాడలో ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు.

విగ్రహాలు ధ్వంసం హేయం : మేరుగు

స్ఫూర్తిని నింపిన మహనీయుల విగ్రహాల ధ్వంసం, దహనం చేయడం వంటి దుశ్చర్యలకు పాల్పడటం హేయమైన చర్య అని మాజీమంత్రి మేరుగు నాగార్జున అన్నారు. విగ్రహం దహనం విషయం తెలుసుకున్న ఆయన అద్దేపల్లిని సందర్శించి విగ్రహాన్ని పరిశీలించారు. టీడీపీ దురాగతాన్ని ఖండించారు.

హుటాహుటిన మరొక విగ్రహం ఏర్పాటుకు యత్నం

వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు శనివారం రాత్రి అద్దేపల్లి విచ్చేసి కాలిపోయిన వైఎస్ విగ్రహాన్ని పరిశీలించారు. అక్కడే వైఎస్సార్ మరో విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. విగ్రహం ఏర్పాటు పూర్తయ్యే వరకూ ఆయన స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని మౌన దీక్ష చేశారు. దళితవాడ ప్రజలు అండగా వచ్చి ఆయనకు మద్దతుగా దీక్షలో పాల్గొన్నారు. రాత్రి 10గంటల ప్రాంతంలో పోలీసులు అశోక్‌బాబు దీక్షను భగ్నంచేసి ఆయన్ను రేపల్లె తరలించారు. అక్కడా ఆయన పోలీసు వాహనం దిగకుండా దీక్ష కొనసాగిస్తున్నారు. మహిళలు, చిన్నారులు అని చూడకుండా పోలీసులు నిర్దాక్షిణ్యంగా లాఠీచార్జి చేశారు. విగ్రహాన్ని దగ్ధం చేయడం గ్రామ చరిత్రలో బ్లాక్ డేగా నిలిచిందని.. చంద్రబాబు రాక్షస పాలనకు ఇది పరాకాష్టని అశోక్‌బాబు మండిపడ్డారు.

గిరిజన గురుకుల ఉపాధ్యాయుల పెన్‌డౌన్

మెగా డీఎస్సీలో 1,143 పోస్టులు కలపడంతో తమ ఉద్యోగాలకు ప్రమాదం ఏర్పడిందని ఆందోళన

విజయవాడకు చేరుకున్న 300 మంది


మంగళగిరిలోని టీడీపీ కార్యాలయం వద్ద సీఎం చంద్రబాబును కలిసేందుకు పడిగాపులు పడుతున్న గిరిజన గురుకులాల ఉపాధ్యాయులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గిరిజన గురుకుల ఉపాధ్యాయులు, అధ్యాపకులు పెన్‌డౌన్ చేపట్టి నిరసనకు దిగారు. ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ కారణంగా తమ ఉద్యోగాలకు ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై తమకు న్యాయం చేయాలంటూ ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇదే విషయమై శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసి విన్నవించిన గురుకుల ఉపాధ్యాయులు శనివారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి తమ ఆవేదనను చెప్పుకున్నారు. గిరిజన ప్రాంతాలకు చెందిన సుమారు 300 మంది విధులను బహిష్కరించి విజయవాడకు చేరుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. గిరిజన గురుకులాల్లో సుమారు 1,650 మంది దాదాపు 10 నుంచి 15 ఏళ్లుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించడంతో తమ ఉద్యోగాలు పోతాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెగా డీఎస్సీలో గిరిజన ప్రాంతాల్లోని గురుకుల విద్యాలయాలకు సంబంధించిన 1,143 పోస్టులు ప్రతిపాదించారు. దీంతో ఏళ్ల తరబడి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో సేవలందిస్తున్న తమకు అన్యాయం జరుగుతుందని ఆవేదన చెందుతున్నారు. ఇదే విషయాన్ని గిరిజన సంక్షేమ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పష్టమైన హామీ రాలేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది గురుకుల ఉపాధ్యాయులు, అధ్యాపకులు విధులను బహిష్కరించి విజయవాడ చేరుకున్నారు. ఉద్యోగ భద్రత కల్పించి, సమాన పనికి సమాన వేతనం ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబును కోరినట్టు గురుకుల ఉపాధ్యాయ సంఘం ప్రతినిధి లక్ష్మీనాయక్ తెలిపారు.

పోలవరానికి 'చంద్ర'శాపం

తన తప్పిదాలను జగన్‌పై నెట్టేందుకు శ్వేతపత్రంలో చంద్రబాబు అబద్ధాలు

- వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ప్రణాళికాబద్ధంగా పనులు
- కరోనా కాలంలోనూ 48 గేట్లతో సహా రికార్డు సమయంలో స్పిల్ వే పూర్తి
- అప్రోచ్ ఛానల్, స్పిల్ ఛానల్, పైలట్ ఛానల్‌ను పూర్తి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- 2021 జూన్ 11న 6.1 కి.మీ.ల పొడవున నదీ ప్రవాహం మళ్లింపు
- బాబు తప్పిదం వల్ల కోతకు గురైన దిగువ కాఫర్ డ్యామ్ పనులు పూర్తి
- ఈసీఆర్ఎఫ్ నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన అగాధాలు పూడ్చివేత
- డయాఫ్రమ్ వాల్ భవితవ్యాన్ని తేల్చి డిజైన్లను ఖరారు చేస్తే 18 నెలల్లో డ్యామ్ పూర్తి చేస్తామని స్పష్టీకరణ


2019 ఆగస్టులో వచ్చిన వరద సమయంలో పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే పరిస్థితి ఇది

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2014–19 మధ్య టీడీపీ సర్కార్ అధికారంలో ఉన్నప్పుడు సీఎం చంద్రబాబు చేసిన చారిత్రక తప్పిదాల వల్లే పోలవరంలో పెను విధ్వంసం చోటు చేసుకుంది. ఆ తప్పిదాలే పోలవరానికి శాపంగా మారాయి. ప్రాజెక్టు పనుల్లో తీవ్ర జాప్యానికి.. రూ.వేల కోట్ల నష్టానికి దారి తీశాయి. కమీషన్లకు ఆశ పడి తాను చేసిన తప్పిదాల వల్ల ప్రాజెక్టులో జరిగిన విధ్వంసం.. ఫలితంగా పనుల్లో జరుగుతున్న జాప్యాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వంపై నెడుతూ నిస్సిగ్గుగా సీఎం చంద్రబాబు పదే పదే అబద్ధాలు వల్లిస్తున్నారు. ఈనెల 17న పోలవరం పర్యటనలోనూ.. శుక్రవారం శ్వేతపత్రం విడుదల చేస్తున్నప్పుడూ వైఎస్ జగన్‌పై వ్యక్తిగత దూషణలు చేస్తూ.. నిరాధారమైన అసత్య ఆరోపణలు చేస్తూ.. పచ్చి అబద్ధాలతో కట్టుకథలు అల్లుతూ చంద్రబాబు చిందులు తొక్కారు. రాజకీయాల్లో ఉండటానికి అర్హత లేని వ్యక్తులకు అధికారం ఇస్తే పరిస్థితి ఇలాగే ఉంటుందని ఆక్రోశం వెళ్లగక్కారు. చివరకు పోలవరాన్ని ఎప్పుడు పూర్తి చేస్తామనేది చెప్పలేక చేతులెత్తేశారు. సీఎం చంద్రబాబు చెప్పినట్టుగా రాజకీయాల్లో ఉండటానికి అర్హత లేని వారు ఎవరు.. అర్హత ఉన్న వారు ఎవరో చూద్దాం..

నిర్మాణ బాధ్యతల కోసం 30 నెలలు వృథా

రాష్ట్రానికి జీవనాడి లాంటి పోలవరం ప్రాజెక్టును వంద శాతం వ్యయంతో తామే పూర్తి చేస్తామని ఏపీ పునర్విభజన చట్టం–2014 ద్వారా కేంద్రం హామీ ఇచ్చింది. కమీషన్లకు ఆశపడిన నాటి సీఎం చంద్రబాబు.. ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి మరీ పోలవరం నిర్మాణ బాధ్యతలను దక్కించుకుని చారిత్రక తప్పిదానికి పాల్పడ్డారు. ద్రవ్యోల్బణం వల్ల ధరలు పెరిగి అంచనా వ్యయం పెరుగుతుందని తెలిసినా, 2013–14 ధరలతోనే పోలవరాన్ని పూర్తి చేస్తానని 2016 సెప్టెంబరు 7న కేంద్రంతో ఒప్పందం చేసుకున్నారు. ఇది పోలవరానికి నిధుల సమస్యకు ప్రధాన కారణమైంది. ఆ మరుసటి రోజే.. జలాశయం పనుల అంచనా వ్యయాన్ని 2015–16 ధరల ప్రకారం పెంచి రూ.1,481.41 కోట్ల మేర కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చారు. 2014 జూన్ 8 నుంచి 2016 డిసెంబర్ 30 వరకు ప్రాజెక్టుకు సంబంధించి ఎలాంటి పనులు చేపట్టకుండా 30 నెలలు వృథా చేశారు.

ప్రణాళికాయుతంగా వడివడిగా పనులు

ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్–3లో 162 మీటర్ల పొడవున కాంక్రీట్ డ్యామ్ నిర్మాణాన్ని వైఎస్ జగన్ పూర్తి చేశారు. గ్యాప్–1లో 543 మీటర్ల పొడవున పునాది డయాఫ్రమ్ వాల్ నిర్మించారు. కుడి కాలువతోపాటు ఎడమ కాలువలో అత్యంత సంక్లిష్టమైన వరహా నదిపై అతి పొడవైన అక్విడెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి దాదాపుగా కొలిక్కి తెచ్చారు. జలాశయంతో కుడి, ఎడమ కాలువలను అనుసంధానం చేసే కనెక్టివిటీస్(హెడ్ రెగ్యులేటర్, సొరంగాలు)ను పూర్తి చేశారు. చంద్రబాబు చారిత్రక తప్పిదం వల్ల ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన భారీ అగాధాలను సీడబ్ల్యూసీ మార్గదర్శకాల మేరకు ఇసుకతో నింపి, వైబ్రో కాంపాక్షన్ చేస్తూ యథాస్థితికి తెచ్చారు. గ్యాప్–2లో దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌కు సమాంతరంగా కొత్తది నిర్మించాలా? లేదంటే దెబ్బతిన్న చోట్ల 'యూ' ఆకారంలో డయాఫ్రమ్ వాల్ నిర్మించి.. పాత దానితో అనుసంధానం చేయాలా? అన్నది తేల్చి.. డిజైన్లను ఖరారు చేస్తే 18 నెలల్లోగా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామంటూ 2022 డిసెంబర్ నుంచి వైఎస్ జగన్ ప్రభుత్వం కేంద్ర జల్ శక్తి శాఖ, సీడబ్ల్యూసీ, పీపీఏలను కోరుతూ వచ్చింది. అంతర్జాతీయ నిపుణుల సహకారం తీసుకుని డిజైన్లను ఖరారు చేద్దామని సీడబ్ల్యూసీ ఛైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరా ప్రతిపాదించారు. ఆ మేరకు కాంట్రాక్టు సంస్థ స్వీడన్‌కు చెందిన యాఫ్రిని అంతర్జాతీయ కన్సల్టెంట్‌గా నియమించుకుంది. ఫిబ్రవరిలో యూఎస్ఏకు చెందిన ఇద్దరు, కెనడాకు చెందిన మరో ఇద్దరు నిపుణులను పీపీఏ ఎంపిక చేసింది. యాఫ్రి, అంతర్జాతీయ నిపుణులు ఏకాభిప్రాయం వ్యక్తం చేసిన డిజైన్లతో సవాళ్లను అధిగమిస్తూ.. పనులు చేపట్టేలా ప్రణాళిక రూపొందించారు. చంద్రబాబు చారిత్రక తప్పిదానికి పాల్పడకపోయి ఉంటే.. 2022 నాటికే వైఎస్ జగన్ పోలవరాన్ని పూర్తి చేసి ఉండేవారని సాగు నీటి రంగ నిపుణులు చెబుతున్నారు.

కరోనా వేళ రికార్డు సమయంలో స్పిల్ వే పూర్తి

వైఎస్ జగన్ సీఎంగా 2019 మే 30న బాధ్యతలు స్వీకరించారు. 2019 జూన్ రెండో వారంలోనే గోదావరి వరద ప్రారంభమైంది. నవంబర్‌కు తగ్గుముఖం పట్టింది. ఆ వెంటనే ప్రోటోకాల్ ప్రకారం.. నదీ ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్ వే నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. 2020 మార్చిలో కరోనా మహమ్మారి విజృంభించి.. 2021 ఆఖరు వరకు అతలాకుతలం చేసింది. అయినప్పటికీ స్పిల్ వే నిర్మాణాన్ని పరుగులెత్తించారు. స్పిల్ వే పియర్స్‌ను 53.32 మీటర్ల ఎత్తుతో పూర్తి చేసి.. వాటికి 25.72 మీటర్ల నుంచి 45.72 మీటర్ల మధ్య 20 మీటర్ల ఎత్తు, 16 మీటర్ల వెడల్పుతో ప్రపంచంలోనే అతి పెద్ద గేట్లను బిగించారు. వరద వచ్చినప్పుడు దిగువకు విడుదల చేయడానికి వీలుగా గేట్లను ఎత్తడానికి, దించడానికి జర్మనీ, జపాన్‌ల నుంచి హైడ్రాలిక్ హాయిస్ట్ సిలిండర్లను దిగుమతి చేసుకుని వాటికి అమర్చారు. స్పిల్ వేపై రాకపోకలకు వీలుగా 1,118 మీటర్ల పొడవున స్పిల్ వే బ్రిడ్జిని పూర్తి చేశారు. నదీ ప్రవాహాన్ని స్పిల్ వే వైపునకు మళ్లించేందుకు వెయ్యి మీటర్ల వెడల్పు.. 2,100 మీటర్ల పొడవుతో అప్రోచ్ ఛానల్ తవ్వారు. స్పిల్ వే నుంచి దిగువకు వదలిన వరద ప్రవాహాన్ని తిరిగి నదిలోకి కలపడం కోసం 2,920 మీటర్ల పొడవున స్పిల్ ఛానల్, వెయ్యి మీటర్ల పొడవున పైలట్ ఛానల్‌లను పూర్తి చేశారు. ఆలోగా ఎగువ కాఫర్ డ్యామ్, దిగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేశారు. దాంతో 2021 జూన్ 11న గోదావరి వరద ప్రవాహాన్ని అప్రోచ్ ఛానల్, స్పిల్ వే, స్పిల్ ఛానల్, పైలట్ ఛానల్ మీదుగా 6.1 కి.మీల పొడవున గోదావరి ప్రవాహాన్ని మళ్లించి రికార్డు సృష్టించారు.

కాఫర్ డ్యామ్‌ల లీకేజీల పాపం బాబు సర్కార్‌దే

ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల పనులను చేపట్టడానికి వీలుగా లీకేజీలకు అడ్డుకట్ట వేయడానికి జెట్ గ్రౌటింగ్ చేయాలి. అయితే నిర్మాణ వ్యయాన్ని తగ్గించుకోవడం కోసం గోదావరి నదిలో ఇసుక పర్మియబులిటీ విలువను 2018లో అప్పటి కాంట్రాక్టు సంస్థ ట్రాన్స్‌ట్రాయ్ తప్పుగా మదింపు చేసింది. దాన్నే పరిగణనలోకి తీసుకుని 30 నుంచి 35 మీటర్ల లోతు వరకూ స్టోన్ కాలమ్స్ వేసి జెట్ గ్రౌటింగ్ చేయకుండా కేవలం 20 మీటర్ల లోతు వరకూ జెట్ గ్రౌటింగ్ చేసేలా డిజైన్‌లు రూపొందించింది. నవయుగ సంస్థ ఆ మేరకే జెట్ గ్రౌటింగ్ చేసి కాఫర్ డ్యామ్‌ల నిర్మాణం చేపట్టింది. జెట్ గ్రౌటింగ్ నిబంధనల మేరకు చేసి ఉంటే ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లలో లీకేజీ సమస్య ఉత్పన్నమయ్యేది కాదని సాగు నీటి రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తన హయాంలో జరిగిన ఈ తప్పిదాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వంపై నెట్టేందుకు సీఎం చంద్రబాబు యత్నించడం గమనార్హం.

చారిత్రక తప్పిదంతో విధ్వంసం

- ఏదైనా నదిపై ఒక ప్రాజెక్టును కట్టాలంటే.. తొలుత నదీ ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్ వేను పూర్తి చేయాలి. ఆ తర్వాత ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతానికి ఎగువన, దిగువన నదికి అడ్డంగా కాఫర్ డ్యామ్‌లు నిర్మించాలి. దీని వల్ల నదీ ప్రవాహం స్పిల్ వే మీదుగా మళ్లుతుంది. అప్పుడు ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రధాన డ్యామ్ పనులు చేపట్టి, పూర్తి చేయవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశంలోనైనా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఇదే ప్రోటోకాల్ పాటిస్తారు.
- కానీ.. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో మాత్రం నాటి సీఎం చంద్రబాబు ప్రోటోకాల్‌ను తుంగలో తొక్కారు. నదీ ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్ వేను పూర్తి చేయకుండా పునాది స్థాయిలోనే వదిలేశారు. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యామ్ గ్యాప్–2లో నది గర్భంలో 1,396 మీటర్ల పొడవున పునాది డయాఫ్రమ్ వాల్ నిర్మాణాన్ని 2018 జూన్ 11 నాటికే పూర్తి చేశారు. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణానికి ప్రాంతానికి ఎగువన, దిగువన నదికి అడ్డంగా కాఫర్ డ్యామ్‌ల నిర్మాణాన్ని 2018 నవంబర్‌లో ప్రారంభించి పూర్తి చేయలేక 2019 ఫిబ్రవరిలో చేతులెత్తేశారు.
- స్పిల్ వే, స్పిల్ ఛానల్ పూర్తి చేయకపోవడం వల్ల నదీ ప్రవాహాన్ని మళ్లించడం సాధ్యం కాదు. అప్పుడు కాఫర్ డ్యామ్‌ల మీదుగా వరద ప్రవాహిస్తే కొట్టుకుపోతాయనే నెపంతో.. కాఫర్ డ్యామ్‌లకు ఇరువైపులా ఖాళీ ప్రదేశాలను వదిలేశారు. పోలవరం ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద గోదావరి నది వెడల్పు 2,400 మీటర్లు. 2019, 2020లలో గోదావరికి వచ్చిన భారీ వరద 2,400 మీటర్ల వెడల్పుతో ప్రవహించాల్సింది పోయి.. ఎగువ కాఫర్ డ్యామ్ ఖాళీగా వదిలిన 800 మీటర్లకు కుంచించుకుపోయి ప్రవహించాల్సి రావడంతో వరద ఉధృతి మరింత అధికమవడం వల్ల ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురై విధ్వంసం చోటుచేసుకుంది. గరిష్ఠంగా 36.5 మీటర్లు.. కనిష్ఠంగా 26 మీటర్ల లోతుతో నాలుగు చోట్ల భారీ అగాధాలు ఏర్పడ్డాయి. గ్యాప్–2లో 1396 మీటర్ల పొడవుతో నిర్మించిన డయాఫ్రమ్ వాల్ నాలుగు చోట్ల కోతకు గురై 485 మీటర్ల పొడవున దెబ్బతింది. ఇదే పనుల్లో జాప్యానికి, రూ.వేల కోట్ల నష్టానికి కారణమైంది. ఐఐటీ (హైదరాబాద్), ఎన్‌హెచ్‌పీసీ (నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్) నిపుణులు ఇదే విషయాన్ని తేల్చి చెబుతూ నివేదిక ఇచ్చాయి.

రూ.12,157.53 కోట్లకు మోకాలడ్డు

పోలవరం నిర్మాణ బాధ్యతలను దక్కించుకునే క్రమంలో 2013–14 ధరల ప్రకారం ప్రాజెక్టును పూర్తి చేస్తానని 2016 సెప్టెంబరు 7న చంద్రబాబు కేంద్రానికి హామీ ఇచ్చారు. ఆ మేరకు ఒప్పందం చేసుకున్నారు. 2013–14 ధరల ప్రకారం పోలవరం అంచనా వ్యయం రూ.20,398.61 కోట్లే. ఇందులో 2014 ఏప్రిల్ 1 వరకూ చేసిన వ్యయం రూ.4,730.71 కోట్లుపోనూ మిగతా రూ.15,667.9 కోట్లే ఇస్తామని కేంద్రం స్పష్టం చేసింది. అయితే 2017–18 ధరల ప్రకారం పునరావాసం, భూసేకరణ వ్యయమే రూ.33,168.23 కోట్లు. అందువల్ల రూ.20,398.61 కోట్లతో ప్రాజెక్టును పూర్తి చేయడం అసాధ్యమని, తాజా ధరల మేరకు నిధులిచ్చి ప్రాజెక్టును పూర్తి చేయడానికి సహకరించాలని 2019 మే 30 నుంచి పలుదఫాలు ప్రధాని మోదీని అప్పటి సీఎం వైఎస్ జగన్ కోరుతూ వచ్చారు. దానికి ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించారు. ప్రధాని ఆదేశాల మేరకు తొలి దశ పూర్తికి రూ.12,157.53 కోట్లు అవసరమని కేంద్ర జల్ శక్తి శాఖ తేల్చింది. ఆ మేరకు నిధులు విడుదల చేయాలని మార్చి 6న కేంద్ర కేబినెట్‌కు ప్రతిపాదన పంపింది. అప్పటికే బీజేపీతో పొత్తు కుదరడంతో పోలవరానికి నిధుల విడుదల ప్రతిపాదనను కేంద్ర కేబినెట్ ముందు పెట్టవద్దని, తమకు రాజకీయంగా ఇబ్బందులు వస్తాయంటూ చంద్రబాబు అడ్డుపుల్ల వేశారు. ప్రస్తుతం ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్నందున, ఆ ప్రతిపాదనపై కేంద్ర కేబినెట్‌తో ఆమోద ముద్ర వేయిస్తే నిధుల సమస్య తీరుతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. సాంకేతిక సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వం సీడబ్ల్యూసీ ద్వారా ఒక ప్రణాళికను సిద్ధం చేసింది. ఆ ప్రణాళికను అమలు చేయడం ద్వారా ప్రాజెక్టు పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని సాగు నీటి రంగ నిపుణులు సూచిస్తున్నారు.

క్లుప్తంగా...

కృషి, పట్టుదలతో మరో గొప్ప గెలుపు

భారత క్రికెట్ జట్టుకు మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: టీ20 వరల్డ్ కప్ గెలుచుకున్న భారత క్రికెట్ జట్టుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. కృషి, పట్టుదలతో మరో గొప్ప గెలుపు సొంతం చేసుకుందని ప్రశంసించారు. టోర్నీ ఆద్యంతం సమష్టి కృషితో భారత జట్టు విజయాలు సాధించిందన్నారు. వన్డే వరల్డ్ కప్ ఫైనల్‌లో ఓటమితో తీవ్ర నిరాశకు గురైన అభిమానులకు ఈ విజయం గొప్ప ఊరట నిస్తుందని అభిప్రాయపడ్డారు. భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ తెలుగువాడు కావడం గర్వ కారణమన్నారు. జట్టును విజయవంతంగా నడిపించడంలో అతడు చక్కటి నాయకత్వాన్ని ప్రదర్శించాడని కొనియాడారు. రానున్న రోజుల్లో టీమ్ ఇండియా మరిన్ని చాంపియన్‌షిప్‌లు సాధించాలని ఆకాంక్షించారు.

అంజన్న సన్నిధిలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ పూజలు

జగిత్యాల: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కల్యాణ్ జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజన్న ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

జగన్ హయాంలోనే 'పోలవరం' పరుగులు

కాంగ్రెస్ పార్టీ నేత జెట్టి రామారావు

తాడేపల్లిరూరల్: పోలవరం ప్రాజెక్టును రాజకీయ కోణంలో చూడొద్దని కాంగ్రెస్ పార్టీ నాయకుడు జెట్టి రామారావు కోరారు. శనివారం గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం జగన్ సర్కారు హయాంలోనే పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పరుగులు పెట్టిందని ఆయన తెలిపారు. రానున్న బడ్జెట్‌లో పోలవరానికి కేంద్ర ప్రభుత్వం సరిపడా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అమరావతి జేఏసీ నేతలు మూర్తి, నాగరాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్పీకర్ పదవికి గౌరవం తెస్తా: అయ్యన్న పాత్రుడు



స్పీకర్ అయ్యన్న పాత్రుడుకు స్వాగతం పలుకుతున్న సీపీ రవిశంకర్

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): స్పీకర్ పదవికి గౌరవం తెస్తానని ఆంధ్రప్రదేశ్ స్పీకర్ అయ్యన్న పాత్రుడు తెలిపారు. విశాఖ విమానాశ్రయంలో శనివారం ఆయనకు సాదర స్వాగతం లభించింది. స్పీకర్ పదవి చేపట్టి తొలిసారిగా విశాఖ వచ్చిన ఆయనకు అధికారులు, నాయకులు, టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తానిప్పుడు బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నాననీ, ఏదిపడితే అది మాట్లాడనని తెలిపారు. స్పీకర్ పదవి రావడం సంతోషంగా ఉందని, పరిమితులకు లోబడి హుందాగా పని చేస్తానన్నారు.

కృష్ణా బోర్డు చైర్మన్‌గా అతుల్ జైన్

సాక్షి, అమరావతి: కృష్ణానది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) చైర్మన్‌గా అతుల్ జైన్‌ను కేంద్ర జల్ శక్తి శాఖ నియమించింది. ప్రస్తుతం కృష్ణా బోర్డు చైర్మన్‌గా పనిచేస్తున్న శివ్‌నందన్‌కుమార్ పదవీ విరమణ చేశారు. దాంతో.. పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవోగా పనిచేస్తున్న అతుల్ జైన్‌ను కృష్ణా బోర్డు చైర్మన్‌గా నియమించింది. ఈ మేరకు కేంద్ర జల్ శక్తి శాఖ అండర్ సెక్రటరీ అనిల్‌కుమార్ శర్మ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పలువురు ఐఏఎస్‌ల బదిలీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పీఏడీఏ) ఓఎస్డీ బి.అనిల్ కుమార్ రెడ్డి, ఇన్‌క్యాప్ ఎండీ కె.నీలకంఠారెడ్డిని జీఏడీకి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నెడ్‌క్యాప్ వీసీఎండీగా ఉన్న నందకిశోర్‌నూ జీఏడీకి అటాచ్ చేశారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుల అరెస్టు

రేపల్లె రూరల్: బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుల్ని అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరిచినట్లు రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆయన వివరాలు వెల్లడించారు. వేమూరు నియోజకవర్గం పెరవలి గ్రామానికి చెందిన బాలిక ఇటీవల నిజాంపట్నం మండలంలోని అడవులదీవి పంచాయతీ గరువుపాలెంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చింది. శుక్రవారం రాత్రి బాలికకు పరిచయస్తుడైన పెరవలి గ్రామానికి చెందిన చైతన్య అనే యువకుడు ఫోన్‌చేసి బయటకు పిలిచాడు. ఆమెను బైక్‌పై గరువుపాలెం గ్రామ శివారుకు తీసుకెళ్లి అత్యాచారానికి చేశాడు. చైతన్యతో పాటు పెరవలి నుంచి వచ్చిన యడాలి పవన్‌కుమార్‌తో పాటు జొన్నకూటి వెంకటేష్, వీరంకి నితీష్, వీరంకి వేణు కూడా బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు డీఎస్పీ వివరించారు. బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వైఎస్సార్ విగ్రహాలు, శిలాఫలకాలపై అక్కసు

'పశ్చిమ'ం, కృష్ణా, కోనసీమ జిల్లాల్లో దుండగుల ధ్వంసం

నరసాపురం రూరల్/వెంట్రప్రగడ (పెదపారుపూడి) /అమలాపురం రూరల్ : పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలంలోని సారవ గ్రామంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వైఎస్సార్ విగ్రహాన్ని, శిలాఫలకాలను ధ్వంసం చేశారు. స్థానిక ఎమ్మెల్యే, అప్పటి ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు హయాంలో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను గ్రామంలో నిర్మించారు. వీటి ప్రారంభోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాలను, అక్కడే ఏర్పాటుచేసిన వైఎస్సార్ విగ్రహాన్ని కొందరు ధ్వంసం చేశారు. ఈ ఘటనతో గ్రామంలో అలజడి రేగింది. ఈ విధ్వంసానికి పాల్పడిన దోషులను శిక్షించాలంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు కడలి రాంబాబు ఆధ్వర్యంలో శనివారం పెద్దఎత్తున ఆందోళనకు సమాయత్తమయ్యారు. గ్రామ కార్యదర్శి యర్రంశెట్టి సత్యనారాయణ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విధ్వంసానికి పాల్పడిన దోషులను వెంటనే అరెస్టుచేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంగ మురళీకృష్ణ డిమాండ్ చేశారు.

కృష్ణాజిల్లా పెదపారుపూడి మండలంలో..

అలాగే, కృష్ణాజిల్లా పెదపారుపూడి మండలంలోని



పశ్చిమ గోదావరి జిల్లా సారవ గ్రామంలో సచివాలయ ప్రాంగణంలోని వైఎస్సార్ విగ్రహాన్ని పూర్తిగా పెకలించి తీసువెళ్లిన దృశ్యం

వెంట్రప్రగడ శివారు శివాపురం వద్ద రోడ్డు పక్కనున్న దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని కూడా శుక్రవారం రాత్రి దుండగులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ పార్టీ గ్రామ కన్వీనర్ మండవ జానకరామయ్య (మున్నా) మాట్లాడుతూ.. అర్ధరాత్రి సమయంలో ఎవరో వైఎస్సార్ విగ్రహం చేతుల భాగం విరగ్గొట్టారన్నారు. ఈ ఘటనను మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. గ్రామంలో పార్టీల పరంగా పరస్పర ఆరోపణలు మినహా ఎప్పుడూ ఇటువంటి చిల్లర రాజకీయాలు జరగలేదన్నారు.

సచివాలయ శిలాఫలకం ధ్వంసం..

ఇదిలా ఉంటే.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ



పశ్చిమ గోదావరి జిల్లా సారవ గ్రామంలో ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని తొలగించిన దృశ్యం

జిల్లా అమలాపురం రూరల్ మండలం రెడ్డిపల్లిలో గ్రామ సచివాలయం శిలాఫలకాన్ని కూడా గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. సచివాలయ నూతన భవనాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. దీనిని అప్పటి రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఈ ఏడాది మార్చిలో ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దీనిని గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేయగా.. శనివారం ఉదయం కార్యాలయానికి వచ్చిన సచివాలయ ఉద్యోగులు దీనిని గుర్తించారు. వెంటనే సర్పంచ్ కరాటం ప్రసన్న, కార్యదర్శి కట్టా సత్తిబాబు దృష్టికి విషయం తీసుకెళ్లగా వారిరువురూ అమలాపురం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని



కృష్ణా జిల్లా వెంట్రప్రగడ శివారు శివాపురంలో ధ్వంసమైన రాజశేఖర్‌రెడ్డి విగ్రహం



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రెడ్డిపల్లిలో ధ్వంసమైన సచివాలయ శిలాఫలకం

ఎస్సై శేఖర్‌బాబు పరిశీలించి గ్రామంలో విచారణ జరిపారు. గ్రామంలో ఇటువంటి సంఘనలు గతంలో ఎప్పుడూ జరగలేదని, బయటి నుంచి వచ్చిన వ్యక్తులే చేసి ఉండవచ్చని స్థానికులు అనుమానాలు వ్యక్తంచేశారు. ఈ సంఘటనపై విచారణ జరుపుతున్నామని ఎస్సై శేఖర్‌బాబు తెలిపారు.

వినతులు స్వీకరించిన సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి శనివారం వినతులు స్వీకరించారు. పలువురు తమ వ్యక్తిగత సమస్యలను విన్నవించి సాయం కోరగా, వారి నుంచి కాగితాలు తీసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే ప్రత్యేక వేదిక ఏర్పాటు చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు.

ఈ ఏడాది మినహాయింపు ఇవ్వండి

ఎన్ఎంసీని కోరిన డా. వైఎస్సార్ హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి

సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్ సీ కేటగిరి (ఎన్ఆర్ఐ) సీట్లను తామే భర్తీ చేస్తామని నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) చేసిన ప్రతిపాదన నుంచి ఈ ఏడాది మినహాయింపు కోరుకుతూ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి ఎన్ఎంసీకి లేఖ రాశారు. ఏపీ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ యాక్ట్ 1983 ప్రకారం ప్రస్తుతం రాష్ట్రంలో వైద్య విద్య యూజీ ప్రవేశాలు చేపడుతున్నట్లు లేఖలో వెల్లడించారు. ఎన్ఎంసీ ప్రతిపాదనల ప్రకారం ముందుకు వెళ్లాలంటే నియమ నిబంధనలు సవరించాల్సి ఉంటుందన్నారు. త్వరలోనే ప్రవేశ ప్రక్రియ మొదలయ్యే అవకాశం ఉన్న క్రమంలో ఇంత స్వల్ప కాలంలో నిబంధనల సవరణ వీలు పడదన్నారు. దీనికి తోడుగా ఎన్ఎంసీ ప్రతిపాదనలు అనుమతించవద్దని ఏపీ ప్రైవేటు మెడికల్, డెంటల్ కళాశాలల యాజమాన్యాల నుంచి అభ్యర్థన వచ్చిందని, ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని 2024–25 విద్యా సంవత్సరం అడ్మిషన్లను పాత పద్ధతిలోనే చేసుకునేలా అనుమతించాలని పేర్కొన్నారు.

పోలవరం అనర్థాలకు చంద్రబాబే కారణం

- ప్యాకేజీల కోసం బాబు ప్రాజెక్టును కేంద్రం నుంచి తీసుకొన్నారు
- కేంద్రమే నిర్మాణం చేపట్టి ఉంటే ఈపాటికే నిర్మాణం పూర్తయ్యేది
- బాబు హయాంలో నిర్మాణంలో లోపాలు జరిగాయి
- దీనిపై బహిరంగ చర్చకు సిద్ధం
- మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: పోలవరం ప్రాజెక్టు అనర్థాలకు సీఎం చంద్రబాబే కారకుడని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ చెప్పారు. ఆయన శనివారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టుపై చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేయడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఆయన ఏ హోదాలో శ్వేతపత్రం విడుదల చేశారని ప్రశ్నించారు. 2014–19 చంద్రబాబు హయాంలో, 2019–24 వైఎస్ జగన్ హయాంలో ఎంత మేరకు పనులు జరిగాయో ప్రజలకు తెలుసన్నారు. బాబు పాలనలోనే పోలవరం నిర్మాణం అస్తవ్యస్తంగా జరిగిందన్నారు. ఈ వైఫల్యాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు స్థితిగతులపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం నిర్మాణాన్ని కేంద్రానికి వదిలేయకుండా తన చేతుల్లోకి తీసుకొని ప్యాకేజీల కోసం నవయుగ కం



మాట్లాడుతున్న మాజీ ఎంపీ భరత్‌రామ్

పెనీకి కాంట్రాక్ట్ ఇచ్చిన ఘనత చంద్రబాబుదేనని గుర్తు చేశారు. దీనిని కేంద్రానికి వదిలేసి ఉంటే ఈపాటికే నిర్మాణం పూర్తయ్యేదని చెప్పారు. బాబు హయాంలో పోలవరం నిర్మాణంలో జరిగిన లోపాల ఫలితంగా వరదలకు కాఫర్ డ్యామ్ కొట్టుకుపోయిందని చెప్పారు. ఎన్‌డీఏలో భాగస్వామి అయిన చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి సత్వరమే ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 2019 – 24 మధ్య నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధానితో మాట్లాడి ప్రాజెక్టు వ్యయం రూ.47,800 కోట్లకు జలశక్తి మిషన్ ఆమోదం పొందేలా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయాలు తొలగించడం అనైతిక చర్య

రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ కార్యాలయాలను తొలగించడానికి టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రయత్నించడం అనైతికమని చెప్పారు. 2014 – 19 మధ్య టీడీపీ ఎన్నో భవనాలు నిర్మించుకుందని, రూ.వెయ్యి లీజుకు కడప, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో స్థలాలు తీసుకుందని గుర్తు చేశారు. వాటిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తొలగించలేదని అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో చంద్రబాబు ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు లీజుకు తీసుకున్నారో జాబితా తమ వద్ద ఉందని చెప్పారు. చంద్రబాబుకు భజన చేసే చానళ్లకు ప్రాధాన్యం ఇస్తూ సాక్షి, టీవీ 9, ఎన్‌టీవీ చానళ్లను నిలిపివేయడం మంచి పద్ధతి కాదన్నారు.

దహనమైన వాహనం వద్ద నిరసన

టీడీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఆ పార్టీ వారు రాజమహేంద్రవరం నగరంలో విధ్వంసాలకు పాల్పడుతున్నారని భరత్‌రామ్ ఆవేదన వ్యక్తం చేశారు. తన ప్రచార రథాన్ని దహనం చేసిన ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరపాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దహనమైన వాహనం వద్ద నల్ల కండువాలు ధరించి నిరసన తెలిపారు. తన హయాంలో నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశానని చెప్పారు. మోరంపూడి ఫ్లైఓవర్ బ్రిడ్జి కోసం నాటి ఎంపీ మురళీమోహన్ ప్రయత్నించినప్పటికీ పనులు జరగలేదని, తాను ఎంపీగా ఎన్నికైన వెంటనే కేంద్ర అధికారులతో సంప్రదించి దీని నిర్మాణం పూర్తి చేయించానని చెప్పారు. ఇసుక, అభివృద్ధి పనుల్లో పర్సంటేజీలు తీసుకున్నట్లు టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు నిరూపించాలని సవాల్ చేశారు. టీడీపీ నాయకులు ఉచిత ఇసుక పేరుతో గోదావరి నుంచి యంత్రాలతో ఇసుక తోడేస్తున్నారని అన్నారు.

నేడు పోలవరానికి అంతర్జాతీయ నిపుణులు

- నాలుగు రోజులపాటు ప్రాజెక్టు పనులు పరిశీలన, సమీక్ష
- సవాళ్లను అధిగమించే విధానం, డిజైన్లపై కసరత్తు

సాక్షి, అమరావతి/పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ఎంపిక చేసిన అంతర్జాతీయ నిపుణులు యూఎస్ఏకు చెందిన డేవిడ్ బి.పాల్, గియాస్ ఫ్రాంకో డి సిస్కో, కెనడాకు చెందిన రిచర్డ్ డొన్నెల్లీ, సీస్ హించ్‌బెర్గర్, కాంట్రాక్టు సంస్థ మేఘా నియమించిన యాఫ్రి (స్వీడన్) ప్రతినిధులు ఆదివారం పోలవరం ప్రాజెక్టును పరిశీలించనున్నారు. నాలుగు రోజులపాటు వారు అక్కడే మకాం వేసి, ప్రాజెక్టుపై క్షుణ్ణంగా అధ్యయనం చేస్తారు. ఆదివారం, సోమవారం ఎగువ కాఫర్ డ్యామ్, దిగువ కాఫర్ డ్యామ్, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతాన్ని, డ్యామ్ గ్యాప్–1, గ్యాప్–2 డయాఫ్రమ్ వాల్, గైడ్ బండ్, స్పిల్ వే, స్పిల్ ఛానల్‌లను పరిశీలిస్తారు. మంగళవారం, బుధవారం డయాఫ్రమ్‌వాల్ పనులు చేసిన బావర్, జెట్ గ్రౌటింగ్ పనులు చేసిన కెల్లర్, ప్రాజెక్టు పనుల నాణ్యతను పర్యవేక్షించే సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్ (సీఎస్ఎంఆర్ఎస్) నిపుణులు, రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు, పీపీఏ సీఈవోతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. క్షేత్ర స్థాయి పరిశీలన, సమీక్షలో వెల్లడైన అంశాల ఆధారంగా ప్రాజెక్టులో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించే విధానాన్ని



ప్రాజెక్టు వ్యూ పాయింట్ నుంచి పనులను పరిశీలిస్తున్న ట్రైనీ ఐఏఎస్ బృందం

ఖరారు చేస్తారు. నిర్మాణాలకు డిజైన్లపై కసరత్తు చేస్తారు. నలుగురు అంతర్జాతీయ నిపుణులు, యాఫ్రి సంస్థ ప్రతినిధులతో సీడబ్ల్యూసీ సభ్యులు (డిజైన్ అండ్ రీసెర్చ్ వింగ్) ఎస్కే సిబల్ శనివారం ఢిల్లీలో సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ నిపుణులకు పోలవరం ప్రాజెక్టు పనులపై అవగాహన కల్పించేందుకు పీపీఏ సీఈవో అతుల్‌జైన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

ప్రాజెక్టును పరిశీలించిన ట్రైనీ ఐఏఎస్‌లు

పోలవరం ప్రాజెక్టు పనులను ట్రైనీ ఐఏఎస్‌ల బృందం శనివారం పరిశీలించింది. ప్రాజెక్టు వ్యూ పాయింట్ నుంచి పనులను వీక్షించారు. ప్రాజెక్టు ఈఈ వెంకటరమణ పనులు జరుగుతున్న తీరును వివరించారు. ఈ బృందంలో 2023 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ ట్రైనీలు సీహెచ్ కళ్యాణి, దామెర హిమ వంశీ, స్వప్నిల్ జగన్నాథ్, బొల్లిపల్లి వినూత్న, హెచ్ఎస్ భావన, శుభమ్ నోక్వాల్ ఉన్నారు. అనంతరం వీరు పట్టిసీమ ఎత్తిపోతల పథకం ప్రాంతాన్ని కూడా పరిశీలించారు.

కాంగ్రెస్ సీనియర్ నేత డీఎస్ కన్నుమూత

- ఉమ్మడి ఏపీలో పీసీసీ చీఫ్‌గా, మంత్రిగా పనిచేసిన డీఎస్
- ఘనంగా నివాళులు అర్పించిన రాజకీయ ప్రముఖులు
- స్వస్థలం నిజామాబాద్‌కు భౌతికకాయం తరలింపు
- నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- హాజరుకానున్న సీఎం రేవంత్, మంత్రులు, ఇతర నేతలు

హైదరాబాద్ (బంజారాహిల్స్)/సాక్షి, హైదరాబాద్/ కోరుట్ల: కాంగ్రెస్ సీనియర్ నేత, పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ (డీఎస్) శనివారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో గుండెపోటుతో కన్నుమూశారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కాలనీలో నివాసం ఉంటున్న ఆయనకు గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు



డీఎస్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు తదితరులు

ఆయనను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే తుదిశ్వాస విడిచారు. డీఎస్‌కు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు సంజయ్ గతంలో నిజామాబాద్ మేయర్‌గా పనిచేశారు. చిన్న కుమారుడు అరవింద్ నిజామాబాద్ బీజేపీ ఎంపీగా ఇటీవల ఎన్నికల్లో గెలుపొందారు. డీఎస్ మరణ వార్త తెలిసిన వెంటనే ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి తన సంతాపాన్ని ప్రకటించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల, ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, కె.రఘువీర్‌రెడ్డి, కేశవరావు, ఆర్.కృష్ణయ్య, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు తదితరులు డీఎస్ నివాసానికి వచ్చి ఆయన భౌతికకాయానికి నివాళులు అర్పించారు. హైదరాబాద్ నుంచి డీఎస్ భౌతికకాయాన్ని ఆయన స్వస్థలం నిజామాబాద్‌కు తరలించారు. ఆదివారం మధ్యాహ్నం అక్కడే ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, తదితర ప్రముఖులు హాజరుకానున్నారు.

బ్యాంకులో క్యాషియర్ నుంచి పీసీసీ చీఫ్, మంత్రి వరకు..

ధర్మపురి శ్రీనివాస్ (డీఎస్) 1948 సెప్టెంబర్ 27న నిజామాబాద్ జిల్లా వేల్పూరులో జన్మించారు. ఆయనకు సతీమణి విజయలక్ష్మి, కుమారులు సంజయ్, అరవింద్ ఉన్నారు. బీకాం, ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన డీఎస్.. తొలుత హైదరాబాద్‌లోని రిజర్వుబ్యాంకులో క్యాషియర్‌గా పనిచేశారు. డీఎస్‌కు ఏపీ ఆర్థిక మంత్రిగా పనిచేసిన అర్గుల్ రాజారాం వరుసకు మేనమామ అవుతారు. ఆయన ప్రోద్బలంతో డీఎస్ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. తొలుత ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. 1989లో నిజామాబాద్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1992లో గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, జౌళి శాఖల మంత్రిగా.. 1993లో ప్రజా సంబంధాలు, సినిమాటోగ్రఫీ, సినిమా అభివృద్ధి శాఖల మంత్రిగా పనిచేశారు. 1995–1998 మధ్య ఉమ్మడి ఏపీ పీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. 1999లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. అసెంబ్లీలో కాంగ్రెస్ సభాపక్ష ఉపనేతగా పనిచేశారు. 2003లో ఉమ్మడి ఏపీ పీసీసీ చీఫ్‌గా నియమితులయ్యారు. 2004లో మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. వైఎస్సార్ కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. 2008లో తిరిగి పీసీసీ పగ్గాలు చేపట్టారు. 2011–2015 మధ్య ఎమ్మెల్సీగా పనిచేశారు. 2015 జూలైలో బీఆర్ఎస్ (టీఆర్ఎస్)లో చేరారు. అప్పటి సీఎం కేసీఆర్ ఆయనను ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుగా నియమించారు. 2016లో డీఎస్ రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2023లో తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

వైఎస్సార్‌తో డీఎస్‌కు ఉన్న అనుబంధం మరిచిపోలేనిది


డీఎస్ మృతి పట్ల వైఎస్ జగన్ సంతాపం



సాక్షి, అమరావతి: మాజీ మంత్రి, తెలంగాణకు చెందిన సీనియర్ నాయకుడు, ఉమ్మడి ఏపీ పీసీసీ మాజీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ (డీఎస్) మరణం పట్ల మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ సంతాపం తెలిపారు. తన తండ్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డితో డీఎస్‌కు ఉన్న అనుబంధం మరిచిపోలేనిదని గుర్తు చేసుకున్నారు. ఎన్నో పదవులు సమర్థవంతంగా నిర్వర్తించి చాలామంది రాజకీయ నాయకులకు డీఎస్ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. డీఎస్ మరణం దిగ్భ్రాంతి కలిగించిందని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. డీఎస్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

జనసేన ఎదుగుదలను ఆకాంక్షించిన వ్యక్తి

డీఎస్‌కు డిప్యూటీ సీఎం పవన్ నివాళి



సాక్షి, అమరావతి: జనసేన పార్టీ ఎదుగుదలను ఆకాంక్షించిన వ్యక్తి డి.శ్రీనివాస్ అని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పేర్కొన్నారు. డీఎస్ మరణం బాధాకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు శనివారం ప్రకటన విడుదల చేశారు.

ప్రజాసేవకు అంకితమైన నాయకుడు: మంత్రి కొలుసు

డీఎస్ మృతి పట్ల రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి డాక్టర్ కొలుసు పార్థసారథి సంతాపం వ్యక్తం చేశారు. మంత్రి, ఎంపీ, పీసీసీ చీఫ్‌గా డీఎస్ ఎన్నో బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. డీఎస్ మరణం బాధాకరమని, సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ప్రజాసేవకు అంకితమైన నాయకుడని పేర్కొన్నారు. డీఎస్‌తో తనకు మంచి అనుబంధముందని, ఉమ్మడి ఏపీలో క్రియాశీలకంగా వ్యవహరించి తనదైన ముద్ర వేసిన డీఎస్ మరణం తీరని లోటన్నారు. డీఎస్ కుటుంబీకులకు సానుభూతి తెలిపారు.

బురదలోనే విద్యార్థులకు భోజనాలు

విశాఖలోని కప్పరాడలో దారుణం

విశాఖ సిటీ: కూటమి ప్రభుత్వం కొలువుదీరిన కొద్ది రోజులకే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది. ఐదేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉన్న దుస్థితే మళ్లీ దాపురించింది. ఎన్నికల ముందు వరకు పాఠశాల భవనంలో ఫ్యాన్ల కింద మధ్యాహ్న భోజనాలు చేసిన విద్యార్థులు.. ఇప్పుడు బురదలో కూర్చొని తినాల్సిన పరిస్థితులు తలెత్తాయి. విశాఖపట్నంలోని కప్పరాడ ప్రభుత్వ పాఠశాలలో కనిపించిన దృశ్యాలే ఇందుకు నిదర్శనం. పాఠశాల విద్యార్థులను బురదలో కూర్చోబెట్టి మధ్యాహ్న భోజనాలు పెట్టడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సర్కారు బడులను అభివృద్ధి చేసింది. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక సదుపాయాలను కల్పించింది. రోజూ నిర్దిష్ట మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన కొద్ది రోజులకే విద్యార్థులకు మళ్లీ ఆరుబయట ఇబ్బందులు పడాల్సిన దుస్థితి వచ్చేసింది. కప్పరాడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను తరగతి గదుల్లో భోజనాలు చేయడానికి సిబ్బంది అంగీకరించలేదు. ఒకవైపు వర్షం పడి బురదమయంగా మారిన పాఠశాల ఆవరణలో ఆరుబయటే విద్యార్థులను కూర్చోబెట్టేశారు. ఆ అపరిశుభ్ర వాతావరణంలోనే మధ్యాహ్న భోజనాలు వడ్డించారు.



కప్పరాడ ప్రభుత్వ పాఠశాలలో బురదలోనే భోజనాలు చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులు బతిమాలినా..

బురదగా ఉందని.. గదుల్లో కాకపోయినా కనీసం వరండాలో అయినా తింటామని విద్యార్థులు బతిమలాడినప్పటికీ అక్కడి సిబ్బంది అంగీకరించలేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో చిన్నారులు ఆరు బయట బురదలోనే కూర్చొని భోజనాలు చేయాల్సి వచ్చింది. దీనిపై కొంత మంది స్థానికులు పాఠశాల సిబ్బందిని ప్రశ్నించారు. పిల్లలు గదులను పాడు చేసేస్తారని, అందుకే లోపల తినొద్దని చెప్పామని సిబ్బంది చెప్పడం గమనార్హం. బురదలో విద్యార్థులకు భోజనాలు పెట్టడాన్ని స్థానికులు తమ ఫోన్లతో చిత్రీకరించారు. ఈ వీడియో ప్రసుత్తం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ దృశ్యాలను చూసిన విద్యార్థుల తల్లిదండ్రులు అప్పటి, ఇప్పటి పరిస్థితులను బేరీజు వేసుకుంటూ నిట్టూరుస్తున్నారు.

మూడు వారాల్లో రూ.7 వేల కోట్ల అప్పు

▶ మొదటి పేజీ తరువాయి

ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఎల్లో మీడియాతో పాటు చంద్రబాబు, పురందేశ్వరి, పవన్ కళ్యాణ్‌లు విషం కక్కారు. చంద్రబాబు అయితే ఒక అడుగు ముందుకు వేసి అప్పులు చేయడం కాదు.. సంపద సృష్టిస్తానని, ఆ సంపద ఎలా సృష్టించాలో తనకే తెలుసంటూ ఎన్నికల ముందు ప్రచారం చేశారు. ఇంత గట్టిగా బల్లగుద్ది చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు ప్రతి మంగళవారం అప్పులు చేస్తామంటూ ఆర్‌బీఐకి స్పష్టం చేసింది. ఇదే సందర్భంలో ప్రతి మంగళవారం అప్పులతో పాటు ఎంత సంపద సృష్టిస్తారో కూడా చెబితే బాగుంటుందని అధికార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఈ నెల 25వ తేదీన సెక్యూరిటీల వేలం ద్వారా రూ.2,000 కోట్లు అప్పు చేసిన చంద్రబాబు సర్కారు.. వచ్చే నెల 2వ తేదీన మంగళవారం మరో రూ.5,000 కోట్లు అప్పు చేస్తోంది. వచ్చే నెల 2వ తేదీన రూ.1,000 కోట్లు తొమ్మిది సంవత్సరాల కాల వ్యవధికి, మరో రూ.1,000 కోట్లు 12 ఏళ్ల కాల వ్యవధికి, మరో రూ.1,000 కోట్లు 17 ఏళ్ల కాల వ్యవధికి, ఇంకో రూ.1,000 కోట్లు 21 ఏళ్ల కాల వ్యవధికి, మరో రూ.1,000 కోట్లు 24 ఏళ్ల కాల వ్యవధికి సెక్యూరిటీల విక్రయం ద్వారా అప్పు చేయనుంది. ఆ తర్వాత మంగళవారం కూడా అప్పు చేయనున్నట్లు చంద్రబాబు సర్కారు ఆర్‌బీఐకి తెలియజేసింది.



నా ఇష్టమును నెరవేర్చు కొనుటకు నేను రాలేదు;
నన్ను పంపిన వాని చిత్తము నెరవేర్చుటకే
పరలోకము నుండి దిగివచ్చితిని.
– క్రైస్తవ ధర్మం

ఇది సరైన సందేశమేనా?



జనతంత్రం

వర్ధెల్లి మురళి

'మరణం నా చివరి చరణం కాదు' అంటాడు విప్లవ కవి అలిశెట్టి ప్రభాకర్. నిజమే, ప్రభావశీలమైన వ్యక్తులు మరణానంతరం కూడా జీవించే ఉంటారు. వారి ప్రభావ స్థాయిని బట్టి సంవత్సరాలు, దశాబ్దాలు, శతాబ్దాల పర్యంతం కూడా. ప్రభావశీలతలో పాజిటివ్ కోణం ఒక్కటే చూడాలా? నెగెటివ్ ప్రభావానికి కూడా ఈ సూత్రం వర్తిస్తుందా? మానవ చరిత్రపై అడాల్ఫ్ హిట్లర్ చేసిన రక్తాక్షర సంతకం కూడా తక్కువ ప్రభావాన్ని చూపలేదు కదా! అతడు కూడా మనకు ప్రాతఃస్మరణీయుడవుతాడా?

నిజానికి ఇందులో సమస్య ఏమీ లేదు. సందేహాతీతమైన సదాచారాలు మనకు ఉన్నాయి. సమాజం మేలు కోరిన వారు, ప్రజల మంచి కోసం పోరాడినవారు, మంచితనాన్ని పెంచినవారిని స్మరించుకునే సంప్రదాయం మనకున్నది. స్మారకాలు నిర్మించుకునే అలవాటు కూడా ఉన్నది. వారి జీవితాల్లోంచి సమాజం పాఠాలు నేర్చుకోవాలనే కాంక్షతో వారినలా తమ జ్ఞాపకాల్లో శాశ్వతంగా నిలబెట్టుకుంటారు. చెడు మార్గంలో పయనించి ప్రభావం కలిగించిన వారిని... అధ్యయనం కోసం మాత్రమే చరిత్ర పుటల్లోకి ఎక్కించాలి. వారికి మరణమే చివరి చరణం కావాలి. ఆ ప్రభావం ఆదర్శం కాకూడదు.

కానీ, దురదృష్టవశాత్తు మారుతున్న కాలం వింత పోకడలు పోతున్నది. అభివృద్ధికి అర్థం మారుతున్నది. విజయ గాథలకు కొత్త నిర్వచనాలు చేరుతున్నాయి. గొప్పతనం అనే మాటకు తాత్పర్యం మారింది. ఎవరు బాగా సంపాదిస్తారో వారే మహానుభావులు అనే భావన బలపడుతున్నది. వారు ఏ మార్గంలో సంపాదించారన్న పట్టింపేమీ కనిపించడం లేదు. గమ్యం మాత్రమే కాదు, గమ్యాన్ని చేరే మార్గం కూడా పవిత్రంగా ఉండాలన్న గాంధీ బోధనను ఒక చాదస్తం కింద జమకట్టవలసిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. గాడ్సే వారసులకు గౌరవ మర్యాదలు లభిస్తున్న కాలంలోకి ప్రవేశించాము కదా!

పారిశ్రామికాభివృద్ధిలో జాతి ప్రగతిని దర్శించిన జేఆర్‌డీ టాటా వంటి ఉన్నతస్థాయి పారిశ్రామికవేత్తలు కూడా మనకు ఉన్నారు. అటువంటి వారు చనిపోయినప్పుడు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకొని అధికారిక సంస్మరణ సభలు నిర్వహించినట్టు గుర్తు లేదు. అటువంటి అదృష్టం మన తెలుగువాడైన చెరుకూరి రామోజీరావుకు దక్కింది. తెలుగు రాష్ట్రాల్లో 'ఈనాడు'కున్నంత పేరు ఆయనకూ ఉన్నది. బాగా సంపాదించారు. చిట్‌ఫండ్స్‌తో ప్రారంభమై మీడియాకు విస్తరించారు. మీడియా దన్నుతో సాటి చిట్‌ఫండ్ కంపెనీలను చావబాది, వాటిని దివాళా తీయించారు. ఫలితంగా ఆయన 'మార్గదర్శి చిట్‌ఫండ్స్' దినదిన ప్రవర్ధమానమైంది.

చిట్‌ఫండ్స్‌కు తోడుగా 'ఫైనాన్షియర్స్' పేరుతో మరో జంట కంపెనీ తెరిచారు. రెండు చేతులా ప్రజాధనాన్ని స్వీకరించారు. మీడియాను విస్తరింపజేశారు. ఫిలిం సిటీ పేరుతో ఓ మాహిష్మతీ రాజ్యాన్ని స్థాపించేశారు. ఈలోగా మీడియాను వాడుకొని ప్రభుత్వాలను మార్చారు. 'పత్రికొక్కటి ఉన్న పదివేల సైన్యంబు' అన్నారు నార్ల వెంకటేశ్వరరావు. ఆ వాక్యాన్ని చెరుకూరి వారు వ్యాపారపరంగా ఆలోచించారు. పదివేల సైన్యంబును ప్రయోగిస్తూ వచ్చారు. మొదట కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ పదివేల సైన్యం పొగబాంబులు పేల్చింది. ఫలితంగా ఎన్టీ రామారావు గద్దెనెక్కారు. రామోజీరావు వ్యాపారపు అడుగులకు మడుగులొత్తడానికి రామారావు నిరాకరించారు. క్రుద్ధుడైన రామోజీ వృద్ధుడైన రామారావు పైకి తన పదివేల సైన్యాన్ని అదిలించారు. ఎన్టీఆర్ గద్దె దిగి చంద్రబాబు గద్దెనెక్కారు. మనోవేదనతో ఐదు మాసాల్లోపే ఎన్టీఆర్ చనిపోయారు. రామోజీరావు పట్ల కృతజ్ఞతాపూర్వకంగా చంద్రబాబు ఆయనకు శుక్రాచార్యులవారి హోదా కల్పించారు.

పత్రికా రచన రంగానికి సంబంధించి రామోజీకి పలు ప్రతిష్ఠాత్మక అవార్డులు లభించాయి. 'ఈనాడు' ఎడిటర్ హోదాతో ఆయన ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షుడుగా కూడా పని చేశారు. కానీ ఆయన వృత్తిపరంగా జర్నలిస్టు కాదు. నాన్ జర్నలిస్ట్ ఎడిటర్‌గా ఆయన పలు రికార్డుల్ని బద్దలు కొట్టారు. ఏకవాక్య రచన కూడా లేకుండా ఏకబిగిన దశాబ్దాల తరబడి ప్రధాన సంపాదకుడిగా కొనసాగిన ఘనతను ఆయన్నుంచి ఎవరూ లాక్కోలేరు. 1974లో విశాఖపట్నం నుంచి 'ఈనాడు' పత్రిక ప్రారంభమయ్యే నాటికి అప్పటికే ఉన్న రెండు పెద్ద పత్రికలు పాత మూసలోనే మునకేసి ఉన్నాయి. ఈ స్థితిలో కొంత ఆధునికతను జోడిస్తూ, ప్రజల అవసరాలను గమనిస్తూ, వారికి అర్థమయ్యే సరళమైన భాషను వినియోగిస్తూ 'ఈనాడు' ముందుకొచ్చింది. ఈ మార్పులకు మూల పురుషుడు 'ఈనాడు' తొలి ఎడిటర్ అన్నే భవానీ కోటేశ్వర ప్రసాద్ ఉరఫ్ ఏబీకే ప్రసాద్ అనే తెలుగుజాతి అగ్రశ్రేణి పాత్రికేయుడు.

సందేహాతీతమైన సదాచారాలు మనకు ఉన్నాయి. సమాజం మేలు కోరిన వారు, ప్రజల మంచి కోసం పోరాడినవారు, మంచితనాన్ని పెంచినవారిని స్మరించుకునే సంప్రదాయం మనకున్నది. స్మారకాలు నిర్మించుకునే అలవాటు కూడా ఉన్నది. వారి జీవితాల్లోంచి సమాజం పాఠాలు నేర్చుకోవాలనే కాంక్షతో వారినలా తమ జ్ఞాపకాల్లో శాశ్వతంగా నిలబెట్టుకుంటారు. చెడు మార్గంలో పయనించి ప్రభావం కలిగించిన వారిని... అధ్యయనం కోసం మాత్రమే చరిత్ర పుటల్లోకి ఎక్కించాలి. వారికి మరణమే చివరి చరణం కావాలి. ఆ ప్రభావం ఆదర్శం కాకూడదు.

కానీ, దురదృష్టవశాత్తు మారుతున్న కాలం వింత పోకడలు పోతున్నది. అభివృద్ధికి అర్థం మారుతున్నది. విజయ గాథలకు కొత్త నిర్వచనాలు చేరుతున్నాయి. గొప్పతనం అనే మాటకు తాత్పర్యం మారింది. ఎవరు బాగా సంపాదిస్తారో వారే మహానుభావులు అనే భావన బలపడుతున్నది. వారు ఏ మార్గంలో సంపాదించారన్న పట్టింపేమీ కనిపించడం లేదు. గమ్యం మాత్రమే కాదు, గమ్యాన్ని చేరే మార్గం కూడా పవిత్రంగా ఉండాలన్న గాంధీ బోధనను ఒక చాదస్తం కింద జమకట్టవలసిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. గాడ్సే వారసులకు గౌరవ మర్యాదలు లభిస్తున్న కాలంలోకి ప్రవేశించాము కదా!

'ఈనాడు' హైదరాబాద్ ఎడిషన్ ప్రారంభమైన కొద్ది కాలానికే ఏబీకే ప్రసాద్‌ను బయటకు పంపించారన్నది ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. తర్వాత కాలంలో రామోజీరావే స్వయంగా ప్రధాన సంపాదకులయ్యారు. ఏబీకే నెలకొల్పిన పత్రికా ప్రమాణాల స్థానాన్ని క్రమంగా రామోజీ వ్యాపార సూత్రాలు ఆక్రమించాయి. ఈ వ్యాపార సూత్రాలు కూడా పత్రిక విస్తృతిలో వాటి పాత్రను పోషించాయి. ఆ రోజుల్లో 'స్కైలాబ్' పేరుతో అమెరికా నెలకొల్పిన ఒక అంతరిక్ష కేంద్రానికి ఆయుష్షు మూడింది. అది ముక్కచెక్కలై భూమ్మీద పడిపోయే సందర్భాన్ని 'ఈనాడు' వినియోగించుకున్నది. అది రేపోమాపో పడిపోనున్నదనీ, దాంతో భూమి బద్దలైపోతుందని, ఇవే మనకు చివరి రోజులనీ ఊరూరా ప్రచారం జరగడంలో 'ఈనాడు' గొప్ప పాత్రనే పోషించింది. ఆ విధంగా గ్రామీణ ప్రజల్లోకి కూడా చొచ్చుకొనిపోగలిగింది.

పత్రికకు ఉండవలసిన నిష్పాక్షికత అనే లక్షణాన్ని ఈ యాభయ్యేళ్ల ప్రయాణంలో మొదటి ఐదారేళ్లు 'ఈనాడు' పాటించిందేమో! ఎనభయ్యో దశకం ప్రారంభంలోనే నిష్పాక్షికతకు నిప్పు పెట్టేసింది. గడిచిన నాలుగున్నర దశాబ్దాలుగా దాని పాత్రికేయమంతా ఏకపక్షా రచనా వ్యాసంగమే! నాణేనికి ఉండే రెండో కోణాన్ని తెలుగు ప్రజలు చూడకుండా 'ఈనాడు' దాచిపెట్టింది. పోటీగా మరో పత్రిక ఎదగకుండా దాని ఆర్థిక మూలాలను దెబ్బకొట్టే రామోజీ ఎత్తుగడలన్నీ తెలుగు ప్రజల అనుభవంలో ఉన్నవే. 'ఉదయం' పత్రిక అకాల అస్తమయానికి ఈ ఎత్తుగడలే కారణం. 'వార్త'ను నిర్వీర్యం చేయడానికి కూడా అది ప్రయత్నాలు చేసింది. ఒక్క 'సాక్షి' ముందు మాత్రం దాని మంత్రాంగం పారలేదు. ఫలితంగా గత పదహారేళ్లుగా తెలుగు ప్రజలకు వార్తాంశాల రెండో కోణం ఆవిష్కృతమైంది. దశాబ్దాల తరబడి తెలుగు ప్రజలకు నిష్పాక్షిక సమాచార హక్కును దక్కకుండా చేసినందుకుగాను ఆయన్ను అక్షర సూర్యుడుగా భృత్య మీడియా బహువిధాలుగా శ్లాఘించింది. ప్రభుత్వం వారి సంస్మరణ సభలో వక్తలందరూ నోరారా కొనియాడారు.

ఇక రామోజీరావు తన వ్యాపార సామ్రాజ్య స్థాపనలో అనుసరించిన పద్ధతులూ, నియమోల్లంఘనలూ, చట్టవిరుద్ధ వ్యవహారాలూ ఆమోదయోగ్యమైనవేనా? భవిష్యత్తు తరాల వారికి వాటిని బోధించవచ్చునా? ఈ అంశాలపై విస్తృతమైన చర్చ జరగవలసి ఉన్నది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరుతో ఆయన చేసిన డిపాజిట్ల సేకరణ చట్ట విరుద్ధమైనదని స్వయంగా ఆర్‌బీఐ ప్రకటించింది. ఆయన కూడా అది తప్పేనని ఒప్పుకున్నందువల్లనే ఆ సంస్థను మూసేస్తున్నట్టు ప్రకటించారు. ఆయన ఎవరెవరి దగ్గర డిపాజిట్లు వసూలు చేశారో, ఎవరెవరికి తిరిగి చెల్లించారో తెలియజేస్తూ ఒక జాబితాను సమర్పించాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. సుప్రీం ఆదేశాన్ని ఆయన పాటించలేదు.

కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ రామోజీరావు ఆర్థిక నేరాలకు పాల్పడ్డారు. చిట్‌ఫండ్ సంస్థలు డిపాజిట్లు స్వీకరించడం నిషిద్ధం. కానీ మార్గదర్శి ఆ చట్టాన్ని ఉల్లంఘించి డిపాజిట్లు సేకరించింది. ఆ డిపాజిట్లను నిబంధనలకు విరుద్ధంగా షేర్ మార్కెట్లో, మ్యూచువల్ ఫండ్స్‌లో, తమ సొంత కంపెనీల్లో పెట్టుబడులుగా పెట్టింది. లేని చందాదారులను ఉన్నట్టుగా చూపిస్తూ ఘోస్ట్ చిట్టీలు నడుపుతూ మనీ లాండరింగ్ నేరానికి పాల్పడినట్టు ఇటీవల జరిగిన సోదాల్లో బయటపడింది. కేంద్ర దర్యాప్తు సంస్థలు జోక్యం చేసుకోవలసిన పరిణామాలివి.

రామోజీరావు తన వ్యాపార సామ్రాజ్య స్థాపనలో అనుసరించిన పద్ధతులూ, నియమోల్లంఘనలూ, చట్టవిరుద్ధ వ్యవహారాలూ ఆమోదయోగ్యమైనవేనా? భవిష్యత్తు తరాల వారికి వాటిని బోధించవచ్చునా? ఈ అంశాలపై విస్తృతమైన చర్చ జరగవలసి ఉన్నది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరుతో ఆయన చేసిన డిపాజిట్ల సేకరణ చట్ట విరుద్ధమైనదని స్వయంగా ఆర్‌బీఐ ప్రకటించింది. ఆయన కూడా అది తప్పేనని ఒప్పుకున్నందువల్లనే ఆ సంస్థను మూసేస్తున్నట్టు ప్రకటించారు. ఆయన ఎవరెవరి దగ్గర డిపాజిట్లు వసూలు చేశారో, ఎవరెవరికి తిరిగి చెల్లించారో తెలియజేస్తూ ఒక జాబితాను సమర్పించాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. సుప్రీం ఆదేశాన్ని ఆయన పాటించలేదు.

కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ రామోజీరావు ఆర్థిక నేరాలకు పాల్పడ్డారు. చిట్‌ఫండ్ సంస్థలు డిపాజిట్లు స్వీకరించడం నిషిద్ధం. కానీ మార్గదర్శి ఆ చట్టాన్ని ఉల్లంఘించి డిపాజిట్లు సేకరించింది. ఆ డిపాజిట్లను నిబంధనలకు విరుద్ధంగా షేర్ మార్కెట్లో, మ్యూచువల్ ఫండ్స్‌లో, తమ సొంత కంపెనీల్లో పెట్టుబడులుగా పెట్టింది. లేని చందాదారులను ఉన్నట్టుగా చూపిస్తూ ఘోస్ట్ చిట్టీలు నడుపుతూ మనీలాండరింగ్ నేరానికి పాల్పడినట్టు ఇటీవల జరిగిన సోదాల్లో బయటపడింది. కేంద్ర దర్యాప్తు సంస్థలు జోక్యం చేసుకోవలసిన పరిణామాలివి.

ఇక రామోజీ ఫిలింసిటీ ఒక అక్రమాల పుట్ట. ఇక్కడ జరిగిన నియమోల్లంఘనలు నూటొక్క రకాలు.

ఇక రామోజీ ఫిలింసిటీ ఒక అక్రమాల పుట్ట. ఇక్కడ జరిగిన నియమోల్లంఘనలు నూటొక్క రకాలు. ఇందులో ప్రభుత్వ భూముల ఆక్రమణ ఉన్నది. పప్పుబెల్లాలు పంచి అసైన్డ్ భూములు కొనుగోలు చేసిన నేరం ఉన్నది. తరతరాల నాటి రహదారులనే కబ్జా చేసి కాంపౌండ్ వాల్ చుట్టుకున్న దాదాగిరి ఉన్నది. మాతృభూమిలో వైద్యసేవలు చేయడానికి వచ్చిన ఒక ఎన్ఆర్ఐ డాక్టర్‌ను బెదిరించి 200 ఎకరాల భూమిని కారుచౌకగా కొట్టేసిన దాష్టీకం ఉన్నది. భూపరిమితి చట్టాన్ని వెంట్రుక సమానంగా జమకట్టిన లెక్కలేని తెంపరితనం ఈ ఫిలింసిటీ కథలో దాగున్నది.


ఎటువంటి అనుమతుల్లేకుండా ఫిలిం సిటీలో నిర్మించిన 147 భవనాలు హెచ్ఎమ్‌డీఏ అధికారాన్ని తొడగొట్టి సవాల్ చేస్తున్నాయి. చెరువులను చెరపట్టి వాటిలోకి ప్రవాహాలను మోసుకెళ్లే కాల్వలను రహదారులుగా మార్చుకున్న ఫిలింసిటీ రుబాబు ముంగిట... 'వాల్టా' చట్టం చేతులు ముడుచుకొని సిగ్గుతో తలవంచి నిలబడింది. రామోజీ వ్యాపార సామ్రాజ్య విస్తరణ వెనుక ఇంత తతంగం ఉన్నది. ఇది రేఖామాత్రపు ప్రస్తావన మాత్రమే! ఈ 'సక్సెస్' స్టోరీ రాబోయే తరాలకు ఆదర్శనీయమైనదేనా? రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సంస్మరణ సభ జరపడం సమర్థనీయమేనా? అమరావతిలో శిలా విగ్రహం, ఒక రహదారికి పేరు, స్మారక ఘాట్‌ల స్థాపన ఎటువంటి స్ఫూర్తిని ఉద్దీపింపజేస్తాయి. 'భారతరత్న' బిరుదాన్ని ఆయనకు సంపాదించిపెడతామని ముఖ్యమంత్రి చేసిన వాగ్దానం సరైన సందేశాన్నే సమాజంలోకి పంపిస్తుందా?

vardhelli1959@gmail.com


సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

చట్టంలో ఈ మార్పులు ఎవరి కోసం?

అభిప్రాయం



డా॥ మంగారి రాజేందర్



మూడు కొత్త క్రిమినల్ చట్టాలు జూలై ఒకటవ తేదీ నుంచి అమలులోకి వస్తున్నాయి. ఈ మూడు చట్టాలు బాధితులకు అనుకూలంగా ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. కానీ అలా ఉన్నట్టుగా అనిపించటం లేదు. అందుకు ఉదాహరణగా ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్)ను పేర్కొనవచ్చు.

ప్రాథమిక దృష్టితో చూసినప్పుడు నేర సమాచారం కాగ్నిజబుల్ అయితే ఎఫ్ఐఆర్‌ను క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ లోని సెక్షన్ 154 ప్రకారం తప్పక నమోదు చేయాల్సిన బాధ్యత పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జిపై ఉంది. ఈ విషయంలో అతను తన విచక్షణాధికారాన్ని ఉపయోగించుకునే అవకాశం చట్టం అతనికి ఇవ్వలేదు. సమాచారంలో విశ్వసనీయత కనిపించటం లేదనే కారణం కానీ లేదా అవసరమైన వివరాలు లేవని కానీ ఎఫ్ఐఆర్‌ను విడుదల చేయకుండా ఉండే అవకాశం లేదు. కేసు ప్రాథమిక దశలో సమాచారం అన్నదే నిర్ణయాత్మకమైన విషయం. అందులోని విశ్వసనీయత తీవ్రతను చూడాల్సిన అవసరం లేదు. ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చారన్న విషయం తేలితే కేసును మూసివేసి, తుది నివేదికను కోర్టుకు సమర్పించవచ్చు. అవసరమని భావించినప్పుడు ఆ తప్పుడు సమాచారం ఇచ్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవచ్చు. ఎఫ్ఐఆర్‌ను విడుదల చేయటానికి విశ్వసనీయ సమాచారం అవసరం లేదు. అందుకు కావలసిన అంశాలు రెండే రెండు. మొదటిది– అది సమాచారం అయ్యుండాలి. రెండవది– అది కాగ్నిజబల్ అయిన సమాచారం అయిఉండాలి.

అయితే సుప్రీంకోర్టు లలిత కుమారి వర్సెస్ స్టేట్ ఆఫ్ యూపీ (ఏఐఆర్ 2014 సుప్రీం కోర్టు 187) కేసులో కొన్ని సందర్భాలలో ప్రాథమిక విచారణ చేసే వెసులుబాటును పోలీసులకు కల్పించింది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో ప్రాథమిక విచారణ గురించి ఎక్కడా చెప్పలేదు. అదేవిధంగా ప్రాథమిక విచారణ జరుపకూడదని కూడా ఎక్కడా నిషేధం లేదు. నిషేధం లేనంత మాత్రాన ప్రాథమిక విచారణ చేయవచ్చని అనుకోడానికి వీలు లేదు. కానీ సుప్రీంకోర్టు కొన్ని కేసులలో ప్రాథమిక విచారణ జరుపడానికి వెసులుబాటు కల్పించింది. ప్రథమ సమాచార నివేదిక విడుదల చేయడానికైనా ముందు ఎంక్వయిరీ జరిపే నిబంధన ఏదీ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లో లేదు. లలిత కుమారి కేసు ప్రకారం కాగ్నిజబల్ నేర సమాచారం ఉన్నప్పుడు పోలీసులు విధిగా ప్రథమ సమాచార నివేదికను విడుదల చేయాలి. ఎలాంటి విచారణనూ చేయడానికి వీలు లేదు. ఒకవేళ అందిన సమాచారంలో కాగ్నిజబల్ నేరం వెల్లడికానప్పుడు అది కాగ్నిజబల్ నేర సమాచారం ఔనా, కాదా అనే విషయం తెలుసుకోవడానికి పోలీసులు ప్రాథమిక విచారణ చేయవచ్చు. అంతే తప్ప మరే విషయంలో ప్రాథమిక విచారణ చేయడానికి వీలులేదు. ఎలాంటి కేసులలో ప్రాథమిక విచారణ జరుపాలో సుప్రీంకోర్టు నిర్దేశించింది. 1. వివాహ వివాదాలు/ కుటుంబ వివాదాలు 2.వాణిజ్య నేరాలు 3. వైద్య నిర్లక్ష్య కేసులు 4. అవినీతికి సంబంధించిన కేసులు 5. సమాచారం అందచేయటంలో తీవ్రమైన జాప్యం ఉన్నప్పుడు. ఈ ప్రాథమిక విచారణను పోలీసులు జరుపవచ్చు. విచారణ సమయాన్ని 15 రోజులుగా సుప్రీంకోర్టు నిర్దేశించింది.

చట్టం ఇంత స్పష్టంగా ఉన్నపుడే కేసు నమోదు చేసుకోవడానికి బాధితులు తీవ్రమైన ఇబ్బందులకు లోనవుతున్నారు. అంతేకాదు కేసు నమోదు కోసం పైరవీలు చేయాల్సిన పరిస్థితి ఇప్పుడు దేశంలో ఉంది. ఈ ప్రాథమిక విచారణను పోలీసులు దుర్వినియోగం చేస్తున్నారని చెప్పటానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. అందులో ప్రముఖమైన ఉదాహరణ, పత్రికల్లో వచ్చిన ఉదాహరణ– ఒక వ్యక్తి బ్యాంక్ నుంచి పది కోట్ల రుణం తీసుకున్నాడు. అది కట్టలేదు. చివరికి బ్యాంక్ వాళ్ళు ఆ రుణం వసూలు చేయడానికి ఏజంట్లను నియమించుకున్నారు. ఈ పరిస్థితిని అధిగమించటానికి ఆ రుణం తీసుకున్న వ్యక్తి పోలీసులను ఆశ్రయించి, ఒక ఫిర్యాదును బ్యాంక్ ఉన్నతాధికారుల మీద దాఖలు చేశాడు.

ప్రాథమిక విచారణ పేరుతో పోలీసులు ఆ అధికారులను తరచూ పిలుస్తూ ఆరు మాసాలు గడిపారు. ఆ ఉన్నత అధికారులకు కేసు భయం పట్టుకునేలా చేశారు. చివరికి బ్యాంక్ అధికారులు తక్కువ మొత్తానికి ఒకేసారి పరిష్కారాన్ని చేసుకున్నారు. దాని వల్ల బ్యాంక్ నష్ట పోయింది. రుణం తీసుకున్న వ్యక్తి లాభపడ్డాడు. ఈ ప్రాథమిక విచారణ సమయంలో అనుమానితుడిని పిలిచే అధికారం పోలీసులకు లేదు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పోలీసులు చేయాల్సింది రహస్య విచారణ. దాని పరిధి కూడా చిన్నది. కాగ్నిజబల్ నేరం జరిగిందా, లేదా అన్న విషయం తెలుసుకోవడానికి మాత్రమే పోలీసులు విచారణ జరపాలి కానీ పోలీసులు సుప్రీంకోర్టు తీర్పులో చెప్పిన దానిని మించి ప్రాథమిక విచారణ పేరుతో ఆ ఫిర్యాదు చేసిన వ్యక్తికి లాభం జరిగే విధంగా ప్రవర్తించారు. బ్యాంక్‌కు కోట్ల రూపాయల నష్టం జరిగింది. కేసు నమోదు చేసిన తర్వాత మాత్రమే క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ లోని సెక్షన్ 41 ప్రకారం లేదా 160 ప్రకారం మాత్రమే అనుమానితులను పిలవడానికి అవకాశం ఉంది. కానీ ఎలాంటి అధికారం లేకుండానే పోలీసు అధికారులు ఈ కేసులో బ్యాంక్ ఉన్నత అధికారులను పిలిచి, ఫిర్యాదు చేసిన వ్యక్తికి లాభం కలిగేలా చేశారు.

ప్రాథమిక విచారణను పైవిధంగా జరుపడానికి అధికారం లేనప్పుడే పోలీసులు ఈ విధంగా దుర్వినియోగం చేస్తున్నారు. ప్రాథమిక విచారణ జరుపచ్చని చట్టం నిర్దేశిస్తే ఇంకా ఎంత దుర్వినియోగం అవుతుందోనని అనిపిస్తుంది. 'భారతీయ నాగరిక సురక్ష సంహిత 2024' లోని 173 ప్రకారం పోలీసు అధికారులు 3 సంవత్సరాలు కానీ, అంతకు మించి కానీ, 7 సంవత్సరాల లోపు కానీ ఉన్న నేరాలలో పోలీసులు ప్రాథమిక విచారణ జరుపవచ్చు. అది కాగ్నిజబల్ నేర సమాచారం ఐనప్పటికి కూడా ఈ విచారణను పోలీసు అధికారి జరపటానికి అవకాశం ఉంది. ఈ ప్రాథమిక విచారణ చేయడానికి పోలీస్ అధికారి, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అనుమతి తీసుకోవలసి ఉంటుంది. అతను ఈ అనుమతిని ఎంతకాలంలో ఇవ్వాలి అన్న విషయం గురించి చట్టంలో ఏమీ చెప్పలేదు. ఆ అనుమతి కోసం కూడా బాధితులు ఆ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌ని ఆశ్రయించాల్సి ఉంటుంది. ఒకవేళ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ప్రాథమిక విచారణను చేయడానికి అనుమతిస్తే... పోలీస్ అధికారి విచారణను 14 రోజుల్లో పూర్తి చేయాలి. ఈ విచారణ లలిత కుమారి కేసులో సుప్రీంకోర్టు చెప్పిన విధంగా కాదు. కేసులో ప్రాథమికంగా చూసినప్పుడు బలం ఉందా, లేదా అని అనిపించినప్పుడు విచారణ జరుపవచ్చు. కేసులోని స్వభావాన్ని బట్టి, తీవ్రతను బట్టి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ప్రాథమిక విచారణ జరుపడానికి అనుమతిని ఇస్తారు. ఈ విచారణ దుర్వినియోగం అయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. కేసు నమోదు కావడానికే బాధితులు తీవ్రమైన ప్రయత్నాలు చేయవలసి ఉంటుంది. 7 ఏళ్ల లోపు శిక్ష విధించే అవకాశం ఉన్న నేరాలు 98 వరకు ఉన్నాయి. వాటిలో చాలా నేరాలు తీవ్రమైన నేరాలే. ప్రాథమిక విచారణ పేరుతో నెలల తరబడి విచారణ జరిపితే సాక్ష్యాలు మాయమయ్యే పరిస్థితి ఉంది. అదే విధంగా ప్రథమ సమాచార నివేదిక ఉద్దేశ్యం కూడా దెబ్బ తినే అవకాశం మరింత ఉంది. బాధితులకు లాభం చేద్దామనే ఉద్దేశ్యంతో ఈ నిబంధన ఏర్పాటు చేశారని ప్రభుత్వం చెప్పినప్పటికీ అలాంటి పరిస్థితి కనిపించటం లేదు. ఈ నిబంధన దుర్వినియోగం కానుందని స్పష్టంగా అర్థమవుతోంది. ఈ విమర్శను గమనించి కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యం లోని బీపీఆర్‌డీ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను ఈ ప్రాథమిక విచారణ గురించి విడుదల చేసింది. దాని ప్రకారం ప్రాథమిక విచారణ కోసం ఆఫీసర్ ఇన్‌ఛార్జి ఆఫ్ పోలీస్ స్టేషన్ అనుమతి కోరిన 24 గంటలలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఇవ్వాలని చెప్పారు. ఒకవేళ 24 గంటల్లో అనుమతి ఇవ్వకపోయినా, అనుమతిని తిరస్కరించినా, ఏ విషయాన్ని తెలియచేయకపోయినా... ఆ పోలీసు అధికారి ఎఫ్ఐఆర్ నమోదు చేసి ప్రాథమిక విచారణ చేపట్టవచ్చు.

ఈ ప్రాథమిక విచారణ సమయం లో పోలీసు అధికారి సాక్ష్యాలు నమోదు చేసే అవకాశం ఉంది. కేసు నమోదు చేసిన తర్వాత కూడా సాక్షులను విచారిస్తారు. వీటి వల్ల సాక్ష్యాలలో వైరుధ్యాలు పెరిగి కేసు బలహీనపడే అవకాశం ఉంది. దానివల్ల బాధితులకి న్యాయం జరుగదు. మరి ఎవరి కోసం ఈ మార్పులు? ఈ కొత్త చట్టాలు? దీనికి సమాధానం కాలమే చెప్తుంది.

వ్యాసకర్త తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడెమీ డైరెక్టర్ । 9440483001

కరుణాహృదయమే దేవాలయం!

మన పూర్వ కథలలో నాగులకు గరుత్మంతుడికీ మధ్య వైరం ప్రసిద్ధమైనది. జీమూతవాహనుడనే పక్షిరాజు పరమ దయాళువు. ఒక సందర్భంలో, పూర్వం కుదుర్చుకున్న నియమం కారణంగా, గరుడుడికి ఆహారం కావాల్సిన శంఖచూడుడనే నాగజాతి బాలుడి కోసం ఆ బాలుడి తల్లి పడే వేదన చూసి తాళలేక, మనసు కరిగి, ఆ బాలుడికి బదులుగా తాను గరుడుడికి ఆహారం కావడానికి సిద్ధపడతాడు జీమూతవాహనుడు. ఆ త్యాగాన్ని నమ్మలేక పోతారు శంఖచూడుడు, అతడి తల్లి. ఆ నమ్మలేనితనంలో జీమూతవాహనుడితో శంఖచూడుడు 'ఈ లోకంలో దేనికీ పనికిరానివాళ్ళముగా, జీవుల ప్రాణాలను హరించే పాపులంగా పరిగణించబడేవారం, మహా అల్పులం మేము. అటువంటి మా కోసం, ప్రాణాన్ని మా పగవాడికి ఇవ్వడానికి సిద్ధపడడం అంటే, కసవుకు – అనగా ఎందుకూ పనికిరానిదిగా చిమ్మి చెత్తలో పారేసే దుమ్మూ ధూళితో సమానమైన వస్తువుకు– బదులుగా రత్నాన్ని అమ్ముకోవడంతో సమానమైన వ్యర్థ కార్యం కాదా?!' అని అంటాడు. శంఖచూడుడు తనను తాను కసవుతో పోల్చుకున్నప్పటికీ, జీమూతవాహనుడి హృదయం మాత్రం ఆ పిల్లవాడి ప్రాణం కోసం తల్లి పడే ఆవేదనలోని అంతులేని దుఃఖాన్ని పవిత్రమైనదిగా, విలువైనదిగా చూసింది. మరుక్షణం కరుణతో అతడి హృదయం నిండిపోయింది. కరుణతో సంపన్నమైన హృదయం అసహాయుడైన తోటి వ్యక్తి దుఃఖాన్ని పోగొట్టడానికి ఎంతటి త్యాగానికైనా వెరవదు, వెనుకాడదు అని పై సన్నివేశంలో జీమూతవాహనుడి చర్య తెలియజేస్తుందని కొఱవి గోపరాజు రచించిన 'సింహాసన ద్వాత్రింశిక' పంచమా శ్వాసంలోని ఈ కథ తెలుపుతుంది. సరిగ్గా ఈ భావాన్నే ఎఱ్ఱయ కవి తన 'సకలనీతి కథానిదానము' కావ్యం, ప్రథమాశ్వాసంలో ఒక చక్కటి కందపద్యంలో ఇలా చెప్పాడు.

జ్యోతిర్మయం

పరులకునైన నుపద్రవ
మరసి మహామతులు దమదు ప్రాణంబైనన్
కరమొసగి చక్కజేతురు
పరికింపగ నిదియు నిహము బరమును గాదె.

'తోటివారికి వచ్చిన ప్రాణ సంకటాన్ని తమ ప్రాణాన్ని సైతం పణంగా పెట్టి తీర్చడానికి మహాపురుషులు వెనుకాడరు. అంతటి త్యాగానికి సిద్ధపడిన మహామతులకు ఇహపర సౌఖ్యం దక్కుతుందనడంలో ఆశ్చర్యపోవాల్సింది లేదు కదా!' అని పై పద్యం భావం. కరుణతో నిండిన హృదయం ఒక దేవాలయం! మానవత్వంలో దైవత్వం అక్కడ కలగలిసి కొలువు తీరి దర్శనమిస్తుంది.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీక్రోధి నామ సంవత్సరం : ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు ; జ్యేష్ఠ మాసం ; తిథి: బ.నవమి ప.1.17 వరకు, తదుపరి దశమి ; నక్షత్రం: రేవతి ఉ.9.11 వరకు, తదుపరి అశ్విని ; వర్జ్యం: తె.3.55 నుండి 5.25 వరకు (తెల్లవారితే సోమవారం); దుర్ముహూర్తం: సా.4.51 నుండి 5.44 వరకు ; అమృత ఘడియలు: ఉ.5.55 నుండి 8.23 వరకు ; సూర్యోదయం : 5.32 ; సూర్యాస్తమయం: 6.34 ; రాహుకాలం: సా.4.30 నుండి 6.00 వరకు ; యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

మల్లేశ్వరునికి స్వర్ణాభరణాలు సమర్పణ

- రూ.40 లక్షలతో చేయించిన హైదరాబాద్ భక్తులు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న మల్లేశ్వరస్వామికి హైదరాబాద్‌కు చెందిన మాగంటి సత్యనారాయణ మూర్తి, మధురావు కుటుంబం స్వర్ణాభరణాలను సమర్పించింది. స్వామి వారి అలంకరణ నిమిత్తం నాగాభరణం, జటాఝాటం, నాగ పడగ, పానవట్టం, ధారాపత్తం, మకర తోరణం వంటి ఆభరణాలకు బంగారు తాపడం చేయించారు. శనివారం ఆలయ ఈవో కె.ఎస్.రామారావుకు ఆభరణాలను అందజేశారు. తొలుత ఆలయానికి చేరుకున్న దాతలకు ఈవో సాదరంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశ్వర స్వామి వారికి విశేష అభిషేకాలు, అర్చన నిర్వహించిన అనంతరం ఆభరణాలను వైదిక సిబ్బంది శుద్ధి చేసి స్వామి వారికి అలంకరించారు.

'ఆన్‌లైన్' సేవలకు ఆధార్ అనుసంధానం

- టీటీడీ ఈవో జె.శ్యామలరావు



తిరుపతి(అలిపిరి): శ్రీవారి భక్తులకు టీటీడీ అందిస్తున్న ఆన్‌లైన్ అప్లికేషన్ సేవలకు ఆధార్‌ను అనుసంధానం చేయడం వల్ల పారదర్శకతతో పాటు దళారీ వ్యవస్థను నియంత్రించేందుకు వీలవుతుందని టీటీడీ ఈవో జె.శ్యామలరావు తెలిపారు. తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో శనివారం యూఐడీఏఐ (ఆధార్ సంస్థ)అధికారులు, టీసీఎస్ జియో, టీటీడీ ఐటీ విభాగంతో ఈవో సమీక్షించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఇదివరకే టీటీడీ దర్శనం, వసతి, ఆర్జిత సేవలు, శ్రీవారి సేవ తదితర సేవలను ఆన్‌లైన్‌లో భక్తులు బుక్ చేసుకునేందుకు వీలు కల్పిస్తోందన్నారు. అయితే ఈ అప్లికేషన్లతో దళారుల బెడద తప్పడం లేదని.. వాటిని నియంత్రించడానికి ఆధార్ లింక్ చేసేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఐటీ అధికారులను ఆదేశించారు. ఆధార్‌తో యాత్రికుల గుర్తింపు, పరిశీలన, బయోమెట్రిక్ వెరిఫికేషన్ ఎలా చేయాలి.. ఆధార్ డూప్లికేషన్ ఎలా నిరోధించాలి తదితర అంశాలపై ఆయన చర్చించారు. సమావేశంలో యూఐడీఏఐ డిప్యూటీ డైరెక్టర్ సంగీత తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ వర్సిటీ పేరు మార్పుపై యార్లగడ్డ హర్షం

సాక్షి, అమరావతి: ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ పేరును పునరుద్ధరించడంపై విశ్వహిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధికి మద్దతిస్తాం .. టీడీపీకి కాదు..

- ఎమ్మెల్యే గుమ్మనూరుకు స్పష్టం చేసిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

గుత్తి: 'మీరు అభివృద్ధి చేస్తామంటే మేము కూడా పూర్తిస్థాయిలో మద్దతిస్తాం. అంతేకానీ టీడీపీలో చేరబోం. మీ పార్టీకి మద్దతివ్వబోం' అని అనంతపురం జిల్లా గుత్తి మున్సిపాలిటీకి చెందిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు స్పష్టం చేశారు. గుత్తి మునిసిపల్ కౌన్సిల్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సమావేశానికి గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం హాజరయ్యారు. ఎమ్మెల్యే గుమ్మనూరు మాట్లాడుతూ మున్సిపాలిటీలో గెలిచిన 24 మంది వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు రాజీనామా చేసి టీడీపీలో చేరితే పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. అందుకు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు తీవ్ర అభ్యంతరం తెలిపారు.

శారదా పీఠానికి 2005లోనే లీజుకు స్థలం

- టీటీడీ ప్రకటన

తిరుమల: విశాఖ శారదా పీఠం తిరుమలలో మఠం నిర్మించుకోవడానికి 5000 చదరపు అడుగుల స్థలాన్ని లీజుకు ఇచ్చినట్లు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. తిరుమలకు వచ్చే యాత్రికులకు సేవలందించేందుకు 2005, ఫిబ్రవరిలో 30 సంవత్సరాల పాటు స్థలం లీజుకు ఇవ్వడానికి టీటీడీ ధర్మకర్తల మండలి నిర్ణయించిందనీ, శారద మఠానికి పక్కనే ఉన్న 4,817 చదరపు అడుగుల స్థలాన్ని మఠం అధికారులు వినియోగించుకుంటున్నారని తెలియజేసింది. 2019లో ఈ అదనపు స్థలాన్ని క్రమబద్ధీకరించి, అదనపు గదులు నిర్మించడానికి అనుమతి లభించిన అంశాన్ని ప్రభుత్వానికి తెలియజేసినట్లు పేర్కొంది. ప్రస్తుతం ఈ అంశం ఆంధ్రప్రదేశ్ ప్రధాన న్యాయస్థానం పరిధిలో ఉందని తెలియజేసింది.

ముందు ప్యాకేజీ తేల్చండి

ప్రభుత్వాన్ని నిలదీసిన ఉండవల్లి రైతులు

- సీడ్ యాక్సిస్ రోడ్డు కోసం ఏర్పాటు చేసిన సమావేశం రసాభాస
- ముందు సర్వే చేద్దామన్న అధికారులు.. ససేమిరా అన్న రైతులు
- టీడీపీ రైతు సంఘం నేతలు, రైతుల మధ్య ఘర్షణ
- ప్రభుత్వం ఏదైనా నష్టం జరిగితే ఊరుకోబోమని రైతుల స్పష్టీకరణ
- సమావేశాన్ని వాయిదా వేసిన సీఆర్‌డీఏ



ముందుగా ప్యాకేజీ చెప్పాలంటూ సీఆర్‌డీఏ డిప్యూటీ కలెక్టర్ విశ్వేశ్వర నాయుడుని నిలదీస్తున్న రైతు



టీడీపీ రైతు సంఘం నేతలు, రైతుల మధ్య వాగ్వాదం

సాక్షి ప్రతినిధి, గుంటూరు, తాడేపల్లి రూరల్: అమరావతిలో సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం కోసం రైతులతో సీఆర్‌డీఏ ఏర్పాటు చేసిన సమావేశం రసాభాసగా మారింది. తెలుగుదేశం పార్టీకి చెందిన రైతులు, ఇతర రైతుల మధ్య వివాదం చెలరేగడంతో సమావేశం వాయిదా పడింది. భూసేకరణకు ప్యాకేజీ ఎంత ఇస్తారో తేల్చిన తర్వాతే ముందుకు వెళ్లాలని రైతులు కరాఖండిగా చెప్పడంతో సీఆర్‌డీఏ అధికారులు సమావేశాన్ని వాయిదా వేశారు.

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణం కోసం భూ సేకరణకు నోటీసులు ఇవ్వగా భూములు కోల్పోయే రైతులు హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకువచ్చారు. దీంతో రోడ్డు నిర్మాణం నిలిచిపోయింది. మళ్లీ కూటమి అధికారంలోకి రావడంతో సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి సీఆర్‌డీఏ సన్నద్ధమవుతోంది. దీనిలో భాగంగా శనివారం ఉండవల్లి సచివాలయం–2లో రోడ్డు నిర్మాణంలో పొలాలు కోల్పోయే రైతులతో సీఆర్‌డీఏ డిప్యూటీ కలెక్టర్ విశ్వేశ్వర నాయుడు సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశం ఆరంభంలోనే రైతులు సీఆర్‌డీఏ అధికారులను నిలదీశారు. ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ముందుగా ఎందుకు తెలియజేయలేదని, ఒక్క పేపరు ప్రకటన ఇస్తే సరిపోతుందా అంటూ నిలదీశారు. ముందుగానే సమాచారం ఇచ్చామని డిప్యూటీ కలెక్టర్ విశ్వేశ్వరనాయుడు చెప్పారు. రోడ్డు కోసం రైతుల భూములను సర్వే చేస్తామని, అనంతరం మరోసారి సమావేశం ఏర్పాటు చేసి మిగిలిన విషయాలు మాట్లాడుకుందామని ఆయన చెబుతుండగా రైతులు తిరగబడ్డారు. సర్వే కాదని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రైతులకు ఎంత ప్రకటిస్తారో ముందుగా చెప్పాలని డిమాండ్ చేశారు. అంతలో అక్కడే ఉన్న తెలుగుదేశం పార్టీ రైతు సంఘం నాయకుడు దాసరి కృష్ణ కల్పించుకొని, మనకు రాజధాని వద్దు, మన భూములు ఇవ్వవద్దు.. గత ప్రభుత్వంలో రైతులకు కౌలు కూడా ఇవ్వనప్పుడు ఎవరూ మాట్లాడలేదంటూ వాగ్వాదానికి దిగారు. దాంతో మిగతా రైతులు ఆయనపై తిరగబడ్డారు. గత ప్రభుత్వంలో కరకట్ట విస్తరణకు భూ సేకరణ నోటీసు ఇస్తే దానిని వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించామని, సీడ్ యాక్సెస్ రోడ్డు, కరకట్ట విస్తరణ రెండింటి మీదా హైకోర్టు స్టే ఇచ్చిందని, మాకు ఏ ప్రభుత్వమైనా ఒకటేనని, రైతులకు స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుంటూరు – విజయవాడ మహానగరాల మధ్య ఉన్న వారికి, ఎక్కడో మారుమూల గ్రామాల్లో ఉన్నవారికి ఒకే ప్యాకేజీ ఇవ్వడం ఎంతవరకు న్యాయమని రైతులు ప్రశ్నించారు. ఈ క్రమంలో తెలుగుదేశం రైతు సంఘం నాయకులు, ఇతర రైతుల మధ్య వివాదం చెలరేగింది. పలువురు రైతులు మాట్లాడుతూ తాము నష్టపోవడానికి సిద్ధంగా లేమని, సీఎం చంద్రబాబు, మంగళగిరి ఎమ్మెల్యే లోకేశ్‌తో సమావేశం ఏర్పాటు చేస్తే మా కష్టాలు తెలుపుతామని అన్నారు. మళ్లీ టీడీపీ రైతు సంఘం నాయకులు కల్పించుకోవడంతో సమావేశం రసాభాసగా మారింది. దీంతో సీఆర్‌డీఏ అధికారులు సమావేశాన్ని వాయిదా వేశారు. తదుపరి సమావేశానికి సీడ్ యాక్సెస్ రోడ్డులో భూములు కోల్పోయే రైతులు మాత్రమే హాజరు కావాలని డిప్యూటీ కలెక్టర్ విశ్వేశ్వరనాయుడు స్పష్టం చేశారు.

'మాన్సాస్' భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు

అయినవిల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండల పరిధిలోని మాన్సాస్ ట్రస్ట్ భూముల్లో అధికార పార్టీ నాయకుల అండతో ఇష్టారాజ్యంగా బొండు మట్టి తవ్వేసి, తరలించుకుపోతున్నారు. దీనికోసం కోటిపల్లి భాగ నుంచి ముక్తేశ్వరం రేవు వైపు వారం రోజులుగా పొక్లెయిన్లతో నదిలో కట్టుదిట్టంగా రహదారి కూడా ఏర్పాటు చేశారు. కోటిపల్లి భాగ నుంచి ముక్తేశ్వరం రేవు మీదుగా అయినవిల్లి, అమలాపురం పరిసర ప్రాంతాల్లోకి ఈ మట్టిని తరలిస్తున్నారు. 2 రోజులుగా మట్టి తవ్వకాలు ఊపందుకోగా..దీనికి ప్రభుత్వం నుంచి అనుమతుల్లేవని అధికారులు చెబుతున్నారు. రోజుకు 60 ట్రిప్పుల పైనే మట్టిని తరలిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. కాగా, మట్టి తవ్వకాలపై దీనిపై తమకు సమాచారం లేదని అయినవిల్లి తహశీల్దార్ ప్రమద్వర చెప్పారు.



మాన్సాస్ ట్రస్టు భూముల్లో మట్టి తరలిస్తున్న లారీలు

కంటైనర్ టెర్మినల్ మూసేయలేదు

- అదానీని సోమిరెడ్డి కలిసేది కలెక్షన్ల కోసమే
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లూరు (పొగతోట): కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ మూసివేయలేదని యాజమాన్యం చెబుతున్నా.. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హడావుడి చేయడం సిగ్గు చేటని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దుయ్యబట్టారు. శనివారం నెల్లూరులోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియాతో కాకాణి మాట్లాడుతూ.. కంటైనర్ టెర్మినల్ తరలిపోయిందని, అక్రమ టోల్ గేట్లు పెట్టి సంపాదించుకుంటున్నారని విమర్శిస్తున్న సోమిరెడ్డి వాటిని రుజువు చేయాలని సవాల్ విసిరారారు. ఈ విషయంలో దమ్ముంటే విచారణ జరిపించాలని చాలెంజ్ చేశారు. అదానీని కలుస్తానని సోమిరెడ్డి చెప్పడం కలెక్షన్ల కోసమే అని ఆరోపించారు. సోమిరెడ్డికి కళ్లు కనిపించడం లేదని, కళ్లల్లో చుక్కల మందు వేసుకుని చూడాలని హితవు పలికారు. 'ప్రస్తుతం సోమిరెడ్డి అధికారంలో ఉన్నారు. కంటైనర్ టెర్మినల్ విషయంలో ధైర్యం ఉంటే టోల్‌గేట్ ఎక్కడ పెట్టారో.. అక్రమంగా ఎవరు సంపాదిస్తున్నారో నిరూపించాలని.. లేదంటే అన్నీ మూసుకుని కూర్చోవాలి' అని హితవు పలికారు. అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే సోమిరెడ్డి అవినీతిపైనే దృష్టి కేంద్రీకరించారని విమర్శించారు. కృష్ణపట్నం పోర్టులో యాష్ పాండ్‌తోపాటు లే అవుట్ల యజమానుల నుంచి వసూళ్లు మొదలుపెట్టారని దుయ్యబట్టారు. అభివృద్ధి కోసం కాకుండా అవినీతి సంపాదన కోసం సోమిరెడ్డి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని చెప్పారు. 'మీరు శిలఫలాకాలు, విగ్రహాలు, ఆస్తులను కూల్చామని విర్రవీగుతున్నారు. మీరు ఎక్కడ ఏవేవి కూల్చారో వాటిని మీతోనే వాటిని పునర్నిర్మించే రోజు వస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి' అని స్పష్టం చేశారు. జిల్లాలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతి పరుల కోసం తాము వాచ్‌మెన్ డ్యూటీ చేస్తామని కాకాణి అన్నారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎక్కడ అన్యాయం జరిగినా వారికి అండగా ఉండి అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలంతా కలిసికట్టుగా వచ్చి కార్యకర్తల వెన్నంటే ఉంటామని, అండగా నిలుస్తామన్నారు.

ఆ లెక్కలూ చెప్పాల్సిందే

- డిస్కమ్‌ల కొనుగోళ్ల విషయంలో ఏపీఈఆర్‌సీ కఠిన నిబంధనలు
- టెండర్ అంచనాతోపాటు వస్తువుల ధరలను తెలపాలి
- విద్యుత్ పంపిణీ, సేకరణ, ప్రసారంపై మార్గదర్శకాలు

సాక్షి, అమరావతి: విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) చేసే కొనుగోళ్ల విషయంలో ఇకపై అత్యంత కఠిన నిబంధనలను అమలు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) స్పష్టం చేసింది. ఇన్నాళ్లూ డిస్కంలు తాము పరికరాలను కొనే ముందు, లేదా ఆ తర్వాత టెండర్ వివరాలను ఏపీఈఆర్‌సీకి పంపిస్తున్నాయి. కానీ ఆ టెండర్‌తో కొంటున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, ఇతర సామాగ్రి వంటి ధరలను విడివిడిగా వెల్లడించడం లేదు. ఇకపై ప్రతి పరికరానికి సంబంధించి ధరల జాబితాను మండలికి సమర్పించి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు విద్యుత్ పంపిణీ, సేకరణ, ప్రసార ప్రణాళికలపై ఏపీఈఆర్‌సీ తాజాగా మార్గదర్శకాలను జారీ చేసింది. కాగా 2024–25 నుంచి 2028–29 (5వ నియంత్రణ కాలం) వరకూ, 2029–30 నుంచి 2033–34 (6వ నియంత్రణ కాలం) వరకూ విద్యుత్ ప్రణాళికలను డిస్కంలు, ఏపీ ట్రాన్స్‌కో ఏపీఈఆర్‌సీకి సమర్పించాయి. వాటిపై విచారణ జరిపిన మండలి ప్రతిపాదనల్లో చాలావరకు తిరస్కరించింది. కొన్నిటికి మాత్రమే అనుమతినిచ్చింది. మరికొన్నిటిపై మరింత సమాచారం కావాలని అడిగింది. అందులో వ్యవసాయానికి స్మార్ట్ మీటర్ల అంశం ఒకటి. రివాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ స్కీమ్ (ఆర్‌డీఎస్ఎస్) కింద స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, ఫీడర్ల విభజన పనులకు కేంద్ర ప్రభుత్వం గ్రాంట్లు అందిస్తుంది. అలాగే వినియోగదారులకు స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లను ఏర్పాటు చేయవలసిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఏపీఈఆర్‌సీ ఆమోదం తెలిపింది. అదీగాక ఇందుకు అయ్యే ఖర్చును డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా ప్రభుత్వమే భరిస్తుండటంతో ఈ ప్రాజెక్టుకు ఏపీఈఆర్‌సీ ఎలాంటి అభ్యంతరాన్ని వ్యక్తం చేయలేదు. అలాగే జగనన్న కాలనీల విద్యుద్దీకరణకు ఇప్పటికే ఆమోదం తెలిపింది. అయితే, తాను ఆమోదించిన విలువల కంటే డిస్కంలు లెక్కల్లో చూపించిన వ్యయం ఎక్కువ అని గుర్తించిన ఏపీఈఆర్‌సీ తాజా ఆర్డర్‌లో గతంలో ఆమోదించిన విలువలకే ఓకే చెప్పింది. అలాగే విద్యుత్ కొనుగోళ్ల అంచనాలపై మరింత లోతుగా అధ్యయనం చేయాల్సి ఉన్నందున.. దానికి సంబంధించిన ప్రతిపాదనలన్నిటినీ తిరస్కరించింది.

ఈవీఎం, వీవీప్యాట్‌ల గోడౌన్లకు పటిష్ట భద్రత కల్పించాలి

గొల్లపూడిలోని గోడౌన్‌ను తనిఖీ చేసిన సీఈవో ముఖేష్‌కుమార్ మీనా

సాక్షి, అమరావతి: భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం), వీవీప్యాట్లు భద్రపరిచిన గోడౌన్లకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సీఈవో) ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ గోడౌన్‌ను ఆయన శనివారం పరిశీలించారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్ల భద్రతకు చేసిన ఏర్పాట్లు, సీసీ కెమెరాల భద్రతా వ్యవస్థను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం, వీవీప్యాట్ల గోడౌన్‌లో తనిఖీలు చేయనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి త్రైమాసిక తనిఖీల్లో భాగంగా గోడౌన్‌ను నిశితంగా పరిశీలించినట్లు వివరించారు.

వనవాసంలో పల్నాడు ప్రజలు

పల్నాడు జిల్లాలో టీడీపీ గూండాగిరికి చెట్టుకొకరు.. పుట్టకొకరు

- గ్రామంలో ఉండొద్దంటూ వైఎస్సార్‌సీపీకి చెందిన వందల కుటుంబాల గెంటివేత
- టీడీపీ రెడ్‌బుక్ రాజ్యాంగంలో బతకలేని పరిస్థితి
- తెలంగాణలో బంధువుల ఇళ్లల్లో తలదాచుకున్న బాధితులు
- ఒకప్పుడు సొంతూరిలో రైతులు.. ఇప్పుడు వలస కూలీలు
- మరికొందరు చిన్నాచితకా పనులు చేసుకుంటున్న దైన్యం



రాత్రి బంధువుల ఇళ్లల్లో, పొద్దంతా చెట్ల కింద ఉంటున్న పిన్నెల్లి గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్రంలో అధికారమే అండగా టీడీపీ నేతలు, కార్యకర్తలు పేట్రేగిపోతున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ఆ పార్టీ సానుభూతిపరులే లక్ష్యంగా దాడులకు తెగబడుతున్నారు. ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులు రక్తపుటేర్లు పారించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అధికారం కూడా తోడవడంతో టీడీపీ నేతలు, కార్యకర్తలు స్వైరవిహారం చేస్తున్నారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో టీడీపీ గూండాలు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను ఊరి నుంచి తరిమేశారు. మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలని కూడా చూడకుండా గ్రామం నుంచి తరిమితరిమి కొట్టారు. చివరకు కాపాడాల్సిన పోలీసులు కూడా టీడీపీ నేతలకే వంతపాడుతూ.. వెళ్లిపొమ్మని ఒత్తిడి చేయడంతో గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్రం వదిలి అజ్ఞాతవాసం చేస్తున్నారు. చెట్టుకొకరు, పుట్టకొకరు మాదిరిగా భయంతో పారిపోయి తలదాచుకుంటున్నారు. ఇలా పిన్నెల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీకి చెందిన వందల కుటుంబాలు గెంటివేతకు గురయ్యాయి. రాష్ట్రాన్ని వదిలేసి తెలంగాణకు వలస వెళ్లి అక్కడక్కడ కొందరు అద్దె ఇళ్లు తీసుకొని జీవనం సాగిస్తుండగా, మరికొందరు బంధువుల ఇళ్లలో తలదాచుకుంటున్నారు. ఇలా తెలంగాణలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కృష్ణపట్టె ప్రాంతానికి తరలి వచ్చిన కుటుంబాలను కదిలిస్తే ఒక్కొక్కరిది ఒక్కో కన్నీటి గాథ.


వందల ఇళ్లు ధ్వంసం..

టీడీపీ రెడ్‌బుక్ రాజ్యాంగంలో పిన్నెల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులు గ్రామంలో బతకలేని పరిస్థితి ఏర్పడింది. వైఎస్సార్‌సీపీ వారెవరూ గ్రామంలో ఉండడానికి వీల్లేదని గ్రామంలో దండోరా వేయించారంటే టీడీపీ నేతల దురాగతాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుస్తోంది. టీడీపీ గూండాలు దాడులు చేస్తూ అక్కడి ప్రజలను కట్టుబట్టలతో గ్రామాల నుంచి గెంటివేశారు. ఇంకోవైపు కాపాడాల్సిన పోలీసులే 'మీరు గ్రామంలో ఉండొద్దు.. ఉంటే గొడవలవుతాయి.. కాబట్టి వెళ్లిపోండి' అంటూ గ్రామస్తులను వేరే చోటకు పంపించివేస్తున్నారు. గ్రామంలో దాదాపు 3,700 కుటుంబాలు ఉంటే ఇప్పటి వరకు 1,035 కుటుంబాలను వెళ్లగొట్టినట్లు చెబుతున్నారు. మరోవైపు 150 వరకు తాళాలు వేసి ఉన్న ఇళ్లు, కిటికీలు పగులగొట్టి ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు ఇళ్లలో ఉన్న బియ్యాన్ని కూడా వదలకుండా పారబోసినట్లు వాపోయారు. గ్రామంలో ఉన్న దాదాపు 7 వేల ఓట్లలో వైఎస్సార్‌సీపీ కంటే టీడీపీకే 60 ఓట్లు అత్యధికంగా వచ్చినా, అసలు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులెవరూ గ్రామంలో ఉండడానికి వీల్లేదన్నట్టు వెళ్లగొట్టారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వలస కూలీలుగా బతకాల్సిన దైన్యం

గ్రామంలో వైఎస్సార్‌సీపీ పార్టీ నేతలు, కార్యకర్తల్లో అత్యధికంగా బడుగు, బలహీన వర్గాల వారే. అయినా పేదలనే కనికరం లేకుండా వారిని టీడీపీ నేతలు వెళ్లగొట్టారు. దీంతో గ్రామంలో భూములు ఉండటంతో వ్యవసాయం చేసుకున్న రైతులు ఇప్పుడు వేరే ప్రాంతాలకు వెళ్లి వలస కూలీలుగా బతకాల్సిన దుస్థితి ఏర్పడింది. మరికొందరు చిన్నాచితక పనులు చేసుకుంటున్నారు. మరోవైపు చిన్నారులు కూడా టీడీపీ అకృత్యాలతో చదువుకు దూరమయ్యారు. తమ పెద్దలతోపాటే వేరే ఊళ్లకు వలసపోవాల్సి రావడంతో వారు చదువుకునే పరిస్థితులు లేవు. ప్రస్తుతం తలదాచుకుంటున్న గ్రామాల్లోని పాఠశాలల్లో చేరాలన్నా వారికి సర్టిఫికెట్లు లేకపోవడంతో వారిని చేర్చుకోవడం లేదు.


ఎంపీటీసీగా ఉండొద్దని హుకుం జారీ చేశారు..



మాది పిన్నెల్లి గ్రామం. వైఎస్సార్‌సీపీ మాచవరం మండల అధికార ప్రతినిధిని. ఎంపీటీసీ భర్తను. మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ గెలుపొందింది. దీంతో ఎంపీటీసీగా ఉండడానికి టీడీపీ నేతలు వీల్లేదని హుకుం జారీ చేశారు. మా గ్రామ మాజీ సర్పంచ్, టీడీపీ నేత చింతపల్లి అన్ని గ్రామంలో వైఎస్సార్‌సీపీకి చెందినవారెవరూ ఉండడానికి వీల్లేదని మమ్మల్ని బయటకు తరిమేశారు. మా గ్రామంలో మాకు ఇల్లు, పొలాలు ఉన్నా వాటిని వదిలిరావాల్సి వచ్చింది. బాధితులకు రక్షణగా ఉండాల్సిన పోలీసులు టీడీపీ గూండాలకు కొమ్ముకాస్తున్నారు.

–చింతపల్లి పెద్దసైదా (మాస్టర్), వైఎస్సార్‌సీపీ మండల అధికార ప్రతినిధి, మాచవరం, పల్నాడు జిల్లా


కట్టుబట్టలతో గ్రామం విడిచివచ్చాం..



టీడీపీ నేతలు మమ్మల్ని వెళ్లగొడితే కట్టుబట్టలతో గ్రామం విడిచి వచ్చాం. మాకు వ్యవసాయం తప్ప వేరే పని తెలియదు. దీంతో కుటుంబ సభ్యులతో తెలంగాణలోని కృష్ణపట్టెకు వచ్చి వ్యవసాయ పనులు చేస్తున్నాం. ఇక్కడే రెండెకరాల పొలం కౌలుకు తీసుకున్నా. కొంత చెల్లించినా మిగతావి కట్టేందుకు డబ్బుల్లేవు.

– తొండా సైదు, రైతు, పిన్నెల్లి


మా ఇంటిని ధ్వంసం చేశారు..



ఎన్నికల్లో టీడీపీ గెలవగానే మా ఇంటిని క్రేన్‌తో ధ్వంసం చేశారు. బైకును తగలబెట్టారు. బీరువాలో ఉన్న డబ్బులు, బంగారం ఎత్తుకుపోయారు. మాకు 8 ఎకరాల పొలం ఉన్నా ప్రాణభయంతో వచ్చేశాం. మా ఇంటిలో ఉన్న పిల్లల సర్టిఫికెట్లు తీసుకురమ్మని మా బంధువులను పంపితే వారిని కూడా కొట్టి పంపారు. తిరిగి మా పైనే కేసులు పెట్టారు.

– గుంటూరు జమీల, పిన్నెల్లి

ఆడపిల్లలను బూతులు తిడుతూ బట్టలు తగలబెట్టారు..



టీడీపీ వాళ్లు మా ఇంటి తాళాలు పగులగొట్టి సీసాలు పగులకొట్టి ఇంట్లో వేశారు. ఇల్లంతా చిందరవందర చేశారు. మా అమ్మాయిలను బూతులు తిడుతూ బట్టలు తగలబెట్టారు.

– గుంటూరు బషీరున్, పిన్నెల్లి

అభయాంజనేయ సన్నిధిలో హైకోర్టు జడ్జి



అభయాంజనేయ స్వామి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయి ప్రతాప దంపతులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి వారి దేవస్థానాన్ని హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కుటుంబ సమేతంగా శనివారం సందర్శించారు. స్వామి వారికి తమలపాకు అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి దంపతులను స్వామి వారి చిత్రపటం, శేషవస్త్రాలతో ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ సత్కరించి, ప్రసాదాలను అందించారు.

మహానందిలో మరోసారి చిరుత సంచారం



మహానంది: నంద్యాల జిల్లా మహానందిలో చిరుత పులి సంచారం మరోసారి కలకలం రేపింది. శనివారం తెల్లవారు జామున 1.20 గంటల ప్రాంతంలో మూడోసారి గోశాల ప్రాంగణంలో సంచరించింది. ఉదయం విధులకు హాజరైన ఏఈవో ఓంకారం వేంకటేశ్వరుడు సీసీ కెమెరాలు పరిశీలించగా గోశాల ముందు నుంచి కృష్ణనంది మార్గం వైపు చిరుతపులి వెళ్లిన దృశ్యం కనిపించింది. దీంతో ఆయన ఈ విషయాన్ని ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన డీఆర్‌వో హైమావతి, ఎఫ్‌బీవో ప్రతాప్‌లకు సమాచారం ఇచ్చారు. చిరుత భయంతో వణికిపోతున్న స్థానికులు వెంటనే అటవీశాఖ అధికారులు స్పందించి ఆ చిరుతను బంధించాలని కోరుతున్నారు.

మహిళ ఆత్మహత్యను అడ్డుకున్న పెంపుడు శునకం

కర్ణాటక రాష్ట్రం దక్షిణ కన్నడ జిల్లా ఉప్పినంగడిలో ఘటన

యశవంతపుర: నదిలో దూకి ప్రాణాలు తీసుకోవాలనుకున్న మహిళ ప్రయత్నాన్ని పెంపుడు శునకం అడ్డుకున్న ఘటన కర్ణాటక రాష్ట్రం దక్షిణ కన్నడ జిల్లా ఉప్పినంగడిలో శనివారం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే... ఉప్పినంగడికి చెందిన ఓ జంట 16 ఏళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. కొంతకాలంగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి భర్తతో గొడవ పడిన సదరు మహిళ నాలుగు కిలోమీటర్ల దూరంలోని నేత్రావతి నదిలో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి వెళ్లింది.పెంపుడు శునకం కూడా ఆమెను అనుసరించింది. వంతెనపై నుంచి నీటిలోకి దూకడానికి ప్రయత్నిస్తుండగా ఆమె చుడిదార్‌ను శునకం గట్టిగా పట్టుకొంది. ఆమె ఎంత అదిలించినా ఆ శునకం వదిలిపెట్టలేదు. ఇంతలో గమనించిన ద్విచక్ర వాహనదారులు, స్థానికులు వెంటనే అక్కడకు వెళ్లి ఆమెను వారించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సదరు మహిళకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. తన యజమాని ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్న పెంపుడు శునకం తీరును ప్రశంసించారు.

స్టార్మర్... సరికొత్త ఆశాకిరణం

బ్రిటన్‌లో మార్పుకు సారథి • లేబర్ పార్టీకి ఘనవిజయం సాధించి పెడతారంటూ అంచనాలు

కెయిర్ రాడ్నీ స్టార్మర్. ఈ 61 ఏళ్ల లేబర్ పార్టీ నాయకుని పేరు ఇప్పుడు బ్రిటన్‌లో మార్మోగుతోంది. ఆర్థిక ఇక్కట్లు మొదలుకుని నానా రకాల సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు ఆయనలో తమ నూతన నాయకున్ని చూసుకుంటున్నారని సర్వేలన్నీ చెబుతున్నాయి. జూలై 4న జరగనున్న ఎన్నికల్లో లేబర్ పార్టీని ఆయన ఘనవిజయం దిశగా నడిపించడం, ప్రధాని పీఠమెక్కడం ఖాయమని ఘోషిస్తున్నాయి. అదే జరిగితే 14 ఏళ్ల అనంతరం లేబర్ పార్టీని గెలుపు బాట పట్టించిన నేతగా స్టార్మర్ నిలవనున్నారు. సాక్షి, నేషనల్ డెస్క్



నిరుపేద నేపథ్యం..

దేశంలోనే పేరుమోసిన లాయర్. ఐదేళ్ల పాటు బ్రిటన్ చీఫ్ ప్రాసిక్యూటర్. ఆ హోదాలో రాజవంశానికి చేసిన సేవలకు గుర్తింపుగా లభించిన అత్యున్నత పౌర పురస్కారమైన సర్. ఇదంతా 61 ఏళ్ల స్టార్మర్ నేపథ్యం. దాంతో ఆయన సంపన్నుల ప్రతినిధి అంటూ కన్జర్వేటివ్ పార్టీ ప్రత్యర్థులు తరచూ విమర్శిస్తుంటారు. వీటన్నింటికీ తన నేపథ్యమే సమాధానమని సింపుల్‌గా బదులిస్తారు స్టార్మర్. కలవారి కుటుంబంలో పుట్టి, మల్టీ బిలియనీర్ కూతురిని పెళ్లాడిన తన ప్రత్యర్థి, ప్రధాని రిషి సునాక్‌దే సిసలైన సంపన్న నేపథ్యమంటూ చురకలు వేస్తుంటారు. స్టార్మర్ 1963లో లండన్ శివార్లలో ఓ నిరుపేద కుటుంబంలో పుట్టారు. తండ్రి పనిముట్లు తయారు చేసే కార్మికుడు. తల్లి నర్సు. నలుగురు సంతానం కావడంతో నిత్యం డబ్బు కటకట మధ్యే పెరిగారాయన. తన నిరుపేద నేపథ్యాన్ని ఎన్నికల ప్రచారంలో స్టార్మర్ పదేపదే ప్రస్తావిస్తున్నారు. ''ద్రవ్యోల్బణమంటే ఏమిటో, కుటుంబాలను అది ఎంతగా కుంగదీస్తుందో నాకు చిన్నప్పుడే అనుభవం. ధరల పెరుగుదల ఎంత దుర్భరమో కన్జర్వేటివ్ పార్టీ నేతలందరి కంటే నాకంటే ఎక్కువగా తెలుసు. పోస్ట్‌మ్యాన్ వస్తున్నాడంటే చాలు, ఏ బిల్లు తెచ్చిస్తాడో, అది కట్టడానికి ఎన్ని ఇబ్బందులు పడాలో అని ఇంటిల్లిపాదీ బెదిరిపోయేవాళ్లం. ఫోన్ బిల్లు కట్టలేక నెలల తరబడి దాన్ని వాడకుండా పక్కన పెట్టిన సందర్భాలెన్నో'' అంటూ చేస్తున్న ఆయన ప్రసంగాలకు విశేష స్పందన వస్తోంది. తన కుటుంబంలో కాలేజీ చదువు చదివిన తొలి వ్యక్తి స్టార్మరే కావడం విశేషం. లీడ్స్ వర్సిటీ, ఆక్స్‌ఫర్డ్‌లో లా చేశారు. పేదరికమే తనలో కసి నింపి చదువుల్లో టాపర్‌గా నిలిచేందుకు సాయపడిందంటారు.

50 ఏళ్ల తర్వాత రాజకీయ అరంగేట్రం

50 ఏళ్లు దాటాక స్టార్మర్ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 2015లో పార్లమెంటుకు ఎన్నికయ్యారు. రెండు వరుస ఎన్నికల్లో పార్టీని గెలిపించడంలో జెరెమీ కోర్బిన్ విఫలం కావడంతో 2020లో లేబర్ పార్టీ పగ్గాలతో పాటు విపక్ష నేత బాధ్యతలు కూడా చేపట్టారు. వస్తూనే పార్టీలో అంతర్గతంగా ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. బాధ్యతాయుతంగా, మేనేజర్ తరహాలో, కాస్త డల్‌గా కనిపించే వ్యవహార శైలి స్టార్మర్ సొంతం. ఆర్థిక సమస్యల సుడిగుండంలో చిక్కి సతమతమవుతున్న బ్రిటన్‌కు ఇప్పుడు కావాల్సిన సరిగ్గా అలాంటి నాయకుడేనన్నది పరిశీలకుల అభిప్రాయం. చరిష్మా ఉన్న నేత కంటే నమ్మకం కలిగించగల నాయకుడినే బ్రిటన్‌వాసులు కోరుకుంటున్నారని చెబుతున్నారు. అందుకు తగ్గట్టే నాలుగేళ్లుగా విపక్ష నేతగా తన పనితీరుతోనూ, కీలక విధానాంశాలపై స్పష్టమైన అభిప్రాయాలతోనూ ప్రజలను స్టార్మర్ బాగా ఆకట్టుకుంటూ వస్తున్నారు. ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల, హౌజింగ్ సంక్షోభం వంటి పెను సమస్యల పరిష్కారంలో భారత మూలాలున్న తొలి ప్రధాని రిషి సునాక్ విఫలమయ్యారన్న అభిప్రాయం దేశమంతటా బాగా విన్పిస్తోంది. ఈ నేపథ్యంలో 14 ఏళ్ల కన్జర్వేటివ్ పార్టీ పాలనకు తెర పడటం ఖాయమన్న విశ్లేషణలే విన్పిస్తున్నాయి. అందుకే కొద్ది రోజులుగా వెలువడుతున్న ఎన్నికల సర్వేలన్నీ లేబర్ పార్టీ ఘనవిజయం ఖాయమని చెబుతున్నాయి.

> "లేబర్ పార్టీకి ఓటు రాజకీయ, ఆర్థిక స్థిరత్వానికి ఓటు"
> - కెయిర్ స్టార్మర్

విజయమే లక్ష్యంగా...

కన్జర్వేటివ్ పార్టీ పాలనపై దేశమంతటా నెలకొన్న తీవ్ర వ్యతిరేకతను స్టార్మర్ ముందుగానే పసిగట్టారు. అందుకే ఘనవిజయమే లక్ష్యంగా కొద్ది నెలలుగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. బ్రెగ్జిట్ తప్పుడు నిర్ణయమంటూనే తాను అధికారంలోకి వస్తే దాన్ని సమీక్షించబోనని చెబుతున్నారు. ఇది ఆయన సిద్ధాంతరాహిత్యానికి నిదర్శనమన్న కన్జర్వేటివ్ నేతల విమర్శలను తేలిగ్గా తోసిపుచ్చుతున్నారు. తాను కేవలం మెజారిటీ ప్రజల ఆకాంక్షలను అంగీకరిస్తున్నానంటూ దీటుగా బదులిస్తున్నారు. ''నేను కార్మిక కుటుంబం నుంచి వచ్చాను. జీవితమంతా పోరాడుతూనే వస్తున్నా. ఇప్పుడు దేశ ప్రజల స్థితిగతులను మెరుగు పరిచి వారికి బంగారు భవిష్యత్తు అందించేందుకు మరింతగా పోరాడతా'' అంటూ అందరినీ ఆకట్టుకుంటున్నారు. 'పార్టీ కంటే దేశమే ముందు' నినాదంతో దూసుకుపోతున్న స్టార్మర్‌లో బ్రిటన్ ప్రజలు ఇప్పటికే తమ ప్రధానిని చూసుకుంటున్నారని రాజకీయ విశ్లేషకులంతా ముక్త కంఠంతో చెబుతున్నారు. 18 ఏళ్ల కన్జర్వేటివ్ పాలనకు 1997లో తెర దించిన టోనీ బ్లెయిర్ ఫీటును ఈసారి ఆయన పునరావృతం చేస్తారన్న భావన అంతటా వ్యక్తమవుతోంది.

కొసమెరుపు

లేబర్ పార్టీ తొలి నాయకుడు కెయిర్ హార్డీ మీద అభిమానంతో స్టార్మర్‌కు తల్లిదండ్రులు ఆయన పేరే పెట్టుకున్నారు. ఇప్పుడదే లేబర్ పార్టీకి ఆయన నాయకునిగా ఎదగడం విశేషం!

ప్రస్తుత బలాబలాలు

బ్రిటన్ పార్లమెంట్ లో దిగువ సభ అయిన హౌస్ ఆఫ్ కామన్స్‌లోని 650 స్థానాలకు జూలై 4న ఎన్నికలు జరగనున్నాయి. మెజారిటీ మార్కు 326.

పార్టీ	స్థానాలు
కన్జర్వేటివ్	344
లేబర్	205
ఎస్ ఎన్ పీ	43
లిబరల్ డెమొక్రాట్స్	15
ఇతరులు	43

రెండు రోజుల్లో నీట్-పీజీ పరీక్ష షెడ్యూల్


విద్యాశాఖ మంత్రి ప్రధాన్ వెల్లడి

న్యూఢిల్లీ: నీట్-పీజీ పరీక్షల కొత్త షెడ్యూల్‌ను నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్(ఎన్‌బీఈ) ఒకటి రెండ్రోజుల్లో ప్రకటిస్తుందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు. నీట్-పీజీ పరీక్ష ప్రశ్నపత్నం డార్క్ నెట్‌లో లీకైందని, టెలిగ్రామ్ యాప్‌లో షేర్ చేశారని తెలిపారు. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు చేస్తోందన్నారు. కీలకమైన పోటీ పరీక్షల్లో పేపర్ లీకవుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో గతవారం జరగాల్సిన నీట్-పీజీ పరీక్షను ముందు జాగ్రత్తగా రద్దు చేసిన సంగతి తెలిసిందే. అలాగే జూన్ 18న జరిగిన యూజీసీ-నెట్ పరీక్ష సైతం రద్దయ్యింది.

ఫలితం తేల్చని ఇరాన్ ఎన్నికలు

- 60% మంది ఓటింగ్‌కు దూరం
- అధ్యక్ష పదవికి జూలై 5న మళ్లీ పోలింగ్

దుబాయ్: ఇరాన్ అధ్యక్ష పదవికి శుక్రవారం జరిగిన పోలింగ్‌లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇవ్వలేదు. దేశ చరిత్రలోనే అతి తక్కువ ఓటింగ్ నమోదైన నేపథ్యంలో ప్రధాన ప్రత్యర్థులుగా ఉన్న సంస్కరణవాది మసూద్ పెజెష్కియాన్‌కు గానీ ఛాందసవాది సయీద్ జలీలీకిగానీ మెజారిటీ దక్కలేదు. దేశ రాజ్యాంగం ప్రకారం పోలైన ఓట్లలో 50 శాతం పైగా సాధించిన వారే అధ్యక్షుడవుతారు. శుక్రవారం జరిగిన పోలింగ్‌లో అతి తక్కువగా 39.9 శాతం మందే ఓటేశారు. 60 శాతం మందికి పైగా ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయారు. మొత్తం 2.45 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకోగా శనివారం వెలువడిన ఫలితాల్లో పెజెష్కియాన్‌కు 1.04 కోట్ల మంది, జలీలీకి 90.4 లక్షల మంది ఓటేశారని అధికారులు ప్రకటించారు. వీరితోపాటు బరిలో నిలిచిన పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బఘెర్ ఖలిబాఫ్‌కు 30.3 లక్షల ఓట్లు, షియా మత పెద్ద మొస్తాఫాకు 2.06 లక్షల ఓట్లు పోలయ్యాయి. ఫలితాలు వెలువడ్డాక అధ్యక్ష బరి నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించిన ఖలిబాఫ్ రెండో విడత పోలింగ్‌లో తన మద్దతు జలీలీకే ఉంటుందని ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో జూలై 5వ తేదీన రెండో దశ పోలింగ్ జరగనుంది. ఈ పోలింగ్‌లో ఎక్కువ మందిని తన వైపు తిప్పుకోగలిగితేనే పెజెష్కియాన్‌కు గెలిచే అవకాశాలుంటాయి. లేకుంటే, సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ మద్దతున్న జలీలీదే పైచేయి అవుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. ఇరాన్‌లో మరోసారి ఛాందసవాదులే అధికారంలోకి వస్తారని అంటున్నారు. 'నిరసన తెలపడం ప్రజల హక్కు. ఎన్నికల ప్రక్రియకు దూరంగా ఉండటం ద్వారా ఇరాన్ ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. అధ్యక్ష అభ్యర్థులతోపాటు ప్రస్తుత వ్యవస్థను సైతం వారు తిరస్కరించారు' అని లండన్‌లోని చాతం హౌస్‌లో మిడిల్ ఈస్ట్, నార్త్ ఆఫ్రికా ప్రోగ్రాం డైరెక్టర్ సనమ్ వకీల్ విశ్లేషించారు. అక్కడి వ్యవస్థల పట్ల ప్రజల్లో ఏ మేరకు ఉదాసీనత, నిరాశ గూడుకట్టుకునే ఉన్నాయనేందుకు ఇదే ఉదాహరణ అని ఆమె పేర్కొన్నారు.



సయీద్ జలీలీ పెజెష్కియాన్



వర్షాలకు కూలిన రాజ్‌కోట్ ఎయిర్‌పోర్ట్ పైకప్పు

రాజ్‌కోట్: ఢిల్లీ, జబల్పూర్‌లను అతలాకుతలం చేసిన వర్షాలు గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లోనూ బీభత్సం సృష్టించాయి. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ టర్మినల్ కూలిన మరుసటి రోజే మరో ఎయిర్‌పోర్ట్ వర్షాల బారిన పడింది. రాజ్‌కోట్‌లో అక్కడి భారీ వర్షాలకు సోమవారం ఉదయం రాజ్‌కోట్ ఎయిర్‌పోర్ట్‌లో ప్రయాణికుల పికప్, డ్రాప్ ఏరియాపై నిర్మించిన భారీ టెంట్ కూలింది. అయితే ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు. అయితే టెంట్ కూలిన ఘటనపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. '' ప్రధాని మోదీ స్వయంగా వచ్చి ఈ ఎయిర్‌పోర్ట్‌ను ప్రారంభించారు. 11 నెలలకే పైకప్పు కూలింది. అవినీతి ఏ స్థాయిలో ఉందో కూలిన ఘటన చాటిచెప్తోంది. ఢిల్లీ మాదిరి ఘటన వేళ అక్కడ ఎవరైనా ఉంటే జరిగే ప్రాణనష్టానికి ఎవరు బాధ్యులు?. తరచూ అవినీతిపై ప్రసంగాలు దంచే ప్రధాని అవినీతిరహిత పాలనపైనా దృష్టిసారించాలి' అని గుజరాత్ కాంగ్రెస్ అధ్యక్షులు శక్తిసిన్హ్ గోహిల్ అన్నారు.

నెహ్రూను నిందించొద్దు: వ్యంగ్యంగా స్పందించిన బీజేపీ

రాజ్‌కోట్ ఘటనపై బీజేపీ వెటకారంగా స్పందించింది. '' నిన్నటి ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ టర్మినల్ కూలిన ఘటనతో రాజ్‌కోట్ ఘటనను పోల్చొద్దు. రాజ్‌కోట్‌లో పెనుగాలులకు టెంట్ వస్త్రం చిరిగి అది పీలికలై పడిపోయింది. తక్కువ ఎయిర్‌పోర్ట్‌లు నిర్మించారని మీరు జవహర్‌లాల్ నెహ్రూను నిందిస్తారేమో. అలా చేయకండి. ఎందుకంటే ఆయన ఇన్ని విమానాశ్రయాలు నిర్మించలేరు. ఆయనకే మనం అవకాశం ఇచ్చి ఉంటే ఇప్పటికీ మనం రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) అనుమతితో ఎడ్లబళ్లపై ప్రయాణాలు చేస్తూ ఉండేవాళ్లం' అని బీజేపీ ఐటీ విభాగ సారథి అమిత్ మాలవీయ 'ఎక్స్'లో ట్వీట్‌చేశారు.

సైనిక విన్యాసాల్లో తీవ్ర విషాదం

- తూర్పు లద్దాఖ్‌లో ఎల్‌ఏసీ సమీపంలో నదిలో మునిగిన యుద్ధట్యాంకు
- నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి ఐదుగురు జవాన్ల దుర్మరణం
- మృతుల్లో తెలుగు సైనికుడు, జేసీఓ ముత్తముల రామకృష్ణారెడ్డి

లేహ్/రాచర్ల: సైనిక విన్యాసాల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విన్యాసాల్లో భాగంగా యుద్ధ ట్యాంకుతో నదిని దాటుతుండగా హఠాత్తుగా వరద పోటెత్తడంతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జూనియర్ కమిషన్డ్ అధికారి(జేసీఓ) ముత్తముల రామకృష్ణారెడ్డి సహా ఐదుగురు జవాన్లు మృత్యువాత పడ్డారు. తూర్పు లద్దాఖ్‌లో భారత్-చైనా సరిహద్దు వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) సమీపంలోని షియోక్ నదిలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంట సమయంలో ఈ దుర్ఘటన జరిగినట్లు సైనికాధికారులు వెల్లడించారు. లేహ్ నుంచి 148 కిలోమీటర్ల దూరంలోని మందిర్ మోర్హ్ వద్ద భారత సైన్యం విన్యాసాలు చేపట్టింది. ఈ విన్యాసాల్లో భాగంగా జవాన్లు యుద్ధ ట్యాంకులు నడుపుతూ షియోక్ నదిని దాటుతుండగా, టి-72 ట్యాంకు నదిలో ఇరుక్కుపోయింది. ఇంతలో ఎగువ ప్రాంతం నుంచి ఆకస్మికంగా వరద పోటెత్తింది. నదిలో నీటిమట్టం ఒక్కసారిగా పెరిగిపోయింది. క్షణాల వ్యవధిలోనే టి-72 ట్యాంకు నీట మునిగిపోయింది. యుద్ధ ట్యాంకుపై ఉన్న ఐదుగురు సైనికులు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు రంగంలోకి దిగినప్పటికీ నదిలో వరద ఉధృతి అధికంగా ఉండడంతో జవాన్లను రక్షించలేకపోయాయి. నదిలో ఐదుగురి మృతదేహాలు లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఐదుగురు జవాన్లు తూర్పు లద్దాఖ్ దౌలత్ బేగ్ ఓల్డీ మిలటరీ బేస్‌లోని 52 ఆర్మర్డ్ రెజిమెంట్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. విన్యాసాల్లో పాల్గొంటూ దురదృష్టవశాత్తూ మరణించారు. ఈ సైనిక శిబిరం చైనా సరిహద్దుకు అత్యంత సమీపంలో ఉంది. ఎగువ ప్రాంతాల్లో మంచు కరిగిపోవడం వల్లే షియోక్ నదిలో వరద ప్రవాహం హఠాత్తుగా పెరిగినట్లు అధికారులు వెల్లడించారు. దేశ రక్షణ పరంగా వ్యూహాత్మకంగా కీలకమైన దెప్సాంగ్ ప్రాంతంలో ఈ నది ప్రవహిస్తోంది.

పదవీ విరమణకు ఆరు నెలల ముందు మృత్యువాత

తూర్పు లద్దాఖ్‌లో సైనిక విన్యాసాల్లో ప్రాణాలు కోల్పోయిన ముత్తముల రామకృష్ణారెడ్డి(47) స్వగ్రామం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా రాచర్ల మండలం కాలువపల్లె. ఆయన భారత సైన్యంలో 30 ఏళ్లుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్‌గా సేవలందిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరిలో రామకృష్ణారెడ్డి పదవీ విరమణ చేయాల్సి ఉందని గ్రామస్తులు తెలిపారు. ఆయనకు భార్య ఉమాదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమారుల చదువుల కోసం ఉమాదేవి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. రామకృష్ణారెడ్డి మృతదేహం ఆదివారం సాయంత్రం కాలువపల్లెకు చేరుకోనున్నట్లు స్థానికులు చెప్పారు. రామకృష్ణారెడ్డి మరణ వార్త తెలిసిన వెంటనే హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఆయన భార్య ఉమాదేవి, కుమారులు కాలువపల్లెకు బయలుదేరారు.

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన రాజ్‌నాథ్ సింగ్

వాస్తవాధీన రేఖ సమీపంలో ఐదుగురు సైనికులు మరణించడం పట్ల రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక సంతాపం ప్రకటించారు.

'నీట్-యూజీ' కేసులో దర్యాప్తు వేగవంతం

- జార్ఖండ్‌లో హిందీ పత్రిక జర్నలిస్టు అరెస్టు

న్యూఢిల్లీ: నీట్-యూజీ అక్రమాల కేసులో సీబీఐ అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. శనివారం గుజరాత్‌లోని ఏడు ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. జార్ఖండ్‌లో ఓ హిందీ పత్రిక జర్నలిస్టు జమాలుద్దీన్ అన్సారీని అరెస్ట్ చేశారు. నీట్-యూజీ పేపర్ లీకేజీ కేసులో నిందితులైన హజారీబాగ్‌లోని ఒయాసిస్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎహసానుల్ హక్, వైస్ ప్రిన్సిపాల్ ఇంతియాజ్ అలామ్‌కు జమాలుద్దీన్ సహకరినట్లు సీబీఐ అధికారులు గుర్తించారు. గుజరాత్‌లోని ఆనంద్, ఖేడా, అహ్మదాబాద్, గోద్రా జిల్లాల్లో నిందితులకు సంబంధించిన నివాసాలు, కార్యాలయాల్లో అధికారులు సోదాలు చేశారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న జయ్ జలారామ్ స్కూల్ ప్రిన్సిపాల్ పురుషోత్తమ్, టీచర్ తుషార్, మధ్యవర్తులు విభోర్, అరిఫ్‌లను నాలుగు రోజులపాటు సీబీఐ కస్టడీకి అప్పగిస్తూ గోద్రా కోర్టు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. గోద్రా, ఖేడా జిల్లాల్లో నీట్ పరీక్ష జరిగిన సెంటర్లు జయ్ జలారామ్ స్కూల్ యాజమాన్యం ఆధీనంలో ఉన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు.

ఫలితాలు ప్రధానికి నైతిక ఓటమే

- దేశాభివృద్ధి చేయకున్నా ప్రధానిగా కొనసాగుతున్నారు
- మోదీపై సోనియా గాంధీ ఫైర్



న్యూఢిల్లీ: ఎన్‌డీఏ కూటమికి మెజారిటీ తగ్గిస్తూ తాజా లోక్‌సభ ఎన్నికల్లో వెలువడిన ప్రజాతీర్పు ప్రధాని మోదీ వ్యక్తిగత, రాజకీయ, నైతిక ఓటమికి నిదర్శనమని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ విమర్శించారు. ఒక జాతీయ పత్రికలో రాసిన సంపాదకీయంలో మోదీ, ఎన్‌డీఏ ప్రభుత్వంపై సోనియా విమర్శలు సంధించారు. '' ఎన్నికల ప్రచారంవేళ తానొక దైవాంశ సంభూతుడిని అన్నట్లు స్వయంగా ప్రకటించుకుని 400 సీట్ల ఖాయమని భ్రమలో గడిపిన ప్రధాని మోదీకి జూన్ 4న వెల్లడైన ఫలితాలు ప్రతికూల సంకేతాలు చూపించాయి. విభజన, విద్వేష రాజకీయాలు, మోదీ పరిపాలనా విధానాలను ప్రజలు తిరస్కరిస్తున్నట్లు నాటి ఫలితాల్లో వెల్లడైంది. ఏకాభిప్రాయం ఉండాలని మోదీ వల్లెవేస్తారుగానీ ఆచరణలో అవేం ఉండవు. స్పీకర్ ఎన్నికలు ఇందుకు తార్కాణం. డెప్యూటీ స్పీకర్ పదవి విషయంలో విపక్షాల సహేతుక విజ్ఞాపనను పట్టించుకుంటే స్పీకర్ ఎన్నిక విషయంలో ప్రభుత్వానికి మేం సంపూర్ణ మద్దతు ఇస్తామని 'ఇండియా' కూటమి స్పష్టంచేసింది. అయినాసరే మోదీ వైఖరి మారలేదు. 17వ లోక్‌సభలోనూ డెప్యూటీ స్పీకర్ పదవిని విపక్షాలకు కేటాయించలేదు'' అని అన్నారు.

అంతటి మెజారిటీ మోదీ సర్కార్‌కు రాలేదు

''రాజ్యాంగంపై ఎన్‌డీఏ దాడి అంశం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే లోక్‌సభ తొలి సెషన్‌లోనే ఎమర్జెన్సీ అంశాన్ని మోదీ సర్కార్ పదేపదే ప్రస్తావించింది. పార్టీలకతీతంగా, పక్షపాతరహితంగా వ్యవహరించాల్సిన స్పీకర్ కూడా అదే బాటలో పయనిస్తూ 'ఎమర్జెన్సీ'పై తీర్మానం చదవడం దిగ్భ్రాంతికరం. నాటి ఎమర్జెన్సీకి కారణమైన ఇందిరాగాంధీని ఆనాడు ప్రజలు తిరస్కరించినా తర్వాత సార్వత్రిక ఎన్నికల్లో ఆమెకు ఓటర్లు బ్రహ్మరథం పట్టారు. భారీ మెజారిటీతో గెలిపించారు. అంతటి మెజారిటీ మోదీ సర్కార్‌కు కూడా రాలేదు'' అని సోనియా అన్నారు.

ఆ మూడు చట్టాల అమలు నిలిపేయాలి

''పార్లమెంట్‌లో దారుణమైన భద్రతావైఫల్యాన్ని ఎలుగెత్తిచాటినందుకు అక్రమంగా ఇరుసభల్లో 146 మంది విపక్ష సభ్యులను బహిష్కరించారు. వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే కీలకమైన మూడు నూతన నేర బిల్లులను ఎలాంటి చర్చ జరపకుండానే ఏకపక్షంగా చట్టాలుగా ఆమోదింపజేసుకున్నారు. బిల్లులను సంస్కరించాల్సిఉందని, చర్చ జరగాలని ఎందరో న్యాయకోవిదులు మొత్తుకున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. అందుకే వీటిపై సమగ్ర చర్చ జరగాలి. అప్పటిదాకా ఈ నేర చట్టాల అమలును తాత్కాలికంగా నిలిపేయాలి'' అని సోనియా అన్నారు.

నీట్ లీకేజీలపై ప్రధాని మాట్లాడరా?

''లక్షలాది మంది యువత భవిష్యత్తును ఛిద్రం చేస్తూ నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఉదంతం వెలుగుచూస్తే మోదీ మాట్లాడరా? పరీక్ష పే చర్చా అంటూ తరచూ విద్యార్థులతో మాట్లాడే మోదీ ఈసారి ఎందుకు అదే విద్యార్థులకు మరోసారి పేపర్ లీక్ కాబోదని భరోసా ఇవ్వలేకపోతున్నారు? దారుణ నిర్లక్ష్యానికి విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించాలి. ఎన్‌సీఈఆర్‌టీ, యూజీసీ, విశ్వవిద్యాలయాల్లో ప్రమాణాలు గత పదేళ్లలో ఎంతగా పడిపోయాయో ఇట్టే అర్థమవుతోంది'' అని అన్నారు.

మరికొన్ని రోజులు అంతరిక్షంలోనే సునీతా విలియమ్స్!

వాషింగ్టన్: అమెరికాకు చెందిన ప్రఖ్యాత బోయింగ్ సంస్థ అభివృద్ధి చేసిన స్టార్‌లైనర్ వ్యోమనౌకలో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్‌తోపాటు బుచ్ విల్‌మోర్ మరికొన్ని రోజులు అక్కడే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వారు కచ్చితంగా భూమిపైకి ఎప్పుడు తిరిగి వస్తారన్నది నాసా శాస్త్రవేత్తలు చెప్పలేకపోతున్నారు. స్టార్‌లైనర్‌లో తలెత్తిన కొన్ని లోపాలను ఇంకా సరిచేయకపోవడమే ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో స్టార్‌లైనర్ మిషన్ వ్యవధిని 45 రోజుల నుంచి 90 రోజులదాకా పొడిగించాలని భావిస్తున్నారు. జూన్ 5న సునీత, విల్‌మోర్ అంతరిక్షంలోకి బయలుదేరారు. స్టార్‌లైనర్ స్పేస్‌క్రాఫ్ట్‌లో చివరి నిమిషంలో కొన్ని సమస్యలు తలెత్తాయి. హీలియం గ్యాస్ లీకవుతున్నట్లు గుర్తించారు. థ్రస్టర్లు కూడా మొరాయించాయి. బోయింగ్ సైంటిస్టులు అప్పటికప్పుడు కొన్ని మరమ్మతులు చేయడంతో వ్యోమనౌక అంతరిక్షంలోకి చేరుకుంది. షెడ్యూల్ ప్రకారం త్వరలో తిరిగి రావాల్సి ఉంది. కానీ, మరమ్మతులు పూర్తిస్థాయిలో జరగలేదు. ఇవి పూర్తయిన తర్వాతే సునీత విలియమ్స్, విల్‌మోర్ భూమిపైకి చేరుకొనే అవకాశం ఉంది.



ఉత్తరాఖండ్ రాష్ట్రంలో భారీ వర్షాలకు హరిద్వార్‌లోని కొత్వాలి వద్ద గంగానది వరద ప్రవాహంలో కొట్టుకుపోతున్న కార్లు

ఉత్తరాదిన కుండపోత వర్షాలు

- రానున్న ఐదు రోజులపాటు వర్షసూచన
- ఢిల్లీలో 11కు చేరుకున్న మృతుల సంఖ్య

న్యూఢిల్లీ: ఉత్తర భారతదేశంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం పలు ప్రాంతాల్లో భీకర వర్షం కురిసింది. ఉత్తరాదిన రానున్న ఐదు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వెల్లడించింది. దేశ రాజధాని ఢిల్లీలో వర్షాల ధాటికి మరణించిన వారి సంఖ్య 11కు చేరుకుంది. వసంత్ విహార్ ప్రాంతంలో కూలిపోయిన ఓ భవనం కింద చిక్కుకున్న ముగ్గురు కార్మికుల మృతదేహాలను శనివారం వెలికి తీశారు. నగరంలో వరుసగా రెండో రోజూ భారీగా వర్షపాతం నమోదైంది. శనివారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సఫ్దర్‌జంగ్ వాతావరణ కేంద్రంలో 8.9 మిల్లీమీటర్లు, లోధీ రోడ్డులో 12.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నగరంలో 35.6 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయ్యింది. హిమాచల్ ప్రదేశ్‌లో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. కాంగ్రా, కులూ, సోలన్ జిల్లాలో పలు రహదారులను మూసివేశారు. రాష్ట్రంలో ధరంపూర్‌లో గత 24 గంటల్లో 62.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉత్తరాఖండ్, రాజస్తాన్, పంజాబ్, హరియాణా, చండీగఢ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో ఎడతెరిపి వర్షాలు కురుస్తున్నాయి.

14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి కేజ్రీవాల్



న్యూఢిల్లీ: మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను మరో 14 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీకి అప్పగిస్తూ ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. మూడు రోజుల కస్టోడియల్ విచారణ ముగియడంతో కేజ్రీవాల్‌ను సీబీఐ అధికారులు శనివారం రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి సునేనా శర్మ ఎదుట హాజరుపర్చారు. మద్యం కుంభకోణం కేసులో విచారణ నిమిత్తం ఆయనను 14 రోజలపాటు జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించాలని కోరారు. ప్రత్యేక న్యాయమూర్తి సానుకూలంగా స్పందించారు. కేజ్రీవాల్‌ను వచ్చే నెల 12వ తేదీ దాకా జ్యుడీషియల్ కస్టడీకి తరలిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

తెలుగు అధికారికి ఎస్‌బీఐ పగ్గాలు!

- కొత్త చైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు శెట్టి
- తాజాగా ప్రతిపాదించిన ఎఫ్ఎస్ఐబీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: బ్యాంకింగ్ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నూతన చైర్మన్‌గా సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ చల్లా శ్రీనివాసులు శెట్టిని ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్స్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) శనివారం ఎంపిక చేసింది. ప్రస్తుతం ఆయన ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్ హోదాలో అంతర్జాతీయ బ్యాంకింగ్, గ్లోబల్ మార్కెట్స్, టెక్నాలజీ విభాగాలను పర్యవేక్షిస్తున్నారు. ఆగస్టు 28న పదవీ విరమణ చేయనున్న దినేష్ కుమార్ ఖరా స్థానంలో బాధ్యతలు స్వీకరిస్తారు. శ్రీనివాసులు తెలుగు వారు కావడం విశేషం. తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా పెద్దపోతులపాడు ఆయన స్వస్థలం. ఎస్‌బీఐలో ప్రొబేషనరీ అధికారిగా 1988లో కెరీర్ ప్రారంభించారు. ప్రభుత్వ యాజమాన్యంలోని బ్యాంకులు, ఆర్థిక సంస్థల డైరెక్టర్లను ఎంపిక చేసే ఎఫ్ఎస్ఐబీ.. ఎస్‌బీఐ కొత్త చైర్మన్ కోసం జూన్ 29న ముగ్గురు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి శ్రీనివాసులు పేరును ఖరారు చేసింది. ఎఫ్ఎస్ఐబీ సిఫార్సుపై ప్రధాని మోదీ నేతృత్వంలోని కేబినెట్ నియామకాల కమిటీ తుది నిర్ణయం తీసుకోనుంది.

సరిహద్దుల్లో పాక్ కవ్వింపు చర్యలు.. దీటుగా బదులిచ్చిన భారత సైన్యం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి పాకిస్తాన్ రేంజర్లు కవ్వింపు చర్యలకు దిగగా భారత ఆర్మీ వారికి దీటైన జవాబిచ్చింది. శుక్రవారం రాత్రి కృష్ణఘాటి సెక్టార్‌లోని ఫార్వర్డ్ పోస్ట్‌పైకి కాల్పులు జరపగా మన జవాన్లు ప్రతిగా కాల్పులు జరిపి తగిన బుద్ధి చెప్పారని ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. స్వల్ప కాలం చోటుచేసుకున్న ఈ ఘటనలో ఎటువంటి నష్టం సంభవించలేదని ఆ వర్గాలు వివరించాయి. సరిహద్దుల ఆవలి నుంచి భారత భూభాగంలోకి ఉగ్రవాదుల చొరబాట్లకు వీలుకల్పించేందుకే పాక్ రేంజర్లు కాల్పులకు పాల్పడి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సరిహద్దుల్లో గస్తీతోపాటు సోదాలను మరింత పెంచినట్లు ఆర్మీ తెలిపింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేసింది. కశ్మీర్‌లో వార్షిక అమర్‌నాథ్ మొదలైన సమయంలోనే పాక్ ఆర్మీ కవ్వింపు చర్యలకు దిగటంతో సైన్యం అప్రమత్తమైంది.

బిహార్‌కు ప్రత్యేక హోదా లేదా ప్యాకేజీ ఇవ్వాలి

- నితీశ్ సారథ్యంలో జేడీయూ సమావేశం తీర్మానం
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సంజయ్ ఝా ఎన్నిక



సంజయ్ ఝా

న్యూఢిల్లీ: కేంద్రంలో ప్రధాని మోదీ సారథ్యంలో ప్రభుత్వం ఏర్పాటులో కీలకంగా ఉన్న జనతాదళ్(యునైటెడ్) ఎగ్జిక్యూటివ్ సమావేశం శనివారం జరిగింది. పార్టీ చీఫ్, బిహార్ సీఎం నితీశ్ అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన ఈ భేటీలో ఆ పార్టీ కీలక తీర్మానాలు చేసింది. బిహార్‌కు ప్రత్యేక హోదా లేదా స్పెషల్ ప్యాకేజీ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. పేపర్ లీకేజీ ఘటనల్లో బాధ్యులపై తీవ్ర చర్యలు తీసుకోవడం ద్వారా వీటిని పునరావృతం కాకుండా చేయవచ్చని పేర్కొంది. ఈ సమావేశం నితీశ్‌కి నమ్మకస్తుడిగా, బీజేపీతో మంచి సంబంధాలున్న రాజ్యసభ ఎంపీ సంజయ్ ఝాను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకుంది.

అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

మంచు స్ఫటిక శివలింగాన్ని దర్శించుకున్న 13 వేల మంది

శ్రీనగర్: కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ వార్షిక అమర్‌నాథ్ యాత్ర మొదలైంది. మొదటి రోజైన శనివారం అమర్‌నాథ్ గుహాలయంలోని స్ఫటిక శివలింగాన్ని 13 వేల మంది దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. యాత్ర సందర్భంగా ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. యాత్ర శుభప్రదం కావాలని ఆకాంక్షించారు. కాగా, శుక్రవారం సాయంత్రం జమ్మూలోని భగవతి నగర్ నుంచి బాల్టాల్, నున్వాన్ బేస్ క్యాంపులకు 4,603 మంది యాత్రికులు చేరుకోవడం తెల్సిందే. శనివారం ఉదయం వీరు బేస్ క్యాంపుల నుంచి 3,880 మీటర్ల ఎత్తులో ఉన్న ఆలయాన్ని దర్శించుకునేందుకు బయలుదేరారు. అనంత్‌నాగ్ జిల్లాలోని 48 కిలోమీటర్ల నున్వాన్-పహల్గాం సంప్రదాయ మార్గం ఒకటి కాగా, గందేర్‌బల్‌లోని ఇరుకైన 14 కిలోమీటర్ల బాల్టాల్ మార్గం మరోటి. ఈ రెండు మార్గాల గుండా సాగే యాత్రను సీనియర్ అధికారులు జెండా ఊపి ప్రారంభించారు. శనివారం మధ్యాహ్నానికల్లా యాత్రికులు కశ్మీర్ లోయకు చేరుకున్నారు. అక్కడ వీరికి అధికారులు, స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు.

సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
ఆదివారం । 30 । జూన్ । 2024

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ



కేన్సర్‌పై అవగాహన పెంపొందించే దిశగా చెన్నై, కావేరి ఆసుపత్రి నేతృత్వంలో టీసీఎస్ ఉద్యోగులు 5 వేల మందితో ప్రతిజ్ఞ, రన్ కార్యక్రమం శనివారం జరిగింది. టీసీఎస్ ఉపాధ్యక్షుడు సురేష్ రామన్, కావేరి గ్రూప్ ఈడీ అరవింద్ సెల్వరాజ్, డాక్టర్లు మహేశ్‌కుమార్, శివరామన్ కన్నన్, కె.మహాలక్ష్మి, సుజయ్ సుశికర్, సురేష్ కుమార్, అశ్విన్, కిషోర్ తదితరులు ఈ అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు.

- సాక్షి, చెన్నై

గెలుస్తాం.. గెలుస్తూనే ఉంటాం!

'గెలుస్తాం..గెలుస్తూనే ఉందాం.. ఉంటాం!' ఇదే ద్రవిడ మోడల్ పాలన లక్ష్యం అని అసెంబ్లీ వేదికగా సీఎం ఎంకే స్టాలిన్ వ్యాఖ్యానించారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లోనూ భారీ విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. హోంశాఖను బలోపేతం చేయడం కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తామన్నారు. పది రోజుల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాలు శనివారంతో ముగిశాయి.

- 2026 అసెంబ్లీ ఎన్నికల్లోనూ భారీ విజయం తథ్యం
- అసెంబ్లీ వేదికగా సీఎం స్టాలిన్ వ్యాఖ్యలు
- హోంశాఖ బలోపేతానికి కార్యాచరణ
- ముగిసిన సభాపర్వం



అసెంబ్లీలో ప్రసంగిస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై : అసెంబ్లీ సమావేశాల్లో చివరి రోజైన శనివారం ఉదయం ప్రశ్నోత్తరాల అనంతరం సీఎం స్టాలిన్ తన పరిధిలోని హోంశాఖలోని పోలీసులు, అగ్నిమాపక తదితర విభాగాలకు 2024–25 సంవత్సరానికి గాను నిధుల కేటాయింపునకు సంబంధించిన నివేదికను సభలో దాఖలు చేశారు. ఇందులో సభలో చివరిరోజు ప్రసంగం చేశారు. ×40కు 40₹ కైవసంతో దక్కిన విజయ ధరహాసంతో ఇక్కడ నిలబడి మాట్లాడుతున్నట్లు పేర్కొన్నారు. దివంగత నేత కలైంజ్ఞర్ కరుణానిధి శత జయంతి ఉత్సవాల ముగింపు వేడుకను ఎన్నికల కోడ్ కారణంగా నిర్వహించలేని పరిస్థితి ఎదురైనట్టు గుర్తు చేశారు. ద్రవిడ మోడల్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఆరోపణలు, విమర్శలు చేసినా, ప్రజలు తమపై విశ్వాసం చూపించారని పేర్కొన్నారు. తాను బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రోజూ ఎన్నో ప్రాజెక్టుల అమలు కోసం నిత్యం పడ్డ శ్రమను ప్రజలు గుర్తించారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో తనకు ఓటేసినా, ఓటు వేయని ప్రజలకు సైతం మూడు సంవత్సరాలు ఎలాంటి వివక్ష లేకుండా పథకాలను దరి చేర్చినందుకు ప్రతిఫలం లోక్‌సభ ఎన్నికల ఫలితాల రూపంలో దక్కిందన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లోనూ భారీ విజయంతో మళ్లీ అధికారంలోకి వస్తామన్న ధీమా తనలో మరింత రెట్టింపైనట్లు వివరించారు. ఇది తాను గర్వంతో చెప్పడం లేదని, ద్రవిడ మోడల్ ప్రభుత్వంపై ప్రజలలో పెరిగిన నమ్మకం ఆధారంగా వ్యాఖ్యలు చేస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గాల వారీగా పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను చూస్తుంటే డీఎంకే కూటమి 221 అసెంబ్లీ స్థానాలలో విజయ ఢంకా మోగించడం ఖాయమనే విషయం స్పష్టమవుతోందన్నారు.

ప్రతిపక్షం తీరు ఆవేదన కలిగిస్తోంది..

ప్రధాన ప్రతి పక్షం అన్నాడీఎంకే అసెంబ్లీలో వ్యవహరించిన తీరు వేదన కలిగిస్తోందని సీఎం స్టాలిన్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ఓటమిని కప్పిపుచ్చుకునేందుకు, పార్టీలోని అంతర్గత కుమ్ములాట విశ్వరూపం దాల్చకుండా కల్తీ సారా అంశాన్ని అన్నాడీఎంకే అస్త్రంగా చేసుకుని సభలో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. కల్తీ సారా ఘటన సమాచారంతో తన ప్రభుత్వం తక్షణం స్పందించిందని, విచారణకు బృందాలు రంగంలోకి దిగాయని, పలువురు అధికారులపై చర్యలు తీసుకున్నామని, ఉన్నతాధికారులు, మంత్రులు కళ్లకురిచ్చిలో తిష్ట వేసి పరిస్థితిని సమీక్షిస్తూ వచ్చారని, బాధితులను ఆదుకోవడం జరిగిందని వివరించారు. రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి గోకుల్ దాస్ నేతృత్వంలో కమిటీ విచారణను వేగవంతం చేసిందన్నారు. అన్ని పనులు సకాలంలో పూర్తి చేశామని, అసెంబ్లీలో కూర్చుని చర్చించాల్సిన ఇతర అంశాల మీద కాకుండా కేవలం కల్తీ సారా అంశంతో రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నాన్ని అన్నాడీఎంకే సభ్యులు చేశారని ధ్వజమెత్తారు. అసెంబ్లీకి వచ్చి తమను ప్రశ్నించి ఉంటే, మరింతగా సమాధానాలు ఇచ్చేందుకు సైతం సిద్ధంగా ఉన్నామని, అయితే అసెంబ్లీకి రాకూడదని ముందుగానే నిర్ణయించుకుని పదేపదే వివాదాలు, గందరగోళం సృష్టించి వారు వ్యవహరించిన తీరు తనకు వేదన కలిగించిందన్నారు.

వంద ప్రకటనల్లో కొన్ని

ఏర్కాడ్‌లో కొత్త ట్రాఫిక్ పోలీసుస్టేషన్, మంగళం పుదూర్, తిరుప్పరగుండ్రంలలో కొత్త పోలీసు స్టేషన్ ఏర్పాటు చేస్తామని అసెంబ్లీలో సీఎం ప్రకటించారు. పేర్నంబట్టులోని పోలీసుస్టేషన్‌ను మరోచోటికి మార్చే విషయంగా పరిశీలిస్తామన్నారు. చెన్నైలోని కొళత్తూరు, కేలంబాక్కం,రెడ్ హిల్స్‌లలో మహిళా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. తాంబరం పోలీసులు కమిషనరేట్ కోసం కొత్త భవనం నిర్మిస్తామని ప్రకటించారు. కోయంబత్తూర్ – పొల్లాచ్చి, తిరుపూర్ – నల్లూరులో పోలీస్ క్వార్టర్స్ నిర్మిస్తామన్నారు. కోయంబత్తూర్‌ను ప్రమాద రహిత నగరంగా మార్చేందుకు రూ. 5 కోట్లతో ప్రత్యేక కార్యాచరణ, తంజావూరు రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీకి రూ. 5.21 కోట్లతో, అగ్నిమాపక రెస్క్యూ ఆపరేషన్లలో పాల్గొనే 1,500 మందికి వ్యక్తిగత రక్షణ సూట్‌లు, అలాగే ఇతర సిబ్బంది కోసం చిన్న పరికరాలతో 3,000 రెస్క్యూ సూట్‌లు రూ. 4.50 కోట్లతో కొనుగోలు చేయనున్నామన్నారు. అరెల్, కరుమత్తంపట్టి, మడతికులం, కోవలం, పడప్పై, తిరునెల్వేలి సిటీ, పుదువాయల్ సహా 7 ప్రదేశాలలో కొత్త అగ్నిమాపక, రెస్క్యూ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నామని ప్రకటించారు. సమయపురం, మేడవాక్కం, పెరంబలూరు, త్యాగదురగ, నీడమంగళం, కొలత్తూరు 6 అగ్నిమాపక రెస్క్యూ స్టేషన్లకు కొత్త భవనాలను నిర్మిస్తామని ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగుల కోసం కొత్త ఆరోగ్య బీమా పథకం, ప్రభుత్వ ఉద్యోగులపై ఆధారపడిన తల్లిదండ్రులకు కూడా ఈ పథకంలో లబ్ధి చేకూరుస్తామన్నారు. ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తూ, బాధ్యతతో ముందుకెళ్లనే తమ లక్ష్యంతో గెలుపు తథ్యమని, గెలుస్తాం, గెలుస్తూనే ఉందాం, గెలుస్తూనే ఉంటాం అని ప్రకటించి సభలో ప్రసంగాన్ని ముగించారు. చివరి రోజు సాయంత్రం పలు ముసాయిదాలకు ఆమోదం తెలిపిన అనంతరం సభను స్పీకర్ అప్పావు వాయిదా వేశారు. ముందుగా తమిళనాడు ప్రభుత్వ స్టాఫ్ సెలక్షన్ కమిషన్, అగ్రికల్చర్ ఆఫీసర్, హార్టికల్చర్ ఆఫీసర్ పోస్టులకు ఎంపిక చేసిన 133 మందికి సీఎం స్టాలిన్ ఉద్యోగ నియామక ఉత్తర్వులను సచివాలయం ఆవరణలో అందజేశారు.



హోంశాఖకు సంబంధించిన బడ్జెట్ నివేదిక సమర్పణకు ముందు సీఎం స్టాలిన్‌ను కలిసి శుభాకాంక్షలు చెబుతున్న పోలీసు అధికారులు



అభ్యర్థులకు ఉద్యోగ నియామక ఉత్తర్వులను అందజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

అసెంబ్లీకి కొడనాడు కేసు

దివంగత సీఎం జయలలితకు చెందిన కొడనాడు ఎస్టేట్‌లో జరిగిన హత్య, దోపిడీ ఘటనల విచారణ ప్రస్తావనను అసెంబ్లీకి సీఎం స్టాలిన్ తీసుకొచ్చారు. ఈకేసులో 268 మంది సాక్షులను విచారించడం జరిగిందన్నారు. 8 సెల్‌ఫోన్లు, 4 సిమ్ కార్డులను సీజ్ చేశారని గుర్తు చేస్తూ, వీటిని పరిశీలించగా, కొందరికి విదేశీ ఫోన్ కాల్స్ సైతం వచ్చి ఉండడం మరింత అనుమానాలు కలిగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్‌పోల్ సాయంతో దర్యాప్తు చేయాల్సిన అవశ్యం ఈ కేసులో ఏర్పడిందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో తమిళనాడు ప్రభుత్వం సామరస్యం లేకుండా కఠినంగానే ముందుకెళ్తున్నదని, నేరాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా సరే ఉపేక్షించకుండా అరెస్టు చేసి కటకటాలలోకి పోలీసులు నెడుతున్నారన్నారు. భవిష్యత్తులో నేరాల కట్టడికి మరిన్ని చర్యలు విస్తృతం చేయనున్నామన్నారు. తమిళనాడు ప్రస్తుతం భారతదేశంలో అగ్రగామి రాష్ట్రంగా ఎదుగుతోందని, పారిశ్రామిక, విద్యా అభివృద్ధిలో, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇండెక్స్ అంటూ ఏ కేటగిరీని తీసుకున్నా తమిళనాడు ముందంజలో దూసుకెళుతోందన్నారు.

న్యూస్‌రీల్

ఆంధ్రాకు తరలిస్తున్న 11 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

అన్నానగర్: తమిళనాడు అందజేస్తున్న రేషన్ బియ్యం తదితర నిత్యావసర సరుకులను అక్రమ రవాణా చేయకుండా పౌరసరఫరాల నేర పరిశోధన విభాగం అధికారులు ముమ్మరంగా విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో శనివారం పుళల్ సిగ్నల్ దగ్గర రహస్యంగా నిఘా పెట్టారు. అనంతరం అటు వస్తున్న మినీ వ్యాన్‌ను అడ్డగించి సోదాలు చేశారు. అందులో 8 టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్లు తేలింది. చెన్నై నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు యత్నించినట్లు విచారణలో గుర్తించారు. పోలీసులు చెన్నైలోని మూలకడైకి చెందిన వసంత్, మారియప్పన్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు. అదేవిధంగా రెడ్‌హిల్స్ టోల్‌గేట్ సమీపంలో ఆంధ్రప్రదేశ్‌కు అక్రమంగా తరలించేందుకు యత్నిస్తున్న 3 టన్నుల రేషన్ బియ్యాన్ని కూడా పోలీసులు సీజ్ చేశారు.

రూ.5 కోట్ల మోసం కేసులో నిందితుడి అరెస్టు

అన్నానగర్: పలు వెబ్‌సైట్ల ద్వారా రూ.5 కోట్లను మోసం చేసిన వ్యక్తి పై తెలంగాణ సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో దినేష్ (36) హస్తం ఉన్నట్లు తేలింది. నిందితుడు మధురవాయల్‌లో తలదాచుకున్నట్లు తెలియడంతో సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నగేష్ నేతృత్వంలో ప్రత్యేక బలగాలు శనివారం మధురవాయల్‌కు చేరుకున్నాయి. అక్కడ ఇన్‌స్పెక్టర్ భూపతిరాజ్, పోలీసుల సహాయంతో మధురవాయల్, పల్లవన్ నగర్‌లో ఓ ఇంటి లోపల దాక్కున్న దినేష్‌ని అరెస్టు చేశారు. తర్వాత అతడిని పూందమల్లి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు అనుమతితో రాత్రి తెలంగాణకు ఆ రాష్ట్ర సైబర్ క్రైమ్ పోలీసులు తరలించారు.

తెప్పకాడు శిబిరంలో గున్న ఏనుగు మృతి



గున్న ఏనుగు కళేబరం

అన్నానగర్: కోయంబత్తూరులోని మరుదమలై అటవీ ప్రాంతంలో తల్లి ఏనుగు నుంచి విడిపోయిన గున్న ఏనుగు ఇటీవల కొంతకాలంగా మరో గుంపుతో కలసి అడవిలో సంచరించేది. అటవీశాఖ అధికారులు ఏనుగు పిల్లను రక్షించి తల్లి ఏనుగులో చేర్చేందుకు యత్నించారు. అటవీశాఖ ప్రయత్నాలు విఫలం కావడంతో జూన్ 9న ఉత్తగై ముదుమలై టైగర్ రిజర్వ్ పరిధిలోని తెప్పకాడు పెంపకం శిబిరానికి ఏనుగు పిల్లను తీసుకెళ్లి సంరక్షణ చేపట్టారు. ఈ నేపథ్యంలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి ఏనుగు పిల్ల మృతి చెందినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. శనివారం ఉదయం శవపరీక్ష నిర్వహించి అంత్యక్రియలు నిర్వహించారు.

తమిళిసైకు పదవి దక్కేనా?



అమిత్ షాతో తమిళిసై భేటీ

సాక్షి, చెన్నై : మాజీ గవర్నర్ తమిళిసైకు పార్టీ పరంగా పదవి దక్కనున్నట్లు చర్చ ఊపందుకుంది. అదే సమయంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో ఢిల్లీలో ఆమె భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. వివరాలు.. లోక్‌సభ ఎన్నికల ముందు వరకు ఓ వైపు తెలంగాణ గవర్నర్‌గా, మరోవైపు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా తమిళి సై సౌందరరాజన్ అధికార చక్రం తిప్పిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికలలో పోటీ చేయడం కోసం ఆ పదవులకు రాజీనామా చేశారు. దక్షిణ చెన్నై నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయితే ఓటమి గురించి తాజాగా తమిళి సై చేస్తూ వచ్చిన వ్యాఖ్యలు బీజేపీలో చిచ్చు రగిల్చాయి. అన్నాడీఎంకే దూరం కావడం వంటి పరిణామాలను గుర్తు చేస్తూ, పార్టీ అధ్యక్షుడు అన్నామలైను పరోక్షంగా ఆమె టార్గెట్ చేయడం బీజేపీ రాజకీయాలను రచ్చకెక్కాలా చేశాయి. ఈ పరిణామాలు తమిళనాడు బీజేపీ వివాదాలను ఢిల్లీకి చేర్చినట్టు సంకేతాలు వెలువడ్డాయి. దీనిని తీవ్రంగా పరిగణించిన అమిత్ షా తమిళి సైపై ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు సీఎంగా ప్రమాణ స్వీకారం సమయంలో ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నట్టుగా వీడియో వైరల్ కావడం చర్చకు దారి తీసింది. ఈ పరిణామాల నేపథ్యంలో తమిళి సై ఢిల్లీ వెళ్లి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు వివరణ ఇచ్చుకున్నట్టు తెలిసింది. శుక్రవారం అమిత్ షాతో ఆమె సమావేశమైనట్టుగా సంకేతాలు వచ్చాయి. ఇందుకు అనుగుణంగా ఆమె తన సామాజిక మాధ్యమం పేజీలో అమిత్‌షాతో భేటీ ఫొటోను విడుదల చేశారు. అమిత్ షా ప్రసన్నంతో తమిళిసై పార్టీ పరంగా పదవి దక్కించుకోబోతున్నట్లుగా తమిళనాట చర్చ జోరందుకుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఆరు నెలల పాటు లండన్‌కు వెళ్లనున్నట్లు తెలిసింది. ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ నుంచి అన్నామలైకు బీజేపీ ప్రతినిధిగా ఆహ్వానం వచ్చినట్టు, ఈ కార్యక్రమానికి ఆయన వెళ్లగానే ఇక్కడి పార్టీ వ్యవహారాలను తమిళిసై పర్యవేక్షించవచ్చు అనే చర్చ జోరందుకుంది.

ఎక్సైజ్ చట్టంలో కీలక మార్పులు

- నిందితులకు ఇకపై యావజ్జీవ శిక్ష, రూ.10 లక్షల జరిమానా
- వ్యాపారుల ఆస్తుల సీజ్‌కు చర్యలు
- అసెంబ్లీలో తీర్మానం ఆమోదం



అసెంబ్లీలో మంత్రి ముత్తుస్వామి ప్రసంగం

సాక్షి, చెన్నై: సారా రక్కసిని కట్టడి చేయడమే లక్ష్యంగా విక్రయ దారులపై కొరడా ఝుళిపించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఎక్సైజ్ చట్టంలో పలు మార్పులు చేశారు. పట్టుబడే సారా వ్యాపారులు, విక్రయ దారులకు ఇకపై యావజ్జీవ శిక్షను అమలు చేయనున్నారు. వివరాలు.. కళ్లకురిచ్చి సారా రక్కసి వ్యవహారం తమిళనాడులోనే కాదు, దేశ వ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటన జరిగి పదిరోజులకు పైగా అవుతోంది. ఈ ఘటనలో అధికారిక లెక్కల మేరకు 65 మంది మరణించారు. ఆస్పత్రుల నంచి 145 మంది డిశ్చార్జ్ అయ్యారు. మరో 19 మంది చికిత్సలో ఉన్నారు. వీరిలో పలువురు ఇంకా ఐసీయూలోనే ఉండడంతో మరణాల సంఖ్య పెరిగే అవకాశం అధికంగా ఉంది. ఈకేసును తీవ్రంగా పరిగణించిన సీబీసీఐడీ విచారణను వేగవంతం చేసింది. 11 మందిని అరెస్టు చేసింది. వీరి వెనుక ఉన్న వారిని గుర్తించే పనిలో ప్రత్యేక బృందాలు నిమగ్నమయ్యాయి. ఈ సారా రక్కసి ఘటన డీఎంకే ప్రభుత్వానికి ఒక మాయని మచ్చగా మారింది. ఈ మచ్చను చెరుపుకునే విధంగా పాలకులు విశ్వ ప్రయత్నాలు చేస్తూ వస్తున్నారు. ఈ పరిస్థితులలో ఇకపై సారా అనే మాట తమిళనాట వినిపించకుండా శిక్షలను కఠినతరం చేయడానికి చర్యలు తీసుకున్నారు.

అసెంబ్లీ ఆమోదం

ప్రస్తుతం ఉన్న శిక్షలు, చట్టాలలోని లొసుగులను అస్త్రంగా చేసుకుని సారా విక్రయదారులు తప్పించుకుంటూ రావడాన్ని పాలకులు పరిగణించారు. సారా తయారీ చేస్తూ పట్టుబడే వారే మళ్లీ మళ్లీ పోలీసులకు చిక్కుతున్నారు. అరెస్టు చేసి కటకటాలలోకి నెట్టినా ఈ వ్యాపారులు, విక్రయదారులు తమ పని తమది అన్నట్లుగా సారా విక్రయాలలో కొనసాగడాన్ని తీవ్రంగా పరిగణించి చట్టాలను మరింత పటిష్టం చేసే విధంగా అసెంబ్లీలో శనివారం ఎక్సైజ్ శాఖ మంత్రి ముత్తుస్వామి చట్ట సవరణ ముసాయిదాను ప్రవేశ పెట్టారు. సారా, కల్తీసారా విక్రయాలకు పాల్పడే వారికి శిక్షను కఠినం చేస్తూ ఇక, యావజ్జీవ కారాగార శిక్ష అమలు చేసే విధంగా చట్టంలో సవరణలు చేశారు. అలాగే పట్టుబడే వారికి శిక్షతోపాటుగా రూ. పది లక్షల జరిమానా విధింపు, వారి ఆస్తుల జప్తునకు సంబంధించి చట్టంలో అంశాలను పేర్కొన్నారు. అలాగే నిందితుల బెయిల్ రద్దు, బెయిల్ మీద బయటకు వచ్చే వ్యవహారాల మీద దృష్టిపెట్టే విధంగా అడ్మిన్ అధికారి ఒకరిని పర్యవేక్షణకు నియమించేందుకు నిర్ణయించారు. ఈ చట్టం అసెంబ్లీ ఆమోదం పొందినట్టు స్పీకర్ అప్పావు ప్రకటించారు.

ఇంటింటా బూత్ స్లిప్పుల పంపిణీ

- జూలై ఒకటి నుంచి పోస్టల్ ఓట్ల నమోదు



బూత్ స్లిప్పులను పంపిణీ చేస్తున్న కలెక్టర్ పళని

సాక్షి, చెన్నై: విక్రవాండి ఉప ఎన్నికల ఏర్పాట్లను ఎన్నికల యంత్రాంగం వేగవంతం చేసింది. ఇంటింటా బూత్ స్లిప్పుల పంపిణీకి శనివారం శ్రీకారం చుట్టారు. జూలై ఒకటో తేదీ నుంచి తపాల్ ఓట్ల నమోదుకు నిర్ణయించారు. డీఎంకే ఎమ్మెల్యే పుగలేంది మరణంతో ఖాళీగా ఉన్న విల్లుపురం జిల్లా విక్రవాండి నియోజకవర్గానికి జూలై 10వ తేదీన ఉప ఎన్నిక జరగనున్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికలలో డీఎంకే, పీఎంకే, నామ్ తమిళర్ కట్చితోపాటు 29 మంది పోటీలో ఉన్నారు. అభ్యర్థులు తీవ్ర ఓట్ల వేటలో దూసుకెళ్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి పెట్టిన అధికారులు ఈవీఎంలలో ఆయా పార్టీల చిహ్నాలు, అభ్యర్థుల పేర్లను పొందుపరిచే పనులు వేగవంతం చేశారు. ఎన్నికల విధులకు అవసరమయ్యే అన్నిరకాల సామాగ్రిని సిద్ధం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో శనివారం నుంచి ఓటర్లకు బూత్ స్లిప్పుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఇంటింటా సిబ్బంది వెళ్లి బూత్ స్లిప్పులను అందజేస్తున్నారు. ఈ పనులను విల్లుపురం కలెక్టర్ పళని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి పర్యవేక్షిస్తున్నారు. 85 ఏళ్లకు పైబడిన వారు, దివ్యాంగులు, ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది వద్ద తపాల్‌ఓట్ల నమోదుకు చర్యలు చేపట్టారు. జూలై 1 నుంచి 4వ తేదీ వరకు ఓట్ల నమోదు ఉంటుంది. ఇందుకోసం ప్రత్యేక మొబైల్ బృందాలను రంగంలోకి దించారు.

రంగన్నపై బీజేపీ గుర్రు



రంగస్వామి

సాక్షి, చెన్నై : పుదుచ్చేరి రాజకీయం మళ్లీ వేడెక్కింది. సీఎం రంగస్వామిపై బీజేపీ ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టుగా మరోమారు స్పష్టమైంది. ఈసారి ఏకంగా బీజేపీ ఎమ్మెల్యేలు లెఫ్టినెంట్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కలిసి పాలకుల తీరుపై శనివారం వినతిపత్రం రూపంలో ఫిర్యాదు చేయడం చర్చకు దారి తీసింది. వివరాలు.. కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో బీజేపీ – ఎన్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న విషయం తెలిసిందే. సీఎంగా ఎన్ఆర్ కాంగ్రెస్ నేత రంగస్వామి, హోంశాఖ మంత్రిగా బీజేపీ నేత నమశ్శివాయం వ్యవహరిస్తున్నారు. ఇదేవిధంగా రెండు పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు పలువురు మంత్రులుగా ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల ద్వారా తొలిసారిగా పుదుచ్చేరి నుంచి పార్లమెంట్‌లో తమ ప్రతినిధి అడుగు పెట్టాలనే కాంక్షతో బీజేపీ అధిష్టానం వ్యూహాలకు పదును పెట్టి విఫలమైంది. అభ్యర్థిగా హోంశాఖ మంత్రి నమశ్శివాయం పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి వైద్యలింగం చేతిలో లక్షా 30 వేల ఓట్ల మెజారిటీతో ఓటమి చవిచూశారు.ఈ పరిణామాలతో పుదుచ్చేరిలో బీజేపీ ఎమ్మెల్యేలు, ఎన్ఆర్ కాంగ్రెస్ మధ్య అగాధం క్రమంగా పెరుగుతూ వస్తోంది. సిట్టింగ్ ఎన్ఆర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు రావడంపై ఇప్పటికే పెద్ద చర్చ జరుగుతోంది. అదే సమయంలో అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతున్నా, తమకు ఇంత వరకు నామినేటెడ్ పోస్టులను కేటాయించక పోవడం గుర్రుగా ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యేలు పలువురు పనిగట్టుకుని బీజేపీని ఓడించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పరిస్థితులలో బీజేపీ ఎమ్మెల్యేలు శనివారం రాజ్‌నివాస్‌కు వెళ్లడం చర్చకు దారి తీసింది.

వినతి పత్రంతో ఫిర్యాదు

బీజేపీ ఎమ్మెల్యే కల్యాణసుందరం నేతృత్వంలో పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు జాన్‌కుమార్, రిచర్డ్ జాన్‌కుమార్, బీజేపీ మద్దతు స్వతంత్ర ఎమ్మెల్యేలు శివశంకర్, అంగాలన్, నామినేటెడ్ ఎమ్మెల్యేలు వెంకటేషన్, అశోక్ బాబు ఉదయాన్నే రాజ్‌నివాస్‌కు వెళ్లారు. గవర్నర్‌ను కలిసి ఓ వినతిపత్రం సమర్పించారు. ఇది వినతి పత్రమే అయినా, ఇందులో బీజేపీ ఎమ్మెల్యేలు పలు ఆరోపణలు చేయడం గమనార్హం. పుదుచ్చేరిలో అధికారులు తీరును వివరిస్తూ, లంచాలకు మరిగి అవినీతి ఊబిలో కూరుకు పోయి ఉన్నారని ఆరోపించారు. వీరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రెస్టో బార్లను నియోజకవర్గ ఎమ్మెల్యేలను సంప్రదించకుండా ఇష్టాను సారంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తూ వెళ్తోందని, ఈ కారణంగా ప్రజల నుంచి తమకు తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలకు కేటాయించాల్సిన నామినేటెడ్ పోస్టులను ఇంత వరకు అప్పగించలేదని ఆరోపించారు. ఈ వినతిపత్రం అందుకున్న గవర్నర్ సంబంధిత అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని బీజేపీ ఎమ్మెల్యేలకు హామీ ఇచ్చి పంపించారు. ఎమ్మెల్యేల ఆరోపణలపై సీఎంతో చర్చించేందుకు గవర్నర్ నిర్ణయించినట్టు సమాచారం రావడంతో పుదుచ్చేరి రాజకీయాలు మళ్లీ వేడెక్కినట్లయ్యింది.

బాణసంచా పేలుడుతో బతుకు బుగ్గి

- నలుగురు మృతి
- మూడు గదులు నేలమట్టం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

సాక్షి, చెన్నై: బాణసంచా పేలుడుతో కార్మికుల బతుకు శనివారం ఉదయాన్నే బుగ్గి అయ్యింది. మూడు గదులు నేలమట్టం కావడంతో నలుగురు కార్మికుల శరీరాలు ఛిద్రమయ్యాయి. సాత్తూరు సమీపంలోని బాణసంచా కర్మాగారంలో ఈ పేలుడు చోటు చేసుకుంది. వివరాలు.. విరుదునగర్ జిల్లా శివకాశి, సాత్తూరు డివిజన్‌లోని గ్రామాలు బాణసంచా తయారీలో అగ్రగామిగా ఉన్న విషయం తెలిసిందే. ఈ మినీ జపాన్‌గా పిలిచే ఈ పరిసరాలలోని బాణసంచా పరిశ్రమలే ప్రజలకు బతుకు దెరువు. ఇక్కడి కార్మికులు దినదిన గండంగా బతుకు జీవనం సాగిస్తున్నారు. ఎప్పుడు ఎక్కడ ఎలాంటి ప్రమాదం జరుగుతుందో అనే ఆందోళన నిత్యం ఇక్కడి ప్రజలను వెంటాడుతూ వస్తోంది. ఇక్కడ తరచూ జరుగుతున్న బాణసంచా ప్రమాదాలతో ఎన్నో కుటుంబాలు కన్నీటి సాగరంలో మునిగాయి. ఈ ఏడాదిలో ఇప్పటికే ఇక్కడ ఆరు ప్రమాదాలు జరిగాయి. ఏడవ ప్రమాదం శనివారం చోటు చేసుకుంది.

సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి

విరుదునగర్ జిల్లా సాత్తూరు సమీపంలోని బంధువారి పట్టి గ్రామంలో సహదేవన్ అనే వ్యక్తికి చెందిన బాణసంచా పరిశ్రమ ఉంది. ఇక్కడ 30 గదులు వరకు ఉన్నాయి. రోజూ 120 మంది కార్మికులు ఇక్కడ పనుల్లో ఉంటారు. ఈ పరిస్థితుల్లో శనివారం ఉదయం ఇక్కడ రసాయనాల మిశ్రమ సమయంలో పేలుడు సంభవించింది. అయితే అదృష్టవశాత్తు కార్మికులు పూర్తిస్థాయిలో విధులకు హాజరు కాని సమయంలో ఈ పేలుడు చోటు చేసుకుంది. ఉదయం 8 గంటల సమయంలో కొందరు కార్మికులు విధులకు వచ్చి రసాయనాల మిశ్రమాల మీద దృష్టి పెట్టారు. ఈ సమయంలో హఠాత్తుగా ఓగదిలో పేలుడు జరిగింది. ఈ గదికి ఆనుకుని ఉన్నమరో రెండు గదులు సైతం పేలుడు దాడికి నేలమట్టమయ్యాయి. భారీ శబ్దం రావడంతో విధులకు వస్తున్న కార్మికులు, ఆ పరిసర వాసులు ఉలిక్కిపడ్డారు. బాణసంచాల మోత మోగడంతో దారిదాపులలోకి వెళ్లేందుకు భయపడ్డారు. సమాచారం అందుకున్నఅగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కుప్పకూలిన గదుల శిథిలాల కింద ఛిద్రమైపడి ఉన్న ముగ్గురి మృతదేహాలను బయటకు తీశారు. ఈ పేలుడు దాడికి ఆ భవన శిథిలాల రాయి తగిలిన పరిస్థితుల్లో ఆ గదికి సమీపంలో మరో కార్మికుడి మృతదేహాన్ని గుర్తించారు. మరణించిన వారు నడుమరాంకుడి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ (45), వెంబకోట్టై ప్రాంతానికి చెందిన మారిస్వామి (40), సెల్వకుమార్ (35), మోహన్ (30)గా గుర్తించారు. సమాచారం అందుకున్న విరుదునగర్ కలెక్టర్ జయశీలన్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ ప్రమాద ఘటనపై సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తనప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుల కుటుంబాలకు తలా రూ. 3 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఇదిలా ఉండగా ఈ ఘటనలో మరణించిన మోహన్‌తో పాటు మరొకరు ఈ పరిశ్రమలో పనిలో చేరిన తొలిరోజే మరణించడం ఆ కుటుంబాలను విషాదంలోకి నెట్టింది. తాను తీసుకున్న రూ. 10వేలు అప్పు చెల్లించడం కోసమే బాణసంచా పరిశ్రమలో పనికి మోహన్ చేరినట్లు తేలింది.

డాక్టర్ కారులో రూ.కోటి స్వాధీనం

అన్నానగర్: విక్రవాండి ఉప ఎన్నికల సందర్భంగా వాహన తనిఖీల్లో శనివారం డాక్టర్ కారులో రూ.కోటి నగదుని ఫ్లయింగ్ స్క్వాడ్ స్వాధీనం చేసుకుంది. విక్రవాండి అసెంబ్లీ నియోజకవర్గానికి ఉప ఎన్నిక వచ్చే నెల (జూలై) 10వ తేదీన జరగనుంది. ఎన్నికల సందర్భంగా ఓటర్లకు డబ్బు, బహుమతులు ఇచ్చి ఓట్లు రాబట్టేందుకు రాజకీయ పార్టీలు యత్నించకుండా ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ విల్లుపురం జిల్లావ్యాప్తంగా ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తోంది. ఆ విధంగా శనివారం విల్లుపురం జిల్లా సరిహద్దులోని పల్లవంతాంగల్ చెక్‌పోస్టు వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాల తనిఖీలో నిమగ్నమైంది. తిరువణ్ణామలై మార్గం నుంచి వస్తున్న ఓ కారును నిలిపి తనిఖీ చేయగా 2 సూట్ కేసుల్లో రూ.500 కట్టకట్టలను గుర్తించారు. విచారణలో అతడు ఈరోడ్‌కు చెందిన మదన గోపాల్ (48) అని, ప్రస్తుతం చెన్నైలో ఉంటూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్నాడని తేలింది. అతనికి, ఈ డబ్బు ఎలా వచ్చింది? అని అడిగారు. దానికి ఆయన మాట్లాడుతూ, తిరుచ్చిలో స్థానిక ఆస్తులున్నాయి. వాటిని అమ్మిన దాంట్లో అతని వాటా రూ.కోటి వచ్చింది. అది అందుకొని స్నేహితుడితో కలిసి కారులో చెన్నైకి తిరిగి వస్తున్నట్లు పేర్కొన్నాడు. అధికారులు ఈ విషయాన్ని విక్రవాండి నియోజకవర్గ ఎన్నికల అధికారి చంద్రశేఖర్‌కు సమాచారం అందించారు. ఐటీ శాఖకు సమాచారం అందించి, నగదును ట్రెజరీకి అప్పగించాలని ఆయన సూచించారు.

క్లుప్తంగా

తిరుచెందూర్‌లో ఒడ్డుకు చేరిన జెల్లీ ఫిష్



ఒడ్డుకు వచ్చిన జెల్లీ ఫిష్

అన్నానగర్: తిరుచెందూర్ టెంపుల్ బీచ్‌లో గత కొన్ని నెలల క్రితం భారీ సంఖ్యలో జెల్లీ ఫిష్‌లు ఒడ్డుకు చేరాయి. ఈనేపథ్యంలో శనివారం మళ్లీ జెల్లీఫిష్ ఒడ్డుకు కొట్టుకురావడంతో కలకలం రేగింది. భక్తులు సముద్రంలో పవిత్ర జలాన్ని జాగ్రత్తగా తీసుకెళ్లాలని ఆలయ నిర్వాహకులు లౌడ్ స్పీకర్‌ల ద్వారా సూచించారు.

పడవ నుంచి జారి పడి మత్స్యకారుడి మృతి

అన్నానగర్: పడవ నుంచి జారి సముద్రంలో పడి మత్స్యకారుడి మృతి చెందాడు. చెన్నైలోని బీసెంట్ నగర్ బైండింగ్ టెంపుల్ కుప్పానికి చెందిన మణి (52). మత్స్యకారుడైన ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత 22న పరంధామన్‌కు చెందిన బోటు లో మణి సహా ఐదుగురు మత్స్యకారులు కాశిమేడు నుంచి చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. 26వ తేదీన సముద్రంలో చేపల వేటకు వెళు తుండగా మణి కాలు జారి సముద్రంలో పడిపోయాడు. తోటి మత్స్యకారులు అతడిని వెలికి తీసేందుకు యత్నించారు. అయితే మణి సముద్రంలో మునిగిపోయాడు. మత్స్యకారులు అత ని మృతదేహాన్ని శనివారం కాశిమేడు రేవుకు తీ సుకొచ్చారు. కాశిమేడు ఫిషింగ్ పోర్ట్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం స్టాన్లీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో కోయంబత్తూరు డీఎస్పీ..

అన్నానగర్: కోయంబత్తూరు పేరూర్ డివిజన్ డీఎస్పీ శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. నీలగిరి జిల్లా కున్నూర్ ప్రాంతానికి చెందిన వెట్రిచెల్వన్ (56) కోయంబత్తూరు జిల్లా పేరూర్ ఊతుకోటలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా పని చేస్తున్నారు. పదేళ్లుగా కుటుంబంతో కలిసి సూలూరులో నివాసం ఉంటున్నాడు. ఈ స్థితిలో నెల రోజుల కిందట వెట్రిచెల్వన్‌కు ఛాతిలో నొప్పి వచ్చింది. ఆ తర్వాత అతని కుటుంబం వెట్రిచెల్వన్‌ని సూలూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ నెల పాటు చికిత్స పొందుతు వచ్చాడు. తర్వాత మెరుగైన చికిత్స కోసం మూడు రోజుల కిందట కోయంబత్తూరు బీలామేట్టులో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందు తున్న వెట్రిచెల్వన్ శనివారం ఉదయం గుండెపోటుతో మరణించాడు. ఇతనికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు.

243 జీఓను రద్దు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జాక్టో జియో సభ్యులు

వేలూరు: మహిళా టీచర్‌లపై ప్రభావం చూపే 243 జీఓను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని జాక్టో జియో నాయకులు వేలూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తమిళనాడు ప్రాథమిక విద్య ఉపాధ్యాయుల సంయుక్త కార్యాచరణ కమిటీ సమన్వయ కర్త సురేష్ మాట్లాడుతూ ప్రైమరీ, సెకండరీ పాఠశాలల్లో పనిచేస్తున్న 90 శాతానికి పైగా పదోన్నతులు లేకుండా చేసే 243 జీఓను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పలుమార్లు ఈ ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా పలు పోరాటాలు చేసినప్పటికీ ప్రభుత్వం వీటి గురించి పట్టించుకోక పోవడం సరి కాదన్నారు. అదేవిధంగా ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో టీచర్‌లకు, జాక్టో జియో ప్రతినిధులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని, టీచర్‌లు ఇబ్బంది పడే చట్టాలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నిలుపుదల చేయాలని, టీచర్‌లపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని తదితర డిమాండ్‌లు పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించకుంటే జాక్టో జియో ఆధ్వర్యంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామన్నారు. ఈ ధర్నాలో ఆ సంఘం ప్రతినిధులు గీత, రాజన్, శరవణన్, తమిళనాడు వృత్తి విద్యా ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జనార్దనన్, సుధాకర్, జిల్లా ఉన్నత స్థాయి కమిటీ సభ్యులు జోసెఫ్ అన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు

తిరువళ్లూరులో..

తిరువళ్లూరు: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతికి ఇబ్బంది కలిగించేలా ప్రభుత్వం జారీ చేసిన జీఓ 243ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ తమిళనాడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి కో–ఆర్డినేటర్లు లోకయ్య, రాజాజీ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా రాష్ట్ర కో–ఆర్డినేటర్ దాస్ హాజరై ప్రసంగించారు. ఉపాధ్యాయుల పదోన్నతి గతంలో యూనియన్, జిల్లా స్థాయి సీనియారిటీని ఆధారంగా కల్పించేవారని, అయితే విద్యాశాఖ నూతనంగా ఇచ్చిన జీఓ 243 ద్వారా మార్చడం తగదన్నారు. ఈ ఆందోళనలో సంఘం నేతలు భాస్కరన్, జాన్, కన్నదాసన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీప పూజ



దీప పూజ చేస్తున్న మహిళలు

కొరుక్కుపేట: 108 మంది ముత్తయిదువులు దీప పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చెన్నై టి.నగర్ హిందీ ప్రచార సభ రోడ్డులోని శ్రీ కృష్ణ స్వామి కల్యాణ మండపంలో శ్రీ భద్రాచల రామ కార్యక్రమం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వేదికపై భగవాన్ శ్రీ భద్రాచల రామ సీత, లక్ష్మణ స్వామివార్ల చిత్రాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. రామ నామ స్మరణతో 108 మంది మహిళలు దీప పూజను భక్తిశ్రద్ధలతో చేశారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

తిరువొత్తియూరు: విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడిన కేసులో అరెస్టయిన ఉపాధ్యాయుడిని విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. ధర్మపురి జిల్లా బొమ్మిడికి చెందిన శరవణన్ (48) ధర్మపురి అట్టుకారన్‌పట్టి పంచాయతీ యూనియన్ మిడిల్ స్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన ఓ బాలిక పాఠశాలలో చదువుతోంది. విద్యార్థిని ఇటీవల ధర్మపురిలోని ప్రభుత్వ పాఠశాలలో ప్లస్ 2 పూర్తి చేసింది. 3 రోజుల క్రితం ఉపాధ్యాయుడు శరవణన్ తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని విద్యార్థిని ధర్మపురి మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ఉపాధ్యాయుడు శరవణన్‌ను అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. ఈ కేసులో విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి ఉపాధ్యాయుడు శరవణన్‌ను సస్పెండ్ చేశారు.

పసికందు అనుమానాస్పద మృతి

అన్నానగర్: ఓ పసికందు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. కడలూరు జిల్లా దిట్టక్కుడి కొడికలం గ్రామానికి చెందిన శక్తివేల్, నందిని దంతపతులకు 6 ఏళ్ల కుమారుడు, నెల రోజుల కుమార్తె ఉన్నారు. శక్తివేల్ అండమాన్ దీవిలో పనిచేస్తుండగా, నందిని ప్రస్తుతం కొడికలాం గ్రామంలో ఒంటరిగా ఉంటోంది. ఈ స్థితిలో శనివారం నందిని తన ఇంటి ముందు ఉన్న గుమ్మంలో బిడ్డను పడుకోబెట్టి బాత్‌రూమ్‌కు వెళ్లి రాగా రెండు కుక్కలు నిలబడి ఉ న్నాయి. వెంటనే వాటిని తరిమికొట్టి చూడగా చి న్నారికి ఊపిరి ఆడకపోవడంతో వెంటనే పెన్నాడంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చిన్నారిని పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు తెలిపారు. ఆ తర్వాత చిన్నారిని ఇంటికి తీసుకెళ్లి హడావుడిగా అంత్యక్రియలకు ఏ ర్పాట్లు చేశారు. ఈ విషయం తెలుసుకున్న అవినంకుడి పోలీసులు చిన్నారి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చిన్నారి శరీరంపై పెద్దగా కుక్కకాట్లు లేవు. మరోవైపు చిన్నారి మెడకు తాడు బిగించి ఉన్నట్లు గుర్తు లు ఉండడం పలు అనుమానాలకు దారితీసింది. కుక్క కరిచి చిన్నారి చనిపోయిందా? లేక గొంతు నులిమి హత్య చేశారా? అని అవినంకుడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం చిన్నారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముండియంబాక్కం ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

వివాహిత ఆత్మహత్య

తిరువొత్తియూరు: వివాహేతర సంబంధం వ్యవహారంలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో భర్తను, ఆమె ప్రియుడిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై చాకలిపేట, సంజీవి రాయన్ కోయిల్ వీధికి చెందిన పేయింటర్ శరవణన్ (42). అతని భార్య విజయశాంతి (41) అదే ప్రాంతంలోని ప్రముఖ టెక్స్‌టైల్స్‌లో పని చేస్తున్నారు. ఈక్రమంలో శరవణన్ చెల్లెలు కుమారుడు మరో శరవణన్‌తో విజయశాంతికి వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం తెలియడంతో భర్త ఆమె తీరును ఖండించాడు. దీంతో విరక్తి చెందిన విజయశాంతి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. విజయ శాంతి భర్తను, ప్రియుడిని పోలీసులు అరెస్టు చేశారు.

సదస్సు ప్రారంభం



ఉన్నత విద్య నిమిత్తం అగ్రశ్రేణి ఐరీష్(ఐర్లాండ్) విశ్వవిద్యాలయాలలో చేరదలిచిన ఇక్కడి విద్యార్థుల కోసం ఎడ్యుకేషన్ హబ్ ప్రీ డిపార్చర్ సెషన్స్ సదస్సులకు శనివారం స్థానికంగా శ్రీకారం చుట్టారు. ఇందులో విద్యార్థులకు ఐర్లాండ్‌లోని నేషనల్ కాలేజ్ ఆఫ్ ఐర్లాండ్, డబ్లిన్ సిటీ యూనివర్సిటీ, టెక్నాలజిక్ యూనవర్సిటీతో సహా ప్రతిష్ఠాత్మకంగా ఉన్న అన్ని విశ్వవిద్యాలయాల సమగ్ర విద్యా సమాచారాలు, వీసా సంబంధిత అన్ని వివరాలను ఐరీస్ అధికారులు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వన్ స్టెప్ గ్లోబల్ వ్యవస్థాపకుడు అరిత్రా ఘోషల్, గ్రెగ్ వాన్ బస్కిర్క్ ఇంటర్నేషనల్ ఎక్స్‌పీరియన్స్ ఆఫీసర్ షానన్ గ్లోబల్, మేనూత్ వర్సిటీ అవుట్ వర్డ్ మొబిలిటీ ఆఫీసర్ ఎంజెలా మెకెన్నా తదితరులు పాల్గొన్నారు. - సాక్షి, చెన్నై

ఇది నా కుటుంబం లాంటిది



నేశిప్పాయా చిత్రం హీరోహీరోయిన్లు మురళిఆకాశ్, అదితి శంకర్‌తో నటి నయనతార

తమిళసినిమా: ఎక్స్‌బీ ఫిలిమ్ క్రియేటర్స్ పతాకంపై జేవియర్ బ్రిట్టో నిర్మిస్తున్న చిత్రం నేశిప్పాయా. ప్రముఖ దర్శకుడు విష్ణువర్ధన్ కథ, దర్శకత్వం బాధ్యతలను నిర్వహిస్తున్న ఈ చిత్రం ద్వారా దివంగత ప్రముఖ నటుడు మురళి రెండో వారసుడు ఆకాశ్ మురళి కథానాయకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో దర్శకుడు శంకర్ వారసురాలు అదితి శంకర్ నాయకిగా నటిస్తున్నారు. యువన్ శంకర్‌రాజా సంగీతం అందిస్తున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం చెన్నైలోని ఒక నక్షత్ర హోటల్‌లో నిర్వహించారు. నిర్మాత కలైపులి ఎస్.థాను, టీజీ. త్యాగరాజన్, కేఎస్.రవికుమార్, ఐసరిగణేశ్, అధర్వ, నటుడు రాజా, ఆర్య తదితర సినీ ప్రముఖులు అతిథులుగా పాల్గొన్న ఈ కార్యక్రమానికి నటి నయనతార ముఖ్య అతిథిగా విచ్చేయడం విశేషం. కాగా ఆమె కథానాయకుడు ఆకాశ్ మురళి ఫొటోతో కూడిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నయనతార మాట్లాడుతూ నేశిప్పాయా చిత్రం ద్వారా కథానాయకుడిగా పరిచయం అవుతున్న నటుడు ఆకాశ్‌మురళికి శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు. సాధారణంగా తాను ఇలాంటి కార్యక్రమాలకు హాజరుకానని, అయితే ఇది తనకు చాలా స్పెషల్ అని పేర్కొన్నారు. ఈ చిత్రం దర్శకుడు విష్ణువర్ధన్, తన స్నేహితురాలు అనుల వేడుక అని, దర్శకుడు విష్ణువర్ధన్ తనకు 15 ఏళ్లుగా తెలుసన్నారు. ఇది తన కుటుంబం లాంటిదన్నారు. అందుకే నో చెప్పలేకపోయానని చెప్పారు. విష్ణువర్ధన్ మంచి ప్రతిభావంతుడైన దర్శకుడు అని ఈయన నటుడు ఆకాశ్ మురళిని కథానాయకుడిగా పరిచయం చేయడం సంతోషం అని పేర్కొన్నారు. చాలా కాలం తరువాత ఒక స్వీట్ లవ్‌స్టోరీని చూడబోతున్నారని చెప్పారు. తనకు అదితి శంకర్ చాలా ఇష్టమైన నటి అని, చాలా ప్రతిభావంతురాలని అన్నారు. ఈ చిత్రం యూనిట్‌కు తన శుభాకాంక్షలు అని నయనతార పేర్కొన్నారు. హీరోగా పరిచయం అవుతున్న ఆకాశ్ మురళి మాట్లాడుతూ ఈ వేడుకకు విచ్చేసిన అందరికీ కృతజ్ఞతలు అన్నారు. ముఖ్యంగా తన సమయాన్ని కేటాయించి తనను పరిచయం చేయడానికి వచ్చిన నటి నయనతారకు ధన్యవాదాలు అన్నారు. కాగా షూటింగ్‌ను పూర్తి చేసుకున్న నేశిప్పాయా చిత్రం త్వరలో తెరపైకి రానుందని నిర్మాత తెలిపారు.

లారెన్స్, ఎస్‌జే.సూర్య, ఫహాద్ ఫాజిల్

కోలీవుడ్ టాక్స్



లారెన్స్‌కు విలన్లుగా ఆ ఇద్దరు!

తమిళసినిమా: ఇటీవల జిగర్తండా డబులెక్స్ చిత్రంతో సూపర్‌హిట్ కొట్టిన నటుడు రాఘవా లారెన్స్. ప్రస్తుతం వరుస చిత్రాలు చేస్తున్న ఈయన కథానాయుడిగా నటిస్తున్న తాజా చిత్రాల్లో ఒకటి బెంజ్. క్రేజీ దర్శకుడు లోకేష్ కనకరాజ్ కథను అందించి ఫాషన్ స్టూడియోస్ సంస్థతో కలిసి తన జీ స్క్వాడ్ బ్యానర్‌లో ఈ చిత్రాన్ని నిర్మించడం విశేషం. కాగా ఈ చిత్రానికి భాగ్యరాజ్ కన్నన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈయన ఇంతకు ముందు రెమో, సుల్తాన్ వంటి చిత్రాలను తెరకెక్కించారన్నది గమనార్హం. ఇకపోతే ఈ చిత్రంలో నటుడు ఎస్‌జే.సూర్య, ఫహాద్ ఫాజిల్ విలన్లుగా నటించనున్నారన్నది తాజా సమాచారం. కాగా ఇంతకు ముందు రాఘవలారెన్స్, ఎస్‌జే.సూర్య కలిసి జిగర్తండా డబులెక్స్ చిత్రంలో నటించారన్నది గమనార్హం. దీంతో బెంజ్ చిత్రంలో మరోసారి కలిసి నటించనున్నారన్నమాట. ఈ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న చిత్రం త్వరలోనే సెట్ పైకి వెళ్లనుంది. కాగా ఈ యాక్షన్ ఎంటర్‌టెయినర్‌గా తెరకెక్కనున్న దీనికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది.

పూజా కార్యక్రమాలతో యుఆర్ నెక్ట్స్



యుఆర్ నెక్ట్స్ చిత్ర యూనిట్

తమిళసినిమా: ఐమ్యాక్ ఫిలింస్ ప్రైవేట్ లిమిటెడ్, స్కై ఫ్రేమ్ ఎంటర్‌టెయిన్‌మెంట్ సంస్థల అధినేతలు మొహదీన్ అబ్దుల్ కాదర్, మణి సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం యుఆర్ నెక్ట్స్. షరీఫ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రం ఇటీవల చెన్నైలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. తమిళం, తెలుగు, మలయాళం, హిందీ తదితర నాలుగు భాషల్లో పాన్ ఇండియా చిత్రంగా రూపొందుతున్న ఇందులో దర్శకుడు కేఎస్.రవికుమార్, రచితా మహాలక్ష్మి, ఉదయా, జననీ, దినేశ్, దివ్యకృష్ణన్, అర్షద్, కేజీవై వినోద్, రఫీ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. కేజీ. రతీష్ ఛాయాగ్రహణం, ఇసైపేట్టై వసంత్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం గురించి కేఎస్.రవికుమార్ తెలుపుతూ ఇది విభిన్న హార్రర్ కథా చిత్రంగా ఉంటుందని చెప్పారు. తనకు కథ, పాత్ర నచ్చడంతో ఇందులో నటించడానికి అంగీకరించినట్లు పేర్కొన్నారు. ఇది ఈ తరం యువకులను అలరించే చిత్రంగా ఉంటుందన్నారు. దర్శకుడు షరీఫ్ రాసిన కథనం ఆకట్టుకునేలా ఉంటుందని చెప్పారు. సమాచార సాంకేతిక రంగంలో పని చేసే యువకుల నేపథ్యంలో సాగే కథా చిత్రంగా యుఆర్ నెక్ట్స్ చిత్రం ఉంటుందని, కథ, కథనాలు వైవిధ్యభరితంగా ఉంటాయని, చిత్రం ఉత్కంఠ భరితంగా సాగుతుందని దర్శకుడు తెలిపారు.

సమంత మరో వెబ్ సిరీస్‌కు సిద్ధం



సమంత

తమిళసినిమా: నటి సమంత ఈ పేరే ఒక సంచలనం. తమిళంలో నటిగా కెరీర్‌ను ప్రారంభించినా, తెలుగులో ముందుగా స్టార్ అంతస్తును పొందిన నటి ఈమె. తెలుగులో ఏమాయ చేశావే చిత్రంతో అక్కడి ప్రేక్షకుల మనసులను దోచేసిన సమంత ఆ తరువాత స్టార్ హీరోలతో వరుసగా నటించి కథానాయకి లిస్టులో చేరిపోయారు. ఆ తరువాతనే తమిళంలో విజయ్, సూర్య వంటి స్టార్ హీరోల సరసన నటించే అవకాశాలు వరించాయి. అలాంటి పరిస్థితుల్లో ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త నాగచైతన్యతో మనస్పర్థలు రావడం, విడిపోవడం, ఆ వెంటనే మయోసైటీస్ అనే అరుదైన వ్యాధికి గురి కావడం వంటి సంఘటనలు సమంతను ఒకసారిగా కృంగదీశాయనే చెప్పాలి. అయితే ఈమె మొక్కవోని ఆత్మవిశ్వాసంతో వాటి నుంచి బయట పడే ప్రయత్నం చేస్తున్నారు. ఈ సమస్యల కారణంగా సినిమాలకు కాస్త దూరం అయిన మాట వాస్తవమే అయినా, అభిమానులకు మాత్రం దూరం కాలేదు. సామాజిక మాధ్యమాల ద్వారా వారికి గ్లామరస్, వర్కౌట్ ఫొటోలతోనో, ఏదో టీట్‌లతోనో ఎప్పుడూ టచ్‌లోనే ఉంటున్నారు. ఇకపోతే ఖుషీ చిత్రం తరువాత సమంత ఇప్పటివరకూ మరో చిత్రంలో నటించలేదు. ఇటీవల సొంత నిర్మాణం చేపట్టి కథానాయకిగా నటించనున్నట్లు ప్రకటించారు. అయితే ఆ తరువాత దాని ఊసే లేదు. ఇకపోతే తమిళంలో మరోసారి విజయ్‌తో జత కట్టనున్నట్లు ప్రచారం జరిగింది. అదీ ప్రచారానికే పరిమితం అయ్యింది. అలాగే మలయాళ చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇవ్వబోతున్నారనే ప్రచారం జరిగింది. కాగా తాజాగా సమంత మరోసారి హిందీ, తెలుగు, తమిళం భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో తూపొందనున్న వెబ్ సిరీస్‌లో నటించడానికి సిద్ధం అవుతున్నట్లు సమాచారం. ఇప్పుడు ప్రముఖ నటీనటులందరూ వెబ్ సిరీస్‌ల్లో నటించడానికి ఆసక్తి చూపుతున్న విషయం తెలిసిందే. అయితే సమంత ఇంతకు ముందే ఫ్యామిలిమెన్–2, సిట్టాడల్, హని పన్ని వెబ్ సిరీస్‌లో నటించి పాపులర్ అయ్యారు. తాజాగా మరో వెబ్ సిరీస్‌లో నటించడానికి రెడీ అవుతున్నట్లు తెలిసింది. రాజ్, డీకేల ద్వయం దర్శకత్వం వహించనున్న ఈ వెబ్ సిరీస్‌కు రక్తపీజ్ అనే టైటిల్‌ను నిర్ణయించినట్లు సమాచారం. ఇది ఆగస్టు నెలలో ప్రారంభం కానున్నట్లు తెలిసింది. ఈ వెబ్ సిరీస్ కోసం నటీనటులతో రిహార్సల్ చేయిస్తున్నట్లు సమాచారం. మొత్తం మీద చాలా గ్యాప్ తరువాత నటి సమంత కెమెరా ముందుకు వెళ్లనున్నారన్నమాట.

జాన్వీకపూర్ కోలీవుడ్ ఎంట్రీ చిత్రం డ్రాప్?

తమిళసినిమా: అనుకున్నవన్నీ జరగవు. జరిగేవాటిని ఊహించలేము. ఇదే జీవితం. నటి జాన్వీకపూర్ విషయంలోనూ ఇదే జరిగిందని సమాచారం. దివంగత అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలు జాన్వీకపూర్ అన్నది తెలిసిందే. ఈమె తండ్రి బోనీ కపూర్ హిందీలో పాటు కొన్ని తమిళ చిత్రాలు నిర్మించారు. ఈ మధ్య అజిత్ కథానాయకుడిగా తుణివు వంటి విజయవంతమైన చిత్రాన్ని నిర్మించారు. కాగా బాలీవుడ్‌లో నటిగా పరిచయమై రాణిస్తున్న జాన్వీకపూర్‌కు తన తల్లి మాదిరిగానే దక్షిణాది చిత్ర పరిశ్రమలో నటించి పేరు తెచ్చుకోవాలన్నది ఆశ. ఈ విషయాన్ని ఆమె పలుసార్లు ఆమె స్వయంగా వ్యక్తం చేశారు. అలాగే ఇప్పుడు తెలుగులోకి ఎంట్రీ ఇచ్చారు. జూనియర్ ఎన్టీఆర్ సరసన దేవర అనే భారీ చిత్రంలో నాయకిగా నటిస్తున్నారు. త్వరలో రామ్‌చరణ్‌తో జత కట్టడానికి రెడీ అవుతున్నారు. ఇకపోతే కోలీవుడ్‌లో కూడా నటించాలని జాన్వీకపూర్ చాలా ఆశగా ఉన్నారు. అలా ఒక పాన్ ఇండియా సినిమాలో నటించడానికి కమిట్ అయ్యారు. హిందీ, తెలుగు, తమిళం భాషల్లో రూపొందనుందని పేర్కొన్నారు. కాగా మహాభారతం ఇతివృత్తంతో సాగే ఈ చిత్రానికి కర్ణ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఇందులో కర్ణుడిగా నటుడు సూర్య నటించనున్నారని, ఆయనకు జంటగా నటి జాన్వీకపూర్ ఎంపికైనట్లు ప్రచారం జోరుగా సాగింది. త్వరలో ఈ చిత్రం సెట్‌పైకి వెళ్లనున్నట్లు ప్రచారం జరిగింది. అలాంటిది ఏమైందో గానీ ఇప్పుడీ చిత్రం డ్రాప్ అయినట్లు టాక్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అలాగే జాన్వీ కపూర్ కోలీవుడ్ ఎంట్రీ చిత్రం ఆగిపోవడం ఆమె అభిమానులకు నిరాశ కలిగించే విషయమే అవుతుంది. అయితే తాజాగా విజయ్‌తో ఆయన 69వ చిత్రంలో జాన్వీకపూర్ నాయకిగా నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ప్రచారం అయినా నిజం అవుతుందో లేదో వేచి చూడాల్సిందే.



జాన్వీకపూర్

క్లుప్తంగా

కలుషిత నీరు తాగి బాలుడి మృతి

తిరువొత్తియూరు: చెన్నైలోని సైదాపేటలో కలుషిత నీరు తాగి, డయేరియా బారిన పడిన 11 ఏళ్ల బాలుడు మృతి చెందాడు. మరో ఏడేళ్ల బాలిక అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వివరాల్లోకి వెళితే.. బిహార్ రాష్ట్రం నవతాజిల్లా తెరాసరాయ్ గ్రామానికి చెందిన రాజేష్ కుమార్ (39) 10 రోజుల క్రితం చెన్నైలోని సైదాపేట ప్రాంతంలోని ఇంట్లో అద్దెకు చేరారు. రాజేష్ కుమార్‌కు భార్య సుమన కుమారి, కుమార్తె దివ్య(18), మీరా (7), కుమారులు రాజ్‌కుమార్ (14), యువరాజ్ (11) ఉన్నారు. అతని భార్య, కుమార్తె దివ్య గిండిలోని కంపెనీలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో 26వ తేదీన కుమారుడు యువరాజ్‌కు రెండుసార్లు విరేచనాలు అయ్యాయి. దీంతో బాలుడిని చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. తరువాత మెరుగైన వైద్యం కోసం చెన్నై రాజీవ్‌గాంధీ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి 11.30 గంటల సమయంలో మృతి చెందాడు. అదే సమయంలో రాజేష్ కుమార్ రెండో కుమార్తె మీరా తీవ్ర విరేచనాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

గంజాయి కేసులో కంప్యూటర్ ఇంజినీర్ అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నై ఎంజీఆర్ నగర్‌లో ఐటీ ఉద్యోగులకు గంజాయి విక్రయిస్తున్న కంప్యూటర్ ఇంజినీర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. గత మార్చిలో చెన్నై ఎంజీఆర్ నగర్, నెసపాక్కంలో గంజాయి విక్రయాలకు సంబంధించి రామాపురానికి చెందిన రవీంద్రన్, నెసపాక్కం ప్రాంతానికి చెందిన రాఖేష్, సాలిగ్రామం యుగేంద్రన్, కేకేనగర్ బాలభారతి అనే నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో 2 నెలలకు పైగా పరారీలో ఉన్న కంప్యూటర్ ఇంజినీర్ కరుణాకరన్ ఎంజీఆర్ నగర్ పోలీసులు అరెస్టు చేశారు. స్నేహితులకు డబ్బులు చెల్లించి, గంజాయి కొనుగోలు చేసి, కేళంబాక్కం, నావలూర్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉద్యోగులకు సరఫరా చేస్తున్నట్టు కరుణాకరన్ తెలిపాడు. కాగా అతని తల్లి సీబీఐ ఆఫీస్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారని పోలీసులు తెలిపారు.

దొంగల ఛేజింగ్.. కానిస్టేబుల్‌కు కత్తిపోటు

తిరువొత్తియూరు: చోరీకి పాల్పడుతున్న దొంగలను ఛేజింగ్ చేసిన కానిస్టేబుల్‌ను వారు కత్తితో పొడిచి, పరారయ్యారు. వివరాల్లోకి వెళితే.. తిరుచ్చిలో సెల్‌ఫోన్ చైన్ స్నాచింగ్ ఘటనలు నిత్యం జరుగుతున్నాయి. ఈ క్రమంలో కార్పొరేషన్ పోలీస్ కమిషనర్ కామిని ఆధ్వర్యంలో ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేసి నిఘా పెట్టారు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున తిరుచ్చి ప్రాంతంలో ముగ్గురు రౌడీలు సెల్‌ఫోన్లు అపహరిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే చత్రం బస్‌స్టేషన్ ప్రాంతంలో రాత్రి బందోబస్తులో ఉన్న ఫోర్ట్‌స్టేషన్ కానిస్టేబుల్ అబ్దుల్ ఖాదర్‌కు సమాచారం అందించారు. వెంటనే ఆయన తన మోటారు సైకిల్‌లో దొంగలను ఛేజింగ్ చేసి, నిందితుల్లో ఒకరిని పట్టుకున్నాడు. దీంతో కోపోద్రిక్తుడైన మరో దుండగుడు తన వద్ద వున్న కత్తితో పోలీసు ఖాదర్ పై దాడి చేశారు. ఈ ఘటనలో కానిస్టేబుల్ గాయపడ్డాడు. దీంతో ముగ్గురు దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. దీనిపై కానిస్టేబుల్ చ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, పారిపోయిన శ్రీరంగం ప్రాంతానికి చెందిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు.

బస్సు ఢీకొని పారిశుద్ధ్య కార్మికురాలి మృతి

అన్నానగర్: చెన్నై సమీపంలో శనివారం ఉదయం విధుల్లో నిమగ్నమై ఉన్న పారిశుద్ధ్య కార్మికురాలిని ప్రభుత్వ బస్సు ఢీ కొనడంతో మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. చెన్నై పల్లికరనై కామాక్షి హాస్పిటల్ సమీపంలోని రేడియల్ రోడ్డులో ఫాతిమా (45) శనివారం ఉదయం పారిశుద్ధ్య పనిలో నిమగ్నమై ఉంది. ఆ సమయంలో ఆమెను ప్రభుత్వ బస్సు ఢీకొని, ఆపకుండా వెళ్లిపోయింది. ఇది చూసిన తోటి కార్మికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఆ తర్వాత అంబులెన్స్‌లో వచ్చిన మెడికల్ అసిస్టెంట్ ఫాతిమాను పరీక్షించి, అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పల్లికరనై ట్రాఫిక్ విభాగం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం క్రోమ్‌పేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటన గురించి పోలీసులు కేసు నమోదు చేసి, ప్రభుత్వ బస్సు డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

డ్రగ్స్ తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

తిరువొత్తియూరు: డ్రగ్స్ అక్రమంగా తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. తేని జిల్లా పెరియకులం సమీపంలోని పుదుపట్టి బైపాస్ రోడ్డుపై పెరియకులం వడకరై పోలీసులు శుక్రవారం రాత్రి తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వస్తున్న కేరళ రిజిస్ట్రేషన్ నంబర్ కారును అడ్డుకుని సోదాలు చేశారు. కారులో 250 గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. కారులో ఉన్న వారిని విచారణ జరపగా పొంతన లేని సమాధానం చెప్పారు. ఆ తర్వాత పోలీసులు కారులో 30 ప్యాకెట్ల మెథాంఫెటమిన్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేశారు.

పందలూరులో కుండపోత

- 3 గంటల్లో 27 సెంటీ మీటర్ల వర్షం
- పొంగిపొర్లుతున్న వాగులు వంకలు, నదులు
- శిబిరాల్లో అటవీ గ్రామ ప్రజలు



పొంగిపొర్లుతున్న వాగులు

సాక్షి, చెన్నై : నీలగిరుల్లోని పందలూరు, కూడలూరులో కుండపోతగా వర్షం కురిసింది. 3 గంటల్లో 27సెంటీమీటర్ల వర్షం కురిసింది. దీంతో ఇక్కడి వాగులు, వంకలు, నదులు పొంగి పొర్లుతున్నాయి. పశ్చిమ కనుమల్లోని నీలగిరి జిల్లాలో కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. శుక్రవారం రాత్రి పలు చోట్ల అతి భారీ వర్షం కురిసింది. అర్ధరాత్రి వరకు మూడు గంటల పాటుగా నిర్విరామంగా కురిసిన వర్షానికి అటవీ గ్రామాల ప్రజలు కంటి మీద కునుకు లేకుండా బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. పందలూరు, కూడలూరు పరిసరాలలోని అటవీ గ్రామాలలో మరింత కుండపోతగా వర్షం పడటంతో అక్కడి ప్రజలు తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. వాగులు, వంకలు, నదులలో వరదలు పొంగిపొర్లాయి. పందలూరులో 27 సె.మీ వర్షం పడింది. ఇక్కడి అటవీ గ్రామాలలోని ప్రజల ఇళ్లలోకి సైతం నీళ్లు చేరాయి. రాత్రంతా తీవ్ర ఆందోళనతో ఉన్న ప్రజలను శనివారం ఉదయాన్నే అధికారులు వెళ్లి రక్షించారు. అక్కడి పాఠశాలలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి వారికి కావాల్సిన సౌకర్యాలను కల్పించారు. దేవాలం పరిసరాలలో 19 సె.మీ వర్షం పడింది.సెమ్మన్ వాయిల్, కువమలై, అత్తికుండు, పరిసరాల్లో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు కలవరపడ్డారు. వీరిని సహాయక బృందాలు రక్షించి శిబిరాలకు తరలించాయి. పొన్ని నది, పాండి నది, చిట్టారు తదితర నదులు పొంగి పొర్లుతుండటంతో తీర వాసులను అప్రమత్తం చేశారు. వర్షాలతో శనివారం బడులు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. వర్షాలు కొనసాగుండడంతో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. విరిగి పడిన మట్టి చరియలు, కొండ చరియలను ఆగమేఘాలపై తొలగించారు. అటవీ గ్రామాల ప్రజలకు, తేయాకు తోటలలో పనిచేసే కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందు జాగ్రత్తలు చేపట్టారు.






సెలవు ప్రకటించడంతో వర్షంలో ఇళ్లకు తిరిగి వెలుతున్న విద్యార్థులు, రోడ్లపై వరద ఉధృతి, విద్యార్థులను ఇంటికి తీసుకువెలుతున్న కుటుంబసభ్యులు

గవర్నర్ పేట టు గవర్నర్ హౌస్ పుస్తకావిష్కరణ

- ఆవిష్కరించిన గవర్నర్ ఆర్‌ఎస్ రవి



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సీఎంకే రెడ్డి

కొరుక్కుపేట: తమిళనాడు రాష్ట్ర మాజీ గవర్నర్ పీఎస్ రామమోహన్‌రావు రాసిన గవర్నర్ పేట టు గవర్నర్ హౌస్ పుస్తకావిష్కరణ కార్యక్రమం శనివారం సాయంత్రం చెన్నై గిండిలో ఉన్న రాజ్‌భవన్‌లోని భారతీయార్ హాల్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎస్ రవి పాల్గొని, పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్, ఆర్‌బీఐ మాజీ గవర్నర్ డాక్టర్ సి.రంగరాజన్, పశ్చిమబెంగాల్ మాజీ గవర్నర్ ఎంకే నారాయణన్ పాల్గొన్నారు. గవర్నర్ రవి మాట్లాడుతూ పీఎస్ రామ మోహనరావు చక్కని పుస్తకాన్ని రాశారని, ఇలాంటి పుస్తకాలు అందరూ చదివి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తన రాజకీయ అనుభవాన్ని ఆసక్తికరంగా తెలియజేశారని కొనియాడారు. ఈ కార్యక్రమం ఆలిండియా తెలుగు ఫెడరేషన్ (ఏఐటీఎఫ్) అధ్యక్షుడు డాక్టర్ సీఎంకే రెడ్డి, ప్రముఖ సామాజిక సేవకురాలు డాక్టర్ ఏవీ శివకుమారి అధ్యక్షతన జరిగింది. తెలుగు ప్రముఖులు లయన్ జీ మురళి, గొల్లపల్లి ఇశ్రాయేలు, వి కృష్ణారావు, డాక్టర్ కొల్లి రాజు పాల్గొని, ప్రసంగించారు.

చోరీ కేసులో బీజేపీనేత సహా ఇద్దరి అరెస్టు



అరెస్టయిన ప్రభాకరన్, కేశవన్

తిరువళ్లూరు: మూడేళ్లగా వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసుల కళ్లు కప్పి తిరుగుతున్న బీజేపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడితోపాటు మరో యువకుడ్ని స్పెషల్ టీమ్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.51 లక్షల విలువైన బంగారు నగలు, పది సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తిరువళ్లూరు జిల్లా పెద్దపాళ్యం, ఊత్తుకోట తదితర ప్రాంతాల్లో మూడేళ్ల నుంచి వరస చోరీలు జరుగుతున్నాయి. అయితే పోలీసులకు నిందితులను గుర్తించడం సవాలుగా మారింది. ఈ క్రమంలోనే గత 22వ తేదీన ఊత్తుకోట సమీపంలోని పెరంబూరుపాట్టై ప్రాంతానికి చెందిన మణిగండన్ ఇంటి తాళాలు పగలగొట్టి ఐదు సవర్ల బంగారు నగలు, రూ.2లక్షల నగదును చోరీ చేశారు. అయితే చోరీ చేయడానికి వచ్చిన యువకులు ఉపయోగించిన ద్విచక్ర వాహనంలో పెట్రోల్ అయిపోవడంతో అక్కడే పడేసి మణిగండన్ ఇంటి వద్ద ఉన్న మరో ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లారు. దీంతో పోలీసులు మణిగండన్ ఇంటి వద్ద పడేసిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, దాని ఆధారంగా ఊత్తుకోట ఇన్‌స్పెక్టర్ ఏలుమలై, పెద్దపాళ్యం సబ్‌ఇన్‌స్పెక్టర్ శక్తివేల్ నేతృత్వంలోని స్పెషల్‌టీమ్ విచారణ చేపట్టింది. విచారణలో ద్విచక్ర వాహనం తోమూరు గ్రామానికి చెందిన బీజేపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకరన్‌దిగా గుర్తించి, ఆ దిశగా విచారణ చేపట్టారు. మూడు సంవత్సరాలుగా వేర్వేరు ప్రాంతాల్లో ప్రభాకరన్, అతడి స్నేహితుడు కేశవన్ కలిసి చోరీలకు పాల్పడినట్టు నిర్ధారించారు. వారి వద్ద నుంచి రూ.51 లక్షల విలువ చేసే బంగారు నగలు, ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకు తరలించారు.

గరుడ వాహనంపై అభయం

– ముగిసిన అవతార మహోత్సవాలు



గరుడ వాహనంపై భక్తులను అనుగ్రహిస్తున్న శ్రీసుందరరాజ స్వామివారు

చంద్రగిరి(తిరుచానూరు): శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా వెలసిన శ్రీ సుందరరాజ స్వామివారు శనివారం రాత్రి గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన శ్రీ సుందరరాజ స్వామివారి అవతార మహోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా మధ్యాహ్నం శ్రీ కృష్ణస్వామివారి ముఖ మండపంలో శ్రీ సుందరరాజ స్వామివారికి వైభవంగా అభిషేకం చేశారు. సాయంత్రం శ్రీకృష్ణస్వామివారి ముఖమండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి స్వామివారు గరుడ వాహనంపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.

వైద్యురాలి ఆత్మహత్య

సేలం: వైద్యురాలు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. నామక్కల్ జిల్లా రాశిపురం కార్పొరేషన్ కోనారిపట్టి ప్రాంతానికి చెందిన కుప్పుసామి (46) ప్రభుత్వ రవాణా శాఖలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని భార్య సుశీల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. వీరి కుమార్తె ప్రియదర్శిని (25) వైద్యురాలిగా పనిచేస్తున్నారు. ఈమె ఏడాది క్రితం తేని ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్యవిద్య పూర్తి చేసి, ఇంట్లోనే ఉంటూ దూరవిద్య ద్వారా ఉన్నత విద్య ఎంట్రన్స్ కోసం చదువుకుంటున్నారు. ఈ స్థితిలో కొన్ని రోజులుగా ప్రియదర్శిని తీవ్ర ఆందోళనతో కనిపించినట్లు సమాచారం. ఇందుకోసం సేలంలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చారు. గురువారం ఇంట్లో ఉన్న ప్రియదర్శిని రాత్రి భోజనానంతరం ఎప్పటిలానే తన గదిలో నిద్రించడానికి వెళ్లింది. గురువారం ఉదయం ఎంతసేపటికీ ప్రియదర్శిని గది తలుపులు తెరవకపోవడంతో దిగ్భ్రాంతి చెందిన తల్లిదండ్రులు పొరుగు వారి సాయంతో తలుపులను పగలగొట్టి లోపలికి వెళ్లి చూడగా ప్రియదర్శిని ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. దిగ్భ్రాంతి చెందిన ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ పరీక్షించిన డాక్టర్ అప్పటికే ఆమె మృతి చెందినట్టు తెలిపారు. శవపంచనామా నిమిత్తం ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు విచారిస్తున్నారు.

మానవత్వం చాటుకున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

అన్నానగర్: ఓ వ్యక్తి రోడ్డుపై పోగొట్టుకున్న రూ.50 వేలను తిరిగి అతడికి అప్పగించి ఓ ఇన్‌స్పెక్టర్ తన మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. కే కే నగర్ ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ కుమార్, పోలీసులు శుక్రవారం సాయంత్రం చెన్నై అశోక్‌నగర్ పక్కన ఉన్న జాఫర్‌ఖాన్‌పేట, కాశీ థియేటర్ కూడలి వద్ద పెట్రోలింగ్ చేపట్టారు. అప్పుడు బైకులో అటుగా వెళుతున్న వ్యక్తి జేబులో నుంచి రూ.50 వేల డబ్బులు పడిపోయాయి. ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ కుమార్, పోలీసులు రోడ్డుపై పడి ఉన్న డబ్బును స్వాధీనం చేసుకున్నారు. నోట్లకట్ట పైన ఉన్న స్లిప్‌లో పేర్కొన్న ప్రైవేట్ బ్యాంకును సంప్రదించి విచారించారు. ఆ సమయంలో నుంగంబాక్కం ప్రాంతంలోని ఓ వాణిజ్య సముదాయంలో కొరియర్ కంపెనీ నిర్వహిస్తున్న శివశంకర్ (55) రూ.వేలు తీసుకుని వెళ్లినట్లు తెలిసింది. శివశంకర్ సెల్‌ఫోన్ నంబర్‌లో సంప్రదించగా ఉద్యోగులకు జీతాలు చెల్లించేందుకు బ్యాంకు నుంచి డబ్బులు తీసుకు వెళుతుండగా అనూహ్యంగా రూ.50 వేలు మాయమైనట్లు తెలిపాడు. ఆ తర్వాత శివశంకర్‌ను వ్యక్తిగతంగా పిలిపించి పోలీసులు అతడికి డబ్బు అందజేశారు. డబ్బును తీసి ఇచ్చిన ట్రాఫిక్ పోలీసులకు శివశంకర్ కృతజ్ఞతలు తెలిపారు.




కలైంజ్ఞర్ వేడుక

దివంగత డీఎంకే నేత, మాజీ ముఖ్యమంత్రి ఎం.కరుణానిధి శత జయంతి ఉత్సవాల ముగింపు వేడుక శనివారం రాజా అన్నామలైపురంలోని ముత్తమిల్ పేరవై తిరువాడుదురై రాజరత్నం మంద్రంలో జరిగింది. తమిళనాడు ఇయల్ ఇసై నాటక మంద్రం నేతృత్వంలో సాగిన ఈ వేడుకలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ వేడుకల్లో తమిళాభివృద్ధి, సమాచార శాఖ మంత్రి స్వామినాథన్ తదితరులు పాల్గొన్నారు.

నైవేలి టౌన్‌షిప్‌లో స్వచ్ఛతా పక్వాడా



పరిశుభ్రత డ్రైవ్‌లో పాల్గొన్న ప్రసన్నకుమార్ మోటుపల్లి తదితరులు

కొరుక్కుపేట: ఎన్‌ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో నైవేలి టౌన్‌షిప్‌లో స్వచ్ఛతా పక్వాడాలో భాగంగా సామూహిక పరిశుభ్రత డ్రైవ్‌ను నిర్వహించారు. ఆ సంస్థ సీఎండీ ప్రసన్న కుమార్ మోటుపల్లి స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్‌ఎల్‌సీ డైరెక్టర్ (గనులు) సురేష్ చంద్ర సుమన్, డైరెక్టర్ (హెచ్‌ఆర్) సమీర్ స్వరూప్ పరిశుభ్రత డ్రైవ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మోటుపల్లి మాట్లాడుతూ ఎన్‌ఎల్‌సీ ఇండియా నైవేలి టౌన్‌షిప్‌లో భారత ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా తన అన్ని ప్రాజెక్టులు, ప్రాంతీయ కార్యాలయం, చెన్నైలో ఏకకాలంలో సామూహిక పరిశుభ్రత ప్రచారాన్ని నిర్వహించామన్నారు. స్వచ్ఛతా (పరిశుభ్రత) డ్రైవ్‌ను పాటించడంలో దేశంలోని అన్ని పీఎస్‌యూలలో మొదటి స్థానంలో నిలిపేందుకు ఎన్‌ఎల్‌సీ ఐఎల్ కృషి చేస్తుందని పేర్కొన్నారు. 2016లో పరిశుభ్రత పక్షం పాటించడం ప్రారంభమైనప్పటి నుంచి ఎన్‌ఎల్‌సీ తమ అన్ని యూనిట్లు, కార్యాలయాలు, టౌన్‌షిప్‌లో గణనీయమైన మెరుగుదలలను సాధించిందని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్‌ఎల్‌సీ సీనియర్ అధికారులు, ఉద్యోగులు, గుర్తింపు పొందిన సంఘాల ప్రతినిధులు, సంఘాలు, సంక్షేమ సంఘాలు, సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది, నైవేలిలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, సామాన్య ప్రజానీకం ఉత్సాహంగా క్లీనింగ్ క్యాంపెయిన్‌లో పాల్గొన్నారు.

యువకుడి హత్య

- బీజేపీ నేత కొడుకు అరెస్టు

అన్నానగర్: తన మాజీ ప్రియురాలని ప్రేమిస్తున్నాడన్న కోపంతో ఓ యువకుడిని హత్య చేసిన సంఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. చెన్నై షోలింగనల్లూరు తురైపాక్కం కస్టమ్స్ కాలనీ మెయిన్ రోడ్‌లో వెబ్‌సైట్ తయారీ కంపెనీ నడుస్తోంది. గత రెండేళ్లుగా నిర్వహిస్తున్న ఈ కంపెనీలో పుదుచ్చేరికి చెందిన ధరణీధరన్ (34), చెన్నైలోని తిరువాన్మియూర్ లక్ష్మీపురం ప్రాంతానికి చెందిన హరికరణ్ (34) సహా 10 మందికి పైగా పనిచేస్తున్నారు. శుక్రవారం సంస్థ అర్ధరోజు మాత్రమే పనిచేస్తోంది. కానీ ధరణీధరన్, హరికరణ్ ఇద్దరూ పనిచేశారు. ధరణీధరన్ కంపెనీ యజమాని మీరాకు ఫోన్ చేసి హరికరణ్‌కు, తనకు మధ్య వాగ్వాదం జరుగుతుండగా హరికరణ్ కింద పడిపోయాడని, మళ్లీ లేవలేదని చెప్పాడు. వెంటనే కంపెనీ యజమాని మీరా తురైపాక్కం పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి 108 అంబులెన్స్ సిబ్బంది చేరుకుని, పరీక్షించారు. అయితే హరికరణ్ అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది. తురైపాక్కం పోలీసులు హరికరణ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెన్నై రాయపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీంతో పోలీసులు ధరణీధరన్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. హరికరణ్‌ను ధరణీధరన్ హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది. రెండేళ్లుగా అదే కంపెనీలో పనిచేస్తున్న ధరణీధరన్ మాజీ ప్రియురాలితో హరికరణ్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్నాడని, తెలుసుకున్నాడు. దీంతో ధరణీధరన్ ఈ విషయమై హరికరణ్‌ను నిలదీయడంతో ఆమెను ప్రేమిస్తున్నానని చెప్పాడు. దీంతో కోపంగా అక్కడి నుంచి ధరణీధరన్ బయటకు వెళ్లి, తురైపాక్కంలోని టాస్మాక్ దుకాణానికి వెళ్లి మద్యం సేవించి తిరిగి కంపెనీకి వచ్చాడు. అక్కడే ఉన్న హరికరణ్‌తో మళ్లీ వాగ్వాదానికి దిగాడు. హరికరణ్ కూడా మద్యం మత్తులో ఉన్నట్లు తెలుస్తుంది. ఇద్దరి మధ్య వాగ్వాదం ఘర్షణగా మారింది. ఆపై ధరణీధరన్, హరికరణ్ ఛాతీపై, కడుపుపై బలంగా కొట్టాడు. హరికరణ్ కంపెనీ ముందు రోడ్డుపై కుప్పకూలి పడిపోయాడు. ఈ విషయాన్ని కంపెనీ యజమానికి ఫోన్‌లో చెప్పినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ మేరకు తురైపాక్కం పోలీసులు కేసు నమోదు చేసి ధరణీధరన్ అరెస్టు చేశారు. హంతకుడు ధరణీధరన్ తండ్రి ఆరోగ్యసామి పుదుచ్చేరి రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు కావడం గమనార్హం.

ఉత్తీర్ణత పెంపునకు ప్రణాళికతో ముందుకు సాగండి



ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభుశంకర్



వందశాతం ఉత్తీర్ణత సాధించిన హెచ్‌ఎంను సన్మానిస్తున్న కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్

తిరువళ్లూరు: ప్లస్‌టూ, పదో తరగతి పరీక్షల్లో 60 శాతం కన్నా తక్కువ ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలో వచ్చే ఏడాది ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్ ఉపాధ్యాయులను ఆదేశించారు. తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ప్లస్‌టూ, పదో తరగతి పరీక్షల్లో 60 శాతం కన్నా తక్కువ ఉత్తీర్ణత సాధించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులతో శనివారం కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ డాక్టర్ ప్రభుశంకర్ హాజరై ఉత్తీర్ణత శాతం తగ్గడానికి గల కారణాలపై ప్రధానోపాధ్యాయుల నుంచి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుల కొరతను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ తక్షణం ఉపాధ్యాయుల కొరతను తీర్చడానికి ప్రభుత్వ ఉన్నత అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. పాఠశాలల్లో భాగా చదివే విద్యార్థులు, ఆవరేజ్, డల్ స్టూడెంట్స్‌లను గుర్తించి వారికి తగిన విధంగా బోధన చేయాలన్నారు. డల్ స్టూడెంట్స్‌కు పరిమిత ప్రశ్నలు మాత్రమే ఇచ్చి వారు ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వందశాతం ఉత్తీర్ణత సాధించి ప్రధానోపాధ్యాయులను కలెక్టర్ గౌరవించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో రాజ్‌కుమార్, సీఈఓ రవిచంద్రన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు హెయిర్ కటింగ్

కొరుక్కుపేట: చెంగల్పట్టు అన్నా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పాఠశాల యాజమాన్యమే 67 మంది విద్యార్థులకు జుట్టు కత్తిరించింది. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల విద్యార్థులు వివిధ హెయిర్‌స్టైల్‌తో పాఠశాలకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో చెంగల్పట్టు అరినార్ అన్నా మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల యాజమాన్యం విద్యార్థులు సంప్రదాయ పద్ధతిలో హెయిర్ కటింగ్ చేసుకుని వస్తే బాగుంటుందని ప్రకటించింది. ఇక నుంచి సంప్రదాయ తరహాలోనే పాఠశాలకు అనుమతిస్తామని ప్రధానోపాధ్యాయులు సూచించారు. దీంతో పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించింది. అందుకు విద్యార్థులు అంగీకరించకపోవడంతో పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు జుట్టు కత్తిరించాలని నిర్ణయించింది. చెంగల్పట్టు అన్నా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠశాలలోనే 67 మంది విద్యార్థులకు జుట్టు కత్తిరించారు. ఈ సమాచారం తెలిసిన కొందరు విద్యార్థులు జుట్టు కత్తిరింపుల కారణంగా శుక్రవారం పాఠశాలకు రాకపోవడం గమనార్హం.

బంగారు తిరుచ్చిపై చిద్విలాసం



బంగారు తిరుచ్చిపై భక్తులను అనుగ్రహిస్తున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను కల్యాణ మండపానికి వేంచేపు చేసి వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండుగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ చేపట్టారు. సర్వాలంకార శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో కలసి బంగారు తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

సాక్షి క్లాసిఫైడ్స్
Real Estate

PLOT FOR SALE
రెడ్ హిల్స్ CMDA అప్రూవ్డ్ ప్లాట్స్ పర్ స్క్వేర్ ఫీట్ రూ.2650/-(Ponneri) DTCP అప్రూవ్డ్ పర్ స్క్వేర్ ఫీట్ రూ. 1200/- సంప్ర: మునిరాజులు 9444559213

PERSONAL CARE


CHANGE OF NAME
I, ANATH KR PAUL alias ANATH KUMAR PAUL alias ASHUTOSH KUMAR PAUL S/o Late ANANDA KUMAR PAUL R/o Ward No-7 House No-434 Madhupur Andaman And Nicobar Islands - 744202, changed my name to ASHUTOSH KUMAR PAUL

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా...

ఒత్తిళ్లు భరించలేం.. సెలవులో వెళ్తాం!

ఎంపీపీ ఎదుట వాపోయిన పంచాయతీల కార్యదర్శులు



మాట్లాడుతున్న ఎంపీపీ వేముల యశోద

తిరుపతి రూరల్: సచివాలయాల సూచిక బోర్డులు, సిమెంట్ దిమ్మెలు, శిలాఫలకాల ధ్వంసం వంటి అంశాలపై తిరుపతి ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీల వారీగా ఎంపీపీ వేముల యశోద అధ్యక్షతన శనివారం కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొందరు అధికార పార్టీ నేతలు అత్యుత్సాహంతో సచివాలయపైన ఉన్న పేర్లు, శిలాఫలకాలను ధ్వంసం చేస్తున్నారని.. కొన్ని ఘటనలు ఫోటోలు, వీడియోలతో సహా బయటకు వచ్చినా ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని కార్యదర్శులను నిలదీశారు. రాజకీయ ఒత్తిళ్లతో ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం చేస్తూ ఉంటే ఉపేక్షించవద్దని సూచించారు. దీనికి స్పందించిన కార్యదర్శులు 'రాజకీయ ఒత్తిళ్లను భరించలేకున్నాం. కళ్లెదుట పంచాయతీ ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. అడ్డుకోవాలని ప్రయత్నిస్తే చెప్పుకోలేని విధంగా దుర్భాషలాడుతున్నారు. చంపుతామని బెదిరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగాలు చేయలేం. సెలవులో వెళ్లడమే శరణ్యం' అంటూ వాపోయారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు రత్నమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఓటమిని జీర్ణించుకోలేక అభిమాని మృతి



నారాయణస్వామి (ఫైల్)

వి.కోట(చిత్తూరు జిల్లా): సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమిని జీర్ణించుకోలేక ఒకరు మృతి చెందిన ఘటన చిత్తూరు జిల్లా వి.కోట గాండ్లపల్లి కొత్తూరులో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన నారాయణస్వామి (46) వైఎస్సార్‌సీపీ వీరాభిమాని. ఎన్నికల ఫలితాలు వచ్చిన నాటి నుంచి మనోవేదనతో పనులకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఉదయం ఒక్కసారిగా బీపీ తగ్గిపోయి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేత తోటల్లో చెట్ల నరికివేత

రూ.3 లక్షలకు పైగా నష్టం



నరికేసిన జీడి చెట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

నాతవరం: అనకాపల్లి జిల్లా నాతవరం మండలం డి.యర్రవరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సబ్బవరపు వెంకునాయుడుకు చెందిన తోటల్లో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 300 జీడి చెట్లను, 200పైగా కొబ్బరి మొక్కలను నరికేశారు. పంట నష్టం రూ.3 లక్షలకు పైగా ఉంటుందని అంచనా. వెంకునాయుడు శనివారం ఉదయం తన తోటల్లోకి వెళ్లగా.. జీడి చెట్లతోపాటు కొబ్బరి మొక్కలు నరికేసి ఉండటాన్ని చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి వెంకునాయుడిని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బాధిత రైతు వెంకునాయుడు వైఎస్సార్‌సీపీ నేతలతో వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ మూకల దాడి



గాయాలపాలైన శ్రీనివాసరావు

ముసునూరు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ మూకలు కర్రలు, రాళ్లతో దాడి చేసి గాయపరచిన ఘటన ఏలూరు జిల్లా ముసునూరు మండలం కాట్రేనిపాడులో శనివారం చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన బాధితుడిని బంధువులు నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి కథనం ప్రకారం.. పది రోజులుగా టీడీపీకి చెందినవారు ఉత్తర దళితవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అమర్తల శ్రీనివాసరావు (45) ఇంటి వైపు మంచినీటి సరఫరా నిలిపి వేయించారు. దీంతో 10 రోజులుగా ఆ వీధిలోని 10 కుటుంబాల వారికి మంచినీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం రాత్రి గ్రామానికి వచ్చిన మంత్రి కొలుసు పార్థసారథికి బాధితుడు సమస్యను వివరించాడు. దీంతో మంచినీటి సరఫరా కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. శనివారం పంపుల సరఫరా పునరుద్ధరించేందుకు వచ్చిన పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది సమక్షంలోనే గ్రామానికి చెందిన దంతమాల సాగర్, కవిత, కోన నాగమణి వచ్చి శ్రీనివాసరావుపై కొట్లాటకు దిగారు. అతనిపై కర్రలు, రాళ్లతో దాడికి తెగబడ్డారు. దాడిలో శ్రీనివాసరావుకు తలపై, కాలిపై తీవ్ర గాయాలయ్యాయి.

రాష్ట్రంలో అరాచకం

రాజ్యమేలుతోంది

రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ, జనసేన శ్రేణులు పేట్రేగిపోతున్నాయి

- వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నాయి
- పార్టీ, ప్రభుత్వ కార్యాలయాల్లో విధ్వంసం సృష్టిస్తున్నాయి
- శాంతిభద్రతలు క్షీణించాయి.. ప్రభుత్వం పట్టించుకోవడంలేదు
- గవర్నర్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు
- తక్షణమే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి
- టీడీపీ అరాచకాలను అరికట్టాలని గవర్నర్‌కు వినతి
- నిబంధనల ప్రకారమే పార్టీ ఆఫీసుల నిర్మాణం: వైవీ సుబ్బారెడ్డి
- టీడీపీ దాడులపై సీఎం చంద్రబాబు స్పందించాలి : అయోధ్యరామిరెడ్డి



గవర్నర్‌కు ఫిర్యాదు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ బృందం

సాక్షి, అమరావతి: ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ కూటమి శ్రేణులు చేస్తున్న దాడులు, విధ్వంసాలను అరికట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కోరింది. వైఎస్సార్‌సీపీ నేతలు, రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి నేతృత్వంలోని పార్టీ బృందం శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి, ఈమేరకు వినతిపత్రం అందించింది. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన రోజు నుంచి టీడీపీ, జనసేన శ్రేణులు పేట్రేగిపోతున్నాయని ఫిర్యాదు చేసింది. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై టీడీపీ శ్రేణులు దాడులు చేస్తున్నాయని, పార్టీ కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో విధ్వంసం సృష్టిస్తున్నాయని తెలిపింది. రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోందని, అస్థిరత నెలకొందని వివరించింది. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని తెలిపింది. తక్షణమే జోక్యం చేసుకొని టీడీపీ అరాచకాలకు అడ్డకట్ట వేయాలని గవర్నర్‌ను వైఎస్సార్‌సీపీ బృందం కోరింది. అనంతరం వైవీ సుబ్బారెడ్డి, అయోధ్యరామిరెడ్డి మీడియాతో మట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు, పార్టీ కార్యాలయాలు, ప్రభుత్వ భవనాల ధ్వంసం జరుగుతున్నా సీఎం చంద్రబాబు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

ప్రధాని, రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్తాం : వైవీ సుబ్బారెడ్డి

రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో 26 రోజులుగా టీడీపీ, జనసేన శ్రేణులు వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపైన, ఇళ్లపైన దాడులు చేస్తున్నారని, దారుణంగా అవమానిస్తున్నారని ఎంపీ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. కొన్ని జిల్లాల్లో ప్రభుత్వ ఆస్తులపైనా దాడులు చేస్తున్నారని, పార్టీకి చెందిన, వైఎస్సార్ పేరు ఉన్న శిలా ఫలకాలను ధ్వంసం చేస్తున్నారని తెలిపారు. అయినా పోలీసులు ఎటువంటి చర్యలూ తీసుకోవడంలేదన్నారు. కనీసం కేసులు కూడా నమోదు చేయడంలేదని అన్నారు. దీంతో ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి, ప్రధాని, హోం మంత్రి దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశామన్నారు. అయినా రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి మెరుగుపడలేదన్నారు. దాడులు, విధ్వంసం కొనసాగుతూనే ఉందని అన్నారు. వైఎస్సార్‌సీపీకి ఓట్లేసిన దళిత కుటుంబాలను కూడా దారుణంగా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ విగ్రహాలను కూడా తగలబెడుతున్నారని అన్నారు. పరిస్థితులు దారుణంగా ఉండటంతో తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరినట్టు చెప్పారు.

హింసాత్మక ధోరణి కొనసాగరాదు : ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, గెలిచిన వాళ్లు విజయాన్ని ఆస్వాదిస్తూ ఒక పద్ధతిలో ఓడిన వారికి షేక్ హ్యాండ్ ఇచ్చేలా ఉండాలని ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి అన్నారు. శాంతిభద్రతలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రతిపక్షంపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. 2014-19లో చంద్రబాబు తెచ్చిన జీవో, నిబంధనల ప్రకారమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలకు కూడా ప్రభుత్వం స్థలాలు కేటాయించిందని తెలిపారు. నిబంధనల ప్రకారమే పార్టీ ఆఫీసుల నిర్మాణం జరుగుతోందని, ఇవి అక్రమ నిర్మాణాలు కాదని స్పష్టం చేశారు. అయినా వేల కోట్ల ప్రజాధనం వృధా అయిందంటూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఒక్కో ఆఫీసు 10 వేల చదరపు అడుగులు ఉంటుందని, ఈరోజు నిర్మాణ ఖర్చు చదరపు అడుగుకు రూ.2,000 నుంచి రూ.2,500 వరకు ఉందన్నారు. అంటే ఒక్కో ఆఫీసు నిర్మాణానికి రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ఖర్చవుతుందని, ఇలా ఇప్పటి వరకు 18 ఆఫీసులకు దాదాపు రూ.60 కోట్లు ఖర్చు పెట్టామని వివరించారు. కానీ రూ.500 కోట్ల నుంచి రూ.5,000 కోట్లు ప్రజాధనం దుర్వినియోగమైనట్లు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తమ కార్యకర్తలు, పార్టీ కార్యాలయాలపై దాడులను ప్రభుత్వం ఆపాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్,, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మా పార్టీ ఆఫీసుల్లోకి ప్రవేశించి బెదిరింపులు

గతంలో టీడీపీ ప్రభుత్వంలో వాళ్ల పార్టీ భవనాలకు, బీజేపీ ఆఫీసులకు, కమ్యూనిస్టు పార్టీల ఆఫీసులకు స్థలాలు మంజూరు చేసిన విధంగానే, ఆ నిబంధనల ప్రకారమే వైఎస్సార్‌సీపీ ఆఫీసులకు స్థలాలు తీసుకున్నామని సుబ్బారెడ్డి తెలిపారు. అన్ని అనుమతులు తీసుకున్నాక భవనాలు నిర్మిస్తున్నామన్నారు. నిర్మాణం పూర్తయ్యే వాటి వద్దకు వెళ్లి టీడీపీ, జనసేన కార్యకర్తలు అక్కడున్న తమ కార్యకర్తలు, సిబ్బందిని బెదిరించి భవనాలను కూలగొడతామంటున్నారని, వీటన్నింటినీ అడ్డుకోవాలని గవర్నర్‌ని కోరామని తెలిపారు. వీటికి సంబంధించి ఫొటోలను కూడా గవర్నర్‌కు చూపించామన్నారు. కొన్ని ఫొటోలను చూసి 'ఇంత దారుణంగా పరిస్థితి ఉందా' అని గవర్నర్ చాలా ఆశ్చర్యపోయారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలోకి

టీడీపీ నేతల చొరబాటు

- భవనాన్ని ధ్వంసం చేయాలంటూ కేకలు
- ఫర్నీచర్ దహనానికి ప్రయత్నం
- కర్నూలులో పేట్రేగిన పచ్చ మూక



నిర్మాణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద టీడీపీ నేతల హడావుడి

కర్నూలు: అధికారమే అండగా టీడీపీ నేతలు పేట్రేగిపోయారు. కర్నూలు ఐదు రోడ్ల కూడలి సమీపంలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యాలయంలోకి దౌర్జన్యంగా చొరబడి హడావుడి చేశారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10:30 గంటల సమయంలో ఆ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయ నిర్మాణం అక్రమమంటూ.. దీన్ని ధ్వంసం చేయాలంటూ రెచ్చిపోయారు. గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు మొదటి అంతస్తు పైకెక్కి పరిశీలించారు. ఓ గదిలో భద్రపరచిన వైఎస్సార్‌సీపీ జెండాలను, ఫర్నీచర్‌ను తగలబెట్టడానికి ప్రయత్నించారు. మరికొంతమంది కార్యాలయం పైకి ఎక్కి టీడీపీ జెండా ఎగురవేసేందుకు విఫలయత్నం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన సోమిశెట్టి వెంకటేశ్వర్లు వైఎస్సార్‌సీపీ నాయకులపై తిట్ల దండకం అందుకున్నారు. ఒక్క అవకాశమని ముఖ్యమంత్రి పదవి చేపట్టిన వైఎస్ జగన్ రాష్ట్రాన్ని దొంగల రాజ్యంగా మార్చారని మండిపడ్డారు. ఎలాంటి అనుమతులు లేకుండా వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని నిర్మిస్తున్నారని విమర్శించారు.

రూ.25 లక్షల విలువైన చేపల్ని

చోరీ చేసిన టీడీపీ శ్రేణులు



చెరువులో చేపలు పడుతున్న టీడీపీ కార్యకర్తలు

ఏర్పేడు: తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంలోని పెనుమల్లంలోని పంచాయతీ చెరువులో రూ.25 లక్షల విలువైన చేపల్ని టీడీపీ కార్యకర్తలు దొంగిలించారని లీజుదారు ఘొల్లుమంటున్నాడు. ఈ మేరకు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. పెనుమల్లంలోని పంచాయతీ చెరువుకు గత ఏడాది అక్టోబర్‌లో పంచాయతీ అధికారులు లీజు వేలం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని నడుమూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు మునిరాజా రూ.50 వేల లీజుకు చేపల చెరువును దక్కించుకున్నాడు. సుమారు రూ.5 లక్షలు వెచ్చించి చేప పిల్లల్ని కొనుగోలు చేసి చెరువులో వేసి పెంచుతున్నాడు. చేపల చెరువు కాలపరిమితి ఆదివారంతో ముగియనుంది. కాగా.. టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యంగా చెరువులోని చేపల్ని వలలతో పట్టుకుని తీసుకుపోయారు. ఇదేమిటని అడిగినందుకు చెరువు వద్దకు వస్తే తాట తీస్తామని బెదిరించడంతో బాధితుడు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. చెరువులోని సుమారు రూ.25 లక్షల విలువైన చేపలను టీడీపీ కార్యకర్తలు పట్టుకుని వెళ్లారని బాధితుడు వాపోయాడు. ఈ విషయంపై ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్‌ను వివరణ కోరగా.. ఆదివారం వరకు చేపల చెరువుకు కాలపరిమితి ఉందని, సమస్యపై చర్చించి న్యాయం చేస్తామని చెప్పారు.

కక్షపూరితంగా షెడ్డు కూల్చివేత



గిరజాల బాబు అరెస్టుకు నిరసనగా రోడ్డుపై బైఠాయించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

కడియం: తూర్పు గోదావరి జిల్లా కడియం కెనాల్ రోడ్డులో నిర్మిస్తున్న రైతు బజారుకు అనుబంధంగా నిర్మించిన రేకుల షెడ్డును పంచాయతీ అధికారులు శనివారం కక్షపూరితంగా కూల్చివేశారు. రైతు బజారు నిర్మాణ సామగ్రి నిల్వ చేసుకునేందుకు ఈ షెడ్డును నిర్మించారని, అవసరమైతే దీనిని ఇతర ప్రజా అవసరాలకు వినియోగించుకోవాలని ఎంపీడీఓ, తహసీల్దార్లకు వైఎస్సార్‌సీపీ నాయకుడు గిరజాల వీర్రాజు (బాబు) శుక్రవారం విజ్ఞప్తి చేశారు. దీనిని పట్టించుకోకుండా ఆ మర్నాడే కూల్చివేతకు దిగడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. షెడ్డు కూల్చివేతను అడ్డుకునేందుకు నిరసనకు దిగిన గిరజాల బాబును కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. దీంతో మాజీ ఎంపీడీ గిరజాల వెంకట స్వామినాయుడు, వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. వెంకటస్వామినాయుడి పూచీకత్తుపై బాబు, దాసరి శేషగిరి, దొడ్డా బుజ్జి తదితరులను పోలీసులు విడుదల చేశారు. అనంతరం శనివారం సాయంత్రం షెడ్డును జేసీబీల సాయంతో హడావుడిగా కూల్చివేశారు.

బెదిరింపులు తట్టుకోలేక వీసీల రాజీనామా



వీఎస్‌యూ వీసీ జీఎం సుందరవల్లి



వీఎస్‌యూ రిజిస్ట్రార్ పి.రామచంద్రారెడ్డి



వైవీయూ వీసీ చింతా సుధాకర్



వైవీయూ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య



వైఎస్సార్ వర్సిటీ రిజిస్ట్రార్ సురేంద్రనాథ్‌రెడ్డి

వెంకటాచలం/గుంటూరు (ఏఎన్‌యూ)/కడప (వైవీయూ): కొత్తగా ఏర్పాటైన టీడీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు శ్రుతిమించాయి. చివరకు ఉన్నత విద్య అందించే విశ్వవిద్యాలయాలపైనా కక్రపెత్తనం ప్రారంభించింది. వర్సిటీల వీసీలను తప్పుకోవాలంటూ బెదిరింపులకు దిగడమేగాక తీవ్ర వేధింపులకు గురిచేస్తుండడంతో తట్టుకోలేక వారు రాజీనామాలు సమర్పిస్తున్నారు. ఇప్పటికే పలు వర్సిటీల వీసీలు రాజీనామా చేయగా.. తాజాగా మరికొందరు అదే బాటపట్టారు. టీడీపీ నేతల వేధింపులను తట్టుకోలేక నెల్లూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీ వీసీ జీఎం సుందరవల్లి, రిజిస్ట్రార్ పి.రామచంద్రారెడ్డి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను రాష్ట్ర గవర్నర్ కార్యాలయానికి శుక్రవారం పంపించారు. ఈ నెల 5న టీడీపీ, టీఎన్ఎస్ఎఫ్ నేతలు విశ్వవిద్యాలయంలోకి చొరబడి వీసీ, రిజిస్ట్రార్లతో పాటు అధ్యాపక బృందాలపై దాడి చేశారు. అభివృద్ధి పనుల శిలాఫలకాలను ధ్వంసం చేశారు. కాగా.. యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్ రాజీనామా చేసి వెళ్లిపోవాలని విద్యాశాఖ మంత్రి పీఏ ఫోన్ ద్వారా ఈ నెల 25వ తేదీ నుంచి ఒత్తిడి చేస్తున్నారు. దీంతో వారిద్దరూ రాజీనామాలు సమర్పించారు.

అదే బాటలో వైవీయూ వీసీ

కడపలోని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ చింతా సుధాకర్ గవర్నర్ కార్యాలయానికి రాజీనామా సమర్పించారు. కాగా.. రిజిస్ట్రార్ వైసీ వెంకట సుబ్బయ్య రాజీనామాను వీసీ ఆమోదించారు. టీడీపీకి చెందిన ఓ వ్యక్తి విద్యాశాఖ మంత్రి ఓఎస్‌డీగా తాను చేరబోతున్నానని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియమితులైన వీసీలు, రిజిస్ట్రార్‌లు రాజీనామాలు సమర్పించాలంటూ ఫోన్లు చేశారు. అనధికార ఓఎస్‌డీ ఫోన్‌కాల్స్ పట్టించుకోవాల్సిన పనిలేదని భావించారు. అయితే, తర్వాత రోజు వీసీల వాట్సాప్ గ్రూపుల్లో సైతం అందరూ రాజీనామాలు సమర్పించాలని వీసీలు, రిజిస్ట్రార్‌లపై ఒత్తిడి తీసుకువచ్చారు. దీనికి తోడు అధికార పార్టీ అనుబంధ విద్యార్థి సంఘాలను విశ్వవిద్యాలయాలపైకి ఉసిగొల్పి అనవసర రాద్ధాంతం చేస్తూ వచ్చారు.

వైఎస్సార్ వర్సిటీ రిజిస్ట్రార్ రాజీనామా

కడప నగరంలోని వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం (వైఎస్సార్ ఏఎఫ్‌యూ) రిజిస్ట్రార్ ఈసీ సురేంద్రనాథ్‌రెడ్డి జూన్ 5న పదవికి రాజీనామా చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీప బంధువు కావడంతో ఈయనపై లేనిపోని అసత్య ఆరోపణలు చేస్తూ విద్యార్థి సంఘాల నాయకులను ఉసిగొల్పారు. తాజాగా శనివారం ఆయన రాజీనామాను ఏఎఫ్‌యూ వైస్ చాన్సలర్ బానోతు ఆంజనేయప్రసాద్ ఆమోదించారు. దీంతో ఆయన తిరిగి మాతృవిశ్వవిద్యాలయం వైవీయూలో బయో టెక్నాలజీ ఆచార్యులుగా చేరారు. కాగా.. వైఎస్సార్ ఏఎఫ్‌యూ వైస్ చాన్సలర్ బానోతు ఆంజనేయప్రసాద్ సైతం సోమవారం రాజీనామా చేయనున్నట్లు సమాచారం.

ఏఎన్‌యూ వీసీ రాజీనామాకు నిర్ణయం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఏఎన్‌యూ) వీసీ పదవికి రాజీనామా చేయనున్నట్టు వీసీ పి.రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని యూనివర్సిటీల వైస్ చాన్సలర్లు రాజీనామా చేస్తున్న తరుణంలో తన రాజీనామా లేఖను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్టు శనివారం పేర్కొన్నారు.

వాటర్ ప్లాంట్‌ను మూసివేసిన టీడీపీ నేతలు



మూసివేసిన వాటర్ ప్లాంట్

వెంకటగిరి రూరల్: తిరుపతిజిల్లా వెంకటగిరిలోని పాల కేంద్రం సమీపంలోని వాటర్ ప్లాంట్‌ను టీడీపీ నేతలు శనివారం బలవంతంగా మూసివేశారు. వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు షేక్ మస్తాన్ మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ నిర్వహణ లోపం కారణంగా మరుగున పడిందని తెలిపారు. ఆ తర్వాత అధికారులతో మాట్లాడి మోటార్లకు మరమ్మతులు చేయించి ప్లాంట్‌ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వెంకటగిరికి చెందిన కొందరు టీడీపీ నేతలు ప్లాంట్ మూసివేయాలని ఇటీవల హుకుం జారీ చేశారని తెలిపారు. అనంతరం శనివారం ప్లాంట్‌ను మూసివేసి తాళాలు తీసుకెళ్లినట్టు వాపోయారు.

వీసీలతో రాజీనామాలు దారుణం

- విద్యా రంగంలో రాజకీయాలతో వ్యవస్థలను సర్వనాశనం చేస్తున్నారు
- దేశంలో ఎన్నడూలేని విధంగా దాడులు
- విగ్రహాలు కూల్చటం హేయమైన చర్య
- దేవుడులాంటి వైఎస్సార్ విగ్రహాలను తగలబెట్టటం నీచం
- మాజీ మంత్రి మేరుగ నాగార్జున



గుంటూరు రూరల్: వీసీలతో బలవంతపు రాజీనామాలు చాలా బాధాకరం, దారుణమని మాజీమంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. తానూ విశ్వవిద్యాలయంలో చదువుకుని, అధ్యాపకుడిగా పనిచేశానని ఎప్పుడూ ఇలాంటి ఒత్తిళ్లు చూడలేదన్నారు. యూనివర్శిటీలంటే ఒక మేధాశక్తిని తయారుచేసే కర్మాగారాలని, వీసీలను నియమిస్తే సీఎంలు మారినా వారి కాలపరిమితి పూర్తయ్యే వరకూ ఎవరూ కదిలించరని తెలిపారు. యూజీసీ నిబంధనల మేరకు వీసీలు పనిచేస్తారని, కానీ, రాష్ట్రంలో ఇప్పుడు జరుగుతున్న పరిస్థితులు చాలా బాధాకరమన్నారు. గుంటూరులోని తన నివాసంలో శనివారం నాగార్జున మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

గతంలో టీడీపీ నియమించిన వీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగించింది. వీసీలపై ఆరోపణలు, అభియోగాలు వస్తే గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లాలి.. పైగా అందుకు సంబంధించి కొన్ని నిబంధనలున్నాయి. గవర్నర్ కమిటీ వేసి తప్పులు జరిగి ఉంటే నిర్ణయం తీసుకుంటుంది. ఎందుకంటే ఆయనే వాళ్లను నియమిస్తారు కాబట్టి. అంతేగాని.. ఇలా భయపెట్టి, తలుపులేసి వీసీలను రిజైన్ చేయాలని బెదిరించటం దేశ చరిత్రలో ఎప్పుడూ చూడలేదు. ఇది సమంజసం కాదు. నిజానికి.. వీసీని గవర్నర్ అపాయింట్ చేస్తారు. కానీ, ఇంత దారుణంగా టీడీపీ వ్యవహరించడం ఏమాత్రం సరికాదు. అధికారం ఉంది కదా అని ఇలా వ్యవహరించడం చాలా తప్పు. దయచేసి విద్యా వ్యవస్థను నాశనం చెయ్యొద్దు. ఇక గతంలో విశాఖ ఆంధ్రా యూనివర్శిటీలో టీడీపీ అపాయింట్ చేసిన వారిని కాంగ్రెస్ ప్రభుత్వం చక్కగా పనిచేయించుకుని సాగనంపింది. అక్కడేకాదు.. మిగిలిన యూనివర్శిటీలు, ఉన్నత విద్యామండలిలో కూడా ఇలాగే జరిగింది. నేను నా అనుభవంతో చెబుతున్నా.. ఇకనైనా ఒక పద్ధతి ప్రకారం నిర్ణయాలు తీసుకోవాలి. మీరు చేసిన తప్పులు సరిదిద్దుకోవాలి.

వైఎస్ జగన్‌పై ఇంత దుష్ప్రచారమా?

ఇక మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెక్యూరిటీపై కూడా బురదజల్లుతున్నారు. మొత్తం కలిపినా ఆయన సెక్యూరిటీ 169 మంది కూడా ఉండరు. కానీ, 900 మందిని ఏర్పాటుచేసుకున్నారని దుష్ప్రచారం చేస్తున్నారు. మేం ఎప్పుడూ టీడీపీలా అరాచకాలు చేయలేదు. మీరు ప్రభుత్వాన్ని చక్కగా నడపాలని మేం కోరుకుంటున్నాం. అలాగే, మేం ఎక్కడా పార్టీ శ్రేణులను ఉసిగొల్పలేదు. తప్పుడు ఆలోచనలతో జగన్‌పై బురద చల్లటం హేయమైన చర్య.

వైఎస్ విగ్రహానికి నిప్పు.. ఇంత పైశాచికమా?

వేమూరు నియోజకవర్గంలో దేవుడులాంటి దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని టీడీపీ గుండాలు పెట్రోల్ పోసి తగలబెట్టారు. ఈ దాడులు, అసాంఘిక చర్యలను వీడియోలు తీస్తున్న వారిపైనా దాడులకు తెగబడుతున్నారు. ఇంత అన్యాయమా.. పోలీసు వ్యవస్థ ఏం చేస్తోంది? మేం ఎప్పుడైనా ఇలా చేశామా? ఇంత పైశాచికమా? కచ్చితంగా ప్రజల్లో తిరుగుబాటు మొదలవుతుంది. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేశ్.. దయచేసి విగ్రహాల జోలికెళ్లొద్దు. రాష్ట్రంలో జరుగుతున్న దాడులు, అరాచకాలను చూస్తుంటే ప్రజాస్వామ్యం ఎటు వెళ్తోందన్న బాధ కలుగుతోంది. వైఎస్సార్ విగ్రహం తగలబెట్టిన వారిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలి.

రాజకీయ కేంద్రంగా ఏయూ

- టీడీపీ ఫ్లెక్సీలతో ఎమ్మెల్యేలు, ఎంపీల హడావిడి
- వీసీని విడిచిపెట్టేది లేదన్న ఎంపీ సీఎం రమేష్



వీసీ కార్యాలయం ఎదుట టీడీపీ, జనసేన శ్రేణుల హడావిడి

సాక్షి, విశాఖపట్నం: ఐదేళ్ల కాలంలో.. దేశంలోనే నంబర్-3 విశ్వవిద్యాలయంగా పరిఢవిల్లిన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. రాజకీయాలకు దూరంగా.. విద్యార్థుల అభివృద్ధికి, యూనివర్సిటీకి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేయగా.. టీడీపీ ప్రభుత్వం మాత్రం రాజకీయ కేంద్రంగా మార్చేసింది. టీడీపీ ఆధ్వర్యంలో ఏయూ వీసీ ప్రాంగణం వద్ద శనివారం నిర్వహించిన కార్యక్రమం ఏయూ చరిత్రలో మాయనిమచ్చగా నిలిచిపోతుంది. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ ఏయూని సందర్శించారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున విశ్వవిద్యాలయం వద్దకు చేరుకుని రాజకీయ కార్యాలయంగా మార్చేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గుంపులుగా దూసుకొస్తూ.. రాజకీయ నినాదాలు చేస్తూ.. మాజీ వీసీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టీడీపీ, జనసేన శ్రేణుల చర్యలతో యూనివర్సిటీ విద్యార్థులు, సిబ్బంది భయాందోళనలకు గురయ్యారు. ఏయూ వీసీ చాంబర్‌పైకెక్కి హడావిడి చేశారు. పోలీసులు నిలువరించినా పట్టించుకోకుండా యూనివర్సిటీలో ఆందోళనకర వాతావరణాన్ని సృష్టించారు. ఈ సందర్భంగా ఎంపీ సీఎం రమేష్ మాట్లాడుతూ.. ఏయూ వీసీ వ్యవహారంపై విచారణ చేసి శిక్షించాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. రాజీనామా చేసినంత మాత్రాన ప్రసాదరెడ్డితో పాటు ఆయన అరాచకాల్లో భాగస్వామ్యులైన వారెవరినీ వదిలిపెట్టే సమస్యే లేదని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ నేతృత్వంలో ఏయూలో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచి పూర్వ వైభవం తీసుకొస్తామని చెప్పారు.

సాక్షి ఫ్యామిలీ
చెన్నై
ఆదివారం ॥ 30-6-2024

సినిమా

అమితాబ్ అలా చేస్తారని ఊహించలేదు



- నిర్మాత సి. అశ్వినీదత్

''అమితాబ్ బచ్చన్ గారు లెజెండ్. మేము సెట్స్‌లో కలిసినప్పుడు పరస్పరం నమస్కరించుకుంటాం. కానీ ముంబైలో జరిగిన 'కల్కి 2898 ఏడీ' ప్రీ రిలీజ్ వేడుకలో నా కాళ్లకి అమితాబ్‌గారు నమస్కరించడంతో నాకు తల కొట్టేసినంత పని అయింది. ఆయన అలా చేస్తారని నేను అస్సలు ఊహించలేదు'' అన్నారు నిర్మాత సి. అశ్వినీదత్. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన చిత్రం 'కల్కి 2898 ఏడీ'. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదలైంది. ఈ సందర్భంగా శనివారం విలేకరుల సమావేశంలో సి. అశ్వినీదత్ మాట్లాడుతూ– ''నాగ్ అశ్విన్ ఎంత పెద్ద సినిమా అయినా తీయగలడనే నమ్మకం నాకు మొదటి నుంచి ఉంది. ఈ శతాబ్దంలో ఒక మంచి దర్శకుడు మా ఇంట్లోనే దొరికాడు (నవ్వుతూ). 'కల్కి' విషయంలో టెన్షన్ పడలేదు. ఈ సినిమా అఖండ విజయం సాధించాలనే ఉద్దేశంతోనే తీశాం... అది నెరవేరింది. ప్రభాస్ సహకారం లేకపోతే అసలు ఈ సినిమా బయటికి రాదు. రాజమౌళి–ప్రభాస్‌ల ఎపిసోడ్ ఫన్నీగా పెట్టిందే. అలాగే బ్రహ్మానందం, రామ్‌గోపాల్ వర్మ పాత్రలని కూడా ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు. ఈ కథ అనుకున్నప్పుడే రెండో భాగం ఆలోచన వచ్చింది. కమల్‌గారు ఎంటరైన తర్వాత పార్ట్ 2 డిసైడ్ అయిపోయాం. 'కల్కి 2898 ఏడీ' పార్ట్ 2 వచ్చే ఏడాది జూన్‌లోనే విడుదల కావొచ్చు. 50 ఏళ్ల వైజయంతీ మూవీస్ ప్రయాణం అద్భుతం. ప్రస్తుతం శ్రీకాంత్‌గారి అబ్బాయి రోషన్‌తో ఓ సినిమా, దుల్కర్ సల్మాన్‌తో ఒక చిత్రం నిర్మిస్తున్నాం'' అన్నారు.

ఆ విషయంలో తప్పు చేశాను



- సమంత

''నేను గతంలో కొన్ని ఉత్పత్తులకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించి తప్పు చేశాను. అయితే కావాలని చేసిన తప్పు కాదు'' అంటున్నారు సమంత. గత ఏడాది విడుదలైన 'ఖుషి' తర్వాత సినిమాల నుంచి బ్రేక్ తీసుకుని, పూర్తి స్థాయిలో ఆరోగ్యంపై దృష్టి పెట్టారామె (గతంలో మయోసైటిస్ బారినపడ్డారు). అయితే సినిమాలకు గ్యాప్ ఇచ్చినా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటారు. తన ఫొటోలు, వీడియోలు షేర్ చేయడంతో పాటు అభిమానులతోనూ ముచ్చటిస్తుంటారు. ఈ క్రమంలోనే తాజాగా అభిమానులతో చిట్ చాట్ చేశారు సమంత. 'ఆరోగ్యం గురించి ఇప్పుడు మీరు మంచి విషయాలు చెబుతున్నారు. కానీ గతంలో మీరే అనారోగ్యకరమైన ఉత్పత్తులని ప్రమోట్ చేశారు కదా?' అని ఓ నెటిజన్ ప్రశ్నించారు. ఇందుకు సమంత బదులిస్తూ– ''అవును.. నేను గతంలో తప్పులు చేసిన మాట వాస్తవమే. కానీ కావాలని చేసినవి కావు. వాటి గురించి తెలిసిన తర్వాత ఆ బ్రాండ్స్‌ను ప్రమోట్ చేయడం మానేశాను. ప్రస్తుతం నేను ఏదైతే చేస్తున్నానో వాటిని మాత్రమే ప్రమోట్ చేస్తున్నాను'' అన్నారు.

కొత్త వెబ్ సిరీస్‌లో... దర్శక–ద్వయం రాజ్ అండ్ డీకే తెరకెక్కించిన వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మేన్ 2'లో సమంత నటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత వారిద్దరూ తెరకెక్కిస్తున్న 'సిటాడెల్: హనీ బన్నీ' అనే వెబ్ సిరీస్‌లోనూ సమంత నటించారు. ఈ సిరీస్ త్వరలోనే స్ట్రీమింగ్ కానుంది. కాగా రాజ్ అండ్ డీకే ద్వయం దర్శకత్వం వహించనున్న కొత్త వెబ్ సిరీస్‌లో సమంత కీలక పాత్ర చేయనున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఆదిత్య రాయ్ కపూర్ కూడా నటించనున్నారట. ఈ వెబ్ సిరీస్‌కి 'రక్తబీజ్' అనే టైటిల్ ఖరారు చేశారని భోగట్టా. ఆగస్టులో ఈ సిరీస్ షూటింగ్ ఆరంభం కానుందని సమాచారం.

వైరల్

దుపట్టా డ్యాన్స్... దుమ్ము రేపింది

సంజూ రాథోడ్ పాడిన మరాఠీ సాంగ్ 'గులాబి శాదీ' సూపర్ హిట్ కావడమే కాదు సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. ఈ సాంగ్‌ను బేస్ చేసుకొని డ్యాన్సింగ్ నుంచి లిప్–సింకింగ్ వరకు సోషల్ మీడియా యూజర్‌లు రకరకాల వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. అలాంటి ఒక వీడియో వైరల్ అయింది.

'గ్రూమ్స్ ఫ్రెండ్స్ ఆన్ ఫైర్' అనే కాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో 4.5 మిలియన్ వ్యూస్ దక్కించుకుంది. గులాబీ రంగు దుపట్టా వేసుకొని వరుడి ఫ్రెండ్స్ చేసిన డ్యాన్స్ 'వారేవా' అనేలా ఉంది.





నీలి వెన్నెల జాబిలీ నిన్ను చూసి మురిసి...



'బ్లూ మేకప్' అనేది ఇప్పుడు వైరల్ బ్యూటీ ట్రెండ్. అమెరికన్ సింగర్–సాంగ్ రైటర్ బిల్లీ ఎలీష్ పాట 'బ్లూ' నుంచి ఈ మేకప్ ట్రెండ్ మొదలైంది. 2016లో 'ఓషన్ ఐస్' ఆల్బమ్ విడుదల అయిన తరువాత 'బ్లూ' పాట రాసింది ఎలీష్.

లేటెస్ట్‌గా ఆ పాటను మరింత కొత్తదనంతో రీక్రియేట్ చేస్తే సంగీత ప్రియులను తెగ ఆకట్టుకుంది. ఆ పాటకు వచ్చిన పాపులారిటీ 'బ్లూ బ్యూటీ ట్రెండ్'కు నాంది పలికింది.

ఈ ట్రెండ్‌లో భాగంగా ఫ్యాషన్ అండ్ బ్యూటీ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు, సెలబ్రిటీలు రకరకాల వీడియోలు చేస్తున్నారు. ఈ ట్రెండ్‌లో భాగంగా కంటెంట్ క్రియేటర్, డాన్సర్ ఆనమ్ దర్బార్ స్విమ్మింగ్‌పూల్ వీడియో చేసింది. బ్యూటీ ఇన్‌ఫ్లుయెన్సర్ మృణాల్ పాంచాల్ 'వాటర్' ఎలిమెంట్‌తో వీడియో చేసింది. ఈ వీడియోలో మృణాల్ నీలిరంగు సీతాకోకచిలుకలా కనిపిస్తుంది. మొత్తానికైతే 'బ్లూ మేకప్ ట్రెండ్' మన దేశంలోనూ సందడి చేస్తోంది.

పిడుగు ముద్దాడ బోయింది




వానలో తడవాలని పిల్లలకు ఉంటుంది. జల్లుల్లో వాళ్ల కేరింతలు కొడితే ముద్దొస్తారు. మరి పిడుగుకు ముద్దొస్తే? తృటిలో ప్రాణాలు తప్పిపోయాయి. వానలో పిల్లలు జాగ్రత్త.

బిహార్‌లోని సీతామర్హిలో ఒకమ్మాయి వానలో టెర్రస్ మీద సరదాగా కేరింతలు కొడుకుతుంటే తల్లి అది ఫోన్‌లో వీడియో తీయసాగింది. మనం అనుకుంటాం వాతావరణం ఆహ్లాదంగా ఉందని. కాని మెరుపులు, పిడుగులు ఎలా మెరిసి ఉరుముతాయో తెలియదు కదా. ఇక్కడ ఆ అమ్మాయికి కొద్ది దూరంలోనే పిడుగు పడింది. క్షణాల్లో ఆ అమ్మాయి లోపలికి పరిగెత్తింది. అమ్మాయి, తల్లి క్షేమమేగాని గురి సూటిగా ఉండి ఉంటే? అందుకే జాగ్రత్త. ఇకపై వానలు... ఉరుములు... పిడుగులు..

విశాల హృదయం





క్వశ్చన్ పేపర్‌లో 'గుండె బొమ్మ గీసి వివిధ భాగాలను వివరించుము' అనే ప్రశ్నను చూసిన స్టూడెంట్ మహాశయుడు ఎక్కడికో వెళ్లిపోయాడు. గుండె బొమ్మను కలర్‌ఫుల్‌గా గీయడం వరకు ఓకే. అయితే ఆ గుండెలో వివిధ భాగాలలో తాను ప్రేమించిన అమ్మాయిల పేర్లు రాశాడు. ప్రియా, నమిత, హరిత, రూప, పూజలాంటి పేర్లు రాశాడు. మరో అడుగు ముందుకు వేసి 'ఫంక్షనింగ్ ఆఫ్ హార్ట్' అనే హెడ్‌లైన్‌తో వారిని తాను ఎందుకు ప్రేమిస్తున్నానో రాశాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో నెటిజనులను నవ్వులలో ముంచెత్తుతుంది.

ఆవురా... ఎంత క్రమశిక్షణ!



క్రమశిక్షణ తప్పిన వారిని 'పశువులా ప్రవర్తించకు' అంటాం. ఈ వైరల్ వీడియోను చూస్తే మాత్రం 'పశువును చూసి నేర్చుకో' అంటాం. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పట్టించుకోకుండా ఎడా పెడా దూసుకుపోయేవాళ్లు ఈ వీడియోను చూసి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. పుణెలో ట్రాఫిక్ సిగ్నల్ దగ్గరకు వచ్చిన ఒక ఆవు ఎరుపు రంగు ట్రాఫిక్ లైట్‌ను చూసి అడుగు ముందుకు వెయ్యలేదు. ట్రాఫిక్ లైట్ ఆకుపచ్చ రంగులో మారే వరకు ఓపికగా ఎదురు చూసింది. ఆ తరువాతే ముందుకు కదిలింది. మ్యూజిక్ జోడించి ఈ వీడియోను పుణె పోలీసులు ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. రోడ్డు భద్రత గురించి ప్రచారం చేయడానికి ఈ వీడియోను ఉపయోగిస్తున్నారు. ఆవు క్రమశిక్షణకు ముచ్చటపడిన నెటిజనులు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

మైకేల్ జాక్సన్ తీన్మార్

హిందీ ఫోక్ సాంగ్‌కు మైకేల్ జాక్సన్ ఆయన స్టైల్లోనే డ్యాన్స్ చేస్తే ఎలా ఉంటుంది?

ఎలా ఉంటుంది కాదు... అసలు ఎలా వీలవుతుంది?! అంటారా. సాంకేతిక మాయాబజార్‌లో ఏదైనా సాధ్యమే. కామెడి డ్రామా స్ట్రీమింగ్ టీవీ సిరీస్ 'పంచాయత్'కు సంబంధించి మీమ్స్, వైరల్ వీడియోలు వస్తూనే ఉన్నాయి. అందులో ఒకటి మైకేల్ జాక్సన్ డ్యాన్స్ వీడియో. ఈ ఫ్యాన్–మేడ్ వీడియో 8 మిలియన్‌ల వ్యూస్‌తో దూసుకుపోతోంది. ఈ వీడియోలో 'ఏ రాజాజీ రాజాజీ' అనే పాటకు మైకేల్ జాక్సన్ డ్యాన్స్ చేస్తూ కనిపిస్తాడు. అయితే ఎక్కడా కృత్రిమత్వం కనిపించదు. చాలా సహజంగా ఉండడమే ఈ వీడియో వైరల్ కావడానికి కారణం అయింది.



హెల్త్

డయాబెటిక్ నెఫ్రోపతి
మూత్రపిండాలకు షుగర్ దెబ్బ!

మధుమేహానికి ఉన్న ప్రధాన లక్షణం చాపకింది నీరులా కీలక అవయవాలను దెబ్బతీయడం. ఆ క్రమంలో అది మూత్రపిండాలనూ దెబ్బతీయవచ్చు. దాంతో దీర్ఘకాలంలో మూత్రపిండాలు (కిడ్నీలు) పనిచేయకుండా పోయే ప్రమాదం ఉంటుంది. చక్కెర వ్యాధి కారణంగా ఇలా మూత్రపిండాలు దెబ్బతినే స్థితిని 'డయాబెటిక్ నెఫ్రోపతి' అంటారు. ఇది చాలా ప్రమాదకరం, ఒక్కోసారి ప్రాణాంతకం కూడా. షుగర్ వ్యాధి మూత్రపిండాలను దెబ్బతీయడం వల్ల కలిగే దుష్ప్రభావాలు, వాటిని నివారించుకునే మార్గాలు...



మూత్రపిండాలు మన దేహంలోని వ్యర్థాలనూ, విషపదార్థాలను క్రమంగా తొలగిస్తుంటాయి. ఈ పనిలో అవి రక్తాన్ని శుద్ధి చేస్తుంటాయి. వీటి పనితీరు నూరు శాతం నుంచి 30 శాతానికి పడిపోయే వరకు ఆ విషయమే తెలియదు. అందుకే తేలిగ్గానే నివారించుకోగలిగే 'డయాబెటిక్ నెఫ్రోపతి' గురించి అప్రమత్తంగా ఉండాలి. చక్కెర వ్యాధి ఉన్నట్లయితే, దాన్ని పూర్తిగా అదుపులో ఉంచుకోవడం, అప్పుడప్పుడూ మూత్రపిండాల్ని పరీక్షించుకుంటూ ఉండటం వల్ల దీన్ని తేలిగ్గానే నివారించుకోవచ్చు. ఇంత తేలిగ్గా నివారించుకోగలిగే ఈ కండిషన్‌ను నిర్లక్ష్యం చేస్తే అది కిడ్నీ ఫెయిల్యూర్‌కు దారితీస్తుందనీ, అది చాలా ప్రమాదకరమని గుర్తుంచుకోవాలి.

లక్షణాలు...

ముందుగా చెప్పినట్లుగా కిడ్నీల పనితీరు నూరు శాతం నుంచి 30 శాతానికి పడిపోయే వరకు లక్షణాలు బయటకు కనిపించవు. దాంతో కిడ్నీలు పూర్తిగా దెబ్బతినే వరకు లక్షణాలేమీ బయటకు కనిపించవు. లక్షణాలు కనిపిస్తున్నాయంటే కిడ్నీ చాలావరకు దెబ్బతిన్నదని అర్థం. ● వికారం లేదా వాంతులు ● కాళ్లూ, చీలమండ, చేతులు లేదా కళ్ల మీద వాపు ● మూత్రం నురగలాగా రావడం ● శ్వాస అందడంలో ఇబ్బంది ● ఆకలి మందగించడం ● ఒళ్లంతా దురదలు ● పూర్తిగా అలసిపోయినట్లు అనిపించడం, నీరసం లేదా నిస్సత్తువ ● అయోమయంగా అనిపించడం, ఆలోచనల్లో స్పష్టత లోపించడం.

నిర్ధారణ

● రక్తంలో సీరమ్ క్రియాటినిన్ మోతాదులు తెలిపే కిడ్నీ పనితీరు పరీక్ష (కిడ్నీ ఫంక్షన్ టెస్ట్)తో దీన్ని గుర్తించవచ్చు. ఇది చాలా తేలిక, చవక కూడా.

నివారణ: ● బీపీని, షుగర్‌నీ అదుపులో ఉంచుకోవడం ● డాక్టర్ సలహా లేకుండా మందులు వాడకపోవడం ● ధూమపానం మానేయడం ● కొవ్వు మోతాదులు ఎక్కువగా ఉండే మాంసాహారం మానేయడం లేదా పరిమితంగా తీసుకోవడం ● బరువును అదుపులో ఉంచుకోవడం. ● నలభై ఏళ్లు దాటాక క్రమం తప్పకుండా షుగర్ టెస్ట్ చేయించడం.

ఇతర దుష్ప్రభావాలు...

● ఒంట్లో వ్యర్థాలు చేరడంతో కాళ్లవాపు, ఊపిరి తిత్తులలో నీరు చేరడంతో లంగ్స్ వాపు (పల్మనరీ ఎడిమా) ● ఒంట్లో పొటాషియమ్ మోతాదులు పెరగడంతో హైపర్ కెలీమియా అనే కండిషన్. ● గుండె రక్తనాళాలలో చివర్లు చిట్లిపోతే గుండెజబ్బులు, గుండెపోటు ● దేహంలోని కణాలకు రక్తం సరిగా అందక పోవడం వల్ల రక్తహీనత (అనీమియా) ● గర్భిణుల్లో గర్భస్రావం లేదా పిండం పెరుగుదలలో లోపాలు.

ఎందుకిలా...

వడపోత ప్రక్రియలో ఈ రక్తశుద్ధి క్యాపిల్లరీస్ అని పిలిచే రక్తకేశ నాళికల చివర్లలో గ్లోమెరూల్స్ అనే చోట జరుగుతుంది. చక్కెరవ్యాధి వల్ల రక్తనాళాల చివర్లలోని అతి సన్నటి రక్తకేశ నాళికలు (క్యాపిల్లరీస్) దెబ్బతింటాయి. దాంతో వడపోత ప్రక్రియ దెబ్బ తింటూ పోవడం వల్ల వడపోత సామర్థ్యం కూడా క్రమంగా పడిపోతూ ఉంటుంది. అలా కిడ్నీలు పూర్తిగా దెబ్బ తిని... ఇక ఏమాత్రం వడపోయలేని పరిస్థితిని 'ఎండ్ స్టేజ్ కిడ్నీ డిసీజ్' అంటారు. ఆ పరిస్థితి రాకముందే జాగ్రత్తపడాలి.

మరో విషయం ఏమిటంటే...

చికిత్స: ● కిడ్నీ పనితీరు తగ్గుతూ పోతూ ఉన్న విషయాన్ని ముందుగానే తెలుసుకుంటే నెఫ్రాలజిస్టులు/యూరాలజిస్టులు కొన్ని మందులు వాడుతూ, ఆ దెబ్బతినే ప్రక్రియను మందగించేలా చేయడం ద్వారా కిడ్నీని కాపాడదానికి ప్రయత్నిస్తారు ● కిడ్నీ పూర్తిగా దెబ్బతింటే క్రమం తప్పకుండా డయాలసిస్ చేయాలి. ఇది చాలా ఖర్చుతోనూ, శ్రమతోనూ కూడిన ప్రక్రియ ● చివరగా యూరాలజిస్టుల ఆధ్వర్యంలో కిడ్నీమార్పిడి (కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్) చేయాల్సి ఉంటుంది.

రక్తపోటు (హైబీపీ) రక్తం చాలా తీవ్రమైన ఒత్తిడితో ప్రవహించడంతో ఆ ఒత్తిడికి క్యాపిల్లరీస్ చిట్లిపోవడం వల్ల కూడా కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉంది. ముందుగానే గుర్తించకపోతే ఆ సమస్యతోనూ కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉంది.

కిడ్నీలకు ముప్పు తెచ్చిపెట్టే అంశాలు (రిస్క్ ఫ్యాక్టర్స్)...

● అదుపులో లేని చక్కెర (హైపర్ గ్లైసీమియా) ● అదుపు లేని రక్తపోటు (హైపర్‌టెన్షన్) ● రక్తంలో కొలెస్ట్రాల్ మోతాదులు పెరగడం ● బరువు విపరీతంగా పెరగడం (ఒబేసిటీ) ● పొగతాగడం ● కుటుంబ ఆరోగ్య చరిత్రలో డయాబెటిస్, కిడ్నీ వ్యాధులు ఉండటం.



డా॥ అరుణ్‌కుమార్ రెడ్డి
సీనియర్ నెఫ్రాలజిస్ట్

యువతలో నిద్రలేమి అనర్థాలు!



యువతలో నిద్రలేమి ఓ సమస్యగా మారింది. కొన్ని వృత్తుల కారణంగా నిద్రపోవాల్సిన టైమ్‌లోనూ మెలకువతో ఉండి పనిచేస్తూ ఉండటం, రాత్రివేళల్లో మొబైల్ చూసుకుంటూ నిద్రకు దూరం కావడం యువతకు పరిపాటిగా మారింది. నిద్రలేమిని వైద్య పరిభాషలో 'ఇన్‌సోమ్నియా' అంటారు. నిద్రలేమితో వచ్చే అనర్థాలూ, ఆరోగ్యసమస్యలూ, వాటిని అధిగమించే మార్గాలపై అవగాహన కోసం...

అనేక అధ్యయనాల్లో తేలిన ఫలితాల ఆధారంగా సాధారణ ఆరోగ్యం బాగుండాలంటే కంటినిండా నిద్ర చాలా అవసరమంటూ అంతర్జాతీయంగా స్లీప్ స్పెషలిస్టులందరూ ఉద్ఘోషిస్తున్నారు. ఇటీవలే యూఎస్‌లోని న్యూ ఓర్లియాన్స్‌లో నిర్వహించిన ఓ సదస్సులో తమ అధ్యయన ఫలితాలను ప్రకటిస్తూ... కొత్త కంప్యూటర్ ఆటలూ, కొత్త గాడ్జెట్లు, మొబైల్స్ కారణంగా యువత, టీనేజీ పిల్లల్లో నిద్రించే టైమ్ బాగా తగ్గిపోతోందన్న ఆందోళన వ్యక్తం చేశారు. యువత ఫిట్‌నెస్ బాగుండాలంటే కనీసం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల నిద్ర ఉండాలనీ, లేకపోతే అనేక శారీరక, మానసిక సమస్యలు వచ్చే అవకాశముందని హెచ్చరించారు.

యువతలో నిద్రలేమిని తెచ్చిపెట్టే అంశాలివే...

■ పనిప్రదేశం (వర్క్‌ప్లేస్)లో మాటిమాటికీ తీసుకునే కాఫీ లేదా కోలాడ్రింక్స్‌లో ఉండే కెఫీన్‌తో పాటు టీలో ఉండే స్టిమ్యులెంట్స్ ■ సోషల్ మీడియాకు అలవాటు పడి ఎప్పుడూ ఫేస్‌బుక్, ఇన్‌స్టా వంటి ప్లాట్‌ఫామ్‌ల మీదే ఉండటం. వాటిని చూస్తున్న కారణంగా నిత్యం బ్లూ రేడియేషన్‌కు ఎక్స్‌పోజ్ అవుతూ ఉండటం ■ కీళ్లవాతం లాంటి కొన్ని రకాల ఆరోగ్య సమస్యలు ■ అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా కారణంగా నిద్ర లేకపోవడం ■ ఆఫీస్ టైమింగ్స్ (కొన్ని సంస్థల్లో లేట్ నైట్స్ పనిచేయ వలసి రావడం).

నిద్రలేమితో అనర్థాలు... ■ ఊబకాయం : ఇది తొలి అనర్థం కాగా... అనేక ఆరోగ్య సమస్యలకు ఈ ఒబేసిటీయే ప్రధాన కారణమవుతూ ఉండటం. ■ లైఫ్‌స్టైల్ డిసీజెస్ : అర్లీ హైపర్ టెన్షన్, అర్లీ డయాబెటిస్, గుండెదడ

రాత్రి నిద్ర ఎందుకు... దాంతో మంచి ఆరోగ్యం ఎలా...

మెదడులోని బయలాజికల్ క్లాక్ వల్ల పగటిపూట చురుగ్గా ఉండటం, రాత్రివేళ నిద్రించడం జరుగుతుంది. దీన్నే 'సర్కాడియన్ రిథమ్' అంటారు. ఈ రిథమ్ దెబ్బతింటే ఆరోగ్యానికి హాని జరుగుతుంది. మెదడులో స్రవించే సెరెటోనిన్‌తో పాటు ఇతర రసాయనాల సమతుల్యత దెబ్బతినడంతో ఆరోగ్యంపై అనేక ప్రతికూల ప్రభావాలు పడతాయి.

నిద్రలేమి నివారణకు...

■ వృత్తిపరమైన అవసరాల వరకే ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్, ఇంటర్‌నెట్ వంటి వాటిని ఉపయోగించడం. ■ ఓ పవర్ న్యాప్ లాంటి అరగంట కునుకు తప్ప... పగటి నిద్రకు దూరంగా ఉండటం ■ సమతుల ఆహారం తీసుకుంటూ తగినంత వ్యాయామం చేయడం. (వ్యాయామం ఉదయం వేళలోనే చేయడం మంచిది. సాయంత్రం చేయడం వల్ల కొన్నిసార్లు రాత్రి నిద్రలేమికి కారణం కావచ్చు) ■ నిద్రకు ముందు గోరువెచ్చని పాలు తాగడం (దాంతో పాలలో ఉండే ట్రిప్టోఫాన్ అనే అమైనోయాసిడ్ ఓ స్లీపింగ్ పిల్‌లా పనిచేసి, ఆరోగ్యకరమైన నిద్రనిస్తుంది) ■ కాఫీ, టీ, కోలా డ్రింక్స్ వంటివి నిద్రకు ఉపక్రమించడానికి 3, 4 గంటల ముందుగా తీసుకోకపోవడం. ■ ఆల్కహాల్, పొగతాగడం వంటి అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండటం.

చికిత్స: ■ నిద్రలేమికి కారణమైన ఆరోగ్య సమస్యను గుర్తించి దానికి చికిత్స అందించాలి. ■ యువతకు వారి అవసరాన్ని / నిద్రలేమి కారణాన్ని బట్టి ఒక్కోసారి 'కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ' అవసరం కావచ్చు. ■ కొందరిలో పరిమిత కాలానికి నిద్రమాత్రలతో చికిత్స.




డాక్టర్ టి. అనురాధ
సీనియర్ కన్సల్టెంట్
స్లీప్ స్పెషలిస్ట్ &
పల్మొనాలజిస్ట్

మెడిటిప్
ప్రోస్టేట్ సమస్యల నివారణ కోసం...

మానవ పునరుత్పత్తి ప్రక్రియ కోసం పురుషుడిలో ఉండే కీలక గ్రంథి ప్రోస్టేట్. వృషణాల నుంచి వీర్యకణాల తయారీ తర్వాత అవి ఈదుతూ మనుగడ సాగించేందుకూ, ఆ వీర్యకణాలను కాపాడేందుకు అవసరమైన ద్రవాన్ని ప్రోస్టేట్ గ్రంథి ఉత్పత్తి చేస్తుంది. దాదాపు 50 ఏళ్లు దాటిన చాలామందిలో ఈ గ్రంథి సైజు పెరగవచ్చు. దీనివల్ల కొన్ని ఇబ్బందులు తలెత్తుతాయి.

దీనిని పూర్తిగా నివారించడం సాధ్యం కాకపోయినా... కొన్ని జాగ్రత్తలతో చాలావరకు నివారించవచ్చు. అవి...

● మూత్ర విసర్జన ఫీలింగ్ రాగానే... ఆపుకోకుండా మూత్రవిసర్జనకు వెళ్లడం ● ఎక్కువ మోతాదులో నీళ్లు తాగకుండా ఉండటం ● నిద్రకు ఉపక్రమించబోయే 2 – 3 గంటల ముందుగా మాత్రమే నీళ్లు / ద్రవాహారాలు తీసుకోవడం ● కెఫీన్ మోతాదులు ఎక్కువగా ఉండే కూల్‌డ్రింకులూ, కాఫీ వంటివి పరిమితంగా మాత్రమే తీసుకోవడం ● శరీరాన్ని వీలైనంత వెచ్చగా ఉంచుకోవటం (చలి వాతావరణం ఈ సమస్యను మరింత పెంచుతుంది) ● చురుగ్గా ఉండటం ● క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం.



గడిచిన మూడు, నాలుగేళ్లు ఎంతో కష్టపడ్డాం. కానీ ఆఖరి ఫలితాలే అందుకోలేకపోయాం. ఈసారి మాత్రం ఏ అవకాశాన్ని వదులుకోవద్దనుకున్నాం. జట్టుగా సమష్టిగా రాణించి ప్రపంచకప్‌ను అందుకున్నాం. నాకే కాదు విరాట్ కోహ్లి ఫామ్‌పై మాలో ఎవరికి ఏ సందేహం లేదు. అతను ఆడాల్సిన సమయం వస్తే కచ్చితంగా నిలబడతాడు. జట్టును నిలబెడతాడు. వికెట్ అంత సులువుగాలేని చోట కోహ్లి చేసిన 76 పరుగులు, అక్షర్ మెరుపులు చాలా కీలకమయ్యాయి. బుమ్రా గురించి చెప్పాల్సిన పనిలేదు. హార్దిక్ పాండ్యా తీసిన వికెట్లు, సూర్య క్యాచ్ అన్ని కుదిరాయి కాబట్టే విజేతలమయ్యాం. –రోహిత్ శర్మ, భారత్ కెప్టెన్

భారత జట్టుకు రూ. 20 కోట్ల 42 లక్షల ప్రైజ్‌మనీ

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తొమ్మిదో టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీకి ఒక కోటీ 12 లక్షల 50 వేల డాలర్ల (రూ. 93 కోట్ల 78 లక్షలు) ప్రైజ్‌మనీని కేటాయించింది. విజేతగా నిలిచిన భారత జట్టుకు 24 లక్షల 50 వేల డాలర్లు (రూ. 20 కోట్ల 42 లక్షలు) లభించాయి. రన్నరప్‌గా నిలిచిన దక్షిణాఫ్రికా జట్టుకు 12 లక్షల 80 వేల డాలర్లు (రూ. 10 కోట్ల 67 లక్షలు) దక్కాయి. సెమీఫైనల్లో ఓడిన ఇంగ్లండ్, అఫ్గానిస్తాన్ ఖాతాలో 7,87,000 డాలర్ల చొప్పున (రూ. 6 కోట్ల 56 లక్షల చొప్పున) చేరాయి. 'సూపర్–8' నుంచి సెమీఫైనల్ చేరుకోలేకపోయిన నాలుగు జట్లకు 3,82,500 డాలర్ల చొప్పున (రూ. 3 కోట్ల 18 లక్షల చొప్పున) లభించాయి. 9 నుంచి 12 స్థానాల్లోపు నిలిచిన నాలుగు జట్లకు 2,47,500 డాలర్ల చొప్పున (రూ. 2 కోట్ల 6 లక్షల చొప్పున) దక్కాయి. 13 నుంచి 20వ స్థానాల్లోపు నిలిచిన ఎనిమిది జట్లకు 2,25,000 డాలర్ల చొప్పున (రూ. 1 కోటీ 87 లక్షల చొప్పున) అందజేశారు. సెమీఫైనల్స్, ఫైనల్ మినహా సాధించిన ఒక్కో విజయానికి ఆయా జట్లకు 31,154 డాలర్ల చొప్పున (రూ. 25 లక్షల 97 వేలు) లభించాయి. 2022 టి20 ప్రపంచకప్‌ను 56 లక్షల డాలర్ల ప్రైజ్‌మనీతో నిర్వహించగా, విజేతగా నిలిచిన ఇంగ్లండ్ జట్టుకు 16 లక్షల డాలర్లు లభించాయి.

కసితీరా కప్ కొట్టారు

టి20 ప్రపంచకప్ విజేత భారత్

- రసవత్తర ఫైనల్లో అద్భుత విజయం
- 7 పరుగులతో ఓడిన దక్షిణాఫ్రికా
- కోహ్లి అర్ధ సెంచరీ ● గెలిపించిన పాండ్యా, బుమ్రా
- 17 ఏళ్ల తర్వాత మళ్లీ టి20ల్లో విశ్వ విజేత



స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) క్లాసెన్ (బి) మహరాజ్ 9; కోహ్లి (సి) రబడ (బి) జాన్సెన్ 76; పంత్ (సి) డికాక్ (బి) మహరాజ్ 0; సూర్యకుమార్ (సి) క్లాసెన్ (బి) రబడ 3; అక్షర్ పటేల్ (రనౌట్) 47; శివమ్ దూబే (సి) మిల్లర్ (బి) నోర్జే 27; హార్దిక్ పాండ్యా (నాటౌట్) 5; జడేజా (సి) మహరాజ్ (బి) నోర్జే 2; ఎక్స్‌ట్రాలు 7; మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 176. వికెట్ల పతనం: 1-23, 2-23, 3-34, 4-106, 5-163, 6-174, 7-176. బౌలింగ్: జాన్సెన్ 4-0-49-1, మహరాజ్ 3-0-23-2, రబడ 4-0-36-1, మార్క్‌రమ్ 2-0-16-0, నోర్జే 4-0-26-2, షమ్సీ 3-0-26-0.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: హెన్‌డ్రిక్స్ (బి) బుమ్రా 4; డికాక్ (సి) కుల్దీప్ (బి) అర్ష్‌దీప్ 39; మార్క్‌రమ్ (సి) పంత్ (బి) అర్ష్‌దీప్ 4; స్టబ్స్ (బి) అక్షర్ 31; క్లాసెన్ (సి) పంత్ (బి) పాండ్యా 52; మిల్లర్ (సి) సూర్యకుమార్ (బి) పాండ్యా 21; జాన్సెన్ (బి) బుమ్రా 2; కేశవ్ మహరాజ్ (నాటౌట్) 2; రబడ (సి) సూర్యకుమార్ (బి) పాండ్యా 4; నోర్జే (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 9; మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 169. వికెట్ల పతనం: 1-7, 2-12, 3-70, 4-106, 5-151, 6-156, 7-161, 8-168. బౌలింగ్: అర్ష్‌దీప్ 4-0-20-2, బుమ్రా 4-0-18-2, అక్షర్ 4-0-49-1, కుల్దీప్ 4-0-45-0, పాండ్యా 3-0-20-3, జడేజా 1-0-12-0.

ఎన్నాళ్లయింది భారత క్రికెటర్లలో ఈ ఆనందాన్ని చూసి... ఎన్నేళ్లయింది భారత క్రికెట్ అభిమానులు ఇలాంటి గెలుపు సంబరాలు చేసుకొని... అందినట్లే అంది చేజారిపోతున్న ఐసీసీ ట్రోఫీ విజయాలు... ఆఖరి మెట్టుపై తడబడిన ప్రపంచ కప్ సమరాలు... అన్నీ దాటి ఇప్పుడు ఆహా అనిపించే ప్రదర్శనతో భారత జట్టు సగర్వంగా నిలిచింది. ఏడు నెలల క్రితం రాల్చిన కన్నీటి చుక్కల స్థానే ఇప్పుడు ఆనంద బాష్పాలు... నియంత్రించలేని భావోద్వేగాలు... ఎన్నోసార్లు చేరువగా వచ్చిన ట్రోఫీని దూరమైన బాధను పూర్తిగా మరిచేలా ఇప్పుడు ప్రపంచ చాంపియన్‌గా చేతిలో వాలిన కప్... సొంతగడ్డపై వన్డే వరల్డ్‌కప్ చేజారిన తర్వాత ఈ సారైనా టి20 ప్రపంచకప్ ఒడిసి పట్టుకోవాలనే పట్టుదలతో బరిలోకి దిగిన టీమిండియా అజేయంగా అద్భుతాన్ని చేసి చూపించింది. రెండోసారి విశ్వ విజేతగా త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించింది. 2007లో తొలి టైటిల్ నెగ్గిన తర్వాత ఆరు ప్రయత్నాల్లో విఫలమైన టీమిండియా ఇప్పుడు మళ్లీ ట్రోఫీని అందుకుంది.

అప్పుడెప్పుడో కపిల్ వన్డే కప్ (1983) తెచ్చినపుడు మనలో చాలామందికి తెలీదు. అదొక వార్తగానే తెలుసుకున్నాం. కానీ ధోని తొలి టి20 ప్రపంచకప్‌ను టీవీల్లో చూశాం. తెగ సంబరపడ్డాం. సొంతగడ్డపై మళ్లీ అదే అదే ధోని (2011) వన్డే విశ్వ విజేతను చేస్తే పెద్ద పండగ చేసుకున్నాం. మళ్లీ... మళ్లీ మళ్లీ ఎంత ప్రయత్నించినా సెమీస్ లేదంటే ఫైనల్స్‌తోనే సరిపెట్టుకున్నాం. కానీ ఇప్పుడు 17 ఏళ్ల నిరీక్షణ తర్వాత ధోని బృందం సాధించిన తొలి టి20 ప్రపంచకప్ జట్టులోని సభ్యుడు రోహిత్ శర్మ సారథ్యంలోని టీమిండియా కరీబియన్ గడ్డపై సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది. రెండోసారి టి20 ప్రపంచకప్‌ను అందుకుంది. రోహిత్ బృందం జగజ్జేతగా అవతరించడంతో యావత్ భారతం సంబరాల్లో మునిగిపోయింది.


నిరాశలో దక్షిణాఫ్రికా ఆటగాళ్లు

బ్రిడ్జ్‌టౌన్ (బార్బడోస్): భారత జట్టు టి20 వరల్డ్ కప్‌ను రెండోసారి సొంతం చేసుకుంది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో భారత్ 7 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (59 బంతుల్లో 76; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా... అక్షర్ పటేల్ (31 బంతుల్లో 47; 1 ఫోర్, 4 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అనంతరం దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 8 వికెట్లకు 169 పరుగులే చేయగలిగింది. హెన్రిచ్ క్లాసెన్ (27 బంతుల్లో 52; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) హాఫ్ సెంచరీ చేయగా... డికాక్ (31 బంతుల్లో 39; 4 ఫోర్లు, 1 సిక్స్), స్టబ్స్ (21 బంతుల్లో 31; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. హార్దిక్ పాండ్యా (3/20) మూడు కీలక వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీయగా... బుమ్రా, అర్ష్‌దీప్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. కోహ్లికి 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్' అవార్డు లభించగా... బుమ్రాకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' పురస్కారం దక్కింది. తదుపరి టి20 ప్రపంచకప్‌కు 2026లో భారత్–శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తాయి.

కీలక భాగస్వామ్యాలు...

టోర్నీలో వరుసగా విఫలమైన కోహ్లి తుది పోరులో మాత్రం తన స్థాయి ఆటను ప్రదర్శించాడు. జాన్సెన్ వేసిన తొలి ఓవర్‌ను కోహ్లి జోరుగా మొదలుపెట్టాడు. అతను 3 ఫోర్లు బాదడంతో మొత్తం 15 పరుగులు వచ్చాయి. అయితే రెండో ఓవర్లో అనూహ్యంగా దక్షిణాఫ్రికా పైచేయి సాధించింది. కేశవ్ మహరాజ్ వేసిన ఈ ఓవర్లో తొలి రెండు బంతులను ఫోర్లుగా మలచినా... నాలుగో బంతికి రోహిత్ శర్మ (9) వెనుదిరిగాడు. చివరి బంతికి రిషభ్ పంత్ (0) కూడా అవుట్ కాగా, సూర్యకుమార్ (3) కూడా విఫలం కావడంతో కొంత ఉత్కంఠ నెలకొంది. అయితే ఐదో స్థానంలో వచ్చిన అక్షర్ చక్కటి బ్యాటింగ్‌తో నిలిచాడు. మూడు కీలక వికెట్లు కోల్పోవడంతో కోహ్లి మరో ఎండ్‌లో నెమ్మదించాల్సి వచ్చింది. పవర్‌ప్లేలో జట్టు 45 పరుగులు చేసింది. నలుగురు వేర్వేరు బౌలర్లు మార్క్‌రమ్, మహరాజ్, షమ్సీ, రబాడ ఓవర్లలో ఒక్కో సిక్సర్ కొట్టిన అక్షర్ పటేల్ ధాటిగా ఆడి తనకు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాడు. 13.1 ఓవర్లలో స్కోరు 100 పరుగులకు చేరింది. అయితే అదే ఓవర్లో అక్షర్ రనౌట్‌గా వెనుదిరిగాడు. కోహ్లి, అక్షర్ నాలుగో వికెట్‌కు 54 బంతుల్లో 72 పరుగులు జోడించారు. ఆ తర్వాత కోహ్లి, శివమ్ దూబే (16 బంతుల్లో 27; 3 ఫోర్లు, 1 సిక్స్) మధ్య 57 పరుగుల భాగస్వామ్యం (33 బంతుల్లో) స్కోరు వేగాన్ని తగ్గకుండా చేసింది. కోహ్లి 48 బంతుల్లో తన అర్ధసెంచరీని పూర్తి చేసుకున్నాడు. 17 ఓవర్లు ముగిసేసరికి స్కోరు 134/4. చివరి 3 ఓవర్లలో భారత్ 42 పరుగులు (వరుసగా 16, 17, 9) పరుగులు రాబట్టింది. తొలి 13 బంతుల్లో 4 ఫోర్లతో 21 పరుగులు చేసి కోహ్లి తర్వాతి 35 బంతుల్లో ఒక్క బౌండరీ కూడా లేకుండా 29 పరుగులే చేశాడు. అయితే తన ఆఖరి 11 బంతుల్లో 26 పరుగులు సాధించి మెరుగైన స్ట్రయిక్ రేట్‌తో ముగించాడు. చివరి 8 బంతుల్లో భారత్ 3 వికెట్లు కోల్పోయింది.

క్లాసెన్ మెరిసినా...

ఛేదనలో దక్షిణాఫ్రికా 12 పరుగులకే హెన్‌డ్రిక్స్ (4), మార్క్‌రమ్ (4) వికెట్లు కోల్పోయింది. అయితే డికాక్, స్టబ్స్ ధాటిగా ఆడుతూ స్కోరును నడిపించారు. వీరిద్దరు మూడో వికెట్‌కు 38 బంతుల్లోనే 58 పరుగులు జోడించారు. 10 ఓవర్లలో స్కోరు 81 పరుగులకు చేరింది. ఒకవైపు డికాక్ చక్కటి బ్యాటింగ్‌తో నిలబడగా... మరోవైపు క్లాసెన్ మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. తర్వాతి 6 ఓవర్లలో దక్షిణాఫ్రికా 51 పరుగులు చేసింది. ఇందులో క్లాసెన్ ఒక్కడే 44 పరుగులు సాధించాడు. మధ్యలో డికాక్ వెనుదిరిగినా క్లాసెన్ తగ్గలేదు. ముఖ్యంగా అర్షద్ వేసిన 15వ ఓవర్లో క్లాసెన్ 2 ఫోర్లు, 2 సిక్స్‌లు బాదడంతో 24 పరుగులు వచ్చాయి. ఈ దశలో భారత్ ఓటమి ఖాయమనిపించింది. కానీ ఆ తర్వాత ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది.



టి20 ప్రపంచకప్ మెడల్స్‌తో కోహ్లి, రోహిత్

ఆటగాడిగా... కెప్టెన్‌గా...

ఐపీఎల్‌లో నాయకుడిగా ఐదు సార్లు ముంబై ఇండియన్స్‌ను గెలిపించిన ఘనత ఉన్నా అంతర్జాతీయ క్రికెట్‌లో భారత జట్టు నాయకత్వం అంత సులువు కాదని రోహిత్‌పై చాలా సందర్భాల్లో విమర్శలు వచ్చాయి. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్, వన్డే వరల్డ్ కప్ ఫైనల్, టి20 వరల్డ్ కప్ సెమీఫైనల్‌లలో ఓడిన తర్వాత అతని కెప్టెన్సీపై సందేహాలు కూడా వచ్చాయి. కానీ బీసీసీఐ మరోసారి రోహిత్‌నే నమ్మింది. వరల్డ్ కప్‌లో జట్టును గెలిపించగలిగిన సామర్థ్యం ఉందంటూ అప్పజెప్పింది. ఈ అవకాశాన్ని అతను సమర్థంగా వాడుకున్నాడు. 2007లో తొలి టి20 వరల్డ్ కప్ గెలిచిన జట్టులో సభ్యుడైన రోహిత్ 17 ఏళ్ల తర్వాత సారథిగా మరో వరల్డ్ కప్ గెలిపించాడు. 2007 నుంచి 2024 వరకు వరుసగా 9 వరల్డ్ కప్‌లలోనూ ఆడిన రోహిత్ రెండు సార్లు విజేతగా నిలిచాడు. అధికారికంగా ప్రకటించకపోయినా రోహిత్‌కు కూడా ఇదే ఆఖరి అంతర్జాతీయ టి20 మ్యాచ్ కావచ్చు. మరో వైపు 2011 వన్డే వరల్డ్ కప్ గెలిచిన టీమ్‌లో ఉన్న కోహ్లి టి20 వరల్డ్ కప్ కోసం ఎంతో కాలంగా ఎదురు చూశాడు. అద్భుత ప్రదర్శనలతో రెండు సార్లు ప్లేయర్ ఆఫ్ ద టోర్నీగా నిలిచినా... ట్రోఫీ మాత్రం దక్కలేదు. ఇప్పుడు ఈ గెలుపుతో ఆ ఆనందం దక్కింది. పైగా మూడు పరిమిత ఓవర్ల ఐసీసీ ట్రోఫీలు గెలిచినవాడిగా కెరీర్‌ను సంపూర్ణం చేసుకున్న అతను అంతర్జాతీయ టి20లకు రిటైర్మెంట్ పలికాడు. వీరిద్దరు మినహా 15 మంది సభ్యుల జట్టులో మిగతా 13 మందికి ఇదే తొలి వరల్డ్ కప్ కావడం విశేషం. హైదరాబాద్ పేసర్ సిరాజ్ కూడా అరుదైన జాబితాలో భాగమయ్యాడు. గతంలో అజహర్ సహా హైదరాబాద్ నుంచి భారత్‌కు వరల్డ్ కప్ ఆడినవారెవరూ విజేత జట్టులో లేరు. ఇప్పుడు సిరాజ్ ఆ అదృష్టాన్ని దక్కించుకున్నాడు.

కల నిజమాయెగా...

ఫైనల్లో తీవ్ర ఒత్తిడి మధ్య బౌండరీ సూర్యకుమార్ పట్టిన క్యాచ్‌కు వెలకట్టగలమా? అతడిని ఏ అవార్డుతో సన్మానించినా తక్కువే? బుమ్రా తన చివరి 2 ఓవర్లలో చేసిన అద్భుత బౌలింగ్‌కు సలామ్ చేయకుండా ఉండగలమా? టోర్నీలో కేవలం 4.17 ఎకానమీతో 15 వికెట్లు తీసిన బుమ్రా తన స్థాయి ఏమిటో క్రికెట్ ప్రపంచానికి చూపించాడు. క్లాసెన్‌ను అవుట్ చేసి ఆటను భారత్ వైపు తిప్పిన హార్దిక్ పాండ్యా మ్యాచ్ తర్వాత కన్నీళ్లపర్యంతం కావడం మరచిపోగలమా? ఐపీఎల్ సమయంలో ఎంతో వేదన అనుభవించిన తర్వాత భారత్ తరఫున తన విలువేంటో చూపించిన పాండ్యాను రోహిత్ ముద్దాడిన దృశ్యం ఎప్పటికీ హైలైట్స్‌గా ఉండిపోదా! బ్యాటింగ్‌లోనూ తన సత్తా ఏమిటో చూపించిన గుజరాతీ 'బాపు' అక్షర్ పటేల్ ఇన్నింగ్స్ విలువ అమూల్యం కాదా...! చావును దగ్గరగా చూసి ఇక ఆడలేనేమో అనుకున్న క్షణం నుంచి కప్‌ను ఎత్తుకోవడం వరకు రిషభ్ పంత్ సాగిన ప్రస్థానం అసాధారణం కాదా...! అనుభవం లేకపోయినా అర్ష్‌దీప్ పదునైన బంతులతో గెలిపించి చూపించిన భాంగ్రాకు బల్లే బల్లే అనకుండా ఉండగలమా? కుల్దీప్, శివమ్ దూబే కీలక దశలో జట్టు విజయాల్లో ఇరుసుగా నిలిచినవారే... ఇక కోహ్లి గురించి చెప్పడం అంటే కొత్త పుస్తకం రాయడమే. ఫైనల్‌కు ముందు మొత్తం 75 పరుగులు మాత్రమే చేసిన అతను అసలు పోరు కోసం తన ఆటను దాచి ఉంచాడు. 76 పరుగుల ఇన్నింగ్స్‌తో భారీ స్కోరుకు బాటలు వేసి విజయగర్వంతో అంతర్జాతీయ టి20 కెరీర్‌ను ముగించాడు. బ్యాటింగ్‌లో రోహిత్ దూకుడు మంత్రం భారత్ విజయాలకు పునాది వేసింది. తనదైన శైలిలో నాయకుడిగా జట్టును నడిపించిన అతను భారత క్రికెట్‌లో తన కంటూ ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించుకున్నాడు. కపిల్, ధోనిల తర్వాత వరల్డ్ కప్ గెలిపించిన సారథిగా శిఖరాన నిలిచాడు.

కొన్నాళ్ల క్రితం వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో భారత్ ఓటమి పాలైంది... అందరిలోనూ వేదన, తీవ్రమైన బాధ... గెలుపు కోసం ఇంకా ఏం చేయాలనే నైరాశ్యం... కెప్టెన్ రోహిత్ సహా ఇతర సభ్యులందరికీ కూడా ఆ బాధనుంచి కోలుకునేందుకు చాలా సమయం పట్టింది. కాలం గిర్రున తిరిగింది... చూస్తుండగానే టి20 వరల్డ్ కప్ వచ్చేసింది. ఒక ఫార్మాట్‌లో చేజారినా... మరో ఫార్మాట్‌లోనైనా తమ స్థాయిని ప్రదర్శించే విజేతగా నిలిచే అవకాశం వచ్చింది. ఎలాగైనా ఈ సారి పట్టు వదలరాదని గట్టిగా నిశ్చయించుకొని మరో సారి తమ వేటను మొదలు పెట్టింది. లీగ్ దశలో వరుసగా మూడు విజయాలు, ఆ తర్వాత సూపర్–8లో కూడా మూడు విజయాలు. ఆస్ట్రేలియాలాంటి గట్టి ప్రత్యర్థిని కుప్పకూల్చిన ఉత్సాహంతో సెమీస్‌లో ఇంగ్లండ్‌పై కూడా ఘన విజయం. తుది పోరుకు ముందు అజేయంగా నిలిచింది. వన్డే వరల్డ్ కప్‌లో కూడా ఇలాగే వరుసగా పది విజయాల తర్వాత అజేయంగా ఫైనల్ చేరిన టీమ్ నిరాశచెందాల్సి వచ్చింది. అద్భుతంగా సాగిపోతున్న ఆటలో ఎక్కడైనా ఒక బ్రేక్ వస్తే... అదీ ఫైనల్లో అయితే ఎంతటి బాధ ఉంటుందో అందరికీ తెలుసు. ఈ సారీ అలాంటిదే జరిగితే అనే ఆందోళన అందరిలోనూ ఉంది. కానీ భారత్ అలాంటి స్థితిని అధిగమించింది...ఆత్మవిశ్వాసంతో అవరోధాలను అధిగమించింది. కెప్టెన్‌గా 2007 వన్డే వరల్డ్‌కప్‌నాటి బాధను కోచ్‌గా రూపంలో మర్చిపోయే ప్రయత్నం చేసిన దిగ్గజం రాహుల్ ద్రవిడ్ ఎట్టకేలకు తన కల నెరవేర్చుకున్నాడు. గెలుపు ఖాయమైన క్షణాన గాల్లో ఎగురుతూ అతను విసిరిన పంచ్ ఈ విజయం విలువేమిటో చూపించింది.

–సాక్షి క్రీడా విభాగం



టీమిండియా హెడ్ కోచ్ ద్రవిడ్ ఆనందం


మిల్లర్ క్యాచ్‌ను అందుకుంటున్న సూర్యకుమార్


టి20 ప్రపంచకప్ ప్రారంభానికి ముందు హైదరాబాద్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయంలో టి20 ప్రపంచకప్ ఆవిష్కరణ దృశ్యం

భారత్ 603/6

మహిళల టెస్టు క్రికెట్‌లోనే అత్యధిక స్కోరు సాధించిన టీమిండియా



రిచా, హర్మన్‌ప్రీత్

చెన్నై: తొమ్మిది దశాబ్దాల మహిళల టెస్టు క్రికెట్ చరిత్రలో భారత జట్టు అద్భుతం చేసింది. దక్షిణాఫ్రికా జట్టుతో జరుగుతున్న తొలి టెస్టులో హర్మన్‌ప్రీత్ కౌర్ నాయకత్వంలోని టీమిండియా అత్యధిక స్కోరు చేసిన జట్టుగా ప్రపంచ రికార్డు నెలకొల్పింది. రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 525/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత జట్టు 115.1 ఓవర్లలో 6 వికెట్లకు 603 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఈ క్రమంలో మహిళల టెస్టుల్లో అత్యధిక స్కోరు చేసిన జట్టుగా ఆస్ట్రేలియా (ఈ ఏడాది పెర్త్‌లో దక్షిణాఫ్రికాపై 575/9 డిక్లేర్డ్) పేరిట ఉన్న ప్రపంచ రికార్డును భారత జట్టు అధిగమించింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు హర్మన్‌ప్రీత్ కౌర్ (115 బంతుల్లో 69; 4 ఫోర్లు), రిచా ఘోష్ (90 బంతుల్లో 86; 16 ఫోర్లు) తమ అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 143 పరుగులు జోడించారు. 116వ ఓవర్లో రిచా ఘోష్ అవుటైన వెంటనే భారత జట్టు తమ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా ఆట ముగిసే సమయానికి 72 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 236 పరుగులు సాధించింది. సునె లుస్ (65; 6 ఫోర్లు, 1 సిక్స్), మరిజన్ కాప్ (69 బ్యాటింగ్; 8 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు. మరిజన్‌కు తోడుగా నదినె డి క్లెర్క్ (27 బ్యాటింగ్) క్రీజులో ఉంది. ప్రస్తుతం దక్షిణాఫ్రికా మరో 367 పరుగుల దూరంలో ఉంది. స్నేహ్ రాణా మూడు వికెట్లు, దీప్తి శర్మ ఒక వికెట్ తీశారు.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



గౌడ/M.Tech/IIT/Central Govt/ఎలక్ట్రికల్ ఇంజినీర్/ రైల్వేస్ /90,000/-PM / 5'10"/29 సం॥లు/కుల పట్టింపు లేదు/అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8328591692 [H-796309]

క్రిస్టియన్ మాదిగ/కట్నప్రసక్తి లేదు/ M.Tech / Govt. Asst. ఇంజినీర్ /ఎలక్ట్రికల్ Dept / 1 Lakh. PM/5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-15372]

గౌడ/M.Tech, IIT/C.Govt. సైంటిస్ట్/ ఇస్రో/ 1,20,000/-PM/5'11" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-15372]

వడ్డెర /కట్నప్రసక్తి లేదు/B.Tech/Govt. బ్యాంక్ మేనేజర్/ఆంధ్రా బ్యాంక్/ 80,000/-PM/5'10"/ఎత్తు/ 29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-15372]

రిచ్ ఫ్యామిలీ వారైన/రిచ్ ఫ్యామిలీ కాకపోయిన మంచి మనస్సు & క్యారెక్టర్ వధువు కావలెను. రెడ్డీస్/1995/5'9"/B.Tech/30 Lakhs. PM/70 కోట్ల ఆస్తి. పెరి పెరి అర్జెంట్. వాట్సాప్: 8187053655, 6303293337 [HA-15372]

యాదవ /కట్నప్రసక్తి లేదు/B.Tech (EEE)/ Govt.A.E.E/ ట్రాన్స్‌కో/ 85,000/-PM/ 5'8" ఎత్తు/ 28 సం॥ల ఏకైక కుమారుడు/ వరునికి వధువు కావలెను. Ph: 9515755529 [HA-15372]

2వ: కమ్మ MBA, ఆస్తి, IT జాబ్ గల వరునికి చదువు ఆస్తి కుల పట్టింపు లేదు. 32 సం॥ల లోపు వధువు కావలెను. డైరెక్ట్. Ph: 8978609410 [HA-14376]

36 సం.ల బిజినెస్ చేస్తున్న వరుడుకి రెండవ/విడో పిల్లలు ఉన్న వారు అయినా సంప్రదించండి. డౌరీ, కుల ప్రసక్తి లేదు. ఫోన్: 6301943220, 9866724586 [HA-97790]

వైశ్య, (డైవర్సీ) వయస్సు 56, పిల్లలులేరు, ఒంటరి, నెలకు 30,000/- సంపాదన కలిగిన వరునికి తగిన వధువు కావలెను. కుల ప్రసక్తి లేదు. నో బ్రోకర్స్. డైరెక్ట్. ఫోన్ : 7386213167 [G-2441]

★

రెడ్డి/లేట్ మ్యారేజ్/34y/నెలకు లక్ష రూపాయల ఆదాయం. Hydలో సొంత ఇల్లు/కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి, ఓన్లీ తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ/విడో OK. కుల, కట్న ప్రసక్తి లేదు. డైరెక్ట్. Ph: 7989079290 [H-801637]

వధువు కావలెను. డైరెక్ట్ కాంటాక్ట్, పద్మశాలీ, 32Yr./ 5'5"/Qly: B.Sc., Comp. Diploma DOA, Occup : బిజినెస్, 2వ పెళ్ళి, వెల్ సెటిల్డ్. సెల్-94413 86713, 99481 19207. [M-1185251]

కోమట్ల అమ్మాయి కావలెను. ఆర్యవైశ్య అబ్బాయి 35 M.Sc., వ్యవసాయం 34 వేలు ఆస్తి 90 లక్షలు, నల్లగొండ వీరయ్య. MIG-9 HB మునుగోడ్ రోడ్, సంప్ర॥ 9121325068 [Y-798338]

SC-Mala/Hindu/ 2nd Marriage/40y, PG/5'10"/Own Vissa Consultency/ 1,60,000/-PM Wants Good Bride (Direct). Ph: 8187861989 [H-796091]

★★

REDDY, 34 y, MS (Civil USA) Civil Engineer in USA, 5'11", Fair, 5C, Looking for Graduate Bride Pls Cont: 9493242896/ 5 [G-795924]

వరుడు కావలెను



కుల, ఆస్తి పట్టింపు లేదు/ జాబ్/ వ్యాపారం/ ఫ్లాట్స్/5L/PM/వెల్ సెటిల్డ్/5 కోట్ల ప్రాపర్టీ గల అందమైన సాంప్రదాయ వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. ఇల్లరికం OK. ముఖాముఖి కల్పించి త్వరగా కుదుర్చబడును. 7207635129 [H-778826]

కుల పట్టింపు లేదు/44yr/B.Ed/Govt జాబ్/ 80K (PM) విడో, వెల్ సెటిల్డ్, సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా & ఇల్లరికం అయినా OK) అర్జెంట్. సంప్ర : 7286031653 [H-778878]

రెండవ పెళ్ళి/37yrs/డైవర్సీ/Govt.ఎంప్లాయ్/ 3,25,000/-(pm)/వెల్ సెటిల్డ్/కుల పట్టింపు లేని అందమైన వధువుకి తగిన వరుడు కావలెను (Any profesion Ok) సంప్ర : 9032445378 [H-778878]

కమ్మ/50y/విడో/సెంట్రల్ Govt. Job/ రైస్‌మిల్స్/Catton Mills/షెటర్స్/18 Acres Land/8Lac Income గల వధువుకి FC/BC వరుడు కావలెను. Ph: 8374415657 [H-796309]

రెడ్డి/60/విడో/5'5" / V.Fair / Govt.Rtd పెన్షనర్ /సొంత ఇల్లు/బిజినెస్/28 ఎకరాల పండ్ల తోటలు /3L/PM పిల్లలు లేని ఒంటరి వధువుకు వరుడు కావలెను. కుల ఆస్తి ప్రసక్తి లేదు. Ph: 7287079096 [H-796309]

రెడ్డి/విడో/48y/5'3"/Fair/Own Baby Care Centre/సొంత ఇల్లు గల సాంప్రదాయకమైన వధువుకి మధ్య తరగతి వరుడు కావలెను. Ph: 8367233524 [H-796309]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: kcreddy43@gmail.com, Facebook.com/ kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/Rich Business *B.Tech / MBA *1995 /6' /150Cr * 1997/5'11"/100Cr * 1993 / 5'7" / 50Cr *1995 / 5'9"/500Cr. * Cont:K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/B.Tech /Business * 1997/ 6'/ 150Cr *1995/6'/100Cr *1994/ 5'11"/ 250 Cr *1990/6'/1000Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/(Catholic) B.Tech / MS / V. Good Business Hyd/1996/6'/150Cr * 1991/6'/ 55Cr *USA Citizen/ 1986/ 5'7"/ 150K/ * Cont : K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/USA-Citizen/Doctors * MD/ 1992/6' *1989/5'9" *1986/5'10" * 1988/ 6' *1998/5'8" * Cont : K.C. Reddy-Hyd.Ph: 9849321309/9347807015

Reddy/MBBS/PG/DM *1995/ 5'10"/ 400Cr *1994/5'10"/70Cr *1993/5'10"/ 50 Cr * 1996/6'/50Cr *1995/5'11"/20Cr. * Cont: K.C.Reddy-Hyd. Ph: 9849321309

Reddy/B.Tech / MS/H1 / USA *1996/ 5'11"/ 150K/ 50Cr *1998/6'/ 110K/80Cr *1994/ 5'9"/200Cr *1995/5'9"/50Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/B.Tech/MS/H1/USA *1995/230K/ 70Cr *1997/6'/400Cr *1988/5'10"/100Cr *1990/5'7"/50Cr *1991/5'11"/150K/200Cr. *Cont : K.C. Reddy - Hyd. Ph: 9849321309

Reddy/Divorcee/IIT/B.Tech/MS/H1/USA/ 1995/ 5'9"/170K / 25Cr *1994/ 5'10"/ 300Cr *1981/5'8"/ 500Cr *1979 / 5'8"/ 300Cr. * Cont: K.C. Reddy -Hyd. Ph: 9347807015

Reddy/B.Tech IIT/1995/5'10"/300Cr * 1994/ 5'9"/ 1Cr/yr / 30Cr *1994/6'/30Cr/385K * 1994 / 5'11"/70L/yr/25Cr *1995/ 5'10"/25 L/yr.*Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309

Reddy/B.Tech(NIT)/MBA (ISB)/ MBA (USA) 1993/6'/100Cr *BE(BITS) MS H1 USA *1991/5'10"/200K. * Cont. K.C. Reddy- Hyd-Ph: 9347807015/9849321309

వరుడు కావలెను

Reddy/USA Citizen *B.Sc/1989/5'4"/ *Doctors/1995/5'7"/*1997/5'6"/*1997/ 5'2" *2002/5'7" *1992/5'5" * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/Rich Family *1995/ 5'5"/100Cr *1999/5'7"/100Cr *1993/ 5'7"/100Cr *1993/5'3"/1000Cr *Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309

Reddy/MBA /1997 /5'4"/ 150Cr * 1995/5'8"/100Cr *1995/5'5"/70Cr * 1994/ 5'3"/ 200Cr *1996/5'4"/50Cr. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/B.Tech /1994 /5'4"/20Cr *1994/ 5'5"/ 15Cr *2000/5'5"/100Cr *1991 / 5'7"/ 10Cr *1994/5'10"/60Cr. * Cont : K.C.Reddy-Hyd-Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/1996/5'7"/50Cr * 1999/ 5'8"/15Cr *1998/5'5"/100Cr *1996/ 5'4"/ 30Cr *2002/5'6"/20Cr. * Cont : K.C.Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/MBBS/MD/*1995/5'5"/100Cr *1994/ 5'6"/100Cr *1998/5'7"/50Cr *1990/ 5'10"/20Cr *1995/5'3"/50Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/USA - Doctors *1997 / 5'6" * 1995/5'7" *1996/5'8"/40Cr *1987/5'4" *1991/5'1" *1985/5'4"/50Cr. * Cont : K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/B.Tech / MS/H1 / USA *1999/ 5'2"/10Cr *1997/5'5"/30Cr *1996/5'3"/20Cr *1994/5'4"/10Cr *1999/5'6"/200Cr. * Cont. K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/(Divorcee)MBBS/PG-Doctors *1991/ 5'2"/40Cr *1993/5'8"/40Cr *1992/ 5'3"/ 9Cr *1994/5'5"/100Cr. * Cont : K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/Divorcee/B.Tech/1993/5'4"/10 Cr *1991 / 5'4"/15Cr *1988/ 5'6"/ 30Cr *1991 /5'4" /10Cr *1985 /5'5" /400Cr * Cont: K.C.Reddy-Hyd.Ph: 9849321309 [D-548]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Business, B Arch, 28, 5' 10", Rich Family, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 6', Data Engineer, 200 K, 80 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS (USA), MBA (ISB), 30, 5' 11", Manager, 36 L P/A, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MSc, MS, 32, 6', Data Scientist, 140 K, Canada. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Citizen, BS, 28, 5' 6", SWE, 50 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 5' 5", PG Doctor, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 24, 5' 4", Software Developer, 11 L P/A, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 25, 5' 4", Developer, 22 L P/A, 10 Crores, Hyd, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



వధువు కావలెను

రెడ్డి BE, 29, 5' 11", Data Engineer, 13 L P/A, Hyd, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, MBA, 29, 5' 11", Rich Family, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, DM, 27, 5' 11", PG Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, 40, 5' 8", Microsoft, 60 L P/A, Hyd, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Business, MBA, 26, 5' 3", Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Govt, MBA, 27, 5' 3", 18 L P/A, 18 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 5' 5", PG Doctor, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, Degree, 33, 5' 7", Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818. LETTER

SC మాల హిందూ/B.Tech/25y/ 5'4"/ సాఫ్ట్‌వేర్ కాంగ్నిజెంట్ (Hyd)/60K Per Month/ చాలా అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9705960270 [H-796309]

ముదిరాజ్/B.Tech/Govt.Asst.ఇంజినీర్/ఎలక్ట్రికల్ Dept/ 60,000/PM / 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-15372]

SC హిందూ మాదిగ/B.Tech/C.Govt. సైంటిస్ట్ / DRDL / 60,000/-pm/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8297439565 [HA-15372]

రజక/B.Tech/C.Govt.Asst.మేనేజర్/ ఆంధ్రా బ్యాంక్ / 55000/-PM / 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-15372]

వయసు : 36yrs/5'5" ఎత్తు/ గవర్నమెంట్ జాబ్/1.5 Lakhs. జీతం కలిగిన అందమైన అమ్మాయికి వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. పిల్లలున్నా OK. Ph: 8019954482 [HA-15372]

బ్రాహ్మణ/24/5'3"/B.Sc *27/5'4"/ MBA *30/ 5'3"/B.Sc *27/5'2"/ ఇంటర్/32/5'2"/ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్/ బిజినెస్/ పురోహితులకు త్వరగా కుదుర్చబడును. Ph: 7842635086 [HA-15372]

యాదవ /ఎర్ర శాఖ అప్పర్ మిడిల్, 37/ 5'4"/ M.ఫార్మసీ వధువుకి Hydలో జాబ్ కలిగి లక్ష రూ॥ P/M అపై ఆదాయం కలిగిన యాదవ వరుడు మాత్రమే కావలెను. డైరెక్ట్ Father సంప్ర : 9989597799 [H-778746]

కుల పట్టింపు లేదు/22y&24y& 25y&27y& 28y&30y&32&34y&35y&37&38&40y&41y&43y&44y&46y&48y&50y&52y&53y&55y&57y&58y& 59y/ " మా సేవ" (Since1998): PH/WA: 9291503949 [HA-15735]

రెడ్డి/2nd మ్యారేజ్/కుల, మత, ఆస్తి పట్టింపు లేదు/ఎత్తు5'4" Q: ఇంటర్, కలర్: తెలుపు/సొంత వ్యాపారము, అందమైన ఒంటరి వధువుకి వరుడు కావలెను (ఇల్లరికము అయినా OK) Ph: 9063623252 [HA-15735]

2వ పెళ్లి /కుల ప్రసక్తి లేదు/ 40yr/M.Sc Ph.D, M.Phil/Govt ప్రొఫెసర్ 3 లక్షలు PM సొంత ఇల్లు+కారు & 100 కోట్ల ఆస్తి గల పిల్లలు లేని అందమైన వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా & ఇల్లరికం OK) సంప్ర : 7396213324 [HA-15735]

2వ పెళ్లి /40Yrs, 3,00,000/-PM/కోట్ల ప్రాపర్టీ కలిగి, బాగా స్థిరపడిన అమ్మాయికి అందమైన వరుడు కావలెను. Kids ఉన్నా OK కుల ప్రసక్తి లేదు. ఇల్లరికం. Call: 9182213897 [HA-15735]

కాపు/35yr/ ఫెయిర్ / కులపట్టింపులేదు /Govt. ఎంప్లాయ్/50K (PM), వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ/2 సొంత ఇల్లులు & బిజినెస్ కలిగిన వధువుకి వరుడు కావలెను. (1st, 2nd మ్యారేజ్ & ఇల్లరికం OK) సంప్ర : 9640133485 [H-778878]

కాపు/విడో/ఒంటరి/56Y/Hyd lo Own Hostels Rents/సొంత ఫ్లాట్ షో రూం/మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (నో బ్రోకర్స్) 7799083500, 7386660643 [H-778878]

రెడ్డి/50 yrs/విడో/B.Ed/VRS/సొంత ఇల్లు/6 ఎకరాల ల్యాండ్ గల వధువుకి కుల ఆస్తి పట్టింపు లేని వరుడు కావలెను. సంప్ర : 9705499686 [H-778878]

★

మున్నూరు కాపు/25/5'4"/B.టెక్, MS/ USA/Opt * 33/5'4"/ B.టెక్ MS / H1B/I-140/ మేనేజర్ / కాలిఫోర్నియా/250K అమ్మాయిలకు USAలో H1B మున్నూరు కాపు అబ్బాయిలు కావలెను. సం॥ "శుభమస్తు", DSNR, Hyd. S.రాములు గౌడ్- 8790690309 [H-796310]

వేదికలు



ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులము వారికి Govt/ సాఫ్ట్‌వేర్ /గెజిటెడ్ / MBBS / PG/NRI/ Pvt / బిజినెస్/1వ/2వ/లేట్/AP/TS 15 సం॥ Exp: Ph: 9989140444 [H-32366]

మాల మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt.ఆఫీసర్స్, USA, UK. Ph: 7396915712 [HA-15735]

ధ్రువ మ్యారేజెస్ అన్ని కులాల వారికి 1వ, 2వ, లేటు, విడో, డైవర్సీ వారికి తగిన సంబంధాలు చూడబడును. Age: 18-70 సం॥లు. Ph: 7702955854 [HA-15721]

www.christianholymatrimony.com ద్వారా క్రైస్తవ వివాహ పరిచయవేదిక జూలై 17, (బుధవారం) ఉ. 10- సా. 4 వరకు సికింద్రాబాద్ YMCAలో, ప్రొఫైల్స్ వాట్సాప్ చేయండి. 7330957771 [HA-97698]

Brahmin, Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 9000487865/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-15736]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15736]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 9000487865 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15736]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15736]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 9000487865 / / Blue Trend Matrimonial (P) Ltd. [HA-15736]

వాసవి విజయవాడ వారి ఆధ్వర్యంలో 14-07-2024న ఉ॥ 9 గం॥లకు 65వ ఆర్యవైశ్య వధూవరుల ఉచిత వివాహ పరిచయ వేదిక మరియు మ॥ 2 గం॥లకు 20వ పునర్ వివాహ పరిచయ వేదిక, విజయవాడ, K.B.N. కాలేజీలో జరుగును. మరియు ఉచిత మెగా మెడికల్ క్యాంప్ కూడా కలదు. ✆ 99895 00130 [B-284]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt. Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Watsapp) [HA-909]

Free Register హిందూ మాల/ మాదిగ & క్రిస్టియన్ వధూవరుల online స్వయంవరం July 14th bhavanimatrimony, Hyd. 9704656103/ 9533608887 [HA-878]

మాదిగ వివాహ పరిచయ వేదిక, ఆదివారం (16-6-24) 10AM-6PM * మంచిర్యాల ఫీ: 1 వెయ్యి Ph: 9347046175 నిర్వహణ : స్వప్న వివాహ వేదిక [H-800496]

సాక్షి పెళ్ళిచూపులు ప్రకటనల కొరకు
3+2 3 ప్రకటనలకు చెల్లించండి 2 ప్రకటనలు ఉచితంగా పొందండి
AP+TS+Metros: 1800/- for 4 Lines (Chennia + Bengaluru + Delhi + Mumbai) 485/- Extra Line
Andhra Pradesh: 1350/- for 4 Lines (Incl. Hyd) 375/- Extra Line
Telangana (Incl. Hyd) 1100/- for 4 Lines 300/- Extra Line
* Color 25% Extra
గమనిక: ప్రకటనలపై 5% GST అదనం
హైదరాబాద్ : 99122 25453
వరంగల్ : 99516 02872
మెదక్ : 99122 25456
నల్గొండ : 95055 08382
నిజామాబాద్ : 99122 20764
మహబూబ్‌నగర్ : 99516 02829
కరీంనగర్ : 97059 33396
ఖమ్మం: 99516 02868
Cell : 9912225453, umail2sakshi.ads@sakshi.com

బియ్యం ఎగుమతులపై సీఐడీ విచారణ

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడ పోర్టు కేంద్రంగా సాగిన రీసైక్లింగ్ బియ్యం ఎగుమతుల వ్యవహారాన్ని సీఐడీ విచారణకు అప్పగిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం ఆయన పౌర సరఫరాలు, రెవెన్యూ, లీగల్ మెట్రాలజీ తదితర శాఖల అధికారులతో కలసి పలు బియ్యం గోదాములను తనిఖీ చేశారు. కాకినాడ పోర్టు ఏరియాలోని అశోక ఇంటర్నేషనల్, హెచ్1 బియ్యం గోదాములను, లంగరు రేవు, యాంకరేజ్ పోర్టులో ఎగుమతి అవుతున్న బియ్యాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా పర్యటనలో భాగంగా తొలి రోజు నిర్వహించిన తనిఖీల్లో 7,615 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశామన్నారు. లావన్ ఇంటర్నేషనల్, అయ్యప్ప ఎక్స్‌పోర్ట్, విశ్వప్రియ, సార్టెక్స్ ఇండియా, సరళా ఫుడ్స్, వీఎస్ రాజు సన్స్ గోదాముల్లో రేషన్ బియ్యానికి సంబంధించి స్పష్టమైన ఆధారాలు దొరికాయని చెప్పారు. పేదలకు అందాల్సిన బియ్యాన్ని కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి ఆఫ్రికన్ దేశాలకు తరలిస్తూ భారీ అవినీతికి పాల్పడుతున్నట్లు రెండో రోజు తనిఖీల్లో తేలిందని అన్నారు. అశోక గోదాములో 2,800 మెట్రిక్ టన్నులు, హెచ్1 గోదాములో 2,500 మెట్రిక్ టన్నులు కలిపి 5,800 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని, స్టాక్ రిజిస్టర్లను సీజ్ చేశామని చెప్పారు. ఇంకా లోతుగా తనిఖీలు చేసేందుకు రాష్ట్ర పౌర సరఫరాల ఎండీ, జాయింట్ కలెక్టర్‌తో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రూ.1,600 కోట్ల మేర చెల్లించాల్సి ఉందని, ఇందులో రూ.1,000 కోట్లు నాలుగైదు రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు.

అన్నదాతలపైనా కక్ష సాధింపా?

- వ్యవసాయ సలహా మండళ్లు రద్దు చేసిన ప్రభుత్వం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు
- రాష్ట్రస్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- మండళ్లతో పంటల ప్రణాళిక రూపకల్పనలో రైతుల భాగస్వామ్యం
- వీటిని రద్దు చేయడం పట్ల రైతుల ఆగ్రహం

సాక్షి, అమరావతి: టీడీపీ కూటమి కక్ష సాధింపు పరిపాలన రైతుల వైపు మళ్లింది. వ్యవసాయం దండగంటూ గతంలో పాట పాడిన సీఎం చంద్రబాబు.. అధికారంలోకి వచ్చీ రాగానే రైతులను, వ్యవసాయాన్ని దెబ్బతీసే చర్యలు ప్రారంభించారు. పంటల ప్రణాళికలో రైతులను భాగస్వామ్యం చేసి, వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పథంలో నిలిపే వ్యవసాయ సలహా మండళ్లను చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేసింది. దేశంలో మరెక్కడా లేని విధంగా ఎంతో సమున్నత ఆశయంతో రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ఏర్పాటు చేసిన బలమైన ఈ వ్యవస్థను రద్దు చేస్తూ వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ ఆదేశాలు జారీ చేశారు.

రాజకీయాలకు తావు లేకుండా

సీజన్ ప్రారంభం నుంచి పంటను మార్కెట్‌లో మద్దతు ధరకు అమ్ముకునే వరకు రైతులకు అండగా నిలిచి, వారి అభ్యున్నతికి తోడ్పడే లక్ష్యంతో 2020లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ సలహా మండళ్ల వ్యవస్థను తీసుకొచ్చింది. రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా, గ్రామ స్థాయిల్లో ఆదర్శ రైతు, మండల స్థాయిలో స్థానిక ఎమ్మెల్యే సారథ్యంలో ఈ కమిటీలు ఏర్పాటయ్యాయి. సంబంధిత శాఖల అధికారులు, నిపుణులు, శాస్త్రవేత్తలు వీటిలో ఉంటారు. రాష్ట్ర, జిల్లా స్థాయి సలహా మండళ్లలో 10 మంది, మండల స్థాయిలో 8 మంది, ఆర్బీకే స్థాయి మండళ్లలో ఆరుగురు చొప్పున రైతులను భాగస్వాములను చేశారు. ఎక్కడా రాజకీయాలకు తావు లేకుండా దశాబ్దాలుగా వ్యవసాయ రంగంలోనే ఉన్న ఆదర్శ రైతులకే వీటిలో చోటు కల్పించారు. సన్న, చిన్నకారు రైతులతో పాటు మహిళా రైతులు, కౌలు రైతులకూ ప్రాధాన్యతనిచ్చారు. సుమారు లక్ష మంది రైతులు వీటిలో ఉన్నారు.

ప్రతీ నెలా సమావేశమవుతూ

ఆర్బీకే స్థాయి మండలి ప్రతి నెలా మొదటి శుక్రవారం సమావేశమై గ్రామ స్థాయిలో రైతుల సమస్యలు, వారి అవసరాలను గుర్తించి మండల కమిటీకి పంపిస్తారు. ప్రతి నెలా రెండో శుక్రవారం సమావేశమయ్యే మండల స్థాయి మండలి గ్రామ స్థాయిలో వచ్చే సలహాలు, సూచనలు, రైతుల అవసరాలకు తగినట్టుగా ప్రణాళిక రూపొందించి జిల్లా స్థాయి మండలికి పంపిస్తారు. మూడో శుక్రవారం జిల్లా స్థాయి మండలి సమావేశమై ఈ ప్రణాళికను పరిశీలించి, జిల్లా స్థాయిలో ఓ ప్రణాళిక రూపొందించి రాష్ట్ర కమిటీకి పంపిస్తుంది. రాష్ట్ర స్థాయి సలహా మండలి ప్రతి సీజన్‌లో ఓసారి భేటీ అయి రాష్ట్ర స్థాయి ప్రణాళిక రూపొందిస్తుంది. సలహా మండళ్ల ద్వారా రైతులు ఏ సీజన్‌లో ఏ పంట వేయబోతున్నారో ముందుగానే తెలిసేది. తద్వారా రైతులు కోరుకున్న విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు గ్రామ స్థాయిలో అందించే వెసులుబాటు కలిగేది. ఇలా విత్తు నుంచి విక్రయం వరకు రైతులకు అన్ని విధాలుగా తోడ్పాటు అందించిన ఈ మండళ్ల వ్యవస్థను మరింత బలోపేతం చేస్తే.. రైతులకు మరింత మేలు జరిగేది. కానీ కూటమి ప్రభుత్వం మండళ్లను రద్దు చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై రైతులు మండిపడుతున్నారు.



సలహా మండళ్ల బాధ్యతలు

- ఆగ్రో క్లైమెట్ జోన్స్, మార్కెట్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పంటల మార్పిడి, పంటల ప్రణాళిక రూపకల్పన
- రైతుల ఆదాయం పెంచే పంటల సాగును ప్రోత్సహించడం
- అదనపు ఆదాయం పెంపు మార్గాలు
- ఎగుమతి మార్గాల అన్వేషణ
- సాగునీటి సమర్థ వినియోగం
- డిమాండ్ -సరఫరా మధ్య గ్యాప్ లేకుండా పంట ఉత్పత్తులు మార్కెట్‌కు వచ్చేలా ప్రణాళికలు

ఈ సలహా మండళ్లు రద్దు చేయడం సరికాదు

గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవసాయ సలహా మండళ్లు రైతులకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. వీటిని సమర్థంగా వినియోగించుకుని, మరింత బలోపేతం చేయాలే తప్ప రద్దు చేయడం సరికాదు.

-కనుమూరి శ్రీనివాసరాజు, మాజీ చెర్మన్, ఆత్రేయపురం మండల వ్యవసాయ సలహా మండలి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ఇది కుట్రపూరిత ఆలోచన

వ్యవసాయ సలహా మండళ్ల రద్దు ముమ్మాటికీ కుట్రపూరిత ఆలోచన. రైతులకు మేలు చేసేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవస్థను రద్దు చేయడం సరికాదు. ఇది రైతులపై కక్ష సాధింపే. సూపర్ సిక్స్‌లో ఇచ్చిన ప్రతి రైతుకు రూ.20 వేల పెట్టుబడి సాయం, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలి.

- కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మాజీ మంత్రి

• యువత ఆనందహేల







ఉత్కంఠభరితంగా సాగిన టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌లో దక్షిణాఫ్రికాను ఓడించి భారత్ ట్రోఫీని ముద్దాడటంతో యువత ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఫైనల్ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించిన వెంటనే వందలాది మంది యువతీయువకులు జోరువానను కూడా లెక్కచేయకుండా విజయవాడ బెంజ్ సర్కిల్‌లో ఆనంద తాండవం చేశారు. బైకులు, కార్లు ఎక్కి 'జై భారత్', 'భారత్ మాతాకీ జై' నినాదాలతో హోరెత్తించారు. – సనకా లక్ష్మీపవన్, సాక్షి ఫొటోగ్రాఫర్

సీఆర్డీఏలో ప్రభుత్వ కాంప్లెక్స్‌కు బృహత్ ప్రణాళిక

- 1,575 ఎకరాలు నోటిఫై చేస్తూ నోటిఫికేషన్
- అర్బన్ డిజైన్స్ మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: ఏపీ సీఆర్డీఏ పరిధిలోని రాయపూడి, లింగాయపాలెం, కొండమరాజుపాలెం, నేలపాడు, శాఖమూరు తదితర గ్రామాల మధ్య కాంప్లెక్స్ బృహత్ ప్రణాళికకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ ప్రాంతాల మధ్య ప్రభుత్వ అధికారుల నివాసాలతోపాటు ప్రభుత్వ కాంప్లెక్స్ నిర్మాణానికి 1,575 ఎకరాలు నోటిఫై చేస్తూ శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ కాంప్లెక్స్ బృహత్ ప్రణాళిక జోనింగ్ నిబంధనలు, అర్బన్ డిజైన్ మార్గదర్శకాలను విడుదల చేసింది.

107, 108 జీఓలు రద్దు చేయాలి: ఏపీ సీఎంకు రఘువీరారెడ్డి లేఖ

మడకశిర: ప్రతిభావంతులైన పేద విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించడానికి జీఓ. 107, 108 ఇబ్బందికరంగా మారాయని రాష్ట్ర మాజీ మంత్రి, సీడబ్ల్యూసీ సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. ఈ జీఓలను వెంటనే రద్దు చేయాలని కోరారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులు వైద్య విద్య అభ్యసించడానికి ఈ జీఓలు గొడ్డలిపెట్టుగా మారాయని, వెంటనే వీటిని రద్దు చేసి పేద విద్యార్థులకు మేలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మెగా డీఎస్సీ అంటూ.. మోసమేల బాబూ..

- 56వేల పోస్టులకు గానూ 16వేల పోస్టులు మాత్రమే భర్తీ చేస్తారా?
- నిరుద్యోగ భృతి తక్షణం చెల్లించాలి
- ఏఐఎస్ఎఫ్ జాతీయ సభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

తిరుపతి సిటీ: రాష్ట్రంలో 56వేల పైచిలుకు టీచర్ పోస్టులు ఖాళీగా ఉంటే, మెగా డీఎస్సీ అంటూ కేవలం 16వేలు మాత్రమే భర్తీ చేసేందుకు సిద్ధమౌతున్న చంద్రబాబు ప్రభుత్వం నిరుద్యోగులను తీవ్రంగా మోసగిస్తున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజమెత్తారు. శనివారం తిరుపతి ఎస్వీయూ సెనేట్ హాల్‌లో ప్రారంభమైన ఏఐఎస్ఎఫ్ జాతీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతిని వెంటనే అందజేసి పేద నిరుద్యోగులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి కట్టి అధికారంలోకొచ్చినందున.. ప్రత్యేక హోదా, పోలవరం సాధన బాధ్యత చంద్రబాబుదేనని చెప్పారు. 2014 తరహాలో బాబు పాలన కొనసాగితే పెద్ద ఎత్తున ఆగ్రహజ్వాలలు తప్పవని, ప్రజలంతా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. లక్షల మంది నీట్ విద్యార్థులకు అన్యాయం జరిగితే మోదీ నోరు మెదపకపోవడం శోచనీయమన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు అతుల్ కుమార్ అంజన్, గగన్‌దీప్ సింగ్ నేటి యువతరానికి మార్గదర్శులన్నారు.

పింఛన్ల పంపిణీకి ప్రత్యేక రశీదు

చెల్లించిన వారి సంతకంతో కూడిన రశీదు లబ్ధిదారుకు

సాక్షి, అమరావతి: జూలై నుంచి జరిగే వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ తదితర పింఛన్ల పంపిణీలో ప్రభుత్వం రశీదుల పద్ధతిని ప్రవేశపెట్టింది. పింఛను పంపిణీ చేసిన వారి సంతకంతో కూడిన ఒక రశీదును లబ్ధిదారునికి అందజేస్తారు. అదే విధంగా పిం ఛను తీసుకున్నట్లుగా లబ్ధిదారునితో మరో రశీదుపై సంతకం చేయించి, దానిని సచివాలయంలో భద్ర పరుస్తారు. ఈమేరకు పింఛన్ల పంపిణీ సిబ్బంది ప్రత్యేక రశీదులు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది. ఈ రశీదుల ముద్రణకు ఒక్కో దానికి అర్ధ రూపాయి చొప్పున రూ. 32.41 లక్షలు ప్రభుత్వం అదనంగా విడుదల చేసింది. ప్రతి లబ్ధిదారునికి చెల్లించిన పింఛన్ సొమ్ము ఎంత, ఆ లబ్ధిదారుని పేరు వంటి వివరాలను కూడ రశీదులో ఉంటాయి. పింఛన్ల లబ్ధిదారులు రాష్ట్రంలో 65,18,496 మంది ఉండగా 64.75 లక్షల మందికి ఇంటి వద్ద అందజేస్తారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, మిగతా లబ్ధిదారులకు డీబీటీ రూపంలో బ్యాంకులో జమ చేస్తారు. లబ్ధిదారునికి పింఛను డబ్బులతో పాటు సీఎం చంద్రబాబు రాసిన లేఖ ప్రతులను కూడ అందజేస్తారు. పింఛన్ల పంపిణీపై ప్రతి రెండు సచివాలయాలకు ఒక ప్రత్యేక అధికారిని ప్రభుత్వ నియమించింది. ఆ అధికారులు ఆదివారం సచివాలయాలకు వచ్చి పంపిణీ సన్నద్ధతను పరిశీలిస్తారని, అందువల్ల సిబ్బంది ఆదివారం సచివాలయాలకు రావాలని కొన్ని జిల్లాల్లో కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు.

పింఛన్ల పంపిణీలో సీఎం, డిప్యూటీ సీఎం కూడా

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా జూలై 1న జరిగే పింఛన్ల పంపిణీలో సచివాలయ సిబ్బందితో కలిసి టీడీపీకి చెందిన ప్రతి నాయకుడూ పాల్గొనాలంటూ ఇప్పటికే సందేశాలు వెళ్లాయి. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. చంద్రబాబు 1వ తేదీ ఉదయం 6 గంటలకు మంగళగిరి నియోజకవర్గం పెనుమాకలో పింఛన్ల పంపిణీలో పాల్గొంటారు. పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలులో పింఛన్ల పంపిణీలో పాల్గొంటారని జనసేన పార్టీ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యే, ఎంపీలతో పాటు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు కనీసం 10 మంది లబ్ధిదారుల వద్దకు వెళ్లి, ఆ ఫోటోలను సోషల్ మీడియాలో ప్రచారం చేయాలని తెలిపింది.

మొదటి రోజే 95 శాతం పంపిణీ: సీఎస్

జూలై 1న మొదటి రోజునే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను 100 శాతం పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, కనీసం 95 శాతం పంపిణీ చేయాలని, ఇందులో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఉండకూడదని జిల్లా కలెక్టర్లను సీఎస్ ఆదేశించారు. పింఛన్ల పంపిణీపై ఆయన శనివారం జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. పింఛన్ల పంపిణీకి రూ. 4,399.89 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా...

నేటి నుంచి 'మన్ కీ బాత్'

సాక్షి,అమరావతి: ప్రధాని మోదీ నిర్వహించే మన్ కీబాత్ కార్యక్రమం సార్వత్రిక ఎన్నికల అనంతరం ఆదివారం (30వ తేదీ) నుంచి ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ శ్రేణులు ప్రతి శక్తి కేంద్ర, బూత్ స్థాయిల్లో పాల్గొనాలని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. శనివారం పార్టీ శ్రేణులతో ఆమె ఆడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 10,000కు పైగా ఏర్పాటు చేసుకున్న శక్తి కేంద్రాల్లో మన్ కీబాత్ వీక్షణకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జూలై 8న రాష్ట్రస్థాయి బీజేపీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశాన్ని రాజమహేంద్రవరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న అల్పపీడనం

మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఒడిశా–పశ్చిమ బెంగాల్ తీరాలకు ఆనుకుని కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా సముద్ర మట్టానికి 7.6 కి.మీ. ఎత్తులో ఉపరిత ఆవర్తనం ఏర్పడి నైరుతి దిశగా వంగి ఉంది. ఫలితంగా రానున్న మూడు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. అదే సమయంలో ఒకట్రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగులు కూడా పడే వీలుందని పేర్కొంది. మరోవైపు గంటకు 30–40 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, పిడుగుల పట్ల ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

వైఫై రూటర్స్ తయారీలోకి సెల్‌కాన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రానిక్ ఉపకరణాల తయారీలో ఉన్న సెల్‌కాన్ గ్రూపు.. వైఫై–6 రూటర్ల విభాగంలోకి ప్రవేశిస్తోంది. టెలికమ్యూనికేషన్స్ ఎక్విప్‌మెంట్ దిగ్గజం జడ్‌టీఈ టెలికంతో.. సెల్‌కాన్ గ్రూప్ అనుబంధ సంస్థ సెల్‌కాన్ రిసొల్యూట్ చేతులు కలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి వద్ద ఉన్న తిరుపతి ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో కొత్తగా ఏర్పాటయ్యే ప్లాంటులో ఆగస్ట్ నుంచి వైఫై–6 రూటర్లను ఉత్పత్తి చేస్తారు. నెలకు 2 లక్షల యూనిట్ల తయారీతో మొదలై.. డిసెంబర్‌కల్లా 5 లక్షల యూనిట్ల స్థాయికి ఉత్పత్తిని చేర్చడంతోపాటు విదేశాలకు సరఫరా చేస్తారు. ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో జడ్‌టీఈ టెలికం సీఈవో లేవో ఛావ్, సెల్‌కాన్ గ్రూప్ సీఎండీ వై.గురు, రిసొల్యూట్ గ్రూప్ ఫౌండర్, సీఎండీ రమీందర్ సోయిన్ ఈ వివరాలను శనివారం వెల్లడించారు. రూటర్ల తయారీ ద్వారా నూతనంగా 1,000 మంది వరకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని వై.గురు తెలిపారు.

ప్రేమోన్మాది అరెస్ట్

కృష్ణలంక (విజయవాడ తూర్పు): విజయవాడ లబ్బీపేటలోని బృందావన్ కాలనీలో ఈ నెల 27 రాత్రి జరిగిన హత్య కేసులో నిందితుడు గట్టెం శివమణికంఠను అరెస్ట్ చేసినట్టు కృష్ణలంక సీఐ మురళీకృష్ణ శనివారం తెలిపారు. పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ ఆదేశాలతో డీసీపీ అధిరాజ్‌సింగ్ రాణా, సౌత్ ఏసీపీ జి.రత్నరాజు పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుడు కోసం గాలించామన్నారు. భవానీపురం పున్నమి ఘాట్ వద్ద నిందితుడు శివమణికంఠను అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు. హతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు నిందితుడిపై 302, 307, 354(డి) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితుడు మణికంఠ ప్రేమ పేరుతో యువతి వెంట పడేవాడని, ఈ విషయం తెలుసుకున్న ఆమె తండ్రి అతడిని మందలించాడని తెలిపారు. దీంతో కక్ష పెంచుకుని యువతి తండ్రిని అతికిరాతకంగా మణికంఠ హత్య చేసినట్టు వివరించారు. నిందితుణ్ణి విజయవాడ రెండో ఏఎంఎం కోర్టులో హాజరుపర్చినట్టు తెలిపారు.

గుంటూరు కేవీకేకు ఐదు అవార్డులు


అవార్డులను చూపిస్తున్న కేవీకే అధికారులు

గుంటూరు రూరల్: ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన జోనల్ లెవెల్ భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ, అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ జోన్–10 సదస్సులో గుంటూరు లాం ఫామ్‌కు చెందిన కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)కు జాతీయ స్థాయిలో ఐదు అవార్డులు లభించడం సంతోషంగా ఉందని లాం ఫామ్ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్ తెలిపారు. గుంటూరు లాం ఫామ్‌లోని కేవీకేలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సామూహిక పప్పు దినుసుల ప్రదర్శన క్షేత్రాల విభాగం, అధిక విస్తరణ ప్రచురణలను ప్రచురించడం, విస్తరణాధికారులకు శిక్షణ ఇవ్వటం, గ్రామీణ యువతకు శిక్షణ, పప్పు దినుసుల ఏరియా ఉత్పాదకత పెంపు విభాగాల్లో ఎక్స్‌లెన్స్ అవార్డులను పొందినట్లు వివరించారు. అవార్డులను అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ జోన్–10 డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరా తదితరులు అందజేస్తారన్నారు.

గంగపుత్రులకు ఏదీ భరోసా?


వేట సిద్ధమవుతున్న మత్స్యకారులు

ఐదేళ్లూ గడువులోగానే మత్స్యకార భరోసా

రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచిన జగన్ ప్రభుత్వం

- ఏటా సగటున 1.16 లక్షల మందికి వేట నిషేధ భృతి
- ఐదేళ్లలో రూ.538 కోట్లు జమ చేసి అండగా నిలిచిన పరిస్థితి
- ఎన్నికల బిజీలో కూడా గడువులోగా భరోసా ఇవ్వాలని యత్నం
- ఆర్బీకేల ద్వారా 1.30 లక్షల మంది అర్హుల గుర్తింపు
- సామాజిక తనిఖీల కింద సచివాలయాల్లో జాబితాల ప్రదర్శన
- ఎన్నికల కోడ్ సాకుతో ఈసీకి ఫిర్యాదు చేసి అడ్డుకున్న కూటమి నేతలు
- అధికారంలోకి రాగానే రూ.20 వేలు భృతి ఇస్తామని మేనిఫెస్టోలో హామీ
- ఆ మేరకు రూ.260.26 కోట్ల బడ్జెట్ కోసం మత్స్యశాఖ ప్రతిపాదనలు
- గడువు ముగిసి రెండు వారాలవుతున్నా పట్టించుకోని ప్రభుత్వం

సాక్షి, అమరావతి : వేసవిలో చేపలు గుడ్లు పెట్టే సమయంలో ఏటా 61 రోజుల పాటు వేట నిషేధం అమలవుతుంది. ఈ సమయంలో వేటకు వెళ్లే మత్స్యకారులకు జీవనోపాధి ఉండదు. వేట తప్ప వారికి మరో వృత్తి చేతకాదు. వేటకు వెళ్తే కానీ పూట గడవని బతుకులు వారివి. వేట మీద ఆధారపడి జీవనోపాధి పొందే ప్రతీ మత్స్యకారునికి నిషేధ కాలంలో కుటుంబ పోషణ కోసం చాలా ఏళ్లుగా వేట నిషేధ భృతిని ప్రభుత్వం అందిస్తోంది. గత ఐదేళ్లుగా వేటకు వెళ్లే ప్రతి మత్స్యకారునికి రూ.10 వేల చొప్పున భరోసా ఇవ్వగా, తాము అధికారంలోకి రాగానే రూ.20 వేల చొప్పున వేట నిషేధ భృతి ఇస్తామంటూ కూటమి నేతలు ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. వేట గడువు ముగిసినప్పటికీ నిషేధ భృతి చేతికి అందక మత్స్యకారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

ఐదేళ్లూ గడువులోగానే మత్స్యకార భరోసా

వేటకు వెళ్లే మత్స్యకార కుటుంబాలకు పూర్వం రూ.2 వేలు, బియ్యం, ఇతర నిత్యావసరాలు ఇచ్చేవారు. ఆ తర్వాత నిత్యావసరాలకు ఫుల్‌స్టాప్ పెట్టి రూ.4 వేల చొప్పున భృతి ఇచ్చారు. అది కూడా వేట నిషేధం ముగిసిన తర్వాత ఆర్నెల్లకో ఏడాదికో ఎప్పుడిచ్చేది కూడా తెలిసేది కాదు. పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు నిషేధ భృతిని రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచి నిషేధ కాలంలోనే పార్టీలు, కులాలు, మతాలకతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇచ్చి వైఎస్ జగన్ ప్రభుత్వం అండగా నిలిచింది. మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్లకే కాకుండా.. తెప్పలు ఇతర సంప్రదాయ నావలపై వేట సాగించే వారికి సైతం ఈ సాయాన్ని వర్తింప చేసింది. 2014–19 మధ్య ఏటా సగటున 60 వేల మందికి ఐదేళ్లలో రూ.104.62 కోట్లు జమ చేయగా, 2019–24 మధ్య ఏటా సగటున 1.16 లక్షల మంది మత్స్యకారులకు ఐదేళ్లలో రూ.538 కోట్లు జమ చేశారు.

ఎన్నికల వేళ.. గడువులోగా ఇచ్చేలా

ఎన్నికల వేళ క్షణం తీరక లేని పరిస్థితుల్లో సైతం గత ఐదేళ్ల మాదిరిగానే వేట నిషేధ సమయంలో అర్హులైన ప్రతీ మత్స్యకారునికి వేట నిషేధ భృతిని అందించాలని వైఎస్ జగన్ ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేసింది. తొలుత ఎన్నికల కోడ్ సాకుతో అర్హుల గుర్తింపును విపక్షాలు అడ్డుకోగా, నిషేధ సమయంలోనే వారికి ఈ సాయం అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌కు పలుమార్లు లేఖలు రాసింది. ఫలితంగా ఈసీ అనుమతితో మే 2వ తేదీ నుంచి తీర ప్రాంత గ్రామాల్లో ఆర్బీకేల ద్వారా అర్హుల గుర్తింపు చేపట్టింది. 2023–24 సీజన్‌లో 1.23 లక్షల మంది అర్హత పొందితే, 2024–25 సీజన్‌లో 1,30,128 మంది అర్హత పొందారు. సామాజిక తనిఖీల్లో భాగంగా అర్హుల జాబితాలను సచివాలయాల్లో ప్రదర్శనకు సైతం పెట్టారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రూ.20 వేల చొప్పున వేట నిషేధ భృతి చెల్లించేందుకు రూ.260.26 కోట్లు అవసరమని మత్స్య శాఖ ప్రతిపాదనలు పంపింది. గడువు ముగిసి రెండు వారాలు కావస్తున్నా, మత్స్యకార భరోసా ఇచ్చే విషయంలో ప్రభుత్వం మీన మేషాలు లెక్కిస్తుండడం పట్ల మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఇబ్బంది పడ్డాం

వేట నిషేధంలో సమయం అందే మత్స్యకార భరోసా ఈ సంవత్సరం వేట నిషేధం ముగిసినప్పటికీ జమ చేయలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ ఈ ఏడాది వేట నిషేధ గడువు ముగిసి 15 రోజులు కావస్తున్నా, ఎలాంటి సాయం అందించలేదు. ప్రస్తుతం సరైన వేట లేక, పూట గడవక చాలా ఇబ్బంది పడుతున్నాం.

– వై రాజు, మత్స్యకారుడు, అమీనాబాద్, కాకినాడ జిల్లా

అప్పులు చేసి తినాల్సి వచ్చేది

మాకు వేట తప్ప మరో పనిరాదు. వేట నిషేధ సమయంలో పిల్లాపాపలతో ఇంటికి పరిమితం అవ్వాల్సి వస్తుంది. ఆ రెండు నెలలు కుటుంబ పోషణ చాలా కష్టంగా ఉంటుంది. వేట నిషేధ సమయంలో ఇచ్చే సాయంతోనే ఇల్లు గడుస్తుంది. ఐదేళ్లుగా ఇదే రీతిలో సాయం అందింది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.20 వేలు నిషేధ గడువు ముగియక ముందే ఇచ్చి ఉంటే బాగుండేది. ఈసారి అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సి వచ్చింది.

– అర్జిల్లి రామకృష్ణ, వెంకటనగరం, అనకాపల్లి జిల్లా

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

గతంలో రూ.4 వేలు చొప్పున ఇచ్చే వేట నిషేధ భృతిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.10 వేలకు పెంచి, ఏటా క్రమం తప్పకుండా నిషేధ సమయంలోనే జమ చేసేది. పైగా మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్లకే కాదు.. తెప్పలు, ఇతర సంప్రదాయ నావలపై వేట సాగించే వారికి సైతం ఈ సాయాన్ని అందించింది. మత్స్యకారుల సంక్షేమానికి తాము పెద్దపీట వేస్తామని ఎన్నికల వేళ టీడీపీ కూటమి నేతలు హామీలిచ్చారు. తాము అధికారంలోకి రాగానే రూ.20 వేలు ఇస్తామన్నారు. ఆ మాట నిలబెట్టుకొని ప్రతి మత్స్యకారునికి భృతి అందించాలి.

– ఆవల శ్రీను, మత్స్యకారుడు, విజయలక్ష్మీపురం, బాపట్ల జిల్లా

ఎప్పుడు ఇస్తారో చెప్పండి



ఐదేళ్లుగా ఏటా చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకార భరోసా కింద రూ.10 వేలు చొప్పున లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకు జమయ్యేది. ఈ ఏడాది ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి భృతి చెల్లింపులో ఆలస్యం చేశారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరినా భృతి చెల్లింపునకు కనీసం చర్యలు తీసుకోవడం లేదు. ఎప్పుడు చెల్లిస్తారో తేదీ ప్రకటించాలి.

– చిన్నపల్లి నీలయ్య, మత్స్యకారుడు, చింతపల్లి, పూసపాటిరేగ మండలం, విజయనగరం జిల్లా

అనుమానంగా ఉంది



చంద్రబాబు ఎన్నికల సమయంలో మత్స్యకార భరోసా రూ.20 వేలు ఇస్తానని వాగ్దానం చేశారు. కానీ వేట నిషేధ కాలం ముగిసినా ఇంత వరకు మత్స్యకార భరోసాపై ఒక్క ప్రకటన కూడా చేయలేదు. దీంతో మత్స్యకార భరోసా ఇస్తారా, ఇవ్వరా అని సందిగ్ధంగా ఉంది.

– వాయిల యానాదిరావు, చెల్లెమ్మగారి పట్టుపుపాలెం, పాకల పంచాయతీ, ప్రకాశం జిల్లా

ఎన్నికలు పూర్తయినా దక్కని పరిహారం



మత్స్యకారులకు వేట విరామ సమయంలో క్రమం తప్పక రూ.10 వేల చొప్పున పరిహారం అందించేవారు. తాము అధికారంలోకి వస్తే రూ.20 వేలు ఇస్తామని కూటమి పార్టీలు చెప్పాయి. ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు 60 రోజుల పాటు వేట లేక ఇబ్బంది పడ్డాం. ఎన్నికలు పూర్తయి ఇప్పుడు అధికారంలోకి వచ్చింది కూటమి ప్రభుత్వమే కాబట్టి.. వెంటనే మత్స్యకార భరోసా ఇవ్వాలి.

– మునస్వామి, మత్స్యకారుడు, లైట్ హౌస్, వాకాడు మండలం, తిరుపతి జిల్లా

ఎదురు చూస్తున్నాం



మత్స్యకార భరోసా సొమ్ము మా ఖాతాల్లో ఎప్పుడు పడుతుందా అని ఎదురు చూస్తున్నాం. గత ఐదేళ్లు చెప్పిన తేదీన ఇచ్చారు. పని లేక ఖాళీగా ఇంట్లో కూర్చున్నప్పుడు సొమ్ము రావడంతో ఏ ఇబ్బందీ ఉండేది కాదు. కూటమి సర్కార్ వస్తే మత్స్యకార భరోసా ఇంకా ఎక్కువగా ఇస్తామన్నారు. కానీ ఇంత వరకు ఎవరూ స్పందించ లేదు.

– తిరుమాని దేవేంద్రరాజు, మత్స్యకారుడు, వేములదీవి వెస్ట్ గ్రామం, పశ్చిమగోదావరి జిల్లా

వెంటనే సాయం అందజేయాలి



మత్స్యకారులకు వేటే జీవనాధారం. రెండు నెలలు వేట విరామ సమయంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. అప్పులు చేశాం. ఇప్పుడు ఆ అప్పు తీర్చాలంటే భృతి రూ.20 వేలు వెంటనే ఇవ్వాలి. ప్రస్తుతం వేట నిషేధం పూర్తయినా ప్రభుత్వం నుంచి సాయం అందలేదు. వెంటనే భృతిని అందజేసి మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలి.

– గండుపల్లి హరిదాసు, చేపల గొల్లగండి, సోంపేట మండలం, శ్రీకాకుళం గ్రామం

వేటకు వెళ్లే ప్రతి ఒక్కరికి రూ.20 వేలు ఇవ్వాలి

సబ్సిడీ ఆయిల్ వినియోగంతో ముడి పెట్టకుండా మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్లపై వేటకు వెళ్లే ప్రతి మత్స్యకారునికి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.20 వేల చొప్పున వేట నిషేధ భృతి ఇవ్వాలి. గత ఐదేళ్లుగా వేట నిషేధ సమయంలోనే క్రమం తప్పకుండా మత్స్యకార భరోసా ఇచ్చారు. అదే రీతిలో నిషేధ సమయంలోనే భృతిని అందించి అండగా నిలవాలి.

– వాసుపల్లి జానకీరాం, అధ్యక్షుడు, ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్ల సంఘం

రాష్ట్రంలో నాలుగు ఆస్పత్రులకు ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికేషన్

వైఎస్ జగన్ ప్రభుత్వం ఆస్పత్రులను బలోపేతం చేయడం వల్లే జాతీయ స్థాయి గుర్తింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని నాలుగు ప్రభుత్వ ఆస్పత్రులకు ప్రతిష్టాత్మక నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్యూఏఎస్) సర్టిఫికేషన్ లభించింది. నాడు–నేడు పథకం కింద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసింది. జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పించింది. ఫలితంగానే ఆరోగ్య సంరక్షణ సదుపాయాలు అత్యుత్తమంగా ఉన్నాయని కేంద్ర బృందం గుర్తించి నాలుగు ఆస్పత్రులకు ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికేషన్ అందజేసింది. పొన్నూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్, డ్రైవర్స్ కాలనీ యూపీహెచ్‌సీ, విజయనగరం జిల్లా గరివిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కృష్ణా జిల్లా దొండపాడు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లు ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికేషన్‌ను పొందాయి. ఈ మేరకు న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికేషన్ అవార్డులను కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి జేపీ నడ్డా చేతుల మీదుగా రాష్ట్ర అధికారులు అందుకున్నారు. ఈ మేరకు అధికారులను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ శనివారం అభినందించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(యూపీహెచ్‌సీలు) స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ విజయలక్ష్మి, క్వాలిటీ ఎస్యూరెన్స్ పీవో డాక్టర్ రమాదేవి బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించి, జాతీయ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వైద్య, ఆరోగ్య శాఖ సేవలను ఇంకా మెరుగుపరచాలని సూచించారు.

జీజీహెచ్‌లో విజిలెన్స్ విచారణ జరపండి

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ఆదేశం


మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పక్కన ఎమ్మెల్యేలు, కలెక్టర్

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌లో జరుగుతున్న నిర్మాణాలు, ఇతర కాంట్రాక్టులపై విజిలెన్స్ విచారణ జరపాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మిని ఆదేశించారు. శనివారం జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ సమావేశ మందిరంలో పెమ్మసాని వైద్యులు, వైద్య అధికారులతో సమావేశం నిర్వహించారు. తొలుత ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డు, క్యాజువాలిటీ, ఎం.ఆర్.ఐ విభాగం, ఐసీయూ, అడ్వాన్స్‌డ్ ఐసీయూ విభాగాలను ఆయన పరిశీలించారు. రోగులతో మాట్లాడి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. తక్షణమే సి.టి.స్కాన్ యంత్రాలకు మరమ్మతులు చేయించాలని, లేనిపక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం వెయిటింగ్ హాల్ భవనం నిర్మించాలని మాజీ ఎంపీ గల్లా జయదేవ్, దాతలు నిధులను సమకూర్చారని, ఆ నిర్మాణాలు నేటికీ పూర్తికాకపోవడంపై పెమ్మసాని విస్మయం వ్యక్తం చేశారు. నిర్మాణాల కాంట్రాక్టులపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీని ఏర్పాటు చేసి.. ఆ కమిటీ ఆధ్వర్యంలోనే విచారణ జరిపించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్ అహ్మద్, మాధవి, బోర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

చేనేత, జౌళి శాఖలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు

సాక్షి, అమరావతి: జాతీయ చేనేత అభివృద్ధి పథకం కింద స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో తాత్కాలిక పద్ధతిలో నియామకాలకు చేనేత, జౌళిశాఖ చర్యలు చేపట్టింది. ఈ మేరకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చేనేత, జౌళి శాఖ కమిషనర్ కె.శ్రీకాంత్ ప్రభాకర్ ఒక ప్రకటన విడుదల చేశారు. స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లలో క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు నాలుగు, టెక్స్‌టైల్ డిజైనర్ పోస్టులు నాలుగు కలిపి మొత్తం ఎనిమిది పోస్టులకు తాత్కాలిక పద్ధతిలో నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. 21 రోజులలోపు దరఖాస్తులను 'కమిషనర్, చేనేత, జౌళీశాఖ, 4వ అంతస్తు, ఐహెచ్‌సీ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, మంగళగిరి, గుంటూరు జిల్లా'కు అందజేయాలని కోరారు. http://www.handlooms.ap.gov.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చునని తెలిపారు.

ఎలిమెంటరీలో ఉమ్మడి పరీక్షను రద్దు చేసిన హైకోర్టు

- ఈ పరీక్ష చట్ట విరుద్ధం.. విద్యార్థుల హక్కులను హరిస్తోంది
- వారిని బాధకు, భయానికి గురి చేస్తోంది
- ఉమ్మడి పరీక్ష విధానం, ప్రొసీడింగ్స్ కూడా రద్దు
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయన సుజాత తీర్పు


సాల్ట్‌లో ప్రైవేటు పాఠశాలలు భాగం కాదు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎలిమెంటరీ (1 నుంచి 8 తరగతి) విద్యార్థులకు ఉమ్మడి పరీక్ష నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానాన్ని హైకోర్టు రద్దు చేసింది. ఎలిమెంటరీ విద్యార్థులకు ఉమ్మడి పరీక్ష విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 29కి విరుద్ధమని తేల్చి చెప్పింది. ఈ కొత్త విధానం సమర్థనీయం కాదని, విద్యార్థుల హక్కులను హరిస్తుందని స్పష్టం చేసింది. ఈ విధానం వల్ల విద్యార్థులు నిర్దిష్ట సమయం లోపు బలవంతంగా వారి సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని, ఇది వారిని బాధకు, భయానికి, ఆందోళనకు గురి చేస్తుందని తెలిపింది. అందువల్ల ఎలిమెంటరీ విద్యార్థుల తరగతి గది ఆధారిత మదింపు పరీక్ష (సీబీఏ) కోసం తెచ్చిన కొత్త విధానాన్ని, తదనుగుణ ప్రొసీడింగ్స్‌ను రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ పరీక్ష టైం టేబుల్‌ను, షెడ్యూల్‌ను కూడా రద్దు చేస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయన సుజాత ఇటీవల తీర్పు వెలువరించారు.

సాల్ట్ పేరుతో తెచ్చిన కొత్త విధానాన్ని ప్రైవేట్ పాఠశాలలకు వర్తింపజేయడం ఆ విధానం మార్గదర్శకాలకు విరుద్ధమని తేల్చారు. సాల్ట్ ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చి, వారిలో నైపుణ్యాలను పెంచేందుకు ఉద్దేశించినదని, ప్రైవేటు పాఠశాలలు అందులో భాగం కాదని స్పష్టం చేశారు. కొత్త విధానంలో ఎలిమెంటరీ విద్యార్థులు ఒక్క రోజులో రెండు పరీక్షలు రాయాలని, ఇది 10వ తరగతి ఉమ్మడి పరీక్షను పోలి ఉందని న్యాయమూర్తి తెలిపారు. విద్యా హక్కు చట్టం సెక్షన్ 30 ప్రకారం ఏ విద్యార్థి కూడా ఎలిమెంటరీ విద్యను పూర్తి చేసేంత వరకు ఏ బోర్డు పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సిన అవసరం లేదని న్యాయమూర్తి తెలిపారు. వాస్తవానికి తరగతి గది ఆధారిత మదింపు పరీక్ష (సీబీఏ) బోర్డు పరీక్ష కిందకు రాదని, అయితే నిర్దేశిత టైం టేబుల్, ఉమ్మడి ప్రశ్నాపత్రం వంటివి బోర్డు పరీక్షను పోలి ఉన్నాయని తీర్పులో పేర్కొన్నారు. ఇది విద్యార్థుల మనస్సుల్లో భయాన్ని, ఆందోళనను, బాధను కలిగిస్తుందన్నారు. ఈ విధానం విద్యా హక్కు చట్ట నిబంధనలకు విరుద్ధమని, అందువల్ల దానిని రద్దు చేస్తున్నట్లు తెలిపింది.

సాల్ట్‌పై హైకోర్టులో ప్రైవేటు విద్యా సంస్థల పిటిషన్

అసైన్‌మెంట్ టెస్ట్, యూనిట్ టెస్ట్, క్వార్టర్లీ, హాఫియర్లీ, వార్షిక పరీక్షల స్థానంలో రాష్ట్రంలో 2012 – 14 విద్యా సంవత్సరం నుంచి ఓ కొత్త పరీక్ష విధానాన్ని అమల్లోకి తెచ్చారు. 2022 వరకు ఈ విధానం కొనసాగింది. ఆ తరువాత రాష్ట్ర ప్రభుత్వం విద్యా ప్రమాణాలు, నైపుణ్యాలను పెంచేందుకు సపోర్టింగ్ ది ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫార్మేషన్ (సాల్ట్) పేరుతో నూతన విధానాన్ని తెచ్చింది. 1 నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఉమ్మడి పరీక్ష విధానం అమలే దీని ఉద్దేశం. 1976 నుంచి నడుస్తున్న జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డ్స్ (డీసీఈబీ)లకు పరీక్ష నిర్వహణ అప్పగించింది. సాల్ట్‌ను ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ విద్యా సంస్థలకు వర్తింప చేయడాన్ని సవాలు చేస్తూ యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫెడరేషన్, కేవీఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ 2022లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ సుజాత ఇటీవల తుది విచారణ జరిపి, తీర్పు వెలువరించారు.

రేపటి నుంచి ఈఏపీ సెట్ ప్రవేశాల ప్రక్రియ

19 నుంచి తరగతులు

సాక్షి, అమరావతి: ఇంజినీరింగ్ ప్రవేశాలకు నిర్దేశించిన ఏపీ ఈఏపీ సెట్–2024 అడ్మిషన్ల ప్రక్రియ జూలై 1 (సోమవారం) నుంచి ప్రారంభమవుతుందని సెట్ కన్వీనర్ డాక్టర్ బి.నవ్య తెలిపారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపులు జూలై 7లోపు పూర్తి చేయాలని సూచించారు. 4 నుంచి 10వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన, 8 నుంచి 12 వరకు ఆప్షన్ల ఎంపిక పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. జూలై 13న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఇచ్చి, 16న సీట్ల కేటాయిస్తామన్నారు. ఓ పక్క జూలై 17 నుంచి 22 వరకు సెల్ఫ్ జాయినింగ్, కళాశాలలో రిపోర్టింగ్లు జరుగుతుండగానే మరోపక్క జూలై 19 నుంచి తరగతులను ప్రారంభిస్తామని తెలిపారు. బి–ఫార్మసీ అడ్మిషన్లకు సంబంధించి ప్రత్యేకంగా నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పారు.

న్యాయరంగంలో మార్పులను పట్టుదలతో సాధించాలి

జస్టిస్ డాక్టర్ వి.ఆర్.కె.కృపాసాగర్


విద్యార్థికి పట్టా ప్రదానం చేస్తున్న జస్టిస్ డాక్టర్ వి.ఆర్.కె. కృపాసాగర్

పెనమలూరు: న్యాయ రంగంలో మార్పులను సహనం, ఓర్పు, నేర్పు, పట్టుదలతో సాధించాలని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వి.ఆర్.కె. కృపాసాగర్ సూచించారు. కృష్ణాజిల్లా, కానూరు వెలగపూడి దుర్గాంబ సిద్ధార్థ లా కాలేజీలో శనివారం న్యాయ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ కృపాసాగర్ మాట్లాడారు. న్యాయ విద్య పూర్తి చేయడం చాలా సులువన్నారు. అయితే న్యాయవాద వృత్తి చేపట్టిన తరువాత అనేక సవాళ్లు ఎదురవుతాయని చెప్పారు. డబ్ల్యూటీవో ఒప్పందం ప్రకారం భారత్‌లో విదేశీ న్యాయవాదులు కూడా తమ వృత్తి చేసుకునే అవకాశం ఉందని ఈ కారణంగా భవిష్యత్‌లో తీవ్ర పోటీ ఏర్పడ వచ్చునన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నుపాటి దివాకర్‌బాబు మాట్లాడుతూ ప్రతీ న్యాయవాది సమాజం పట్ల బాధ్యతతో మెలగాలన్నారు. అనంతరం విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.